

ఈనాడు



విజయవాడ 5-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 115

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru





ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 5-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 115

రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ విమానాశ్రయంలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మరింత పెరిగిన 'ఇండిగో' కష్టం

550కిపైగా విమానాల రద్దు

హైదరాబాద్‌లోనే 79 నిలిపివేత

బెంగళూరు, ముంబయి, దిల్లీల్లోనూ ప్రయాణికుల అవస్థ


ఈనాడు-హైదరాబాద్, న్యూస్‌టుడే-యంత్రాంగం: నిర్వహణాపరమైన లోపాల కారణంగా హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, దిల్లీ, ముంబయిల్లోని విమానాశ్రయాల్లో గురువారమూ ఇండిగో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పలు విమానాలు రద్దుకావడంతోపాటు ఆలస్యంగా నడుస్తుండటంతో గందరగోళం నెలకొంది. దేశంలోనే అతి పెద్ద విమానయాన సంస్థ (మిగతా 5లో)

45 రోజుల్లో శంకుస్థాపనలు

విశాఖ ఎంవోయూలపై కార్యాచరణ

అమలు దిశగా రూ.7.69 లక్షల కోట్ల పెట్టుబడులు

ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికి పైగా ఆమోదించే ప్రక్రియ మొదలైందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వాటికి 45 రోజుల్లోగా శంకుస్థాపన జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన 13వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం రూ.20,444 కోట్ల పెట్టుబడులు.. 56,278 మందికి ఉపాధి కల్పించే ప్రతిపాదనలను ఆమోదించింది. అందులో విశాఖ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న ఆరు కంపెనీల ప్రతిపాదనలూ ఉన్నాయి. సీఎం మాట్లాడుతూ.. 'విశాఖలో 20 రోజుల కిందట నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో రూ.7.69 లక్షల కోట్ల విలువైన వాటిని అమలు చేసే దిశగా వెళ్తున్నాం. 45 రోజుల్లో వీలైనన్ని ఎంవోయూలు గ్రౌండింగ్ చేసి, దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్తే మరిన్ని పెట్టుబడులు వస్తాయి. దావోస్‌కు వెళ్లేలోపే 75 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా చూడాలి. పాలసీల కింద ఇచ్చే ప్రోత్సాహకాలు ఎస్క్రో ఖాతాకు జమ చేసే విధానం తీసుకొస్తాం. ఇకపై ఎంవోయూలపైనా నేను సమీక్షిస్తా. ఎంవోయూల గ్రౌండింగ్‌పై సీఎస్, మంత్రివర్గ ఉపసంఘం, ఆయా శాఖల మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు సమీక్షించేలా విధానాన్ని రూపొందిస్తాం' అని పేర్కొన్నారు.

క్వాంటమ్ వ్యాలీలో ఆరు టవర్లు

'క్వాంటమ్ వ్యాలీలో నిర్మించే 6 టవర్లలో రెండు టవర్లను క్వాంటమ్ ఆల్గరిథం అభివృద్ధికి, మరో రెండు టవర్లను (మిగతా 5లో)

18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం

మార్చిలోపు కంపెనీలకు రూ.2వేల కోట్ల ఇన్సెంటివ్స్

5లో

మంత్రులు టీజీ భరత్, కందుల దుర్గేష్



"నా స్నేహితుడికి స్వాగతం పలికినందుకు ఆనందంగా ఉంది. కాల పరీక్షకు నిలిచిన భారత్, రష్యా స్నేహం.. దేశ ప్రజలకు ఎంతగానో మేలు చేసింది.
- ప్రధాని మోదీ

చిరకాల బంధానికి మరింత బలం

- భారత్‌కు చేరుకున్న రష్యా అధ్యక్షుడు
- పుతిన్‌కు విందు ఇచ్చిన మోదీ
- నేడు కీలక సమావేశం

దిల్లీ: భారత్‌తో కొనసాగుతున్న చిరకాల బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే చర్యల్లో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ దిల్లీలో అడుగుపెట్టారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం రాత్రి దిల్లీ చేరుకున్న ఆయనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘన స్వాగతం పలికారు. శుక్రవారం వారి మధ్య జరిగే 23వ ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కుదరనున్నాయి.

27 గంటల పర్యటనలో: భారత్‌లో 27 గంటలపాటు ఉండనున్న పుతిన్.. వాణిజ్యం, రక్షణ రంగాలతోపాటు (మిగతా 5లో)

ఒకే కారులో..



ఎనిమిది దశాబ్దాల బంధంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించేందుకు భారత్‌కు వచ్చిన పుతిన్‌తో పాలం విమానాశ్రయంలో ప్రధాని మోదీ కరచాలనం చేశారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో రష్యా అధ్యక్షుడికి స్వాగతం లభించింది. అనంతరం వారిద్దరూ ఒకే కారులో ప్రధాని నివాసానికి చేరుకున్నారు. మోదీ ఆయనకు ప్రైవేటుగా విందు ఇచ్చారు.

శ్రీలక్ష్మిపై అభియోగాలకు ఆధారాలున్నాయి

లోపలి పేజీలో

తేలిన అంశంపై మళ్లీ పిటిషన్ చెల్లదు

'పెన్నా' కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన సీబీఐ

గ్రామాలకు మినీ కలెక్టరేట్లుగా డీడీవోలు

- పౌరసేవలు ప్రజలకు చేరువయ్యేందుకే ఈ ఏర్పాటు
- కూటమి వచ్చాక స్థానికసంస్థల్లో అనేక సంస్కరణలు
- డీడీవోల ప్రారంభోత్సవంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు- చిత్తూరు: గ్రామీణ స్థానిక సంస్థల్లో 10-12 రకాల పౌరసేవలు విభిన్న కార్యాలయాల ద్వారా అందుతున్నాయని, వాటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని తాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే అధికారులను ఆదేశించానని, ఆ ఆలోచనల నుంచి పుట్టినవే డివిజినల్ అభివృద్ధి కార్యాలయాలు (డీడీవో) అని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రభుత్వ సేవలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు ఇవి ఉపయోగపడతాయని ఆయన ఆకాంక్షించారు. ఈ వ్యవస్థను అందుబాటులోకి (మిగతా 5లో)



చిత్తూరులోని డీడీవో కార్యాలయం ప్రారంభోత్సవంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు తదితరులు

పరకామణి కేసు ఒక చిన్న చోరీ



- 9 డాలర్ల దొంగతనమే జరిగింది
- వారు రూ.14 కోట్ల ఆస్తుల్ని రాసిచ్చారు
- ప్రపంచంలో ఎక్కడా ఇలా జరగలేదు
- వైకాపా అధినేత జగన్

ఈనాడు, అమరావతి: శ్రీవారి పరకామణి కేసు అనేది చిన్న చోరీ(దొంగతనం) అని వైకాపా అధినేత జగన్ పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో 9 డాలర్లు (దీని విలువ రూ.72 వేలన్నది జగన్ చెప్పిన లెక్క. ప్రస్తుత డాలర్ మారకం విలువ రూ.90. ఆ ప్రకారం చూసినా 9 డాలర్ల విలువ రూ.810) మాత్రమే దొంగతనం జరిగిందని, దీనికి ప్రాయశ్చిత్తంగా ఆ దొంగ కుటుంబసభ్యులు రూ.14 కోట్ల విలువైన ఆస్తుల్ని దేవునికి ఇచ్చారని, ఇది తప్పవుతుందా అని ప్రశ్నించారు. దేశంలో చాలాచోట్ల చాలా (మిగతా 5లో)


జోస్ ఆలుక్కాస్
A TRADITION OF FINE JEWELLERY
ఇప్పుడే కొనండి.
తర్వాత చింతించకండి.
ఇయర్ ఎండ్ సేల్
ఫ్లాట్
50%
తగ్గింపు
బంగారు
ఆభరణాల
తరుగు ఛార్జీలపై
*నియమ నిబంధనలు వర్తిస్తాయి
మీ పాత 22 క్యారెట్ బంగారు ఆభరణాలను
అధిక లాభాలతో ఎక్స్ఛేంజ్ చేసుకోండి
అతినవీన సరికొత్త డిజైన్లు
పెరుగుతున్న బంగారం ధరల నుంచి రక్షణ
పొందడానికి ఇప్పుడే అడ్వాన్స్ బుకింగ్ చేసుకోండి
వజ్రాలపై
30%
తగ్గింపు
15%
తగ్గింపు
ప్లాటినం ఆభరణాల
తరుగు ఛార్జీలపై
OPP: RADIO STATION, M.G. ROAD, VIJAYAWADA. PH: 0866-2475916
ROAD NO.4/9, BRODIPET, GUNTUR. PH: 0863-2241916
MINI BYPASS ROAD, NELLORE. PH: 0861 – 2353916
JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
josalukkasonline.comలో షాపింగ్ చేయండి

ఈనాడు

విజయవాడ 5-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 115

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఐదు కొత్త వైద్య కళాశాలల్లో

పీజీ ప్రవేశాల వార్షిక రుసుము ఖరారు

- ప్రభుత్వ కోటా సీట్లకు రూ.30 వేలు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు రూ.9 లక్షలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఐదు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది జరగనున్న పీజీ ప్రవేశాల వార్షిక ఫీజును రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రభుత్వ కోటా సీట్లకు ఏడాదికి రూ.30 వేలు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు రూ.9 లక్షలు, ఎన్నారై సీట్లకు రూ.29 లక్షలుగా ఫీజు నిర్ధారించింది. 2025-26లో రాజమహేంద్రవరం, నంద్యాల వైద్య కళాశాలల్లో 16 చొప్పున, విజయనగరం, మచిలీపట్నం కళాశాలల్లో 12 చొప్పున, ఏలూరు వైద్య కళాశాలలో నాలుగు పీజీ సీట్లలో జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అనుమతి మేరకు ప్రవేశాలు జరగనున్నాయి. ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం పీజీ ప్రవేశాల్లో 50 శాతం ఆలిండియా కోటాకు, మిగిలిన 50 శాతం రాష్ట్ర కోటాకు దక్కుతాయి. 2017లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు స్టేట్ కోటా సీట్లలో 50 శాతం కన్వీనర్ కోటా, 35 శాతం మేనేజ్‌మెంట్ కోటా, 15 శాతం సీట్లు ఎన్నారై కోటా కింద భర్తీ చేస్తారు.



సాదాబైనామాల క్రమబద్ధీకరణకు

పచ్చజెండా

2024 జూన్ 15 లోపు ఒప్పందాలకు మరో అవకాశం

2027 డిసెంబరు 31లోపు దరఖాస్తు చేసుకోవచ్చు ● 90 రోజుల్లోపు పరిష్కరించాలి

ఆధారాల్లేవని, టైపింగ్ తప్పులని తిరస్కరించకూడదు ● మార్గదర్శకాలు జారీచేసిన రెవెన్యూశాఖ

ఈనాడు, అమరావతి: సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 2024 జూన్ 15 వరకు తెల్లకాగితాలపై (రిజిస్టర్ కాని భూమి కొనుగోలు పత్రాలు) ఒప్పందాల ద్వారా వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన చిన్న, సన్నకారు రైతులు 2027 డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. వీరికి స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా హక్కులు కల్పిస్తారు. గతంలో పలుదఫాలుగా సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఇది 2023 డిసెంబరు 31తో ముగిసింది. రైతుల ఇబ్బందుల నేపథ్యంలో మరోసారి పొడిగించాలని నిర్ణయించింది. భూముల క్రమబద్ధీకరణకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం మార్గదర్శకాలు జారీచేశారు. దరఖాస్తు అందిన 90 రోజుల్లోగా పరిష్కరించాలని, విచారణ తర్వాత అసలు ఒప్పంద (అన్‌రిజిస్టర్డ్)పత్రాల్ని సబ్‌రిజిస్ట్రార్ వద్ద దాఖలు చేయాలని.. సర్టిఫికెట్ జారీచేసి రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. దరఖాస్తు పరిష్కరించడం అంటే తుది ఉత్తర్వులు ఇవ్వడమేనని, లేదంటే పెండింగ్‌లో ఉన్నట్లే అని పేర్కొన్నారు. అందులోని ప్రధానాంశాలు..

- ■ గ్రామీణ ప్రాంతాల్లోని సాగు భూములకే వర్తిస్తుంది.
- ■ చిన్న (2.5 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట), సన్నకారు (1.25 ఎకరాల మాగాణి లేదా 2.5 ఎకరాల మెట్ట) రైతులే అర్హులు.
- ■ రైతుకు ఉన్న మొత్తం భూమితో సాదాబైనామా భూమినీ కలిపి పరిగణనలోకి తీసుకోవాలి.
- ■ సంబంధిత భూమి.. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసిన వ్యక్తి స్వాధీనంలోనే ఉండాలి.
- ■ అడంగల్‌లో అనుభవదారుగా నమోదై ఉంటే సరిపోతుంది. ఇతర ఆధారాలు అక్కర్లేదు.
- ■ రికార్డు లేకపోతే శిస్తు రసీదులు, ఈ-క్రాప్ నమోదు పరిశీలనలోకి తీసుకోవచ్చు.
- ■ మండల పరిధిలోని ఇతర శాఖల వద్ద నమోదైన రికార్డుల్ని తహసీల్దార్లు పరిగణనలోకి తీసుకోవచ్చు. వ్యవసాయాధికారి వద్ద ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పెట్టుబడి రాయితీ, పంటల బీమా, పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ ప్రయోజనాలు, కౌలురైతు కార్డులు, క్రాప్ బుకింగ్ తదితర వివరాలుంటాయి. నీటి వినియోగదారుల సంఘ రికార్డులు, వడ్డీలేని రుణాలు, ధాన్యం కొనుగోలు తదితర వివరాల్ని పరిశీలించాలి
- ■ ఎలాంటి పత్రాలు లేకపోతే క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. భూమి అతని స్వాధీనంలో ఉందో లేదో పొరుగు రైతుల్ని విచారించి తెలుసుకోవాలి.

తిరస్కరణకు ఈ కారణాలు చెప్పొద్దు

ఆధారాలు లేవని, పొరుగు రైతులు విచారణకు రాలేదని, పత్రాలపై సంతకం సంబంధిత వ్యక్తులది కాదని, దరఖాస్తుదారు గైర్హాజరయ్యారని, సర్వేనంబర్లలో గందరగోళం ఉందని, బకాయిలున్నాయని దరఖాస్తుల్ని తిరస్కరించకూడదు. పొరుగు రైతులు అభ్యంతరం చెబుతున్నారని (ఎలాంటి ఆధారం లేకుండా) కూడా పక్కన పెట్టకూడదు. రైతు పేరు, ఇంటిపేరు, గ్రామం, మండలం, ఇతర టైపింగ్ తప్పులున్నాయని కూడా దరఖాస్తు తిరస్కరించకూడదు.

నేడే ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల

బృహత్ సమావేశాలు

- పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



భామినిలో సభకు సిద్ధమైన వేదిక

ఈనాడు, అమరావతి - భామిని, పార్వతీపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల బృహత్ సమావేశాలు(మెగా పీటీఎం) నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలను సైతం ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. దీంతో పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సామర్థ్యాలపైన మంచి చర్చ జరిగేందుకు అవకాశం ఏర్పడింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ సమావేశాలు జరగనున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లా భామినిలోని ఆదర్శ పాఠశాలలో జరిగే సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొననున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. సమావేశం అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారు. పాఠశాలలతోపాటు జూనియర్ కళాశాలల్లోనూ ఈ సమావేశాలు నిర్వహిస్తారు. విద్యార్థులతోనే ఆహ్వాన పత్రాలను తయారు చేయించి తల్లిదండ్రులకు అందజేశారు. పీటీఎం కోసం ప్రత్యేకంగా పాటలు రూపొందించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఈసారి వారి పిల్లలు రాసిన పరీక్షల సమాధాన పత్రాలు అందించనున్నారు. ఈ ఏడాది అన్ని పరీక్షలు ఒకే పుస్తకంలో రాసేలా మూల్యాంకన పుస్తకాలు తీసుకొచ్చారు. వాటిలోనే అన్నిరకాల పరీక్షలు రాయించి, మూల్యాంకనం చేసి మార్కులు వేస్తున్నారు. వీటిని పరిశీలించడం ద్వారా విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నారో తల్లిదండ్రులు అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థి పూర్తి స్థాయి వివరాలతో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను కూడా తల్లిదండ్రులకు అందిస్తారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, స్టెమ్ ల్యాబ్‌లు, గ్రంథాలయ పుస్తకాలు, స్పోర్ట్స్ కిట్లను ప్రదర్శనకు ఉంచుతారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నైపుణ్యాభివృద్ధిపైన తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరిస్తారు. తల్లిదండ్రుల ఫోన్లలో లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఆహ్వానితులు నుంచి వచ్చే సూచనలను దృష్టిలో ఉంచుకొని పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తారు.

అమరావతిలో లోక్‌భవన్‌కు

రూ.169 కోట్లతో టెండర్లకు అనుమతి

- జనవరి నెలాఖరుకు సీడ్ యాక్సెస్ రోడ్డు మంగళగిరికి అనుసంధానం
- ఆ రోడ్డు పూర్తి చేసిన తర్వాత కరకట్ట రోడ్డు
- అమరావతి రైతులకు మూలధన పన్ను రాయితీపై కేంద్రం సానుకూలం
- పురపాలకశాఖ మంత్రి నారాయణ వెల్లడి

ఈనాడు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్ లోక్‌భవన్ (గవర్నర్ నివాసం) అమరావతిలో నిర్మించేందుకు రూ.169 కోట్లతో టెండర్లు అనుమతించాం. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.163 కోట్లతో పాలనామోదం ఇచ్చేందుకు అనుమతించాం. ఈ అకాడమీకి త్వరలో టెండర్లు పిలుస్తారు' అని పురపాలకశాఖ మంత్రి నారాయణ చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన వెలగపూడి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..



- ■ అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.7,380.70 కోట్ల రుణం ఇచ్చేందుకు నాబార్డు అంగీకరించింది. ఆ రుణం తీసుకునేందుకు సంస్థ పాలకవర్గం ఆమోదం
- ■ సీడ్‌యాక్సెస్ రోడ్డును జాతీయరహదారి 16తో అనుసంధానం చేసేందుకు రూ.532 కోట్లతో టెండర్లను అప్పగించేందుకు అనుమతి.
- ■ 2024-25 సీఆర్డీఏ వార్షిక నివేదికలు ప్రవేశపెట్టేందుకు అంగీకారం.
- ■ జనవరి నెలాఖరు నాటికి సీడ్‌యాక్సెస్ రోడ్డును మంగళగిరి రహదారితో అనుసంధానం చేస్తాం. మధ్యలో కొండవీటి వాగు, పాలవాగు, గుంటూరు కాలువ, బకింగ్‌హాం కాలువపై స్టీల్ వంతెనలు నిర్మిస్తున్నాం.
- ■ మంగళగిరి రహదారిని కలిసిన తర్వాత సీడ్‌యాక్సెస్ రోడ్డు 16వ నంబరు జాతీయ రహదారిని కలిసేవరకు ఫ్లై ఓవర్లు నిర్మిస్తాం. ప్రస్తుతం రాజధానిలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, పీహెచ్‌సీ భవనాలు 30 వరకు సిద్ధం చేశాం. మార్చి నెలాఖరులోపు అధికారుల భవనాలు సిద్ధమయ్యేలా పనులు చేస్తున్నాం.
- ■ ఇప్పుడే కరకట్ట రోడ్డు పనులు ప్రారంభిస్తే రాజధానికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. అందుకే తొలుత సీడ్‌యాక్సెస్ రోడ్డు పనులు పూర్తిచేసి నాలుగు వరుసల కరకట్ట రహదారి పనులు ఆ తర్వాత ప్రారంభిస్తాం. ప్రస్తుతం 1,500 కి.మీ మేర ఎల్‌పీఎస్ రహదారుల నిర్మాణం ప్రారంభమైంది. వర్షాల వల్ల రైతులు ఇచ్చిన భూముల్లో కంప పెరిగిపోయాయి. రెండురోజుల్లో 3,400 ఎకరాల్లో కంప తొలగించాం. నెలరోజుల్లో మొత్తం 34వేల ఎకరాల్లో కంపలు తొలగించే పనులు పూర్తిచేస్తాం.
- ■ రెండోవిడత 16,666 ఎకరాల సమీకరణపై చర్చించాం. రైతులు సానుకూలంగా ఉన్నారు. తొలి విడతలో ఇచ్చినట్లే రెండో విడతకూ కౌలు ఇస్తాం.
- ■ అమరావతి రైతులకు భూములు అమ్ముకుంటే మూలధనంపై పన్ను రాయితీ కోసం కేంద్ర ఆర్థికమంత్రితో రైతులతో పాటు సీఎం కూడా చర్చించారు. ఆమె సానుకూలంగా స్పందించారు. తొలివిడతలాగే రెండోవిడత రైతులకూ రాయితీ వర్తింపజేస్తాం.
- ■ జగన్ ఎక్కడో ఉండి అమరావతి పనులపై విమర్శలు చేయడం కాదు... అమరావతికి వచ్చి ఇక్కడ పనులు ఏం జరుగుతున్నాయో చూస్తే తెలుస్తుంది. భూసేకరణకు, భూసమీకరణకు మధ్య తేడా తెలియాలి. భూసేకరణ అయితే పూర్తిభూమి మనకు వస్తుంది. అదే భూ సమీకరణ అయితే 15% భూమి మాత్రమే ఉపయోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ విషయం జగన్ తెలుసుకోవాలి.

ఇదే ఐక్యతతో 15 ఏళ్లు ముందుకు సాగాలి

- అధికారంలోకి వచ్చింది గొడవలు పడటానికి కాదు..
- బెల్టు దుకాణాలు వద్దు.. బాధ్యతతో వ్యవహరించండి
- కూటమి శ్రేణులకు జనసేనాని పవన్ కల్యాణ్ హితవు
- తొలిసారి చిత్తూరులో 3 పార్టీల నేతలతో సమావేశం



కూటమి నేతల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పక్కనే ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్, శ్రీనివాసులు

ఈనాడు, చిత్తూరు: కూటమిలోని మూడు పార్టీల నాయకులకు విభిన్న భావజాలాలు ఉన్నా.. 'రాష్ట్రం బాగుండాలి- అరాచకాలు ఆగాలి' అనే సదుద్దేశంతో గత ఎన్నికల్లో కలిసి పనిచేశామని, ఇదే ఐక్యతతో మరో 15 ఏళ్లు ముందుకు సాగాలని జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. జనసేన, తెదేపా, భాజపా నాయకులకు పిలుపునిచ్చారు. 15 ఏళ్లు కష్ట పడితే రాష్ట్ర సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. 'ఒక్కోసారి ఒక పార్టీలో ఉన్న నేతలకే పడదు. నన్ను కూడా తిడుతుంటారు. అలాంటిది మూడు పార్టీలు కలిశాయంటే చిన్నచిన్న విభేదాలు సహజం. అలాంటప్పుడు కూర్చుని మాట్లాడితే సరిపోతుంది. సరిహద్దు వివాదాల పరిష్కారానికి పలుమార్లు చర్చలు జరుపుతారు. మనందరం (కూటమి నాయకులు) కూడా మినీ యుద్ధాలే చేయాలి. తప్పదు.. యుద్ధాలంటే తిట్టుకోవడాలు, కొట్టుకోవడాలు కాదు. కూర్చొని చర్చించాలి. మనం అధికారంలోకి వచ్చింది గొడవలు పడటానికి కాదు.. కూటమికి మరింత బలమివ్వడానికి' అని స్పష్టం చేశారు. చిత్తూరు నగరం రెడ్డిగుంటలో గురువారం కూటమి నాయకులు, శ్రేణులతో పవన్ కల్యాణ్ సమావేశమై దిశానిర్దేశం చేశారు. తొలిసారి చిత్తూరులో మూడు పార్టీల నాయకులతో మాట్లాడాలని నిర్ణయించానని తెలిపారు.

శ్రమించని మేధావి ఉన్నా లేకున్నా ఒకటే

'కూటమి అధికారంలోకి వచ్చింది కాబట్టే ఇంతమందికి పదవులు ఇవ్వగలిగాం. ఇంకొకరు వచ్చుంటే ఏంజరిగి ఉండేదో ఊహించుకోండి. నేను ఎప్పుడూ గుర్తింపు, పదవుల కోసం తాపత్రయపడలేదు. 2008లో తిరుపతిలో ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావ సభలో నేనెక్కడా కనపడలేదు. ప్రజలకు ఎప్పుడూ అండగా నిలవాలనే కోరుకున్నా. మీరంతా సమాజంలో గొంతులేని వాళ్ల గళమవ్వాలి. పదవే పరమావధిగా పనిచేయొద్దు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ చెప్పిన మాటలు బాగున్నాయి. 'వర్షించని మేఘం.. శ్రమించని మేధావి ఉన్నా లేకున్నా ఒక్కటే' అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వానికి ఇంత బలం ఉండి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల్లో మార్పు తీసుకురాకపోతే ఎన్ని పదవులున్నా నిష్ప్రయోజనమే. లక్షల మందికి ప్రాతినిధ్యం వహించాలనుకున్నప్పుడు ముందు క్షేత్రస్థాయిలో పనిచేయాలి. ఆటుపోట్లను తట్టుకుని నిలబడాలి. మీరంతా కష్టపడి పనిచేస్తేనే మళ్లీ మనకు ఓటు వేస్తారని గుర్తుంచుకోవాలి. నాయకుడి లక్షణం నిస్సహాయులకు అండగా ఉండటమే. బెల్టు దుకాణాలను కొనసాగించవద్దు. మీరంతా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి' అని హితవు పలికారు.

చంద్రబాబునే అడుగు పెట్టనివ్వలేదు

'ఐదారుగురు రౌడీలు వచ్చి సమాజాన్ని భయపెడతామంటే ఒప్పుకోం. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబును గత పాలకులు.. సొంత నియోజకవర్గం కుప్పంలో అడుగుపెట్టనీయలేదంటే ఏమనుకోవాలి? అది ఒక్క చంద్రబాబుకే జరిగినట్టు కాదు. గత ప్రభుత్వంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికీ నేతలు భయపడ్డారు. కోల్పోతున్న ధైర్యాన్ని నింపడమే జనసేన లక్ష్యం. మీలో అది ఉంది కాబట్టే ఈరోజు మనం అధికారంలో ఉన్నాం. ఒకడికి ఉంటే అది అతని కోపం. 10 వేలమందికి ఉంటే సమూహం తాలూకా శక్తి. అలాంటి సమూహాన్ని ప్రతి గ్రామంలో నింపుకొంటూ వెళ్లాం. కూటమి కేంద్రానికి బలమైంది. ఏపీ నుంచి 21 మంది ఎంపీలు ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి బలమయ్యారు. చిన్నగా మొదలుపెట్టి ఎక్కడకు వచ్చామో చూడండి' అని జనసేనాని సూచించారు.

జనసేనలో ఐదుగురు సభ్యుల కమిటీ

'జనసేన శ్రేణులకు పాలనానుభవం లేకున్నా, సమాజానికి మంచి చేయాలన్న పట్టుదల ఉంది. ఒకరిని నాయకుడిగా పెడితే ఐదుగురు గొడవ పడుతున్నారు. 2008లో ప్రజారాజ్యం యువజన విభాగంలో ఎదురైన అనుభవాలతో జనసేనలో ఐదుగురు సభ్యులతో కమిటీని నియమిస్తున్నాం. అప్పట్లో ఇలానే ఐదుగురితో విభాగాలు ఏర్పాటు చేశాం. దాంతో ఎవరైనా పెత్తనం చేయడానికి ప్రయత్నిస్తే పవన్ కల్యాణ్ మీకు ఎంత తెలుసో.. నాకూ అంతే తెలుసు అనేవారు. ఇప్పుడు కూడా అలాగే చేస్తున్నాం. ఆ కమిటీయే నిర్ణయం తీసుకుంటుంది. నేనే వాటి ఏర్పాటు బాధ్యత చూస్తా. రెండేళ్లకోసారి పునర్ వ్యవస్థీకరిస్తా' అని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్, మురళీ మోహన్, అరవ శ్రీధర్, ఆరణి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బొకేల హడావుడి లేకపోవడం సంతోషం

చిత్తూరు పర్యటనలో అధికారులు, ప్రజాప్రతినిధులు బొకేలు, శాలువాలతో హడావుడి చేయకపోవడం సంతోషంగా ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. అధికారులను అభినందిస్తున్నానన్నారు. వాటి ఖర్చుతో సేవా కార్యక్రమాలు చేయాలని జనసేన శ్రేణులకు సూచించారు.



ఆకలి తీర్చే ఆపద్బాంధవులు



నిరాదరణకు గురవుతున్న వృద్ధులు, అనాథల ఆకలి బాధలు చూసి మనసు చలించిన ఓ కుటుంబం వారి కడుపు నింపే బాధ్యతను భుజాన వేసుకుంది. నెలకు రూ.1.50 లక్షల ఖర్చు చేస్తూ రెండు పూటలా వారి ఆకలిని తీరుస్తోంది. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం రామనాథపురానికి చెందిన జొన్నగిరి రామమూర్తి స్వామి కుటుంబం బెంగళూరులో ఉంది. ఆయన చౌడయ్య ఇంజినీరింగ్ (బీపీఎల్ అండ్ బీఈఎల్) ట్రస్టు చైర్మన్‌గా ఉన్న ఆయన.. తన కుటుంబ సభ్యులు, సంస్థ డైరెక్టర్లు ఆయన బి.మధుసూదనరావు (అమెరికా), రమేష్‌లతో కలిసి ఈ ఏడాది ఏప్రిల్ 30న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఖాళీగా ఉన్న ఓ భవనాన్ని వంటశాలగా మార్చి అన్నదానం ప్రారంభించారు. ప్రస్తుతం పంచాయతీ పరిధిలోని 14 పల్లెల్లో ఎలాంటి ఆదరణ లేని వృద్ధులు, అనాథలు 150 మందిని గుర్తించి రెండు పూటలా పరిశుభ్ర భోజనాన్ని ఇస్తున్నారు. రోజూ 10 గంటలకల్లా వంట పూర్తి చేసి రెండు కూరలు, అన్నంతో సాంబారు సర్దుతారు. స్వగ్రామంలో పనిచేసే యువత ఒక్కొక్కరు 30 నుంచి 40 మందికి సరిపడా క్యారియర్లను బైకులపై తీసుకుని ఇళ్ల దగ్గరకే తీసుకెళ్లి అందిస్తారు. - న్యూస్‌టుడే, చిన్నమండెం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి గడ్కరీ, మెడ్‌టెక్ జోన్ సీఈఓ డా. జితేంద్రశర్మ తదితరులు

చట్టాలతోనే దివ్యాంగుల హక్కుల పరిరక్షణ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ఈనాడు, విశాఖపట్నం: దేశంలోని భవనాలు, సామాజిక ప్రదేశాలను భవిష్యత్తులో దివ్యాంగులకు అనుకూలంగా మార్చాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దివ్యాంగుల సౌలభ్యం కోసం విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, ఇన్‌క్లూజివ్ దివ్యాంగజన్ ఆంత్రప్రెన్యూర్స్ అసోసియేషన్ సంయుక్తంగా రూపొందించిన 'పర్పుల్ బిల్డింగ్ సర్టిఫికేషన్ స్కీమ్'ను దిల్లీలో ఆయన ప్రారంభించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. లక్షల మంది దివ్యాంగులను శక్తిమంతం చేయడానికి, వారి పట్ల జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడానికి చట్ట నిబంధనలు సహాయపడతాయన్నారు. దీనికి సంబంధించిన ముసాయిదా ప్రతిపాదన రూపొందించాలని నీతి ఆయోగ్‌కు, దాన్ని పార్లమెంటులో ఆమోదించేలా బిల్లు తయారు చేయాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖకు సూచించారు. మెడ్‌టెక్ జోన్ సీఈఓ డా. జితేంద్రశర్మ మాట్లాడుతూ.. ఐసీఎంఆర్ సహకారంతో ముగ్గురు నిపుణుల కమిటీ ఈ పథకానికి జాతీయ ప్రమాణాలు రూపొందించడానికి పనిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యుడు డా. వీకే పాల్, ప్రత్యేక ఒలింపిక్స్ భారత అధ్యక్షురాలు డా. మల్లికా నడ్డా, కేంద్ర దివ్యాంగుల సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మన్మిత్ కౌర్ నందా తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌కు తెలంగాణపై అమిత ప్రేమ

- బిడ్డకు దిష్టి తీసినప్పుడు తన దిష్టీ తగలకూడదని తల్లి అంటుంది
- ఇక్కడితో ఈ వివాదం ముగిసిపోవాలని కోరుకుంటున్నాం
- మంత్రి కందుల దుర్గేష్



ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇటీవల చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరిస్తున్నారని, వాస్తవానికి ఆయనకు తెలంగాణ పట్ల అమితమైన ప్రేమ ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'తెలంగాణను కించపరచాలనే ఉద్దేశంతో పవన్ మాట్లాడలేదు. ఆయనకు తెలంగాణపై విపరీతమైన అభిమానం ఉంది. ఎప్పుడూ తెలంగాణ గొప్పదనాన్ని చెబుతూ పోరుగడ్డగా అభివర్ణిస్తారు. గద్దర్‌పై అమితమైన ప్రేమ చూపిన వ్యక్తి. తన సినిమాల ద్వారా అక్కడి కళాకారులను ప్రోత్సహించారు. మామూలుగా ఆంధ్రా గ్రామీణ ప్రాంతాల్లో ఒక మాట ఉంటుంది. 'మా దిష్టి కూడా తగలకూడదు' అని మనకు మనమే అంటూ ఉంటాం. తల్లి.. బిడ్డకు దిష్టి తీసినప్పుడు తన దిష్టి సైతం తగలకూడదని అంటుంది. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు కూడా అలా అన్నవే తప్ప, తెలంగాణ జనం కించపడేలా ఉద్దేశించినవి కావు. దీనిపై జనసేన పార్టీ ఇప్పటికే స్పష్టమైన వివరణ ఇచ్చింది. దీన్ని తెలంగాణ నేతలు ఇంకా కొనసాగించకూడదు. ఇక్కడితో సమస్య పరిసమాప్తం కావాలని కోరుకుంటున్నాం. పవన్ చెప్పిన మాటలను సీరియస్‌గా తీసుకోవద్దు' అని పేర్కొన్నారు. పవన్ రాజకీయాల్లోకి రాకముందు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏపీకి సహాయం చేసినట్లుగానే, తెలంగాణకూ చేశారని, జనసేన రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉందని దుర్గేష్ గుర్తుచేశారు.

జగన్ సిద్ధాంతానికి కాలం చెల్లింది

'వైకాపా అధినేత జగన్ ఉనికి కోసమే నెలరోజులకోసారి తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి గంటల కొద్దీ మీడియా ఎదుట ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పి నిజం అనిపించాలన్న జగన్ సిద్ధాంతానికి కాలం చెల్లింది' అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అమలు కాలేదని జగన్ చెప్తున్నారని.. అమలు తీరును గుర్తుచేశారు. తల్లికి వందనం, దీపం-2, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ యోజన అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి పేర్ని నాని మంత్రి కాదు అని సంబోధించడాన్ని మంత్రి ఖండించారు. మాంత్రికుడి వేషం వేసేది పేర్ని నానినే అని విమర్శించారు. వైకాపా నేతలు తొలి నుంచీ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఇది తగదని హితవు పలికారు.



కోలుకున్న చిన్నారితో తండ్రి, రుయా వైద్యులు

చిన్నారి ఊపిరితిత్తుల్లో ప్లాస్టిక్ మూత

విజయవంతంగా తొలగించిన రుయా వైద్యులు



ప్లాస్టిక్ మూత

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: బాలుడు అనుకోకుండా మింగేసిన ప్లాస్టిక్ మూత ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోగా.. రుయా చిన్నపిల్లల విభాగం వైద్యులు విజయవంతంగా సర్జరీ నిర్వహించి బయటకు తీశారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులకు చెందిన ప్రశాంత్ కుమారుడు పాలెం మహి(3) వారం రోజుల కిందట ఆడుకుంటూ ప్లాస్టిక్ మూతను మింగేశాడు. దగ్గు, ఆయాసానికి గురికావడంతో రుయా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు సీటీ స్కాన్ చేసి ఊపిరితిత్తుల్లో మూత ఇరుక్కుపోయినట్లు గుర్తించి, 'బ్రాంకోస్కోపీ' ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ నెల 1న పీడియాట్రిక్ సర్జరీ విభాగం వైద్యుడు డా.ఏబీ జగదీష్, అతని బృందం శస్త్రచికిత్స నిర్వహించి ఊపిరితిత్తుల్లోని మూతను విజయవంతంగా బయటకు తీశారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్, పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు, ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ పద్మజ, డాక్టర్ దొరబాబు సహకారం అందించారు. కోలుకున్న బాలుణ్ని గురువారం ఇంటికి పంపించారు.

18 నుంచి రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు

- 'యూత్ ఫర్ స్వర్ణాంధ్ర' థీమ్‌తో కార్యక్రమాల నిర్వహణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యువజన సేవల కమిషనర్ ఎస్.భరణి, లక్ష్మణ్, శ్రీనివాస్

ఈనాడు, అమరావతి: 'యువ-2025' పేరుతో 'యూత్ ఫర్ స్వర్ణాంధ్ర థీమ్'తో ఈ నెల 18, 19, 20 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ ఇందుకు వేదిక కానుంది. విజయవాడలోని శాప్ కార్యాలయంలో గురువారం ఈ వేడుకల వివరాలను యువజన సేవల కమిషనర్ ఎస్.భరణి వెల్లడించారు. 'గ్రాండ్ కార్నివాల్ పరేడ్‌తో వేడుకలు ప్రారంభమవుతాయి. ఇందులో 26 జిల్లాల నుంచి బృందాలు పాల్గొంటాయి. ఎంపిక చేసిన సుమారు రెండు వేల మంది యువ ప్రతినిధులు వేడుకలకు హాజరవుతారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పాలసీ రూపకర్తలు, వైద్యులు, సివిల్ సర్వెంట్లు తదితరులు యువతకు దిశానిర్దేశం చేస్తారు. ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 పేరుతో నిర్వహించిన డిజిటల్ మారథాన్ ఫైనల్స్‌ను ఈ వేడుకల్లో నిర్వహిస్తాం. ఇప్పటికే జిల్లాల్లోని యువజనోత్సవాల్లో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తాం" అని వెల్లడించారు. ఈ సమావేశంలో యూత్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సీఈఓ యు. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

11న కడప మేయర్, కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నిక

ఈనాడు, అమరావతి: కడప మేయర్, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలకు ఈ నెల 11న ఎన్నికలు నిర్వహించనున్నారు. మేయర్ సురేశ్‌బాబు, ఛైర్‌పర్సన్ రాజ్‌కుమార్‌పై వచ్చిన పలు అభియోగాలపై ప్రభుత్వం ఇటీవల ఇద్దరినీ తొలగించింది. 2 చోట్ల ఖాళీ అయిన స్థానాలకు తిరిగి ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలంసాహ్నీ గురువారం వేర్వేరుగా నోటిఫికేషన్లు ఇచ్చారు. ఈ నెల 7లోగా కడప నగరపాలక సంస్థలో కార్పొరేటర్లకు, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు సమాచారం అందించి 11న ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల కలెక్టర్లు, కడప, కళ్యాణదుర్గం నగర, పురపాలక సంస్థల కమిషనర్లను నీలం సాహ్నీ ఆదేశించారు.

ఫైబర్‌నెట్ కేసు మూసివేతపై వైకాపా నేత గౌతమ్‌రెడ్డి పిటిషన్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబుపై దాఖలు చేసిన ఫైబర్‌నెట్ కేసు మూసివేతను సవాలు చేస్తూ ఫైబర్‌నెట్ మాజీ ఛైర్మన్, వైకాపా నేత గౌతమ్‌రెడ్డి ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేశారు. గురువారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ ఫైల్ చేశారు. 2014-19 కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందని నమోదు చేసిన కేసును మూసివేసే ముందు తన వాదనలు వినాలని అభ్యర్థించారు. దీనిపై గురువారం సీఐడీ పిటిషన్ వేసింది. తమ వాదనలూ వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని, ఇందుకు వీలుగా సోమవారానికి వాయిదా వేయాలని కోరింది.

పోలవరంలో 17 నెలల్లో 12% పనులు

- ఐదేళ్లలో వైకాపా చేసింది 2 శాతమే
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల
- పోలవరం నిర్మాణ పనుల పరిశీలన



దేవరగొంది సమీపంలో సాగుతున్న జంట సొరంగాల పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

ఈనాడు-ఏలూరు: పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్మాణ పనుల్ని గాడిలో పెట్టి వేగవంతం చేశామని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షత వల్లే సాధ్యమౌతోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు చాలా వరకు పట్టాలెక్కించాం. 2027 డిసెంబరు కల్లా పూర్తి చేస్తాం' అని తెలిపారు. గురువారం ఆయన ఈఎన్‌సీ నరసింహమూర్తి, సలహాదారు వెంకటేశ్వరరావు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి డయాఫ్రం వాల్, ప్రధాన డ్యామ్ రాక్‌ఫిల్లింగ్ పనులు, సొరంగాల్లో లైనింగ్ పనులను పరిశీలించి వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ముంపు బాధితులు, నిర్వాసితులకు ప్రభుత్వ ప్యాకేజీ, పునరావాసం, కాలనీ నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'వైకాపా పాలనలో పోలవరం పనులు 2 శాతం జరగ్గా కూటమి హయాంలో 17 మాసాల్లో 12 శాతం పనులు చేసి నిర్మాణాలను వేగవంతం చేశాం. ఇప్పటి వరకు 88 శాతం పూర్తయ్యాయి' అని వివరించారు. గడువుకు ఆర్నెల్ల ముందే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులను ఆదేశించారు.

నిర్వాసితులకు అండగా నిలిచాం

'2020లో ధ్వంసమైన డయాఫ్రం వాల్ ఫిబ్రవరికి పూర్తవుతుంది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1లో పనుల్ని ఏప్రిల్‌కు పూర్తి చేస్తాం. ఎడమవైపు ప్రధాన కాలువ పనులు 2026 నాటికి పూర్తి చేసి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలిస్తాం. ఒక్క ఏడాదిలో నిర్వాసితులకు రూ. 2,000 కోట్లు ఇచ్చి వారికి అండగా నిలిచాం' అని మంత్రి వివరించారు. నిరాశ్రయులకు నాణ్యమైన ఇళ్లు నిర్మించాలి. వారికి పునరావాస కల్పన కోసం భూములు సేకరించాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ ప్రశాంతికి సూచించారు.

ముంచెత్తిన వాన

- నెల్లూరు నగరంలో ప్రధాన రోడ్లన్నీ జలమయం
- కాలువల్లో పడి ఒకరి మృతి, మరొకరు గల్లంతు



నెల్లూరు నగరం సండే మార్కెట్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

ఈనాడు, నెల్లూరు, ఈనాడు డిజిటల్-తిరుపతి: దిత్వా తుపాను బలహీనపడి వాయుగుండంగా కొనసాగుతుండటంతో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం 4 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నెల్లూరు రూరల్, వెంకటాచలం పరిధిలో చెరువులు నిండి జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. నెల్లూరులోని పలు కాలనీల్లో ముంపు నీరు చేరింది. నెల్లూరు-జొన్నవాడ మార్గంలో పొట్టేపాలెం కలుజు మట్టికట్ట దెబ్బతినడంతో వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. కలుజు వద్ద ప్రమాదవశాత్తు నీటిలోపడి షేక్ మెహ్రాజ్ మస్తాన్ (18) మృతి చెందారు. నెల్లూరు గ్రామీణం కొండ్లపూడి సమీపంలో నెల్లూరు కాలువలో పడి రవి అనే వ్యక్తి గల్లంతయ్యారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు అత్యధికంగా నెల్లూరు రూరల్‌లో 8.8 సెం.మీ., నెల్లూరు అర్బన్‌లో 8.3 సెం.మీ., కోవూరులో 6.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మరోవైపు మూడు రోజులుగా తిరుపతి జిల్లాలో కురుస్తున్న సుమారు 5 వేల హెక్టార్లలో పంటలు నీటమునిగాయి. గూడూరు మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తీర మండలాల్లోనూ వర్షం కురిసింది.



తిరుపతి జిల్లా వాకాడు మండలం తూపిలిపాలెం ఎస్టీ కాలనీలో ముంపు

రాష్ట్రంలో నాలుగు లాజిస్టిక్ పార్కులు

- సరకు రవాణా వ్యయాన్ని తగ్గించడమే లక్ష్యం
- ఐదు రంగాల్లో సేవల అభివృద్ధికి ప్రభుత్వ నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసేందుకు వీలుగా నాలుగు చోట్ల మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులను (ఎంఎంఎల్‌పీ) అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల్లో రవాణా పరంగా సౌకర్యాలు మెరుగు పడతాయని భావిస్తోంది. సరకు రవాణా ఖర్చులు తగ్గించడంతో పాటు పంపిణీ కేంద్రాలు, కోల్డ్‌స్టోరేజ్‌లు, ఆటోమేటెడ్ వేర్‌హౌస్‌లను అనుసంధానం చేయనుంది. మెటీరియల్ హ్యాండ్లింగ్ సిస్టమ్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ద్వారా సరకు రవాణా వ్యయాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించాలన్నది ప్రభుత్వ ఆలోచన. కృత్రిమ మేధను వినియోగించి సరకు డెలివరీ విధానంలో కచ్చితత్వం తేవాలని భావిస్తోంది. ఏటా 180 బిలియన్ డాలర్ల మేర రవాణా వ్యయాన్ని ఆదా చేయాలన్నది లక్ష్యం. ఏపీ లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ-లింక్) ద్వారా రవాణా రంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించింది.

పార్కుల అభివృద్ధి ఎక్కడెక్కడంటే..

◆ అనంతపురంలో 210 ఎకరాల్లో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కును పీపీపీ విధానంలో అభివృద్ధికి నిర్ణయం. ఇప్పటికే టెండరు ప్రక్రియను అధికారులు చేపట్టారు.

◆ అనకాపల్లిలో 286 ఎకరాల్లో ఎంఎంఎల్‌పీ అభివృద్ధికి నిర్ణయం.

◆ వైఎస్సార్ కడప జిల్లా కొప్పర్తిలో 300 ఎకరాల్లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ద్వారా లాజిస్టిక్స్ పార్కు అభివృద్ధికి నిర్ణయం.

◆ కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో పార్కు అభివృద్ధికి ప్రతిపాదన.

రవాణాకు మద్దతుగా..

రాష్ట్రంలో లాజిస్టిక్స్ నిర్వహణకు అనువైన పరిస్థితులను కల్పించేందుకు ఐదు ప్రధాన అంశాలను ప్రభుత్వం గుర్తించింది. ◆ జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ రోడ్లు, ప్రాంతీయ, స్థానిక రోడ్ల మధ్య అనుసంధానం. ◆ ప్రత్యేక రైల్వే కారిడార్. ◆ కార్గో ఎయిర్ పోర్టులు, విమానాల్లో సరకు రవాణా. ◆ పోర్టులు, హార్బర్లు అంతర్గత జలరవాణా సదుపాయాలు అభివృద్ధి. ◆ పెట్రోలియం, సహజవాయు సరఫరాకు పైప్‌లైన్ నెట్‌వర్క్ ఏర్పాటు.



గోదాములు.. స్టోరేజ్ సదుపాయాలు

◆ రీజినల్, నేషనల్ హబ్‌లు, క్రాస్ డాకింగ్ సదుపాయాలు. ◆ ఉష్ణోగ్రతలు నియంత్రించే గోదాముల ఏర్పాటు. ◆ రోబోటిక్స్, ఏఐ ఆధారిత కార్యకలాపాలు నిర్వహించే ఆటోమేటెడ్ గోదాముల ఏర్పాటు. ◆ ఫోర్కులిఫ్టులు, కన్వేయర్ బెల్టులు, క్రేన్లు, ఆటోమేటెడ్ గైడింగ్ వెహికల్స్.

◆ వినియోగ, పునర్వినియోగ వస్తువుల ప్యాకింగ్ సదుపాయాల కల్పన

అనువైన వాతావరణం.. సేవలు

◆ డెలివరీ, విలువ ఆధారిత సర్వీసుల్లో వినూత్న విధానాలను అనుసరించడం.

◆ ఎగుమతులు, దిగుమతుల్లో సమర్థ విధానాలు. ◆ కస్టమ్సు సేవలతో కూడిన గోదాములు, డాక్యుమెంటేషన్. ◆ విద్యుత్తు, నీరు, టెలికాం నెట్‌వర్క్, వ్యర్థాల నియంత్రణ.

పాక్ ఎయిర్‌లైన్స్‌పై 'సైన్యం' పడగ!

ఇస్లామాబాద్: అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సూచించిన సంస్కరణల్లో భాగంగా పాక్‌కు చెందిన అంతర్జాతీయ విమానయాన సంస్థ (పీఐఏ)ను అమ్మేందుకు అక్కడి ప్రభుత్వం సిద్ధమైంది. అయితే, దీన్ని కొనుగోలు చేసేందుకు సైన్యం గుత్తాధిపత్యం ఎక్కువగా ఉండే ఫౌజీ ఫౌండేషన్‌కు చెందిన ఫౌజీ ఫర్టిలైజర్ కంపెనీ కూడా బిడ్డింగ్ వేయడం గమనార్హం. పీఐఏ బిడ్డింగు ఈనెల 23న జరుగుతుందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. ప్రైవేటీకరణ ద్వారా ఈ ఏడాదికి 8,600 కోట్ల పాకిస్థానీ రూపాయలు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి మహమ్మద్ అలీ గత నెలలో ఓ మీడియాతో పేర్కొన్నారు.

ఏంటీ ఫౌజీ ఫౌండేషన్..: పాకిస్థాన్‌లోని అతిపెద్ద కార్పొరేట్ కంపెనీల్లో ఫౌజీ ఫౌండేషన్ ఒకటి. 1954లో ఏర్పాటైన దీనికి.. 35కు పైగా అనుబంధ సంస్థలున్నాయి. అందులో ఫౌజీ ఫర్టిలైజర్ కంపెనీ ఒకటి. పాక్‌లోని సైనిక ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ఈ ఫౌండేషన్ నడుస్తోంది. ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్‌కు ఈ ఫౌండేషన్‌తో పరోక్ష సంబంధాలున్నాయి. ఏ బిడ్డింగుల్లో అయినా దీనికి పోటీ ఉండదు. ఈ క్రమంలో ఎయిర్‌లైన్స్‌ను కూడా ఈ సంస్థకు చెందిన కంపెనీనే చేజిక్కించుకునే అవకాశాలు లేకపోలేదు.





వస్తు ప్రదర్శనను తిలకిస్తున్న కళాకారులు, విద్యార్థులు ◆ ఎద్దుల మెడలో కట్టే కర్ర గంటలు

తోలు డప్పులు.. కర్ర గంటలు

అల్లూరి సీతారామరాజు, అప్పటి స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రాంతాల నుంచి సేకరించిన అత్యంత అరుదైన సంప్రదాయ, సాంస్కృతిక, చారిత్రక వస్తు సంపద 'ఉద్భవ్-2025' ఉత్సవంలో కొలువుదీరింది. గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక ఉత్సవాల్లో ఆదివాసుల వస్తువులు, ఆభరణాలు, ఆయుధాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇవి విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగిలో ఏర్పాటు చేయబోతున్న ట్రైబల్ ఫ్రీడం ఫైటర్స్ మ్యూజియం కోసం పాడేరు, సీతంపేట, పార్వతీపురం, కేఆర్‌పురం, రంపచోడవరం నుంచి సేకరించిన అత్యంత అరుదైన వాటిని ఇక్కడ ప్రదర్శించామని క్యూరేటర్ శ్రీనివాస్ తెలిపారు - ఈనాడు గుంటూరు

భాజపా యాత్రకు భద్రత కల్పించండి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈనెల 10 నుంచి నిర్వహించనున్న 'అటల్ సుశాసన్ సంకల్ప్- మోదీ సిద్ధి యాత్ర'కు భద్రత కల్పించి, పూర్తి సహకారం అందించాలని భాజపా నాయకులు రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కోరారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాతూరి నాగభూషణం తదితరులు గురువారం డీజీపీని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు.

ఈనాడు

జబ్బొకటి... మందొకటి!

ధూమపానం ఆరోగ్యానికి హానికరమనే హెచ్చరికలు అన్నిచోట్లా కనిపిస్తుంటాయి. పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లపైనా సంబంధిత చిత్రాలు దర్శనమిస్తుంటాయి. వాటిని చూసి ఎంతమంది ఆ దురలవాట్లకు దూరమవుతున్నారు? ప్రాణాంతక పొగాకు నుంచి దేశాన్ని రక్షించుకోవడానికంటూ కేంద్రం పదిహేడేళ్ల కిందటే ప్రత్యేక కార్యక్రమాన్ని భుజాలకెత్తుకుంది. కానీ, క్షేత్రస్థాయిలో అది పెద్దగా విజయవంతం కావట్లేదు. నిత్యం ఎంతోమంది పొగాకుకు కొత్తగా అలవాటుపడుతూ రకరకాల క్యాన్సర్ల గుప్పిట చిక్కుతున్నారు. పచ్చని సంసారాల్లో నిప్పులుపోస్తున్న పొగాకును సమాజం నుంచి పూర్తిగా పారదోలాల్సింది పోయి ప్రభుత్వాలేమో దానిపై సుంకాల పెంపునకు మొగ్గుచూపుతున్నాయి. జేబులపై భారం మోపితే జనం పొగతాగే, పొగాకును నమిలే దుర్వ్యసనాలను మానుకుంటారని సర్కార్లు భావిస్తున్నాయి. ఇటీవల పార్లమెంటరీ స్థాయీసంఘం సైతం పొగాకు ఉత్పత్తులపై 'అధిక ముప్పు' సెస్‌తో పాటు భారీగా పన్నులేయాలని సిఫార్సు చేసింది. తాజాగా పార్లమెంటు సైతం అలాంటి బిల్లుకు ఆమోదం తెలిపింది. తద్వారా పొగాకు ఉత్పత్తులపై సుంకాలు మరింత పెరగనున్నాయి. పొగాకు లభ్యతను నిలువరించకుండా ధరలు పెంచినంత మాత్రాన ప్రయోజనం ఉండదన్న ప్రజారోగ్య నిపుణుల మొత్తుకోళ్లు అరణ్యరోదనే అవుతున్నాయి!

దేశీయంగా నిరుడు 15.3 లక్షల కొత్త క్యాన్సర్ కేసులు వెలుగుచూశాయి. 2023లో ఇండియాలో ఎనిమిది లక్షలకు పైగా నిండు ప్రాణాలు క్యాన్సర్ భూతానికి బలయ్యాయి. ఆ మరణాల్లో మూడో వంతు పాపమంతా పొగాకుదేనని పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. ధూమపానంతో పాటు ఖైనీ, గుట్కా, జర్దా వంటి పొగాకు ఉత్పత్తుల వినియోగంతో నోరు, గొంతు, మెడ, ఊపిరితిత్తులు వంటి పదహారు రకాల క్యాన్సర్లు విజృంభిస్తున్నాయి. హృద్రోగాలు, పక్షవాతం మొదలు సంతానలేమి దాకా అనారోగ్య సమస్యలెన్నో చుట్టుముడుతున్నాయి. ధూమపానం అలవాటు లేకపోయినా మరొకరు తాగి వదిలే పొగను పీల్చుతున్నవారూ జబ్బుల బారిన పడుతున్నారు. పొగాకు సృష్టిస్తున్న జనారోగ్య విధ్వంసానికి దక్షిణాసియా దేశాల్లో ఇండియానే ఎక్కువగా బాధితురాలవుతోంది. పొగాకుపై పన్నుల ద్వారా సర్కారీ ఖజానాకు జమవుతున్న ప్రతి వంద రూపాయలకు జనభారతం రూ.816 చొప్పున మూల్యం చెల్లించాల్సి వస్తోంది. పొగాకుపై పోరు లక్ష్యానికి బారెడు దూరమవుతున్న దౌర్భాగ్యస్థితిని ఈ గణాంకాలే పట్టిచూపుతున్నాయి!

ఆహార ధాన్యాల దిగుబడులు ఏటేటా పెరుగుతున్నా, నూనెగింజలూ పప్పుదినుసుల కోసం దేశానికి నేటికీ పరాధీనత తప్పట్లేదు. వాటికోసం భారత్ నిరుడు రెండు లక్షల కోట్ల రూపాయలను విదేశాలకు ధారబోసింది. ఈ దురవస్థను తప్పించేందుకు పప్పుదినుసుల సాగు విస్తీర్ణాన్ని మరో 86 లక్షల ఎకరాల మేర పెంచాలని కేంద్రం కొద్ది రోజుల క్రితమే పేర్కొంది. రసాయనాల విచ్చలవిడి వాడకంతో పంటభూములు, జనారోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాలను కేంద్రం ప్రోత్సహిస్తోంది. ఆ విధంగా ప్రజాశ్రేయస్సును వాంఛిస్తున్న ప్రభుత్వం- నిలువునా ప్రాణాలు తీస్తున్న పొగాకును మూలంలోనే కట్టడి చేయడంపైనా దృష్టి సారించాలి. దాని సాగుదారుల జీవనోపాధికి నష్టం కలగని రీతిలో దేశీయ అవసరాలకు తగిన ప్రత్యామ్నాయ పంటలవైపు వారిని మళ్లించాలి. సంబంధిత ఫలసాయాలకు గిట్టుబాటు ధరలు దక్కేలా చూడాలి. పొగాకు మూలంగా ముమ్మరిస్తున్న భయంకర వ్యాధులపై యువతలో చైతన్యం నింపాలి. ఆ ఉత్పత్తుల అక్రమ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలి. అప్పుడే క్యాన్సర్ల కరకు కోరల నుంచి దేశం బయటపడగలుగుతుంది!



తల్లిదండ్రులూ ఉపాధ్యాయులూ పిల్లలకు నేర్పాల్సిన విలువలు నేర్పకపోతే వారి స్థానాన్ని సంఘ విద్రోహులు ఆక్రమిస్తారు. నేర్పకూడనివి నేర్పిస్తారు. అప్పుడు ఎంత బాధపడినా ఏమీ ప్రయోజనం ఉండదు.

– ఆనంద్ నీలకంఠన్, రచయిత

స్వర్గం - నరకం

సదాలోచనలు కలిగి ఉంటే స్వర్గాన్ని సృష్టించుకుంటున్నట్లే. వెలుగుకోసం దైవానికి మొరపెట్టుకుంటే మంచి అనుభవం కలుగుతుంది. ఎప్పుడైతే దేదీప్యమైన అనుభూతి మన సొంతం అవుతుందో అదే స్వర్గం. వ్యతిరేక ఆలోచనలకు ఆశ్రయం ఇవ్వడమంటే నరకాన్ని కోరుకోవడమే. ఈ విధంగా స్వర్గం- నరకం మనిషికి నిత్యం తనలోనే తారసపడుతుంటాయి.

చింతలకు, ఆందోళనలకు గురైనప్పుడు మనసు కకావికలమైపోతుంది. కొన్ని సందర్భాల్లో కలుషిత ఆలోచనలతో నిండిపోతుంది. ఆ స్థితి నరకంగా అనిపిస్తుంది. అందం, ప్రకాశం, పవిత్రతలాంటివి హృదయమంతా విస్తరించినప్పుడు, అదే మనం కోరుకున్నదైనప్పుడు స్వర్గంలో విహరిస్తున్న మధురభావన కలుగుతుంది. స్వర్గ నరకాల గురించి తెలుసుకోవడానికి మృత్యువు కోసం నిరీక్షించాల్సిన పనిలేదు. జీవితం చివరి అంచుకు చేరాక తెలుసుకునేది, గ్రహించేది ఏమీ ఉండదు. స్వర్గం, నరకం రెండూ మనిషిలోనే ఉంటాయని గ్రహించాలి. అవే నిత్యజీవితంలో మార్గదర్శకత్వం వహిస్తుంటాయి.



అంతర్యామి

సమర్పణభావం కలిగి ఉన్నప్పుడు భూమ్మీద ఈ జన్మలోనే స్వర్గంలాంటి స్థితిని అనుభవించవచ్చు. దానికి భిన్నమైంది- కూపస్థమండూకంలా పరిమితుల్లో జీవితం గడపడం.. అది నరకప్రాయం.

లోకంలో ప్రతి ఒక్కరి దగ్గర స్వర్గలోక ద్వారాల తాళం చెవి ఉంది. అయితే అదే తాళం చెవితో నరకలోకపు ద్వారాలూ తేలిగ్గా తెరవచ్చు- అని సామెత. బంధనాల్లో చిక్కుకున్నట్లు, బానిసత్వంలో బతుకీడుస్తున్నట్లు అనిపించే అనుభవాలు రోజూ ఎదురవుతుంటాయి. అవి తాత్కాలికమని భావించాలి. మేఘావృతమైన రోజుగా పరిగణించి అంతరంగంలోకి తొంగి చూసుకోవాలి. కొన్ని గంటల పాటు సూర్యుడి జాడ కనబడకపోవచ్చు. ఆ మార్పు తాత్కాలికమైందే అనే సత్యం తెలిస్తే మనసు స్థిమితపడుతుంది.

మనమంతా ఆ భగవంతుడి సృష్టిలోని వాళ్లమే. నిజానికి నరకమంటూ విడిగా ఏదీ ఉండదు. నిజాన్ని చూడలేకపోవడమే లోపలి అస్తవ్యస్త పరిస్థితులకు కారణం. యదార్థాన్ని సక్రమంగా చూసే ప్రయత్నం చేస్తే జీవితం అర్థవంతంగా కనబడుతుంది. స్వర్గమంటే అనంతమైన శాంతి... కాంతి... పరమానందస్థితి. సాధకుడు ప్రార్థనతో, ధ్యానంతో స్వర్గంలోకి అడుగుపెడతాడు. ఎప్పుడు మనసు శాంతంగా, నిశ్చలంగా ఉంటుందో, స్థిరంగా అనిపిస్తుందో అప్పుడు హృదయం ఉదారగుణాన్ని కలిగి పవిత్రతను సంతరించుకుంటుంది. స్వర్గం ఒక ప్రదేశం కాదని, ఒక చైతన్య స్థితి అని బోధపడుతుంది. మనసు అజ్ఞానపు సంకెళ్ల నుంచి విముక్తి పొందినప్పుడు స్వర్గం అనుభవంలోకి వస్తుంది.

ఏ మనిషికైనా జీవితలక్ష్యం భగవత్ స్వరూపాన్ని తెలుసుకోగల జ్ఞానం సంపాదించడం. ప్రతి ఒక్కరిలో అచేతనంగా భగవంతుడి ఎరుక ఉంటుంది. సాధకుడు దైవం కోసం ధ్యానం చేస్తాడు. అది క్రమక్రమంగా దైవం అన్నింటా ఉన్నాడనే బలమైన ఎరుక కలిగే స్థితికి చేరుస్తుంది. దైవాజ్ఞ అనుసారం, వేరుకుంటున్న చీకటితో మనిషి పోరాడతాడు. లేకపోతే భూమికి స్వర్గానికి వ్యత్యాసం బాగా పెరిగిపోతుంది. వర్షం పడుతున్నప్పుడు ఇంద్రధనుస్సు కోసం, చీకటిపడ్డప్పుడు నక్షత్రాల కోసం చూడాలి. అలా చేయగలిగినప్పుడు ఏదీ అసాధ్యమనిపించదు.

– మంత్రవాది మహేశ్వర్

విలువ జోడిస్తేనే అదనపు ఆదాయం

నిరంతరం కష్టపడి సాగుచేసే రైతులకు దక్కుతున్న ఆదాయం అంతంతే. ఈ పరిస్థితుల్లో పంట ఉత్పత్తులకు అదనపు విలువను జోడించగలిగితే మంచి రాబడి పొందేందుకు వీలుంటుంది. దిగుబడులకు ఉపయోగ విలువను పెంచడంపై దృష్టిపెట్టాలి. పంట ఉత్పత్తుల రూపం మార్చి మెరుగ్గా తీర్చిదిద్దాలి. పండించిన చోటే కాకుండా, అధిక ధర దక్కేచోట అమ్ముకోవాలి. చేతికి వచ్చిన పంటను గిట్టుబాటు ధర దక్కినప్పుడే విక్రయించాలి. రైతులకు ఇదంతా సాధ్యమయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

పంట ఉత్పత్తుల విషయంలో వాస్తవిక పరిస్థితుల ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా నష్టాలను పరిహరించుకోవచ్చు. ముందుగా, రైతులు తమ పంట దిగుబడుల రూపాన్ని మార్చడం ద్వారా వినియోగదారులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడం ఒక మార్గం. దీనినే విలువ జోడించడం అంటారు. అంటే ఉత్పత్తి ఆకృతిని మార్చడం ద్వారా అధిక ధర దక్కేలా చూడటమన్నమాట. రాగుల నుంచి రాగి పిండి తదితర పదార్థాలు తయారు చేయడం, చెరకు నుంచి చక్కెర తయారు చేయడం వంటి ప్రక్రియలు ఇలాంటివే. చాలావరకు ముడి పదార్థాలు తమ అసలు రూపంలో ఉన్నప్పుడు అంతగా ఉపయోగకరంగా ఉండవు. అవి ప్రాసెసింగ్, శుద్ధి ప్రక్రియల తరవాతే వినియోగదారుడికి అవసరమయ్యే రూపంలోకి మారతాయి. ఇలాంటి మార్పు వల్ల వస్తువుల విలువ పెరుగుతుంది. ఉత్పత్తులకు విలువను పెంచే క్రమంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటై, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఈ పరిణామ క్రమంలో పల్లెలు, పట్టణాల మధ్య అంతరాలు తగ్గుతాయి.



ఇది ఆర్థిక అభివృద్ధికి, ఉపాధికి దోహదపడుతుంది. ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఏమిటంటే- పంట ఉత్పత్తికి రూపం మార్చడం వల్ల రైతు పొందే ధర- దానికయ్యే ఖర్చుకంటే ఎక్కువగా ఉండాలి. మిరపకాయలను కారంగా మార్చడం, బెల్లాన్ని వివిధ రూపాల్లో తయారు చేసి అమ్మడం ద్వారా 20-25 శాతం అధికంగా లాభాలు గడించవచ్చని వివిధ అధ్యయన ఫలితాలు వెల్లడిస్తున్నాయి. వర్షాలప్పుడు తడిసిన ధాన్యాన్ని పారబాయిల్డ్ రైస్ లేదా నూకల రూపంలో అమ్మితే రైతుకు లాభం దక్కే అవకాశం ఉంటుంది.

ధర పలికే చోటే అమ్మకం

పంటను పండించిన చోటే కాకుండా ఎక్కువ ధర పలికే ప్రదేశానికి తరలించి అమ్ముకోవడం ఆదాయం పెంచుకోవడానికి ఉపకరించే మరో మార్గం. హిమాచల్ ప్రదేశ్‌లో పండిన ఆపిల్స్‌ను చెన్నై మార్కెట్లకు రవాణా చేయడం, తీరప్రాంతాల్లో పట్టిన చేపలను దూర ప్రాంతాలకు తరలించడం, గ్రామాల నుంచి పట్టణ మార్కెట్లకు సరఫరా చేయడం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. దీనివల్ల రవాణా, రోడ్లు, రైల్వేలు, పోర్టులు, మార్కెట్ వ్యవస్థలు బలోపేతమవుతాయి. ఇది ప్రాంతీయ అభివృద్ధి, వాణిజ్య విస్తరణ, ధరల స్థిరీకరణకు దోహదపడుతుంది. ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఏమిటంటే- స్థాన మార్పు ద్వారా రైతు పొందే ధర- రవాణాకు అయ్యే ఖర్చుకన్నా కచ్చితంగా ఎక్కువగా ఉండాలి. ప్రభుత్వం నూకల ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడం వల్ల సుమారు ఇరవై లక్షల టన్నుల ఎగుమతులకు ఆస్కారం ఉందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పశువుల దాణా కోసం చైనా, మనుషుల ఆహారం కోసం కొన్ని ఆఫ్రికా దేశాలు నూకల దిగుమతులను అనుమతిస్తున్నాయి. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. పారబాయిల్డ్ రైస్‌పై కేంద్ర ప్రభుత్వం ఎగుమతుల సుంకాన్ని 20-10 శాతానికి తగ్గించడాన్నీ ఉపయుక్తంగా మార్చుకోవాలి.

వినియోగదారులకు అవసరమైన సమయానికి వస్తువులను అందుబాటులో ఉంచడం ద్వారా ప్రయోజనం పొందడం మరో ముఖ్యమైన వ్యూహం. వ్యవసాయ ఉత్పత్తులు సీజన్ వారీగా పండుతాయి, కానీ వాటి వినియోగం మాత్రం ఏడాదంతా ఉంటుంది. ఉదాహరణకు పండ్లను నిల్వ చేసి సీజన్ కాని వేళల్లో సైతం విక్రయించడం ద్వారా లబ్ధి పొందవచ్చు. దీనికి గిడ్డంగులు, నిల్వ కేంద్రాలు, నిల్వ వాణిజ్య వ్యవస్థ అభివృద్ధి చెందాలి. అది సాధ్యమైతే సరఫరా-డిమాండ్ సమతుల్యాన్ని సాధించడంతోపాటు, ధరల నియంత్రణలో బాగా అక్కరకొస్తుంది. రైతులు తమ ఉత్పత్తులకు దక్కే గిట్టుబాటు ధరల గురించి ముందుగానే తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. తద్వారా తమ ఉత్పత్తులకు ఆదాయ వ్యయాల నిష్పత్తిని లెక్కించుకోవాలి. వివిధ మార్కెట్లలో పంట ఉత్పత్తులకు ఎంత ధర ఉంటోందో తెలుసుకుని తదనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. మొత్తానికి అన్నింటికన్నా ముఖ్యంగా- రైతులు తమ పంట ఉత్పత్తులను యథాతథంగా అమ్ముకోకుండా, అదనపు విలువ జోడించడం ద్వారానే అధిక ధరలు పొందగలమన్న సంగతిని గుర్తించాలి.

మార్కెట్ జోక్యం అవసరం

వ్యవసాయ ఉత్పత్తులు 'సీజన్ ఆధారంగా అందుబాటులోకి వస్తాయి. వాటి అవసరం మాత్రం ఎల్లవేళలా ఉంటుంది. అందుకని గిరాకీ, సరఫరాల మధ్య తేడాలు తక్కువగా ఉండేలా చూడాలి. ఇందుకు ప్రభుత్వపరంగా మార్కెట్ జోక్యం ప్రక్రియను అమలు చేయడం అవసరం. ఏ పంట ఉత్పత్తి అయినా 10-20 శాతం ఒకేసారి పెరిగినప్పుడు లేదా ధరలు 20శాతం కన్నా తగ్గిపోయినప్పుడు ప్రభుత్వం పాత ధరలకే కొనుగోలు చేసి నిల్వ ఉంచాలి. తరవాత కాలంలో ఆ నిల్వలను ఉపయోగించాలి. దీనికోసం ప్రత్యేకంగా ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలి. ఏదేమైనా వినియోగదారుడి సంతృప్తి అనేదే అంతిమ లక్ష్యం. ఆకృతి, స్థల, కాల ఉపయోగాలనేవి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారునికి సరైన రూపంలో, సరైన స్థలంలో, సరైన సమయంలో అందించే విషయంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఇవి ఆర్థిక సమృద్ధిని, వినియోగదారుల్లో సంతోషాన్ని పెంచుతాయి. వీటన్నింటి కలయికే సరైన వస్తువు, సరైన రూపంలో, సరైన సమయానికి, సరైన వ్యక్తికి చేరేలా చేస్తుంది. అది ఆర్థిక వ్యవస్థను సమర్థంగా నడపడానికి, రైతులు వినియోగదారుల మధ్య సమతుల్యాన్ని నెలకొల్పడానికి, సామాజిక సంక్షేమాన్ని పెంచేందుకు దోహదపడుతోంది.



డాక్టర్ ఐ.వి.వై.రామారావు
గౌరవ డైరెక్టర్, సాగు ఖర్చు విభాగం,
ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

తలెత్తి చూడండి

ఈ రోజుల్లో ఎక్కడున్నా చుట్టూ ఉన్న అందమైన ప్రపంచాన్ని కాదని తలలను మొబైల్ ఫోన్‌లలో దూర్చేస్తున్నాం. అలా అని ఇతరుల వ్యక్తిగతాలను వినవసరం లేదు. వాటి బదులు మరింత శక్తిమంతమైన పనిచేయండి... చుట్టూ గమనించండి. 'ఈ ఆకలి హోరు ముందు పిడుగైనా వినిపించదు' అంటారు ప్రముఖ కవి ఆలూరి బైరాగి. ఆ హోరు వినిపించాలంటే చెవుల్లోంచి 'బడ్స్' తీయాలి. మొబైల్లోంచి తలపైకెత్తాలి.



మన మెదడులో ఏముందో మనకే తెలియదు. ఇక ఇతరుల మెదళ్లలో ఏముందో మనకెందుకంటారా? ఎందుకంటే- పరిశీలనే ఆయుధం. సమాజమే గొప్ప గురువు. మనుషుల భావోద్వేగాలు, దేహభాష, స్పందనలు, పరస్పరం ఎలా సహాయం చేసుకుంటున్నారు, సమస్యలను ఎలా ఎదుర్కొంటున్నారు, వారిని సంతోషపెట్టేవి, నిరాశపరచేవి ఏమిటి? పరిశీలించండి. సమాజం ఎలా పనిచేస్తోందో చూపే అద్భుత మానవీయ క్షణాలవి.

గొప్ప ఆలోచనలన్నీ నిశితంగా గమనించడం ద్వారానే పుట్టాయి. న్యూటన్ యాపిల్ నేలమీద పడటాన్ని గమనించారు. భౌతిక శాస్త్రాన్ని తిరగరాసిన గురుత్వాకర్షణ సిద్ధాంతం పుట్టింది. 'జార్జ్ డి మెస్ట్రాల్' తన పెంపుడు కుక్క రోమాలలో అతుక్కుపోయిన చెట్ల ముళ్లు చూశారు. ఆ పరిశీలన 'వెల్‌క్రో'గా మారింది. ఇప్పుడది వాచీ స్ట్రాపుల నుంచి అంతరిక్ష దుస్తుల వరకూ ఉపయోగపడని ప్రదేశం లేదు. 'సిల్వన్ గోల్డ్‌మన్' తన షాపులో వినియోగదారులు సరకులు తీసుకునేటప్పుడు బరువైన బుట్టలతో ఇబ్బంది పడటాన్ని గమనించారు. అలా 'షాపింగ్ కార్ట్' పుట్టింది. హెన్రీ ఫోర్డ్ తన పరిశ్రమలో కారు మొత్తాన్నీ ఒకే కార్మికుడు అసెంబుల్ చేస్తూ అలసి పోతుండటాన్ని చూశారు. ఆ పరిశీలన 'అసెంబ్లీ లైన్' ఆవిర్భావానికి దారితీసింది. 'ట్రావిస్ కలానిక్, గారెట్ క్యాంప్' ఓ వ్యాపార సమావేశానికి పారిస్ వెళ్లారు. అయ్యాక బయటికి వచ్చి టాక్సీ కోసం చూస్తే ఎంతసేపటికీ దొరకలేదు. అక్కడ చుట్టూ చాలామందిదీ అదే సమస్య. అప్పుడు వచ్చిన ఆలోచనే 'ఉబర్'. వీళ్లెవరూ తలొంచుకుని మొబైల్ చూడలేదు కాబట్టి... చరిత్ర గతిని మార్చిన ఆవిష్కరణలు మనకు దక్కాయి.

మొబైల్ అద్భుత సాధనమే. ఇంటర్‌నెట్ అత్యావశ్యకమైనదే. అయినా మనిషి మరమనిషి కాకూడదు. అందుకే ఇంట్లో అయినా, బయటైనా... కొద్దిసేపు ఫోన్‌ను పక్కన పెట్టి, తల పైకెత్తండి. మన చుట్టూ... ప్రతి వ్యక్తీ ఓ కథను మోస్తున్నాడు. ప్రతి దృశ్యం... ప్రతి క్షణం ఒక పాఠమే. ఒక్కొక్కటీ ఒక్కో కొత్త విషయాన్ని పరిచయం చేస్తుంది. మనం నడిచి వెళ్తున్న దారిలో ఎన్నో పూలవనాలుంటాయి. అవి మానవత్వపు పరిమళాలను వెదజల్లుతుంటాయి. ఎన్నో అగాధాలూ ఉండొచ్చు. చుట్టూ చూడకపోతే తెలిసేదెలా? అలా చూడటం ద్వారా మళ్లీ కొత్తగా వెల్‌క్రోనో, ఉబర్‌నో ఆవిష్కరించకపోవచ్చు. కానీ మనుషుల జీవితాల్ని మరింతగా అర్థం చేసుకుంటాం. అనుభూతి చెందుతాం. ఎలా జీవిస్తున్నారు, పోరాడుతున్నారు, ప్రవర్తిస్తున్నారు, కలలు కంటున్నారు... తెలుసుకుంటాం. మరింత జ్ఞానం, పరిపక్వత, అవగాహన పొందుతాం. అందుకే తలెత్తండి. మొబైల్ స్క్రీన్ల కన్నా సమాజం ఎక్కువ నేర్పుతుంది.

– హర్షిత్ జాస్తి

సామరస్యంపై విద్వేష విషం

జాతి, కుల, మత విభేదాలు విడనాడి ప్రజలందరూ సామరస్యంతో జీవించినప్పుడే సమాజంలో సుఖ శాంతులు వర్ధిల్లుతాయి. అయితే, రాజకీయ



ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న విద్వేష ప్రసంగాలు సమాజంలో సుహృద్భావ వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. నిరుడు విద్వేష ప్రసంగాలు చేసినవారు వివిధ అవాంఛనీయ అంశాలను ఎన్నిసార్లు ప్రస్తావించారంటే...

(ఆధారం: ఇండియా హేట్ ల్యాబ్)

కుట్ర సిద్ధాంతాలు	581
హింసకు ప్రేరేపించినవి	259
మారణాయుధాలు పట్టుకోవాలని చెప్పినవి	123
సంఘ బహిష్కరణకు పిలుపిచ్చినవి	111
ప్రార్థనా ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నవి	274
ఇతరాలు	118

నేల తల్లికి కొత్త సత్తువనిద్దాం!

మానవాళితో పాటు జీవజాతుల మనుగడ అంతా నేలతల్లి ప్రసాదమే. కానీ, రసాయన ఎరువులూ పురుగు మందుల వాడకం పెరగడం, దోషపూరిత యాజమాన్య పద్ధతులు, కాలుష్య ఉద్గారాల వల్ల నేలలు నిస్సారమవుతున్నాయి. పంటల నాణ్యత, దిగుబడి తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్‌ఏవో) ఏటా డిసెంబరు 5న అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం నిర్వహిస్తోంది. ఈసారి నినాదం 'ఆరోగ్యవంతమైన నేల- ఆరోగ్యకరమైన పట్టణాలు'.

మానవాళికి అవసరమైన ఆహారంలో తొంభై శాతానికి పైగా భూమి నుంచే వస్తున్నట్లు ఎఫ్‌ఏవో వంటి అంతర్జాతీయ సంస్థల అధ్యయనాలు చెబుతున్నాయి. మనిషి జీవించడానికి అవసరమైన రకరకాల ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లతోపాటు... ఆరోగ్యానికి అవసరమైన ఔషధ మొక్కలు, దుస్తుల తయారీకి కావాల్సిన పత్తి, జనపనార వంటివి నేల నుంచే వస్తున్నాయి. పాలు, మాంసం కోసం పెంచే కోళ్లు, గొర్రెలు, పశువులకు మేత కూడా భూమి నుంచే లభిస్తోంది. వాతావరణ సమతుల్యతకు అత్యంత కీలకమైన అడవుల్లో చెట్లు పెరగడానికి సైతం నేల కావాల్సిందే. ఒక్కమాటలో చెప్పాలంటే, మట్టి లేకుండా మనిషి లేడు!

అనారోగ్యాలకు అదే కారణం...

వాన నీటికి ఆమ్ల గుణం ఉంటుంది. తనలోకి ఇంకిన వర్షపు నీటిని భూమి వడపోస్తుంది. అక్కడి లవణాలు, ఇతర సూక్ష్మ పోషకాలు కలిసిన జలాలు మానవాళితో పాటు కోటానుకోట్ల జీవరాశులకు అవసరమైన తాగునీరుగా మారుతుంది. మనం పారబోసే వ్యర్థాలు, విసర్జితాలను కూడా నేల రీసైకిల్ చేసుకుంటుంది. అయితే, కొన్ని దశాబ్దాలుగా నేలలు కోతకు గురవుతున్నాయి. అధిక దిగుబడుల కోసం ఇప్పుడు రసాయన ఎరువులు, పురుగు మందులను విచ్చలవిడిగా వాడుతున్నారు. సరైన యాజమాన్య పద్ధతులనూ పాటించడం లేదు. దీంతో పొలాలు నిస్సారమై, బీడుబారుతున్నాయి. హరిత



విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ చెప్పినట్లు- చౌడు భూముల్లో పండించే పంటల్లో జింకు, ఇనుము వంటి ధాతువుల లోపాలు అధికంగా ఉంటున్నాయి. అలాంటి ఆహారం తీసుకునే వారిలో రోగనిరోధక శక్తి తగ్గిపోయి, ఎనీమియా వంటి అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ విషయమై రైతులు, పాలకులు, విద్యార్థులు, సామాన్యులు అందరికీ అవగాహన కలిగించాలని ఐక్యరాజ్య సమితి 2014లో తీర్మానించింది. నాటి నుంచి ఏటా ఇదే రోజున అంతర్జాతీయ మృత్తికా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

గ్రామాలతో పోలిస్తే పట్టణ నేలలు కొంత భిన్నంగా ఉంటాయి. అక్కడి భూమిలో సిమెంటు, లోహాలు వంటి నిర్మాణరంగ వ్యర్థాలు... పారిశ్రామిక రసాయనాలు కలిసిపోయి ఉంటాయి. సేంద్రియ కర్బనం తక్కువగా ఉండటం వల్ల నేలలు గట్టిబడిపోతాయి. దాంతో నేలలోకి గాలి, నీరూ సరిగ్గా ప్రసరించలేవు. ఫలితంగా మొక్కలు, చెట్లు ఏపుగా ఎదగలేవు. అక్కడి భూమిలోకి నీరు సరిగ్గా ఇంకదు కాబట్టే, తుపాను వంటి సమయాల్లో వరదలు వచ్చి భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తోంది. చెట్లు సరిగ్గా పెరగకపోవడం వల్ల వేసవిలో అధిక వేడిమికి పట్టణవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. వీటన్నింటి నుంచీ విముక్తి పొందాలంటే పట్టణ ప్రాంత నేలలను సంరక్షించుకోవాల్సిందే.

పట్టణాల్లో ఉత్పత్తి అయ్యే రకరకాల వ్యర్థాలను విడివిడిగా సేకరించి, సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేయాలి. ముఖ్యంగా సిమెంటు, రంగులు, లోహ వ్యర్థాలు నేలలో కలవకుండా జాగ్రత్త వహించాలి. పారిశ్రామిక వ్యర్థాలు, రసాయనాలను అత్యంత సురక్షితంగా నిర్వహించాల్సి ఉంటుంది. మురుగునీటి శుద్ధి యంత్రాల ద్వారా డ్రైనేజీ నీటిని పరిశుభ్రపరచి, ఆ తరవాతే కుంటల్లోకి విడుదల చేయాలి. సేంద్రియ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి కంపోస్టుగా మార్చాలి. పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లో వ్యర్థాలు లేకుండా చేసి, మొక్కలు పెంచాలి. నేలల పరిరక్షణకు కొన్నిసార్లు కఠిన నియమాలు తప్పవు. కాబట్టి, వాటిని ఉల్లంఘించే వారిని శిక్షించాలి.

ఎలా కాపాడుకోగలం?

నగరాలు, పట్టణాల్లో పెరటి, మిద్దె తోటల్ని ప్రోత్సహిస్తే, తక్కువ ఖర్చుకే ఆరోగ్యకరమైన ఆహారం అందివస్తుంది. కాబట్టి ఔత్సాహికులకు విత్తనాలు, సేంద్రియ ఎరువులను రాయితీ ధరలపై అందించడంతో పాటు మొక్కల పెంపకంపై అవగాహన కూడా కల్పించాలి. పట్టణాలు విస్తరిస్తున్నప్పుడు- రోడ్లు, మురుగు కాలువలు, పార్కులకు తగినన్ని స్థలాలను కేటాయించడం అత్యావశ్యకం. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి, సంరక్షించడం చాలా అవసరం. అయితే, వాటి కోసం సరైన పరిమాణంలో గుంతలు తీసి, సారవంతమైన మట్టితో నింపాలి. ఆరోగ్యకరమైన పట్టణ నేలల వల్ల చల్లని వాతావరణం, వరదల నుంచి విముక్తి లభిస్తాయి. పట్టణాలు 'సుస్థిరంగా' విలసిల్లుతాయి.



డాక్టర్ పి.గురుమూర్తి
మృత్తికా విజ్ఞానశాస్త్ర విభాగాధిపతి,
వ్యవసాయ కళాశాల, నైర, శ్రీకాకుళం జిల్లా

సాధన కలిసొస్తుంది..!

హాయ్ ఫ్రెండ్స్..! మనం రోజూ వ్యాయామం చేయమంటే బద్ధకిస్తాం కదా! రోజంతా టీవీ చూడమంటే మాత్రం కదలకుండా కూర్చుంటాం. కానీ, మనలాంటి ఓ నేస్తం జిమ్నాస్టిక్స్ చేస్తూ ప్రపంచ రికార్డు సృష్టించింది. గాల్లో శరీరాన్ని భలేగా బ్యాలెన్స్ చేస్తూ విన్యాసాలు చేస్తోంది. తన గురించి తెలుసుకుందాం రండి.

అమెరికాకు చెందిన కిన్లీ హిమాన్‌కు ఎనిమిది సంవత్సరాలు. తనకు నాలుగేళ్లు ఉన్నప్పుడే జిమ్నాస్టిక్స్ నేర్చుకోవడం ప్రారంభించింది. తక్కువ సమయంలో అందులో మంచి ప్రతిభను చాటుకుంటోంది. జిమ్నాస్టిక్స్ బార్ చుట్టూ 30 సెకన్లలోనే 18 రొటేషన్లు చేసింది. తక్కువ సమయంలో ఎక్కువ రొటేషన్స్ చేసిన అమ్మాయిగా.. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకుంది.



కిన్లీ రోజూ ఉదయాన్నే 5.30 గంటలకు నిద్రలేచి ఫ్లిప్స్, స్ట్రెచింగ్ చక్కగా ప్రాక్టీస్ చేస్తుందట. 'నాకు జిమ్నాస్టిక్స్ చేయడమంటే చాలా ఇష్టం. ఎంతసేపు చేసినా అస్సలు బోర్‌కొట్టదు. అందుకే ఎంతసేపైనా ప్రాక్టీస్ చేస్తూనే ఉంటా. అది నాకు పోటీల్లో పాల్గొన్నప్పుడు బాగా కలిసొస్తుంది. ఒక పని కోసం మనం దృఢ సంకల్పంతో కష్టపడితే.. అది కచ్చితంగా మనల్ని విజయం సాధించేలా చేస్తుంది' అని చెబుతోంది కిన్లీ. 'తను ఎప్పటికప్పుడు చేస్తున్న పొరపాట్లను తెలుసుకుని, ఇంకోసారి అవి జరగకుండా చూసుకుంటుంది. అందుకే తను తక్కువ సమయంలోనే రికార్డు సాధించగలిగింది' అని చెబుతున్నారు కిన్లీ కోచ్. మరో విషయం ఏంటంటే కిన్లీ జిమ్నాస్టిక్ ప్లేయరే కాదు నేస్తాలూ.. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్, యాక్టర్ కూడా! ఇన్‌స్టాలో కిన్లీకి 14లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. తను రోజూ చేసే ప్రాక్టీస్ వీడియోలన్నీ అందులో పోస్ట్ చేస్తుంటుంది. కిన్లీలాగే మీరూ ఏదో ఒక ఆటలో రాణిస్తారా మరి!

– పి.పవిత్ర

హాయ్! బుజ్జీ!!

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిలో ఒక్కటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.

1. ఆటో, పడవ, రోడ్డు, విమానం
2. సింహం, జింక, పులి, చిరుత
3. ఖమ్మం, హైదరాబాద్, కరీంనగర్, విజయవాడ

జవాబులు: 1.రోడ్డు 2.జింక 3.హైదరాబాద్

గ్రామాలకు

మినీ కలెక్టరేట్లుగా డీడీవోలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురావడంతో 22 ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగోన్నతులు లేని ఎంపీడీవోలు నేడు డీడీవోలు అయ్యారని తెలిపారు. ఒక్క పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోనే ఏ పోస్టులో చేరుతారో ఆ హోదాలోనే ఉద్యోగ విరమణ చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 10,000మందికి పారదర్శకంగా ఉద్యోగోన్నతి కల్పించామని గుర్తుచేశారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి అడుగులు వేస్తున్నామన్నారు. గురువారం చిత్తూరు నగరం రెడ్డిగుంటలో డీడీవో కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 76 డీడీవోలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

వైకాపా ఐదేళ్ల పరిణామాలు మదింపు చేసి

'పంచాయతీరాజ్ శాఖలో గత 15- 20 ఏళ్లతోపాటు ముఖ్యంగా వైకాపా ఐదేళ్లలో నెలకొన్న పరిణామాలు మదింపు చేసి.. ప్రస్తుతం అందరూ మెచ్చేలా సరికొత్త వ్యవస్థను తెస్తున్నాం. డీడీవో కార్యాలయాల్లో ఆర్డీవో స్థాయి అధికారిని నియమిస్తున్నాం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని ఏపీడీలు, డీఎల్‌డీవోలు, డీఎల్పీవోలు ఇక్కడి నుంచే సేవలందిస్తారు. ఇవి ఒకరకంగా మినీ కలెక్టరేట్లు. ప్రతి పంచాయతీ స్వతంత్రంగా వ్యవహరించి ప్రజల అవసరాలు తీర్చాలి. స్థానిక



వర్చువల్ విధానంలో డీడీవో కార్యాలయాలు ప్రారంభిస్తున్న పవన్ కల్యాణ్

సంస్థల దగ్గర సాధ్యం కాని పనులకు మాత్రమే ప్రభుత్వంపై ఆధారపడేలా చేయాలన్నది మా లక్ష్యం. పదివేల జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి గెజిటెడ్ అధికారిని పంచాయతీ అభివృద్ధి అధికారిగా నియమించాం. 7,244 క్లస్టర్లను రద్దుచేసి 13,350 పంచాయతీలను స్వయంపాలనా వ్యవస్థలుగా తీర్చిదిద్దాం. పురపాలికల్లోలాగే గ్రామాల్లోనూ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, రెవెన్యూ, వీధిదీపాలు, ఐటీ వింగ్ ఏర్పాటు చేశాం. ప్రధాని మోదీ రాష్ట్రానికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కేంద్రం నుంచి వచ్చిన నిధులు సక్రమంగా వినియోగించుకుంటున్నాం' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

మనోహర్ గారూ క్షమించండి

'అల్లూరి సీతారామరాజు జిల్లాలో గతంలో గంజాయి సాగు అధికంగా ఉంది. ప్రస్తుత చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ అక్కడ కలెక్టర్‌గా ఉన్నప్పుడు దాదాపు 17,000 ఎకరాల్లో ఉపాధి నిధులతో పండ్ల మొక్కలు నాటించి ప్రజల ఆదాయం పెరిగేలా చూశారు. ప్రస్తుత కలెక్టర్ దినేష్‌కుమార్ ఆ ఒరవడిని కొనసాగించి 35,000 ఎకరాల్లో మొక్కలు సాగయ్యేలా చూశారు. వీరిద్దరినీ అభినందిస్తున్నా. ప్రస్తుతం పాడేరులో ఏర్పాటైన డీడీవో ద్వారా ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేయాలి' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. తెనాలిలోని డీడీవోను నెలరోజుల్లో ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భవన సమస్య కారణంగా ఆఖరు నిమిషంలో మార్పు చేశారని, ఇందుకు తనను క్షమించాలని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు.

డబ్బులడుగుతారని తెలిసి ఆశ్చర్యపోయా

తన తండ్రి ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరి అదనపు సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ పొందారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఉద్యోగోన్నతి వస్తే ఇంట్లో ఎంత సందడిగా ఉంటుందో చూశానన్నారు. అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు చెబితేనే ప్రమోషన్ ఇచ్చేవారన్నారు. ఉద్యోగోన్నతికి నాయకులు రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తారని తెలిసి ఆశ్చర్యపోయానని తెలిపారు. ప్రస్తుతం నేతలతో సంబంధం లేకుండా చేశామని వివరించారు. టెక్కలి నుంచి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పెనుకొండ నుంచి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యేలు వర్చువల్‌గా పాల్గొన్నారు.

విప్లవాత్మకమైన మార్పులు

– సభాపతి అయ్యన్న పాత్రుడు

నర్సీపట్నం డీడీవో కార్యాలయం నుంచి స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మాట్లాడారు. మీరు ఈ కార్యక్రమానికి వస్తారని ఊహించలేదని పవన్ అన్నారు. పంచాయతీరాజ్ శాఖలో విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని అయ్యన్నపాత్రుడు కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్లా ఒకే నమూనాలో కార్యాలయాలు ఉండేలా చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వం వద్ద నిధులు లేనందున.. తిరిదేను అప్పు అడగాలని పవన్ చమత్కరించారు. పంట కాలువల సిమెంట్ లైనింగ్‌కు ఉపాధి హామీ నిధులు ఇవ్వాలని స్పీకర్ సూచించగా ఆయన అంగీకరించారు.

ఆత్మవిశ్వాసం కలిగించారు

– మంత్రి నాదెండ్ల

వ్యవస్థలకు మీరు ఆత్మవిశ్వాసం కలిగించారని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి నాదెండ్ల మనోహర్ అన్నారు. డీడీవో వ్యవస్థతో అధికారుల్లో జవాబుదారీతనాన్ని పెంచారని.. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. 'పంచాయతీరాజ్ శాఖలో వేగంగా ఉద్యోగోన్నతులు ఇచ్చి ఉద్యోగుల దశాబ్దాల కలను సాకారం చేశారు. సొంత కార్యాలయాల నిర్మాణానికి స్థలాలు చూపారు.. నిధులు కూడా ఇవ్వాలి' అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో తిరుపతి శివారు దామినీడు వద్ద పవన్ కల్యాణ్ కాన్వాయ్‌ను నిలిపి ఫ్లకార్డులు పట్టుకుని తన కోసం ఎదురుచూస్తున్న రైతులతో మాట్లాడారు.



పెట్టుబడుల బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు కందుల దుర్గేష్, నారాయణ, టీజీ భరత్, లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, అధికారులు

45 రోజుల్లో శంకుస్థాపనలు

(మొదటి పేజీ తరువాయి)

కృత్రిమ మేధ అభివృద్ధికి కేటాయించాలి. ఏఐ బేసిక్స్‌ను 7వ తరగతి నుంచే బోధించేందుకు మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి కంపెనీల సాయంతో బృందాన్ని ఏర్పాటు చేయాలి' అని చంద్రబాబు నిర్దేశించారు.

రూ.500 కోట్లతో సార్వభౌమ నిధి

'ప్రభుత్వ కంపెనీల ద్వారా వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు రూ.500 కోట్లతో సార్వభౌమ నిధి (సావరిన్ ఫండ్) ఏర్పాటు చేస్తాం. యూఏఈ, దుబాయ్ సహా మరికొన్ని దేశాల్లోని ప్రభుత్వ రంగ సంస్థలు ఫండ్ ద్వారా వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నాయి. రాష్ట్రంలో పశు సంపద రూ.8 లక్షల కోట్లకు చేరాలనేది లక్ష్యం. డ్వాక్రా సంఘాల ద్వారా పశు దాణా తయారు చేయిస్తే వారికి మంచి ఆదాయమార్గం అవుతుంది. పూర్వోదయ పథకం కింద కేంద్రం ఇచ్చే రూ.40 వేల కోట్లతో 9 జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తాం' అని సీఎం పేర్కొన్నారు. విశాఖ కాపులుప్పాడలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ కోసం 50 ఎకరాలు కేటాయించాలని, దీనికి అవసరమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు.

నిశిత పరిశీలన తర్వాతే అనుమతులు: మంత్రి లోకేశ్

పెట్టుబడుల ప్రతిపాదనలతో వచ్చిన ప్రతి కంపెనీని పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతివ్వాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని, అవసరమైన అనుమతులు ఇవ్వడంలో జాప్యం ఉండకూడదని సూచించారు. సమావేశానికి మంత్రులు టీజీ భరత్, నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు వర్చువల్‌గా పాల్గొన్నారు.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

చిరకాల బంధానికి మరింత బలం

(మొదటి పేజీ తరువాయి)

పలు కీలక ఒప్పందాలను కుదుర్చుకోనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం లభించనుంది. ఆ తర్వాత ఆయన హైదరాబాద్ హౌస్‌లో జరిగే శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతారు. అక్కడే ప్రధాని మోదీ.. ఆయనకు విందు ఇస్తారు. ఉదయమే రాజ్‌ఘాట్‌ను పుతిన్ సందర్శించనున్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. శిఖరాగ్ర సమావేశం తర్వాత రష్యా ప్రభుత్వ ఛానల్‌ను భారత్‌లో ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఆయన గౌరవార్థం రాష్ట్రపతి ఇచ్చే ఆతిథ్యాన్ని స్వీకరిస్తారు. రాత్రి 9 గంటలకు తిరుగుపయనమవుతారు.

■ భారత్ మండపంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ), రోస్‌కాంగ్రెస్ సంయుక్తంగా నిర్వహించే వాణిజ్య సమావేశంలోనూ పుతిన్, మోదీ పాల్గొంటారు.

మరింత 'రక్షణ'

రక్షణ రంగంలో రెండు దేశాల మధ్య మరింత సహకారం, అంతర్జాతీయంగా వస్తున్న వాణిజ్య ఒత్తిళ్లను తట్టుకోవడం, చిన్నతరహా మాడ్యులర్ అణు రియాక్టర్ల రంగంలో సహకరించుకోవడం వంటి పలు కీలక అంశాలపై ఇద్దరు అగ్ర నేతలు చర్చలు జరపనున్నారు. పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో పుతిన్, మోదీ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

■ 2 బిలియన్ డాలర్ల జలాంతర్గాముల లీజు ఒప్పందంపైనా ఒప్పందం కుదిరే అవకాశముందని తెలుస్తోంది.

■ ముడి చమురు దిగుమతుల కారణంగా రష్యాతో వాణిజ్య లోటు భారీగా ఉంది. ఈ అంశాన్ని ప్రధాని ప్రస్తావించే అవకాశముంది. ఎరువుల దిగుమతులపైనా ఒప్పందం కుదరనుంది.

■ రష్యాలో భారతీయ కార్మికులకు ఉద్యోగావకాశాలపై ఒప్పందం కుదరనుంది.

■ రక్షణ రంగంలో మరింత సహకారానికి రవాణా మద్దతు ఒప్పందానికీ ఆమోద ముద్ర పడనుంది.

■ వాణిజ్య లోటును పూడ్చే ఒప్పందంలో భాగంగా భారత్ నుంచి రష్యాకు ఫార్మా, వ్యవసాయ, ఆహార, వినియోగ వస్తువుల ఎగుమతులు పెరగనున్నాయి.

■ యూరేసియన్ ఆర్థిక కూటమితో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గురించి పుతిన్, మోదీ చర్చించనున్నారు.

■ శిఖరాగ్ర సమావేశానికి సన్నాహకంగా గురువారం ఇరు దేశాల రక్షణ మంత్రులు పలు అంశాలపై చర్చించారు. ఎస్-400 రక్షణ వ్యవస్థలపై వారి మధ్య చర్చలు జరిగాయి. మరిన్ని ఈ వ్యవస్థలను సేకరించే విషయంపై చర్చించారు. రెండు దేశాల మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ఆండ్రీ బెలోసోవ్ ఇందులో పాల్గొన్నారు. తమ సుఖోయ్-57 యుద్ధ విమానాలను విక్రయించేందుకు రష్యా సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

■ రష్యా విద్యా సంస్థ సినర్జీ కార్పొరేషన్, భారత్‌లోని ఇన్నోప్రాక్టికా.ఇండియా కలిసి దిల్లీలో సంయుక్త సంస్థను గురువారం ప్రారంభించాయి. విద్యా, సాంస్కృతిక రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు వీలుగా దీనిని ప్రారంభించినట్లు సినర్జీ సంస్థ అధ్యక్షుడు వాదిమ్ లొబోవ్ తెలిపారు.

అభేద్యంగా దిల్లీ

రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన సందర్భంగా దేశ రాజధాని దిల్లీని అభేద్యంగా మార్చారు. పుతిన్ దిల్లీలో దిగిన క్షణం నుంచి తిరిగి వెళ్లేవరకూ క్షణక్షణం పర్యవేక్షించేలా ఏర్పాటు చేశారు. 5,000 మందికి పైగా సిబ్బందిని భద్రతా విధుల్లో నియమించారు. పుతిన్ వెళ్లే అవకాశమున్న మార్గాలు, సమావేశ ప్రదేశాలను అత్యున్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఉగ్రవాద వ్యతిరేక దళాలు, స్వాట్ బృందాలు, స్నైపర్లు, తక్షణ స్పందన దళాలను కీలక ప్రాంతాల్లో మోహరించారు. దిల్లీ పోలీసు విభాగం, కేంద్ర భద్రతా సంస్థలు, రష్యా అధ్యక్ష భద్రతా బృందం కలిసి బహుళస్థాయి భద్రతను కల్పిస్తున్నాయి. హైడెఫినిషన్ సీసీ టీవీ కెమెరాలు పని చేస్తున్నాయి. టెక్నికల్ మానిటరింగ్, కమాండ్ కంట్రోల్ యూనిట్లు పరిస్థితిని పరిశీలిస్తున్నాయి.

■ భద్రతా కారణాల రీత్యా గురువారం రాత్రి పుతిన్ బసచేసే ప్రాంతాన్ని రహస్యంగా ఉంచారు.



7, లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన అధికార నివాసంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ

వెలుగుజిలుగులు

పుతిన్ పర్యటన కోసం దిల్లీ అందంగా ముస్తాబైంది. లుట్యెన్స్ ప్రాంతాన్ని విద్యుత్తు దీపాలతో కొత్త దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అలంకరించింది. వీధులను చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తోంది.

18 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం

● మంత్రులు టీజీ భరత్, కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ.20,444 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు మంత్రులు కందుల దుర్గేష్, టీజీ భరత్ తెలిపారు. రాష్ట్రంలో 26 సంస్థలు యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా 56,278 ఉద్యోగాలు వస్తాయని వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో 18 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు సాధించామన్నారు. సచివాలయంలో గురువారం ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు విలేకర్లకు వెల్లడించారు. 'ఎర్లీబర్డ్ ప్రోత్సాహకాల కింద మరో ఆరు కంపెనీలకు ఆమోదం తెలిపాం. విశాఖ పెట్టుబడుల సదస్సులో చేసుకున్న ఒప్పందాలకు ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం సూచించారు. విశాఖ రీజియన్‌లో రూ.1.69 లక్షల కోట్లు, అమరావతి రీజియన్‌లో రూ.87 వేల కోట్లు, తిరుపతి రీజియన్‌లో రూ.73 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. మార్చి నెలలోపు కంపెనీలకు రూ.2 వేల కోట్ల ఇన్సెంటివ్స్ ఇవ్వనున్నాం' అని పేర్కొన్నారు.

హుండీ దొంగలను వెనకేసుకొస్తారా?

జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్న మంత్రులు




ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో నగలు చోరీ చేసిన దొంగల్ని వైకాపా అధినేత జగన్ వెనకేసుకొస్తూ, భక్తుల మనోభావాలను దెబ్బతీయడం సిగ్గుచేటని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. జగన్ వ్యాఖ్యలను మంత్రి రవీంద్ర ఖండించారు. ఎన్నో అరాచకాలకు పాల్పడిన వైకాపా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని దేవతామూర్తిగా, కల్తీ మద్యం కేసులో నిందితుడు జోగి రమేశ్‌ను అద్భుత వ్యక్తిగా పేర్కొనడంపై మండిపడ్డారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వాడిన కేసులో జగన్, ఆయన బంధువుల తప్పిదాలన్నీ బయటకొస్తాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రి రవీంద్ర విలేకర్లతో మాట్లాడారు. 'మహిళలపై వేధింపులు, గంజాయి కేసుల్లో పట్టుబడ్డ వైకాపా నాయకులను వెనకేసుకొస్తూ జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. సీఎంగా ఉండి ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని జగన్.. మేం మెగా డీఎస్సీ ద్వారా 16,397 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తే, తిరిగి మమ్మల్నే ప్రశ్నిస్తున్నారు'' అని పేర్కొన్నారు.

హుండీ దోపిడీ చిన్నగా కనిపిస్తుందా?: లోకేశ్



'రూ.లక్షల కోట్ల జనం సొమ్ము దోచేసిన మీకు వేంకన్న హుండీ దోపిడీ చిన్న చోరీలా కనిపిస్తుందా?' అని జగన్‌ను మంత్రి నారా లోకేశ్ నిలదీశారు. ఇది మహాపాపమని ఎక్స్‌లో హెచ్చరించారు. శ్రీవారి పరకామణిలో జరిగిన దొంగతనాన్ని చిన్న చోరీగా పోలుస్తూ జగన్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

చర్చిద్దాం.. అసెంబ్లీకి రండి: అచ్చెన్న



టెక్కలి, న్యూస్‌టుడే: జగన్ ఓ అబద్ధాల కోరు అని, బెంగళూరు నుంచి వారానికోసారి రాష్ట్రానికి వస్తూ తన సొంత ఛానల్‌లో అబద్ధాలు చెప్తూ, ప్రజలను మోసగిస్తున్నారని వ్యవసాయ మంత్రి కె.అచ్చెన్నాయుడు నిప్పులు చెరిగారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో ఉంటే ఇక్కడ ఏం జరుగుతోందో జగన్‌కు తెలిసేది. అధికారంలో ఉన్న ఐదేళ్లూ తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమయ్యారు. ఇప్పుడు బెంగళూరులో ఉంటున్నారు. వైకాపా హయాంలో పంటల బీమాకు ఒక్క పైసా కట్టలేదని కేంద్రం పార్లమెంటులో చెప్పింది. తన పాలనలో రూ.7,700 కోట్లు పంటల కొనుగోలుకు కేటాయించామని చెప్తున్న జగన్‌కు అసెంబ్లీకి వస్తే నిజాలు వెల్లడిస్తాం. ఐదేళ్లలో రూ.2,140 కోట్లు కేటాయించి, రూ.1,400 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం 16 నెలల్లో రూ.1,200 కోట్లు ధరల స్థిరీకరణపై వెచ్చించింది'అని అచ్చెన్న వివరించారు.

16 రోజులైనా రాష్ట్రంలో ఉన్నారా?: అనిత



విజయనగరం అర్బన్: 'కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో ఎన్నో తుపాన్లు వచ్చాయి. అన్నింటినీ సమర్థంగా ఎదుర్కొన్నాం. 16 నెలల్లో 16 రోజులైనా రాష్ట్రంలో లేని జగన్.. చుట్టపుచూపుగా వచ్చి ఏదో మాట్లాడితే మేం బదులివ్వాలా?' అని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. తుపాన్ సమయంలో జగన్ ఎందరిని పరామర్శించారు?' అని మంత్రి విజయనగరంలో మాట్లాడారు.

గిరిజనులపై జగన్‌కు చిన్నచూపు: సంధ్యారాణి



పాలకొండ, గ్రామీణం: జగన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను తిడితేగానీ తెల్లారదని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ధ్వజమెత్తారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో ఆమె మాట్లాడారు. 'గిరిజన సంక్షేమ శాఖపై జగన్ అవాస్తవాలు మాట్లాడుతున్నారు. వైకాపా హయాంలో ఒక్క ఏడాదిలోనే 66 మంది విద్యార్థులు చనిపోయినా, నాడు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుంటే, ఓర్వలేక ప్రశ్నిస్తున్నారు' అని మండిపడ్డారు. తమ కుటుంబంపై జగన్ మీడియా తప్పుడు ప్రచారాలు చేస్తోందని, ఇకపై ఇలాంటి కథనాలు ప్రచారం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

గ్రహం అనుగ్రహం

5–12–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం

పాడ్యమి: తె. 3-04 తదుపరి విదియ

రోహిణి: మ. 1-34 తదుపరి మృగశిర

వర్జ్యం: ఉ. 7-35 వరకు

తిరిగి రా. 6-47 నుంచి 8-17 వరకు

అమృత ఘడియలు: ఉ. 10-35 నుంచి 12-04 వరకు

తిరిగి తె. 3-45 నుంచి 5-15 వరకు

దుర్ముహూర్తం: ఉ. 8-32 నుంచి 9-16 వరకు

తిరిగి మ. 12-12 నుంచి 12-56 వరకు


రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు

సూర్యోదయం: ఉ.6.20; సూర్యాస్తమయం: సా.5.21

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	18.0	28.0
శ్రీకాకుళం	19.0	29.0
రాజమహేంద్రవరం	20.0	33.5
ఖమ్మం	20.4	31.6
కడప	21.0	26.0
అనంతపురం	21.0	29.2
హైదరాబాద్	21.5	28.7
నరసాపురం	22.3	31.6
మహబూబ్‌నగర్	22.4	29.9
విజయవాడ	22.5	30.4
గుంటూరు	23.0	29.0
విశాఖపట్నం	23.2	29.4
తిరుపతి	23.3	26.2
ఒంగోలు	23.3	29.8
నెల్లూరు	23.4	26.2
కర్నూలు	23.4	29.8
తాడేపల్లిగూడెం	27.0	30.0

ఇదీ సంగతి!



పరకామణి కేసు ఒక చిన్న చోరీ

(మొదటి పేజీ తరువాయి)

ఆలయాల్లో ఇలాంటి ఘటనలు జరిగినా ఎక్కడైనా ఇలా ఆస్తుల్ని ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రపంచచరిత్రలోనే ఇలా ఎక్కడా జరగలేదని తెలిపారు. వైకాపా కేంద్ర కార్యాలయంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. 'పరకామణి వ్యవహారంలో దొంగపై కేసు నమోదైంది. తిరుపతి కోర్టులో ఛార్జిషీటు వేశారు. మెగా లోక్ అదాలత్‌లో దీన్ని పరిష్కరించారు. ఇవన్నీ కోర్టు విధివిధానాల ప్రకారమే జరిగాయి. ఇందులో సాంకేతికపరమైన అంశాలుంటే దర్యాప్తు చేయొచ్చు. కానీ రాజకీయం కోసం అప్పటి ఛైర్మన్లపై బురదజల్లేందుకు వక్రీకరిస్తున్నారు' అని మండిపడ్డారు.

16న గవర్నర్‌కు ఫిర్యాదు... తర్వాత హైకోర్టులో పిటిషన్

'కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణలో మరో కుంభకోణానికి తెరతీశారు. ఆ కళాశాలలకు కేటాయించే భూములు, భవనాలు ప్రభుత్వానివి. అక్కడ పనిచేసేది ప్రభుత్వ సిబ్బంది. వారికి జీతాలు చెల్లించేది సర్కారే. కానీ యజమానులు మాత్రం ప్రైవేటు వ్యక్తులు. వచ్చే లాభాలు వారివి. కానీ భారం మాత్రం ప్రజలు, ప్రభుత్వంపైన. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమీకరించిన సంతకాల పత్రాలను నెల పదో తేదీన అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రదర్శిస్తాం. జిల్లా కేంద్రాల్లో 13న ర్యాలీలు నిర్వహిస్తాం. అన్ని జిల్లాల నుంచి వచ్చిన ఆ పత్రాలను ఈ నెల 16న గవర్నర్‌కి సమర్పిస్తాం. ఆ తర్వాత ఆ పత్రాలతో హైకోర్టులో పిటిషన్ వేస్తాం' అని తెలిపారు.

వారు మాత్రం అరెస్ట్ కాలేదు

'ప్రభుత్వం వారిదే. మద్యం దుకాణాలు, బెల్ట్ దుకాణాలు, పర్మిట్ రూంలు, తయారీ, సరఫరా అన్నీ తెదేపా వారివే. రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఇతరులకు వాటిని నడిపే ధైర్యముంటుందా? ములకలచెరువు కల్తీ మద్యం కేసులో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించి జోగి రమేశ్‌ను అరెస్ట్ చేయించారు. కానీ ఈ కేసుతో సంబంధమున్న తెదేపా నేతలు జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డి ఇప్పటికీ అరెస్ట్ కాలేదు. తప్పుడు కేసులు పెట్టి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డిలను వేధిస్తున్నారు. ఇలాంటివి చేస్తేనే నక్సలిజం పుడుతుంది' అని వ్యాఖ్యానించారు.

అవినీతి కేసులను దొంగచాటుగా మూసేయించుకుంటున్నారు

'లిక్కర్ కేసులో బెయిల్ మీద ఉన్న చంద్రబాబు దాన్ని నీరుగార్చేందుకు మా ప్రభుత్వంలో అమలుచేసిన మద్యం విధానాన్ని తప్పుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. తనమీద ఉన్న అవినీతి కేసుల్ని దొంగచాటుగా క్లోజ్ చేయించుకుంటున్నారు. బెయిల్ షరతుల్ని ఉల్లంఘిస్తున్నారు. అధికారుల మీద ఒత్తిడి తెచ్చి, బెదిరించి, భయపెట్టి అబద్ధపు వాంగ్మూలాలు చెప్పించి ఒక్కో కేసును మూసేయించుకుంటున్నారు' అని పేర్కొన్నారు.

తీసుకున్న వాటికే దిక్కు లేదు... మరో 53 వేల ఎకరాలా?

'అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబుకు కుంభకోణాలే గుర్తొస్తాయి. భూములు ఎవరికివ్వాలి. ఎవరి నుంచి తీసుకోవాలి. ధరను పెంచి ఎలా నిర్మాణాలు చేపట్టాలి అనేది ఆలోచిస్తారు. రాజధాని పనులు నిరంతరం కొనసాగాలనేది ఆయన ఉద్దేశం. ఉన్న 53వేల ఎకరాలకే దిక్కులేదు. మరో 53వేల ఎకరాలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు, ఆయన బినామీలు ముందుగానే భూములు కొంటారు. తర్వాత వాటిని ప్లాట్లుగా తన బినామీలకు ఒకచోట, మిగతా వారికి మరోచోట కేటాయిస్తారు. ఇతరులకు కేటాయించిన ప్లాట్లున్న చోట అభివృద్ధి చేయరు. తన మనుషులు మాత్రం బాగుపడేలా చేస్తారు' అని పేర్కొన్నారు.

మరింత పెరిగిన ఇండిగో కష్టం

(మొదటి పేజీ తరువాయి)

అయిన ఇండిగో విమానాల్లోని ప్రతి మూడింటిలో రెండు ఆలస్యంగా నడిచాయి. గురువారం మొత్తం 550కి పైగా జాతీయ, అంతర్జాతీయ విమానాలు రద్దయ్యాయి. మిగతావి ఆలస్యంగా నడిచాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 79 విమానాలు రద్దయ్యాయి. దిల్లీలో 172, ముంబయిలో 118, బెంగళూరులో 100, కోల్‌కతాలో 35, చెన్నైలో 26, గోవాలో 11 రద్దయ్యాయి.

హైదరాబాద్‌లో..: విమానాల రద్దు సమాచారాన్ని ప్రయాణికులకు సరైన సమయంలో చెప్పకపోవడంతో వందల మంది శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చారు. చెక్-ఇన్ పూర్తయి లోపలికి వెళ్లాక మీరు వెళ్లాల్సిన విమానం రద్దయిందంటూ ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది చెప్పడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిలో ఒకరిపై ప్రయాణికులు దాడి చేశారు. తొలుత ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 20 విమానాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే 20 విమానాలు మాత్రమే రద్దయ్యాయంటూ ఇండిగో సిబ్బంది ప్రకటించారు. అదనంగా 39 రద్దు చేయడంతో వేల మందిపై ప్రభావం పడింది. ఆలస్యంగా విమానాలు బయల్దేరుతాయన్న సమాచారంతో 3వేల మంది ప్రయాణికులు గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4గంటల వరకూ ఎదురు చూశారు. చెన్నైలో ఒక వివాహానికి హాజరయ్యేందుకు హైదరాబాద్‌కు చెందిన 20 మంది టికెట్లు బుక్ చేసుకున్నారు. ఉదయం 6.30 గంటలకు విమానం బయల్దేరుతుందని సంక్షిప్త సమాచారం రాగా తెల్లవారుజామున 5 గంటలకే వారు విమానాశ్రయం చేరుకున్నారు. విమానం వెళ్లేందుకు ఆలస్యమవుతుందని, ఉదయం 10.30 గంటలకు పంపుతామంటూ చెప్పడంతో వారు సరే అన్నారు. మధ్యాహ్నం 2 గంటలైనా విమానం రాకపోవడంతో వారు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. హైదరాబాద్ నుంచి కొచ్చిన్‌కు వెళ్లాల్సిన విమానం గురువారం రద్దవడంతో శబరిమలకు వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు విమానాశ్రయంలో బైఠాయించి నిరసన చేపట్టారు.

విశాఖలో..: విశాఖపట్నం విమానాశ్రయానికి రావాల్సిన 6 విమానాలు ఒకరోజుపాటు రద్దయినట్లు విమానాశ్రయ డైరెక్టర్ పురుషోత్తం గురువారం తెలిపారు. బెంగళూరు, చెన్నై, దిల్లీ, ముంబయి, కోల్‌కతా, హైదరాబాద్ విమాన సర్వీసులు రద్దయినట్లు వివరించారు. ప్రధాన నగరాలకు వెళ్లాల్సిన వారిలో చాలామంది రైళ్ల కోసం పరుగులు తీశారు. ముందస్తు సమాచారం లేకుండా చెన్నై విమానాన్ని రద్దు చేశారని అయ్యప్ప భక్తులు ఆందోళనకు దిగారు.

అంత సులభం కాదు: సీఈవో

విమాన సేవలను సాధారణ స్థితికి తేవడమే తమ తక్షణ లక్ష్యమని, సమయపాలనపై పని చేస్తున్నామని, అయితే అది అంత సులభం కాదని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. అత్యుత్తమ సేవలను అందించే బాధ్యత నుంచి వెనక్కి తగ్గలేదని గురువారం స్పష్టం చేశారు.

● వచ్చే ఏడాది ఫిబ్రవరికి 10కిగానీ ఇండిగో విమానాలన్నీ సాధారణ స్థాయికి చేరుకోలేవని అధికారులు తెలిపారు. ఈ నెల 8 నుంచి విమానాలను తగ్గించనున్నట్లు వెల్లడించారు. ఈ వివరాలను గురువారం ఇండిగో సంస్థ డీజీసీఏకు అందించింది.

త్వరగా సరిదిద్దండి: రామ్మోహన్ నాయుడు

ఇండిగో విమానాల గందరగోళంపై పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గురువారం అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. అతి త్వరగా విమానాలను సాధారణ స్థితికి చేర్చాలని, ఇదే అదనుగా ఛార్జీలను పెంచే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. గందరగోళ పరిస్థితులను సరిదిద్దడంలో ఇండిగో సంస్థ వ్యవహరించిన తీరుపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.

సృజనాత్మక నగరంగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిని సృజనాత్మక నగరంగా తీర్చిదిద్దనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతిలో నిర్మించే ప్రతి భవనం విలక్షణంగా ఉండాలని, ప్రస్ఫుటంగా కనిపించాలని, నగరం పచ్చదనంతో అలరారాలని ఆయన స్పష్టం చేశారు. నగరంలో భవనాల డిజైన్ల కోసమే గతంలో చాలా అధ్యయనం, కసరత్తు చేశామని గుర్తు చేశారు. గురువారం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం జరిగింది. రెండో విడత భూసమీకరణ నోటిఫికేషన్, ఎల్‌పీఎస్ ప్రణాళిక సహా పలు అంశాలకు అథారిటీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రాజధానిలో చేపట్టిన 85 శాతం ప్రాజెక్టుల్లో పనులు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. నిర్మాణాల్లో వేగం పెంచాలని, అలాగని నాణ్యతలో రాజీ పడరాదని సీఎం ఆదేశించారు. తెలుగువారి ఆత్మగౌరవానికి, వైభవానికి ప్రతీకగా నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహాన్ని నిర్మించాలని సీఎం సూచించారు.

సిబ్బందికి ప్రభుత్వం జీతాలిస్తే కుంభకోణమా?

జగన్‌ను నిలదీసిన సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: పీపీపీ విధానంలో నిర్మించే వైద్య కళాశాలల్లో సిబ్బందికి ప్రభుత్వం జీతాలు చెల్లించడం కుంభకోణం ఎలా అవుతుందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. స్కాంలు చేసే ఆయనకు అన్నీ అలానే కనిపిస్తాయని గురువారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణం గురించి జగన్ చేసిన విమర్శల్ని తీవ్రంగా ఖండించారు.

డబుల్ డెకర్ వంతెనలతో మెట్రోరైల్, ఎన్‌హెచ్ఏఐకి రూ.563 కోట్లు మిగులు

- భూసేకరణ భారం ఉండదు, ప్రజలకు వెసులుబాటు
- విశాఖలో 20.10 కి.మీ., విజయవాడలో 4.33 కి.మీ. డబుల్‌డెకర్ వంతెనలు
- రెండు సంస్థలూ ఒప్పందం చేసుకుంటే ఆర్థికంగా మేలు
- కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన రాష్ట్రప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో జాతీయ రహదారులపై ఎలివేటెడ్ వంతెనలు నిర్మించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సిద్ధమైంది. ఇదే మార్గంలో మెట్రోరైల్ ప్రాజెక్టులు చేపడుతున్నారు. రెండూ వేర్వేరుగా నిర్మిస్తే.. అదనంగా భూసేకరణలు చేయాలి. దీనివల్ల ఆస్తులు నష్టపోతామనే ఆందోళన ప్రజల్లో ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులేవీ లేకుండా.. రెండూ కలిపి ఒకే ఎలైన్‌మెంట్‌లో డబుల్‌డెకర్ ఫ్లైఓవర్‌గా నిర్మిస్తే భూసేకరణ భారం ఉండదు. ప్రజలకు ఊరట కలుగుతుంది. అలాగే ఒకే ప్రాజెక్టుగా చేపట్టడం వల్ల ఎన్‌హెచ్ఏఐ, మెట్రోరైల్ కార్పొరేషన్‌లకు కలిపి రూ.563 కోట్లు మిగులుతుందని అధికారులు లెక్క తేల్చారు. నిర్మాణ సమయం కలిసి వస్తుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. వీటిని కలిపి ఒకే ప్రాజెక్ట్‌లా చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలని.. రెండు సంస్థల్లో ఎవరు నిర్మాణ పనులు చేపట్టినా అభ్యంతరం ఉండదని పేర్కొంది.

విశాఖలో డబుల్‌డెకరతో ఎన్‌హెచ్ఏఐకి మేలు

◆ విశాఖపట్నంలో కొమ్మాది నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు 46.23 కి.మీ. మెట్రోరైల్ ప్రాజెక్టును మొదటి దశగా చేపట్టనున్నారు.

◆ ఇదే మార్గంలో మధురవాడ నుంచి స్టీల్‌ప్లాంట్ దాటాక లంకెలపాలెం వరకు హైవేపై ఉన్న 12 కూడళ్ల వద్ద వంతెనలు నిర్మించేందుకు ఎన్‌హెచ్ఏఐ సమ్మతించింది.

◆ ఇలా వేర్వేరు వంతెనలకు బదులు అంతా కలిపి ఎలివేటెడ్ వంతెన నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీనికి ఎన్‌హెచ్ఏఐ ప్రాథమికంగా అంగీకరించింది. ◆ ఇప్పుడు ఇదే మార్గంలో మెట్రోరైల్ ప్రాజెక్ట్ కూడా ఉండటంతో.. రెండింటికి కలిపి డబుల్ డెకర్ ఫ్లైఓవర్ నిర్మించేలా ప్రతిపాదించారు.

◆ మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 16 కి.మీ., గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు 4.10 కి.మీ. కలిపి మొత్తం 20.10 కి.మీ.మేర డబుల్‌డెకర్ వంతెనలు నిర్మించనున్నారు. వంతెన మొదటి అంతస్తులో నాలుగు వరుసల హైవే ఉంటుంది. దానిపైన మెట్రో రైల్ వంతెన ఉంటుంది.

◆ కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధిశాఖ అంచనా ప్రకారం విశాఖలోని 46.23 కి.మీ. మెట్రోరైల్ ప్రాజెక్టుకు రూ.11,498 కోట్ల వ్యయమవుతుంది. ఇందులోని ప్రతిపాదిత డబుల్‌డెకర్ భాగం 20.10 కి.మీ.పరిధిలో వేర్వేరుగా నిర్మాణాలు జరిపితే.. మెట్రో రైల్ సంస్థకు రూ.2,076 కోట్లు, ఎన్‌హెచ్ఏఐకి రూ.2,587 కోట్లు కలిపి మొత్తం రూ.4,663 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది.

◆ అదే డబుల్‌డెకర్ వంతెన నిర్మిస్తే రూ.4331 కోట్లు ఖర్చు చేస్తే సరిపోతుంది. ఇందులో ఎన్‌హెచ్ఏఐ వెచ్చించాల్సిన మొత్తం రూ.2,252 కోట్లకు తగ్గుతుంది. అంటే ఈ సంస్థకు రూ.335 కోట్లు మిగులుతుంది.

విజయవాడలో రెండు సంస్థలకూ ఆర్థిక ప్రయోజనం

విజయవాడ నగరం మీదుగా వెళ్లే చెన్నై-కోల్‌కతా హైవేపై.. మహానాడు కూడలి నుంచి నిడమానూరు వరకు 5.8 కి.మీ. ఎలివేటెడ్ వంతెన నిర్మించేందుకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరించింది.

◆ ఇదే మార్గంలో మెట్రో రైల్ ప్రాజెక్ట్ మంజూరైంది. అది ఎలివెటేడ్ వంతెన వెళ్లే మార్గంలో రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు 4.33 కి.మీ. వెళ్తుంది. దీంతో అక్కడ డబుల్ డెకర్ ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంది.

◆ ఈ 4.33 కి.మీ.లో ఎన్‌హెచ్ఏఐ ఎలివేటెడ్ వంతెనకు రూ.528 కోట్లు, మెట్రోరైల్ ప్రాజెక్టుకు రూ.465 కోట్లు కలిపి మొత్తం రూ.993 కోట్ల వ్యయం అవుతుంది.

◆ అదే రెండూ కలిపి డబుల్‌డెకర్ ఫ్లైఓవర్ నిర్మిస్తే రూ.865 కోట్లు వెచ్చిస్తే సరిపోతుంది. అంటే రూ.128 కోట్లు మిగులుతుంది. ◆ ఇలా విశాఖలో రూ.335 కోట్లు, విజయవాడలో రూ.128 కోట్లు కలిపి మొత్తం రూ.563 కోట్ల మేర ఎన్‌హెచ్ఏఐ, మెట్రోరైల్ కార్పొరేషన్‌లకు ఆర్థికభారం తగ్గుతుంది.

బెంజ్‌సర్కిల్-పెనమలూరు మధ్య డబుల్‌డెకర్ వంతెనకు విజ్ఞప్తి

◆ విజయవాడ-మచిలీపట్నం హైవేను విస్తరిస్తున్నారు. ఇందులో అమరావతి అవుటర్ రింగ్ క్రాస్ అయ్యే చోట (దావులూరు సమీపం) నుంచి మచిలీపట్నం వరకు ఆరు వరుసలుగా విస్తరిస్తారు.

◆ కానూరు నుంచి దావులూరు సమీపం వరకు ప్రస్తుత నాలుగు వరుసల హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు.

◆ బెంజ్‌సర్కిల్ నుంచి కానూరు వరకు భూసేకరణ సమస్య కారణంగా ఎటువంటి విస్తరణ పనులూ చేయకూడదని ఎన్‌హెచ్ఏఐ భావించింది.

◆ అయితే ఇదే మార్గంలో విజయవాడ ప్రధాన బస్టాండ్ నుంచి బెంజ్‌సర్కిల్ మీదుగా పెనమలూరు వరకు మెట్రో రైల్ ప్రాజెక్టు చేపడుతున్నారు. దీంతో ఇందులోని బెంజ్ సర్కిల్ నుంచి పెనమలూరు వరకు 8 కి.మీ. మేర డబుల్ డెకర్ ఫ్లైఓవర్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇందుకు ఎన్‌హెచ్ఏఐ, మెట్రోరైల్ కార్పొరేషన్లకు కేంద్రం అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

త్వరలో మాతృభాషలోనే పాఠ్యాంశాల బోధన

- ఆ మేరకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు
- తెలుగు చదువుకున్న వారికే ఉద్యోగాలివ్వాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



కృష్ణాతరంగ్ ఉత్సవాల ప్రారంభ వేదికపై మండలి బుద్ధప్రసాద్, కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు, వెంకయ్యనాయుడు, వీసీ రాంజీ, రిజిస్ట్రార్ ఉష

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: దేశవ్యాప్తంగా వైద్య, సాంకేతిక, ఇంజినీరింగ్ తదితర కోర్సులన్నీ త్వరలో మాతృభాషలోనే బోధించనున్నారని, తదనుగుణంగా పాఠ్యాంశాలు, పుస్తకాలు తయారవుతున్నాయని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. భారతీయ భాషలను పరిరక్షించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో గురువారం కృష్ణాతరంగ్ ఉత్సవాలను వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'తెలుగు చదువుకున్న వారికే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగాలు అన్న నిబంధన రావాలి. అదేమీ రాజ్యాంగ విరుద్ధం కాదు. అప్పుడే కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని తెలుగు సీట్లు భర్తీ అవుతాయి. మాతృభాషను పరిరక్షించాలని ఉద్యమించడం కంటే ప్రభుత్వాలు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమం. ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే ఉండాలని ఇటీవల రామోజీరావు జయంతి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డికి సూచించాను. అదే రామోజీరావుకు మనమైన నివాళి అవుతుందని చెప్పగా, అందుకు వారిద్దరూ ముందుకొచ్చారని వెంకయ్యనాయుడు గుర్తుచేశారు. యువతను విద్యాసంస్థల్లో విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతిపై ప్రేమ, అవసరం మేరకే వినియోగం వంటి విలువలు బోధించాలని సూచించారు. యూనివర్సిటీ ఉన్నతికి తీసుకుంటున్న చర్యలు, కృష్ణాతరంగ్ నేపథ్యాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వివరించారు. వీసీ ప్రొఫెసర్ రాంజీ, రెక్టార్ బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఉష, ఉత్సవ్ కన్వీనర్ దిలీప్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి

- రైల్వేమంత్రికి డివిజన్ సాధన సమితి వినతి



రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, డివిజన్ సాధన సమితి సభ్యులు

ఈనాడు, దిల్లీ: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బాలాజీ రైల్వే డివిజన్‌ను తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని తెదేపా ప్రజాప్రతినిధుల నేతృత్వంలో బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కోరారు. పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, తెదేపా పార్లమెంటరీ పార్టీనాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు నేతృత్వంలో డివిజన్ సాధన సమితి సభ్యులు గురువారం పార్లమెంట్ భవన్‌లో రైల్వేమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 'దేశంలోనే అత్యంత రద్దీ ఉండే పుణ్యక్షేత్రం తిరుపతి. ప్రతి ఏటా రూ.250 కోట్ల ఆదాయంతో దక్షిణ కోస్తా రైల్వేజోన్‌లో అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్న మూడో స్టేషన్‌గా నిలిచింది. ప్రస్తుతం ఉన్న జ్యూరిస్‌డిక్షనల్ ఎలైన్‌మెంట్ కారణంగా ఈ ప్రాంత రైల్వే అవసరాలు తీర్చడంలో చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రధాన కార్యాలయాన్ని రాయలసీమకు దూరంగా ఉన్న విశాఖపట్నంలో ఏర్పాటుచేస్తున్నారు. మరోవైపు అమరావతి ప్రాంతంలో విజయవాడ, గుంటూరు డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ రాయలసీమలోని తిరుపతి ప్రాంతానికి డివిజనల్ ప్రధాన కార్యాలయం లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌ను ఏర్పాటు చేయడం న్యాయబద్ధంగా ఉంటుంది. దీనివల్ల ఈ ప్రాంత అవసరాలకు తగ్గట్టు వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుంది. అందువల్ల తిరుపతి-ఒంగోలు, తిరుపతి-కాట్పాడి, పాకాల-ధర్మవరం, రేణిగుంట-ఎర్రగుంట్ల, ఎర్రగుంట్ల-నంద్యాల, శ్రీకాళహస్తి-నడికుడి, ఓబుళవారిపల్లె-కృష్ణపట్నం, కడప-బెంగుళూరుల మధ్య 1,550 కిలోమీటర్ల దూరం ఉన్న సెక్షన్లతో తిరుపతి డివిజన్‌ను ఏర్పాటుచేయాలి' అని వారు కేంద్రమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో కోరారు.

పరకామణిలో చోరీ కేసు రాజీపై.. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో తప్పేముంది?

- లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు ధర్మాసనానికి నివేదించారు
- దేవాలయాల్లో అక్రమాలపై న్యాయస్థానాలు సుమోటోగా జోక్యం చేసుకోవచ్చు
- రవికుమార్ అప్పీల్ విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: దేవాలయాలు, ఛారిటబుల్ సంస్థలలో అక్రమాలు, మైనర్ల హక్కులకు భంగం వాటిల్లినప్పుడు సుమోటోగా జోక్యం చేసుకొని తగిన ఆదేశాలిచ్చే అధికారం న్యాయస్థానాలకు ఉందని హైకోర్టు స్పష్టంచేసింది. దేవాలయాల ప్రయోజనాలు కాపాడే విషయంలో మొదటి సంరక్షకులు న్యాయస్థానాలేనని వ్యాఖ్యానించింది. తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం పెద్ద వ్యవహారంతో ముడిపడి ఉందని పేర్కొంది. నిందితుడు సీవీ రవికుమార్‌తో అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్వో) వై.సతీష్‌కుమార్ లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసుకునే అధికారం లేదని మాత్రమే హైకోర్టు సింగిల్ జడ్జి ప్రాథమికంగా అభిప్రాయపడ్డారని తెలిపింది. అంతిమంగా లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు ఇద్దరు న్యాయమూర్తుల నేతృత్వంలోని ధర్మాసనానికి సింగిల్ జడ్జి నివేదించారని గుర్తుచేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో తప్పేముందని వ్యాఖ్యానించింది. వాదనల కొనసాగింపునకు విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం గురువారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.

◆ వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదే పరకామణిలో చోటు చేసుకున్న చోరీ కేసును ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్, నిందితుడు సీవీ రవికుమార్ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారాన్ని సీఐడీతో దర్యాప్తు చేయించాలంటూ పాత్రికేయుడు ఎం.శ్రీనివాసులు వేసిన వ్యాజ్యంపై ఈ ఏడాది అక్టోబర్ 27న హైకోర్టు సింగిల్ జడ్జి విచారణ జరిపారు. కేసు రాజీ విషయంలో తితిదే బోర్డు, తితిదే అధికారులు, దర్యాప్తు అధికారి(ఐవో), ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్ పాత్రపై దర్యాప్తు చేయాలని సీఐడీ డీజీని ఆదేశించారు. మరోవైపు నిందితుడు సీవీ రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు కూడబెట్టిన స్థిర, చరాస్తులతోపాటు బ్యాంక్ ఖాతాలపై దర్యాప్తు చేయాలని ఏసీబీ డీజీని ఆదేశించారు. రిజిస్ట్రేషన్లు మరే ఇతర మార్గాల ద్వారా రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు విక్రయించిన, ఇతరులకు కేటాయించిన ఆస్తులపై దర్యాప్తు చేయాలని, ఆదాయానికి తగ్గట్టే వారు ఆస్తులు ఆర్జించారా? లేదా? అనే కోణంలో దర్యాప్తు ఉండాలని స్పష్టంచేశారు. లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి నివేదించిన విషయం తెలిసిందే. ◆ సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ నిందితుడు సీవీ రవికుమార్ వేసిన అప్పీల్‌తోపాటు లోక్ అదాలత్ ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చేందుకు సుమోటోగా నమోదు చేసిన వ్యాజ్యంపై గురువారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

విచారణ జరిపే పరిధి సింగిల్ జడ్జికి లేదు: సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు

గురువారం జరిగిన విచారణలో రవికుమార్ తరపున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. పరకామణిలో చోరీ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారంపై విచారణ జరిపే పరిధి హైకోర్టు సింగిల్ జడ్జికి లేదన్నారు. లోక్ అదాలత్ అవార్డు చట్టబద్ధత తేల్చే అధికారం కేవలం ధర్మాసనం పరిధిలోదన్నారు. సింగిల్ జడ్జి పిటిషన్‌పై విచారణ జరపకుండా మొదట్లోనే దానిని ధర్మాసనానికి నివేదించి ఉండాల్సిందన్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను పరిశీలిస్తే లోక్ అదాలత్ అవార్డును దాదాపు కొట్టేసినట్లు ఉందన్నారు. రవికుమార్ తితిదే ఉద్యోగి కాదని తితిదే ఈవో హైకోర్టులో కౌంటర్ వేశారన్నారు. పెద జీయర్ మఠంలో రవికుమార్ గుమస్తా అని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రభుత్వ ఉద్యోగి(పబ్లిక్ సర్వెంట్) నిర్వచనం పరిధిలోకి రారన్నారు. ప్రభుత్వ ఉద్యోగికాని వ్యక్తి ఆస్తుల విషయంలో దర్యాప్తు చేయాలని సింగిల్ జడ్జి ఏసీబీని ఆదేశించడానికి వీల్లేదన్నారు. ◆ సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి ప్రస్తుత పిటిషన్లలో ప్రతివాదిగా చేరేందుకు అనుమతివ్వాలంటూ ఇంప్లీడ్ పిటిషన్ వేశామన్నారు. దానిని అనుమతించాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ అభ్యర్థనను తదుపరి విచారణలో పరిశీలిస్తామని పేర్కొంది. విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది.

అఖండ2 సినిమా విడుదల వాయిదా

ఈనాడు, హైదరాబాద్: బాలకృష్ణ నటించిన అఖండ2 సినిమా విడుదల వాయిదా పడింది. అనివార్య పరిస్థితుల కారణంగా షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదని నిర్మాణ సంస్థ గురువారం రాత్రి సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని శుక్రవారం ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకున్నారు. గురువారం రాత్రి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు. అయితే ఆర్థికపరమైన విషయాల్లో సమస్యలు తలెత్తడంతో ప్రత్యేక ప్రదర్శనలన్నీ రద్దయ్యాయి. శుక్రవారం విడుదల కావాల్సిన సినిమాని కూడా వాయిదా వేస్తున్నట్లు నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. ఎప్పుడు విడుదల చేస్తారనే విషయంపై శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

జగన్ గగనయానం ఖర్చు రూ.223 కోట్లు

సీఎంగా హెలికాప్టర్, విమాన ప్రయాణాలకు చేసిన వ్యయమిది

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ విమానాలు, హెలికాప్టర్లలో తిరగడానికి రూ.222.85 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ కార్పొరేషన్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. దీనిపై మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో స్పందించారు. 'గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఉద్యోగాలు, కనీస సదుపాయాల కోసం కష్టపడుతుంటే జగన్ మాత్రం ఆయన కోసం విలాసవంతమైన భవనాల నిర్మాణానికి రూ.500 కోట్లు (రుషికొండ భవనాలు), గాల్లో తిరగడానికి రూ.222 కోట్లు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. ఎట్టకేలకు వాస్తవాలు బయటకు వస్తున్నాయి' అని పేర్కొన్నారు. ఐదేళ్ల కాలంలో జగన్ విమానాలు, హెలికాప్టర్లలో ప్రయాణానికి రూ.222 కోట్లు వెచ్చించినట్లుగా ఒక నేషనల్ ఛానల్ వెబ్‌సైట్‌లో వచ్చిన వార్తను ఆయన ట్యాగ్ చేశారు. తెదేపా కూడా జగన్ విమాన ప్రయాణ ఖర్చులపై 'ఎక్స్'లో స్పందించింది.

యువతిపై రౌడీ షీటర్ల అత్యాచారం

ఏలూరు నేరవార్తలు, గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు నగరంలో ఇద్దరు రౌడీ షీటర్లు బరితెగించారు. పూటుగా మద్యం తాగి అర్ధరాత్రి ఓ ఇంటి తలుపులు పగలగొట్టి, ఆ ఇంట్లోని యువతిని లాక్కెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుపై తొలుత స్పందించని పోలీసులు.. గురువారం కేసు నమోదు చేశారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ యువతి ఏలూరుకు చెందిన స్నేహితురాలి ఇంటికి కొన్నాళ్ల కిందట వచ్చింది. ఈ నెల 2న ఆమె కుటుంబ సభ్యులు తిరుపతి వెళ్లారు. ఇంట్లో ఇద్దరు యువతులు మాత్రమే ఉన్న విషయం తెలుసుకున్న కొత్తపేటకు చెందిన రౌడీషీటర్లు పులిగడ్డ జగదీశ్‌బాబు, లావేటి భవానీకుమార్ అర్ధరాత్రి వారి ఇంటి వద్దకెళ్లారు. తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. యువతులను బెల్టుతో కొట్టి భయభ్రాంతులకు గురిచేశారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చిన యువతిని సమీప సచివాలయం ప్రాంగణంలోకి తీసుకెళ్లి జగదీశ్‌బాబు అత్యాచారానికి పాల్పడ్డాడు. మరో యువతిని ఇంట్లోనే నిర్బంధించారు. విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. 3న తెల్లవారుజామున యువతులిద్దరూ రెండో పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టించుకోకుండా వారిని పంపేశారు. విషయాన్ని గోప్యంగా ఉంచారు. విషయం ఎక్కడ ఉన్నతాధికారులకు తెలుస్తుందోనని గురువారం కేసు పెట్టారు.

పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఐదుగురు విద్యార్థులు దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



వాసు



మహేష్



శ్రీకాంత్



రామిరెడ్డి



యశ్వంత్‌సాయి

గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థులు భజనకు వెళ్తుండగా పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం వద్ద బైపాస్ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు కొత్త ట్రాక్టర్లను తీసుకెళ్తున్న కంటెయినర్‌ను దాని వెనుకగా వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టి కంటెయినర్ లోపలికి చొచ్చుకుపోయి నుజ్జునుజ్జయింది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఐదుగురు దుర్మరణం చెందారు. వీరంతా 20 - 22 ఏళ్ల వయసువారే. మృతుల్లో గుంటూరు జిల్లా వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీకాంత్ (వినుకొండ మండలం శివాపురం), వాసు (వినుకొండ సమీప గ్రామం), మహేష్ (పిడుగురాళ్ల), యశ్వంత్ సాయి (నూజెండ్ల మండలం ములకలూరు), విజ్ఞాన్ లారాలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రామిరెడ్డి (తాళ్లూరు, ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా) ఉన్నారు. వినుకొండ మండలం దొండపాడుకు చెందిన మద్దుకూరి కార్తిక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న అతడిని గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో నలుగురు విద్యార్థులు అయ్యప్ప దీక్షలో ఉండగా మరొకరు గోవింద దీక్షలో ఉన్నారు. వీరంతా వినుకొండ మండలం విఠంరాజుపల్లె వద్ద అయ్యప్ప భజనకు బయల్దేరి దారిలో ప్రమాదం బారిన పడ్డారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారులో నలిగిపోయిన మృతదేహాలు

రోగిని మెలకువగా ఉంచి గుండెకు బైపాస్ సర్జరీ

- ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో విజయవంతం



శస్త్రచికిత్స నిర్వహించిన డాక్టర్ జయరామ్ పాయ్ తదితర బృందంతో డాక్టర్ పి.రమేష్‌బాబు

విజయవాడ(కరెన్సీనగర్), న్యూస్‌టుడే: 76 ఏళ్ల మయస్థీనియా గ్రావిస్ రోగిని మెలకువగా ఉంచి గుండె బైపాస్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి అరుదైన మైలురాయిని నమోదు చేసుకుంది విజయవాడలోని ఆస్టర్ రమేష్ వైద్యబృందం. ఈ సందర్భంగా గురువారం ఆస్పత్రిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.రమేష్‌బాబు ఈ వివరాలను వెల్లడించారు. అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉన్న రోగి గుండెకు రక్తం సరఫరా చేసే మూడు ప్రధాన ధమనుల్లో తీవ్రమైన పూడికలు ఉండడంతో పాటు శ్వాసకోశ కండరాలను బలహీనపరిచే 'మయస్థీనియా గ్రావిస్' వ్యాధి ఉంది. ఇలాంటి రోగులకు జనరల్ ఎనస్థీషియా ఇస్తే ప్రాణాంతకం కావొచ్చు. దీంతో వైద్యబృందం 'అవేక్ బైపాస్ టెక్నిక్' పద్ధతిని ఎంచుకుంది. ఈ విధానంలో శస్త్రచికిత్స జరుగుతున్నంత సేపు రోగి స్పృహలోనే ఉండి స్వయంగా శ్వాస తీసుకుంటాడు. థొరాసిక్ ఎపిడ్యూరల్ ఎనస్థీషియా ద్వారా ఛాతీ భాగానికే మత్తు ఇచ్చారు. వెంటిలేటర్ అవసరం లేకుండానే శస్త్రచికిత్సను బృందం విజయవంతంగా పూర్తిచేసినట్లు డాక్టర్ పి.రమేష్‌బాబు వివరించారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను చేసిన కార్డియోథొరాసిక్, వాస్క్యులర్ సర్జన్ల బృందంలో జయరామ్ పాయ్, శివప్రసాద్, అశోక్‌కుమార్, భరత్ సిద్ధార్థ్, శ్రీకాంత్ మహాపాత్రలతో పాటు ఎనస్థీషియా బృందం లోకనాథన్ చక్రవర్తి, పవన్, హిమబిందు, న్యూరాలజిస్ట్ హరిణిలు ఉన్నారని పేర్కొన్నారు.

రూ.15,485 కోట్ల 'సర్దుబాటు' భారం రద్దు చేయాలి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్

ఈనాడు, అమరావతి: విద్యుత్తు ఛార్జీల భారం ప్రజలపై పడొద్దన్న చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి ఉంటే సర్దుబాటు ఛార్జీల భారం రూ.15,485 కోట్లు వెంటనే రద్దు చేయాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. ట్రూ అప్ పేరుతో ఇప్పటివరకు వసూలు చేసిన రూ.3 వేల కోట్లు ప్రజలకు తిరిగి చెల్లించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. '17 నెలల కూటమి పాలనలో ప్రజలపై మోపిన అధిక విద్యుత్తు ఛార్జీలు రూ.17,485 కోట్లు. ఈ ఛార్జీలు వచ్చే రెండేళ్లపాటూ ప్రజలకు పెను భారమే. యూనిట్‌కు అదనంగా 40 పైసల చొప్పున వసూలు చేస్తూ... ఇంకోవైపు ఛార్జీలు పెంచబోమని అనడం ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్' అని షర్మిల విమర్శించారు.

ఇళ్లు కూల్చడం దారుణం: 'సుప్రీంకోర్టు స్టే ఇచ్చినా విజయవాడ భవానీపురంలో 42 ఇళ్లను కనికరం లేకుండా కూల్చడం దారుణం. ఇది కూటమి ప్రభుత్వం తొందరపాటు చర్య. ఇళ్లు కోల్పోయిన బాధితులతో సీఎం మాట్లాడాలి. వారి సమస్యకు పరిష్కారం చూపాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

వచ్చే ఏడాది 24 సాధారణ, 21 ఐచ్ఛిక సెలవులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గాను సాధారణ, ఐచ్ఛిక సెలవుల్ని గురువారం ప్రకటించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 24 సాధారణ, 21 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయి.

సాధారణ సెలవులు

పండుగ	తేదీ	వారం
భోగి	జనవరి 14	బుధవారం
మకర సంక్రాంతి	జనవరి 15	గురువారం
కనుమ	జనవరి 16	శుక్రవారం
గణతంత్ర దినోత్సవం	జనవరి 26	సోమవారం
మహాశివరాత్రి	ఫిబ్రవరి 15	ఆదివారం
హోలీ	మార్చి 03	మంగళవారం
ఉగాది	మార్చి 19	గురువారం
రంజాన్	మార్చి 20	శుక్రవారం
శ్రీరామనవమి	మార్చి 27	శుక్రవారం
గుడ్‌ఫ్రైడే	ఏప్రిల్ 03	శుక్రవారం
బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి	ఏప్రిల్ 05	ఆదివారం
బీఆర్ అంబేడ్కర్ జయంతి	ఏప్రిల్ 14	మంగళవారం
బక్రీద్	మే 27	బుధవారం
మొహర్రం	జూన్ 25	గురువారం
స్వాతంత్ర్య దినోత్సవం	ఆగస్టు 15	శనివారం
వరలక్ష్మీవ్రతం	ఆగస్టు 21	శుక్రవారం
మిలాద్ ఉన్ నబీ	ఆగస్టు 25	మంగళవారం
శ్రీకృష్ణాష్టమి	సెప్టెంబరు 4	శుక్రవారం
వినాయకచవితి	సెప్టెంబరు 14	సోమవారం
గాంధీ జయంతి	అక్టోబరు 2	శుక్రవారం
దుర్గాష్టమి	అక్టోబరు 18	ఆదివారం
విజయదశమి	అక్టోబరు 20	మంగళవారం
దీపావళి	నవంబరు 08	ఆదివారం
క్రిస్మస్	డిసెంబరు 25	శుక్రవారం

పల్గోట సోదరులపై గతంలో డీఆర్ఐ కేసులు

- వాటిలో పలుమార్లు విచారణకు హాజరైన రోణక్, చేతన్‌లు
- వీరితోనే మద్యం లంచాల సొమ్ము మనీలాండరింగ్
- రోణక్, చేతన్‌ను ఎవరు సంప్రదించారో తేల్చే పనిలో సిట్

ఈనాడు, అమరావతి: జగన్ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో వైకాపా వర్గీయులు కొల్లగొట్టిన లంచాల సొమ్ములో... కొంత మొత్తాన్ని మనీలాండరింగ్ ద్వారా రూటింగ్ చేసిన ముంబయి నగల వ్యాపారులు, సోదరులైన రోణక్‌కుమార్ పల్గోట, చేతన్‌కుమార్ పల్గోటలపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ)లోనూ పలు కేసులున్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. 12 కిలోల బంగారం స్మగ్లింగ్ కేసులో 2022 మార్చిలో ఒకసారి, 2023 జులైలో మరోసారి డీఆర్ఐ అధికారులు రోణక్‌ను విచారించినట్లు సిట్ గుర్తించింది. నవంబరు 29 నుంచి ఈ నెల 2 వరకూ వరుసగా 4 రోజుల పాటు సిట్ అధికారులు రోణక్‌కుమార్‌ను విచారించినా.. ఆయన నోరు విప్పలేదు. దీంతో రోణక్ ఫోన్‌ను అతనితోనే ఓపెన్ చేయించిన సిట్ అధికారులు.. అందులోని వివరాలు పరిశీలించగా డీఆర్ఐ కేసుల వ్యవహారం బయటపడింది. రోణక్ సోదరుడు చేతన్ విదేశాల నుంచి అక్రమంగా తీసుకొచ్చిన బంగారం బిస్కట్లతో కోల్‌కతాలో డీఆర్ఐకి పట్టుబడినట్లు సిట్ గుర్తించింది. బంగారం, నగల వ్యాపారం ముసుగులో వీరు రూ.వందల కోట్లలో మనీలాండరింగ్, హవాలా చేస్తున్నారని గుర్తించిన సిట్... వీరికి వైకాపా వర్గీయులతో ఎలా సంబంధాలు ఏర్పడ్డాయి? వీరిని ఎవరు, ఎలా సంప్రదించారు? అనే కోణంలో ఆరా తీస్తోంది. లీలా, అదాన్, ఎస్పీవై డిస్టిలరీల ఖాతాల నుంచి డొల్ల కంపెనీల్లోకి వెళ్లిన రూ.78 కోట్లు కాకుండా.. వైకాపా వర్గీయుల తరపున మరింత సొత్తును వీరు మనీలాండరింగ్ చేశారా? అనే దానిపై వివరాలు సేకరిస్తోంది.

అప్పుడు పొలాల్లోకి దిగని జగన్‌కు ఇప్పుడు రైతులు గుర్తొచ్చారా?

మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజం



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో పంటలు దెబ్బతిన్నప్పుడు కనీసం పొలాల్లోకి కూడా దిగని జగన్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధ్వజమెత్తారు. గతంలో జగన్ ఎర్ర తివాచీపై వెళ్లి, వేదిక ఏర్పాటు చేసుకుని పంటల్ని చూశారని దుయ్యబట్టారు. వైకాపా ప్రభుత్వంలో 2023 ఖరీఫ్‌లో డిసెంబరు 4 నాటికి 5.22 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ ఏడాది ఖరీఫ్‌లో కూటమి ప్రభుత్వం 14 లక్షల టన్నులు సేకరించిందని వివరించారు. ఎవరి హయాంలో ధాన్యం కొనుగోలు బాగా జరుగుతుందో లెక్కలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. విజయవాడలో గురువారం మంత్రి మనోహర్ విలేకర్లతో మాట్లాడారు. "గతంలో ధాన్యం రైతులకు 90 రోజులకూ సొమ్ము జమ చేయలేదు. మా కూటమి పాలనలో 4 గంటల్లోనే అన్నదాతల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం. జగన్ అసమర్థ పాలన కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకూ పార్టీ, కులాలు అంటగట్టిన సంస్కృతి వైకాపాదే' అని మనోహర్ దుయ్యబట్టారు. "ఇటీవల తుపాను సమయంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాయకుల్ని అప్రమత్తం చేసి రైతులకు తోడుగా ఉండాలని చెప్పారు. ఆ సమయంలో జగన్ ఏ ప్యాలెస్‌లో ఉన్నారు? దీపం పథకం ప్రవేశ పెట్టిందెవరు? వైకాపా హయాంలో ఒక్క సిలిండర్ అయినా ఉచితంగా ఇచ్చారా? ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం రూ.2,406 కోట్ల రాయితీతో తొలివిడతలో 97.36 లక్షలు, రెండో విడతలో 93.83 లక్షలు, మూడో విడతలో 94.73 లక్షల ఉచిత సిలిండర్లు అందజేసింది" అని మంత్రి వివరించారు.


రుక్మిణి

యువరాణి పాత్రకు ప్రాణం పోశారొకరు. సూపర్ ఉమన్‌ని కళ్లముందుకు తెచ్చేశారు ఇంకొకరు! తమ నటనతో భారతీయ ప్రేక్షకుల్ని మెప్పించేశారు. కాబట్టే, వెండి తెరమీదే కాదు... సోషల్‌మీడియాలోనూ వీళ్లదే హవా! 2025కుగానూ ఐఎండీబీ టాప్‌-10 తారల జాబితాలోనూ చోటు దక్కించుకున్నారు... రుక్మిణి వసంత్, కళ్యాణి ప్రియదర్శన్!


కల్యాణి

ఆమె యువరాణి... ఈమె సూపర్ ఉమన్!

మాది బెంగళూరు. నాన్న వసంత్ వేణుగోపాల్ సైన్యంలో కమాండింగ్ ఆఫీసర్‌గా చేశారు. దీంతో వివిధ రాష్ట్రాల్లోని ఆర్మీ స్కూళ్లలో నా ప్రాథమిక విద్య సాగింది. 2016 ఉరి సర్జికల్ స్ట్రైక్‌లో నాన్న మరణించారు. దీంతో మా కుటుంబం బెంగళూరుకి వచ్చేసింది. నేను లండన్‌లోని బ్లూమ్స్‌బరీ రాయల్ అకాడమీ ఆఫ్ డ్రామాటిక్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశా. అక్కడే నాకు నటనపై ఆసక్తి కలిగింది. అక్కడ పాశ్చాత్య దేశాల నటన విధానాలపైనే కాదు, మన సంప్రదాయాలు, ఉనికిపైనా పట్టు సాధించాలని బెంగళూరులో థియేటర్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ తీసుకున్నా. నాకు భరతనాట్యంలో ప్రవేశం ఉంది. కాంతార-1లో ఇది సాయపడింది. నడిచినా, మాట్లాడినా పాత్రలోని ఔచిత్యం అర్థమయ్యేలా చేయటం నృత్య కళ నుంచే నేర్చుకున్నా.

చదువయ్యాక మోడలింగ్ చేశా. అప్పుడే తొలిసినిమా 'బీర్బల్ ట్రయాలజీ' అవకాశమొచ్చింది. తరవాత 'సప్తసాగరాలు దాటి' అనే సినిమాకి హీరోయిన్ కోసం ఆడిషన్లు జరుగుతున్నాయని తెలిసింది. దీంతో డైరెక్టర్ హేమంత్ రావ్‌కి నేరుగా హీరోయిన్ అవకాశమివ్వమని మెసేజ్ చేశా. నిజానికి ఇలా అడగడం అన్‌ప్రొఫెషనలిజంగా భావిస్తుంటారు. అందుకే తరవాత ఇలా చేశానేంటి అనిపించింది. అప్పుడు మా అమ్మ 'మీ నాన్న సైనికుడు. ఆయనెప్పుడూ అవతలివాళ్లు ఎప్పుడు అవకాశమిస్తారా అని ఎదురుచూడలేదు. సృష్టించుకుంటూ వెళ్లి శక్తి సామర్థ్యాలు ప్రదర్శించేవారు. నువ్వు చేసిందీ అదే' అని సముదాయించింది. అప్పుడే తెగువ నా రక్తంలోనే ఉందని అనిపించింది. అప్పట్నుంచీ అవకాశాలు రావడం ముఖ్యం కాదు... వాటిని సద్వినియోగం చేసుకోవడమే ప్రధానమని అర్థమైంది. కాబట్టే, పాత్రకోసం కంఫర్ట్ జోన్ దాటి ఎంతైనా కష్టపడతా. కాంతారాలో కనకావతి పాత్రకోసం కత్తిసాము, గుర్రపు స్వారీ, దక్షిణ కన్నడ యాసల్లో శిక్షణనీ తీసుకున్నా. ఇది నటిగా నా బాధ్యత అనుకుంటా.

నాన్న మరణించే నాటికి నాకు పదకొండేళ్లు. అప్పటికి నాన్న సేవల గొప్పతనం తెలియదు. నటిని అయ్యాక, యుద్ధ నేపథ్యంలో తీసిన చిత్రాల ద్వారా సైనికుల గొప్పతనం బాగా అర్థమైంది. మా అమ్మ సుభాషిణి వసంత్... నాన్న చనిపోయిన మూణ్నెళ్లకే 'వీర్ రత్న' స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి వీర మరణం పొందిన సైనికుల కుటుంబాలకు సాయపడుతోంది. దుఃఖాన్ని దాటి ఇతరుల గురించి ఆలోచించడానికి చాలా ధైర్యం కావాలి. నాకు తనే స్ఫూర్తి. ఇంకా మంచి పాత్రలు చేయాలి. అమ్మకు సాయంగా దేశమంతా సేవలను విస్తరించాలి. ఇవే నా లక్ష్యాలు.

– కె.ముకుంద, బెంగళూరు

మాది చెన్నై. అమ్మ లిజి, నటి. నాన్న ప్రియదర్శన్, డైరెక్టర్... కావడంతో చిన్నప్పట్నుంచీ ఇంట్లో సినిమా చర్చలే. నాన్న చుట్టూ ఎప్పుడూ నలుగురైదుగురు అసిస్టెంట్లు ఉండేవారు. నాన్న వాళ్లతో సీన్ల గురించి చర్చించడం రోజూ గమనించేదాన్ని. అయితే పెద్దయ్యాకే వాళ్ల కష్టమేంటో అర్థమైంది. ఆ శ్రమ నచ్చే సినిమాల్లోకి రావాలనుకున్నా. అందుకు అనుగుణంగానే ప్లస్‌టూ పూర్తయ్యాక, న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ చేశా. తర్వాత డైరెక్టర్ సాబు సిరిల్ దగ్గర అసిస్టెంట్ ప్రొడక్షన్ డిజైనర్‌గా అవకాశం ఉంటే చేరిపోయా. ఐదేళ్లు తెర వెనకే ఉంటూ పని నేర్చుకున్నా. ఎప్పటికైనా డైరెక్టర్ అవ్వాలనే లక్ష్యంతో పనిచేసేదాన్ని.

నటిగా అవకాశం...

క్రిష్3, ఇరు మురుగన్ సినిమాలకు డిజైనర్‌గా పని చేస్తున్న సమయంలోనే... 2017లో 'హలో'లో నటించమని అడిగారు. మంచి అవకాశం ప్రయత్నించి చూడమని అమ్మానాన్నలు చెప్పడంతో సరే అన్నాను. తర్వాత చిత్రలహరి, రణరంగం చిత్రాల్లో నటించినా... అనుకున్నంత విజయం అందుకోలేకపోయా. అందుకే మలయాళ సినిమాల మీద దృష్టి పెట్టాలనుకున్నా. నాన్న డైరెక్టర్ అయినా ఆయన దర్శకత్వంలో అరంగేట్రం చేయాలనుకోలేదు. ఆయనకూ ఇది ఇష్టం లేదు. నాకంటూ సొంతంగా గుర్తింపు సంపాదించుకోవాలనుకున్నా. కనీసం ఐదు సినిమాలు చేశాక గానీ, నాన్నతో పని చేయకూడదు అనుకున్నా. కానీ అనుకోకుండానే ఓ చిత్రంలో నటించాల్సి వచ్చింది. షూట్ జరుగుతున్నప్పుడే బాగా చేయలేదని తిడితే ఏడ్చేశా. ఎడిటింగ్ పూర్తయ్యాక మాత్రం 'పాత్రకు కావాల్సినంత ఇచ్చావు' అన్నారు. ఇటీవల విడుదలైన కొత్తలోక ఛాప్టర్-1లో సూపర్ ఉమన్‌గా నటించా. నాన్న దాన్ని చూసి 'బాగా చేశా'వని మెచ్చుకున్నారు. కానీ, నిజ జీవితంలో చంద్ర పాత్రకు పూర్తిగా భిన్నం నేను. కనీసం గట్టిగా తిట్టలేను కూడా. అందుకే ఈ పాత్ర చేయడానికి చాలా కష్టపడ్డా. ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూశాక... ఇంకా ఇలాంటి పాత్రలు చేయాలనిపిస్తోంది. సినిమాలతో బిజీగా ఉండి కుటుంబంతో గడిపే సమయాన్ని కోల్పోతున్నా అనిపిస్తుంది కొన్నిసార్లు. 'కొత్త లోక'లో చంద్రకు ఉన్నట్లు నాకేగాని సూపర్ పవర్స్ ఉంటే 'టెలిపోర్టేషన్' వాడతా. షూటింగ్ అయ్యి ప్యాకప్ చెప్పగానే సెట్‌లో మాయమై, ఇంట్లో ప్రత్యక్షమైపోతా!

వసుంధర

vasundhara@eenadu.in



మహిళల కెరియర్ నిర్మాణంలో సందేహాలు... నిపుణుల సలహాలు ఈనాడు వెబినార్!

ఈనాడు వసుంధర

కెరియర్‌లో ఉన్నతంగా స్థిరపడాలని ఏ మహిళకు ఉండదు? కానీ ఆ ప్రయాణంలో అతివలకు అడుగడుగునా సవాళ్లే. అవకాశాల కొరత, వేతనాల్లో వ్యత్యాసం, పదోన్నతుల్లో పక్షపాతం, నిత్యం మారే సాంకేతికత... ఇలాంటివెన్నో! కుటుంబ బాధ్యతలు, సామాజిక ఒత్తిళ్లు వీటికి అదనం. అలాగని రాజీపడుతూ కూర్చోలేం కదా! ముందడుగు వేయాల్సిందే. అందుకోసం ఏం చేయాలనేదే మీ సందేహమా?

అయితే, **'ఈనాడు- వసుంధర'** ఆధ్వర్యంలో డిసెంబరు 7న(ఆదివారం) ఉదయం 11 గం. నుంచి మధ్యాహ్నం 12:30 గం. వరకూ నిర్వహించే ఉచిత వెబినార్‌లో పాల్గొనండి. తమకు ఎదురైన సవాళ్లను అధిగమించి కెరియర్‌ను విజయవంతంగా నిర్మించుకున్న మహిళల నుంచి అమూల్యమైన సలహాలూ, సూచనలూ అందుకోండి. కెరియర్ ప్రారంభ, మధ్య దశలో ఉన్న ఉద్యోగినులకీ... డిగ్రీ చేస్తున్న, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవాళ్లకీ ఇది అద్భుత అవకాశం.

07.12.2025 (ఆదివారం) నాడు...

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/0f8f2cf2 వెబ్‌లింకు ఓపెన్ చేయండి. జూమ్ ఐడీ: 953 2585 8501 పాస్‌కోడ్: 352258 తోనూ జాయిన్ కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి.

ఇంజినీరింగ్ కాదని...
రాష్ట్రపతి మెడల్ సాధించి!

దేశసేవ ఆమె లక్ష్యం. కాబట్టే, ఇంజినీరింగా... సైన్యంలో చేరడమా అన్న ప్రశ్న ఎదురైనప్పుడు రెండో దానికే ఓటేశారు సిద్ధిజైన్! ఆమె పట్టుదల మిలిటరీలో ప్రవేశాన్ని కల్పించడమే కాదు... రాష్ట్రపతి పతకాన్నీ తెచ్చిపెట్టింది. దాన్ని అందుకున్న తొలి మహిళగానూ చరిత్ర సృష్టించారామె!


సిద్ధిజైన్



చదువయ్యాక మిలిటరీలో చేరాలి అనుకున్నారట సిద్ధి. ఐఐటీ- జేఈఈ శిక్షణలోనూ చేరారు. ఈమెది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉర్జూని. కోటాలో శిక్షణ తీసుకుంటున్నప్పుడు ఎన్‌డీఏ అమ్మాయిలనీ కెడెట్‌లుగా తీసుకుంటోందన్న కబురు అందిందామెకు. వెంటనే ప్రవేశపరీక్ష రాశారు. కానీ తొలి బ్యాచ్‌కి ఎంపికవ్వలేదు. నిరాశ చెందకుండా చదువుపై దృష్టిపెట్టారామె. ఎన్ఐటీలో సీటునీ సాధించారు. అయినా మరుసటి ఏడాది ఎన్‌డీఏ ప్రవేశపరీక్ష రాసి, అర్హత సాధించారు. ఇంజినీరింగ్‌ని పక్కనపెట్టి, శిక్షణలో చేరారు. ఆ నిర్ణయం చరిత్రలో సిద్ధి పేరు నిలిచేలా చేసింది. తాజాగా శిక్షణ పూర్తిచేసుకున్న ఆమె... పాసింగ్ అవుట్ పెరేడ్‌లో రాష్ట్రపతి కాంస్య పతకాన్ని అందుకున్నారు. గత బ్యాచ్‌లోనూ అమ్మాయిలు టాపర్లు ఉన్నారు. కానీ ఎవరూ రాష్ట్రపతి పతకాన్ని అందుకోలేదు. దీన్ని అందుకున్న తొలి మహిళా కెడెట్‌గా చరిత్ర సృష్టించారు సిద్ధి. అకడమిక్స్, ఫీల్డ్ పెర్ఫార్మెన్స్, నాయకత్వ లక్షణాలు, సేవా భావన.. ఇలా అనేక అంశాల్లో మగవాళ్లతో పోటీపడి మరీ ప్రతిభ చూపి, 'బెస్ట్ ఆల్‌రౌండర్ కెడెట్'గానూ నిలిచారు.

'ఇంట్లోవాళ్లకు నా నిర్ణయం చెప్పినప్పుడు వద్దనలేదు, ప్రోత్సహించారు. అయితే మూడేళ్ల శిక్షణలో అలసట, నాపై నాకే సందేహం... వంటి సవాళ్లెన్నో! కానీ నేను చేయగలను అని నాకు నేనే చెప్పుకొనేదాన్ని. ఎంత కష్టమైనా చేసేదాన్ని, త్వరగా నేర్చుకోవడానికి ప్రయత్నించేదాన్ని. ఈ తీరే నన్ను దృఢంగా మార్చింది. అయితే కుటుంబం, సీనియర్ అధికారుల ముందు పతకం అందుకోవడం మాత్రం గర్వంగా ఉంది. అనుకున్నది సాధించా అనిపిస్తోంది' అంటారు సిద్ధి. ఈమె ఎయిర్‌ఫోర్స్‌లో తన సేవలను అందించబోతున్నారు. 'ఒక వైఫల్యం ఎప్పుడూ మన భవిష్యత్తుని నిర్ణయించలేదు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఎవరైనా అనుకున్నది సాధించొచ్చు' అంటోన్న సిద్ధి... యూనిఫాం ధరించి, దేశానికి సేవ చేయాలనుకునే ఎంతోమంది అమ్మాయిలకు టార్చ్ బేరర్‌గా నిలుస్తారనడంలో సందేహం లేదు కదూ!



టెక్నాలజీ అభివృద్ధికి మహిళల ఆలోచనలూ, దృక్పథాలూ, నాయకత్వం అవసరం. అలాంటి భవిష్యత్తుని రూపొందించడం అందరి బాధ్యత. మా సంస్థలో మహిళల్ని చేర్చుకోవడంతో ఆగిపోకుండా వాళ్లు నిలదొక్కుకుని, ముందుకు వెళ్లేలా చర్యలు చేపడుతున్నాం. దాంతో ఒకప్పుడు 10 శాతం ఉన్న మహిళలు ఇప్పుడు 33 శాతానికి పెరిగారు. సమర్థులైన మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి 'దిశ' కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

- ఇస్పితా దాస్‌గుప్తా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎండీ, హెచ్‌పీ ఇండియా



బంగారం - వెండి
4న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,31,940	1,19,900	1,80,690
విజయవాడ	1,28,465	1,19,500	1,83,700
ప్రొద్దుటూరు	1,27,650	1,17,440	1,76,000
రాజమహేంద్రవరం	1,29,660	1,18,850	2,00,000
విశాఖపట్నం	1,29,900	1,19,500	1,90,000
తమిళనాడు	-----	1,20,200	2,00,000



బరువులెత్తగలరా?

'బరువులు ఎత్తితే లావైపోతాం... మగాళ్లలా కనిపిస్తాం' అన్న భయం ఇప్పటికీ చాలామంది ఆడవాళ్లను జిమ్‌లో డంబెల్స్, బార్‌బెల్స్ తాకనివ్వడం లేదు. కానీ, నిపుణుల అభిప్రాయం ప్రకారం స్ట్రెంత్‌నింగ్ వ్యాయామాలు అవసరం.

- మహిళలకు 30 ఏళ్లు దాటాయంటే చాలు... ఈస్ట్రోజన్ హార్మోన్ క్రమంగా తగ్గుతుంది. దీంతో ఎముకలు బలహీనపడతాయి. ఫలితంగా కాళ్ల నొప్పులు, అలసట వంటి ఎన్నో ఇబ్బందులు తప్పవు. మరోపక్క ఆస్టియోపోరోసిస్ ముప్పు పొంచి ఉంటుంది. వీటన్నింటికీ చెక్ పెట్టాలంటే స్ట్రెంత్‌నింగ్ వ్యాయామాలు చేయాల్సిందే. ఇవి కండరాల్నీ, ఎముకల్నీ బలంగా మారుస్తాయి.
- 30 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి పదేళ్లకూ 3-8 శాతం కండరాలను కోల్పోతామట. మెనోపాజ్ తర్వాత ఈ ప్రక్రియ వేగం అవుతుంది. దీంతో మెట్లు ఎక్కలేరు. సామాన్లు ఎత్తలేరు. అంతెందుకు... ఏ పని చేయాలన్నా కష్టమే. ఈ పరిస్థితిని ఎదుర్కోవాలంటే స్ట్రెంత్‌నింగ్ కసరత్తులు చేయడం తప్పనిసరట.
- ఈ వ్యాయామాలు వల్ల మెటబాలిజం రేటు మెరుగుపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరూ బాగుంటుంది. ముఖ్యంగా బరువులు ఎత్తడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. హార్మోన్ల అసమతుల్యత ఎదురు కాదు.
- స్ట్రెంత్ ట్రెయినింగ్ వల్ల మెదడులో ఎండార్ఫిన్, సెరటోనిన్‌లు విడుదల అవుతాయి. ఇవి మెనోపాజ్ మూడ్‌స్వింగ్స్‌ని అదుపులో ఉంచుతాయి.

ఇంట్లోనే చేయొచ్చు...

స్ట్రెంత్‌నింగ్ వ్యాయామాలు అనగానే బరువులు ఎత్తడమే అనుకుంటారు చాలామంది. కానీ స్క్వాట్స్, పుష్-అప్స్, డెడ్‌లిఫ్ట్, లాంజెస్, ప్లాంక్, షోల్డర్ ప్రెస్ వంటివి వారంలో కనీసం 2-3 రోజులు, ప్రతి వ్యాయామం 10-15 సార్లు మూడు సెట్లు చొప్పున చేస్తే చాలు.

దురద, మంట... తగ్గడం లేదు!

మా అమ్మాయి ఉద్యోగిని. తనకు జననాంగాల వద్ద తరచూ దురద, మంట వస్తున్నాయట. యాంటీ సెప్టిక్ క్రీమ్ రాస్తే తగ్గుతోంది. కానీ తిరిగి కొన్ని రోజులకే వస్తోంది. సమస్యేంటి? తగ్గాలంటే ఏం చేయాలి? – ఓ సోదరి

డియర్ వసుంధర


డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

ఈ దురద, మంట చాలావరకూ ఇన్‌ఫెక్షన్ కారణంగా వస్తాయి. అయితే పరిశుభ్రత పాటించకపోయినా, శుభ్రత పేరుతో అతిగా రసాయనాలున్న ఉత్పత్తులు వాడినా, ఆ భాగంలో రోగనిరోధకత తగ్గినా, తరచూ కలయికలో పాల్గొనే వారిలోనూ ఈ సమస్య కనిపిస్తుంది. యాంటీ సెప్టిక్ క్రీమ్‌కి తగ్గుతోంది అంటే ఇన్‌ఫెక్షన్ ఉందనే! అది ఆపగానే పై కారణాల్లో ఏది కొనసాగుతోన్నా తిరిగి వస్తుంటుంది. ఇలా జరగొద్దంటే ముందు జననాంగాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టిపెట్టాలి. అందుకోసం పరిశుభ్రతని పాటించాలి. అయితే సబ్బులు, రసాయనాలుండే బాడీవాష్‌లను ఇందుకు వాడొద్దు. ఇలాచేస్తే అక్కడ సహజంగానే కోలుకునే పరిస్థితిని మనం చెడగొడుతున్నట్లే. దాన్ని గమనించుకోవాలి. నిజానికి సమస్య చిన్నదైతే శరీరమే తగ్గించుకుంటుంది. ప్రోబయాటిక్స్ వంటివి తీసుకుంటూ రోగనిరోధకతను మనం పెంచుకోగలగాలి. అయితే దురద, మంటలకు అందరూ అనుకున్నట్లుగా వైట్ డిశ్చార్జ్ మాత్రమే కారణం కాదు. వెజైనల్ సమస్యలూ కాకపోవచ్చు. కొన్నిసార్లు చర్మసమస్యలూ ఈ ఇబ్బందుల్ని తీసుకొస్తాయి. అలాగే మహిళల్లో కాండిడయాసిస్, వెజైనోసిస్, బ్యాక్టీరియల్ వెజైనైటిస్... ఇలా ఈ సమస్యకి ఇంకా చాలా కారణాలే ఉన్నాయి. వాటిల్లో మీదేంటో కనుక్కుని సంబంధిత యాంటీ బయాటిక్స్‌ని వాడాలి. సమస్య ఎక్కువగా ఉంటే డూషింగ్, లేజర్ థెరపీలూ సూచిస్తాం. కాబట్టి, ముందు వైద్యులను కలిసి, సరైన కారణం కనుక్కోండి. దానికి తగ్గట్టుగా చికిత్స ఇప్పిస్తే సమస్య పదే పదే తిరిగి రాదు.

పాత పత్రికల... వ్యాపారవేత్త!


సుశీల





పాత వార్తాపత్రికలు ఇంట్లో ఉంటే ఏం చేస్తాం? అమ్మేయడమో, పడేయడమో చేస్తాం. కానీ సుశీలా దేవి అలా చేయలేదు. వాటికో రూపమిచ్చారు. అవి ఆమెతోపాటు మరికొందరు మహిళల తలరాతని మార్చింది. అదెలాగంటే...

సుశీలది రాజస్థాన్‌లోని అస్నావర్. భర్త 17 ఏళ్ల క్రితం చనిపోయారు. దీంతో ఐదుగురు పిల్లల బాధ్యత ఆమె మీద పడింది. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం. ఏదో ఒక పని చేయకపోతే పిల్లలను చదివించడం కష్టం. అందుకే ఆమె చేనేత, టైలరింగ్, బ్లాక్ ప్రింటింగ్‌ల్లో శిక్షణ తీసుకున్నారు. వాటి ద్వారా ఉపాధి పొందేవారు. ఒకసారి ఆమెకు ఇంట్లో పాత వార్తాపత్రికలు కనిపించాయి. పడేయకుండా వీటి నుంచి ఏదైనా చేయొచ్చా అన్న ఆలోచన మెదిలిందామెలో. దీంతో వాటిని కత్తిరించి, దారాల సాయంతో మగ్గంపై నేసి, వస్తువులను తయారు చేయడం మొదలుపెట్టారు. ల్యాప్‌ట్యాప్, టోటే బ్యాగులు, ఎన్వలప్‌లు, ఆభరణాల బ్యాగులు, గిఫ్ట్ ప్యాక్‌లు, క్విల్ట్‌లు... ఇలా ఎన్నో తయారు చేశారామె. వాటికి సహజ రంగులే అద్దుతారు. ఆకర్షణీయంగా, ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా తీర్చిదిద్దుతుండటంతో తన ఉత్పత్తులకు చుట్టుపక్కల ప్రాంతాల్లోనే కాదు, విదేశాల్లోనూ డిమాండ్ ఏర్పడింది. ఈమె ఉత్పత్తులు అమెరికాకి ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. 'కాగితంతో చేసినవే అయినా ఎక్కువకాలం మన్నేలా జాగ్రత్తలు తీసుకుంటాం. కాబట్టే ఆదరణ పెరుగుతోంది' అనే సుశీల ఇతర మహిళలకూ తయారీలో శిక్షణనిస్తున్నారు. అలా 50 మంది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారు. 'ఇప్పుడు రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నాం. విదేశాలకీ మా వస్తువులు పంపుతున్నాం కానీ, తొలి రోజుల్లో చాలా ఇబ్బందులు పడ్డాం. మహిళలమంతా జలప్రతాన్ స్వయం సహాయక సంఘంగా ఏర్పడ్డాం. మా సంపాదనలో కొంత మొత్తం దాచి, వ్యాపారం ప్రారంభించాం. తరవాత బ్యాంకు నుంచి లోను తీసుకున్నా'మనే సుశీల... ఒంటరి మహిళ వ్యాపారం పేరుతో ఊళ్లు తిరుగుతోందంటూ హేళనలు ఎదుర్కొన్నారు. అయినా ఆమె వెనకడుగేయలేదు. కాబట్టే, ఒకప్పుడు అవమానించిన వారి చేతే శభాష్ అనిపించుకుంటున్నారు. ఈమె ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

మురిపిస్తున్న 'రెట్రో' అందాలు..!







నేటితరం నాయికలు ట్రెండ్ల వెనకాలే పరుగెత్తట్లేదు. ఒకప్పటి కట్టూ, బొట్టుకీ ఓటేస్తున్నారు. అలనాటి తారల చీరకట్టు, కొప్పులను రీక్రియేట్ చేస్తూ రెట్రో లుక్ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తాజాగా నటి కీర్తి సురేశ్ తన కొత్త సినిమా ప్రమోషన్‌లో భాగంగా 90ల్లో నటీమణులు ధరించిన పోల్కా డాట్ హెడ్ స్కార్ఫ్‌ను ధరించింది. ఆ వింటేజ్ లుక్ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. అవి అమ్మాయిలను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఈమె కన్నా ముందే... దీపికా పదుకొణ్ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో రెట్రో లుక్‌తో తలకు హెడ్‌బ్యాండ్ ధరించి, రెడ్ కార్పెట్‌పై హొయలొలికించింది. ఇంకేం ఈ హెడ్ బ్యాండ్లు, స్కార్ఫ్‌ల మీద అమ్మాయిలు మనసు పారేసుకుంటున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు, వేడుకలు పార్టీలు, ఫ్యాషన్ వాక్‌ల్లో వీటిని ధరించి రెట్రో లుక్‌లో మెరిసిపోతున్నారు. యువత మదిని దోచేస్తున్న ఈ హెడ్ బ్యాండ్ల వెనక చాలా పెద్ద చరిత్రే ఉంది. ఇవి గ్రీకు కాలం నాటివట. వారి తర్వాత రోమన్లు, ఆ తర్వాత రాణులు వీటిని ధరించేవారట. అప్పటి పెళ్లిళ్లలో తలకి ప్రత్యేక ఆభరణంగా వీటినే పెట్టుకునేవారట. ఆపాత మధురాల్ని ఒక్కొక్కటిగా ప్రయత్నిస్తున్న జెన్ జీలు ఈ రెట్రో లుక్‌తోనూ ప్రేమలో పడుతున్నారు. సందర్భానుసారంగా ఈ హెడ్‌బ్యాండ్‌లను ధరించి ఫొటోలకు పోజులిస్తున్నారు. ఫ్యాషన్ ట్రెండ్లు ఎప్పటికప్పుడు మారొచ్చు కానీ, 'ఓల్డ్ ఈజ్ గోల్డ్' అంటూ ఈ క్లాసిక్ లుక్‌కే ఓటేస్తున్నారు. ఆధునిక దుస్తులకీ రెట్రో హంగులు అద్దుతూ మురిపిస్తున్నారు. బెల్ బాటమ్, క్రాప్ టాప్, హై వెయిస్ట్ డెనిమ్ షార్ట్స్‌కి నప్పేలా... ఫ్లోరల్, వెల్వెట్, శాటిన్ క్లాత్‌లతో వీటిని తయారు చేయించుకుంటున్నారు. ఈ లుక్ మీకూ నచ్చిందా? అయితే ఇందులో మీ ఓటు దేనికి...

ఫ్యాషన్ ఫ్యాషన్





ఛాంపియన్

మరిన్ని ఛాన్సులిస్తే..


అర్ష్‌దీప్

విశాఖపట్నం

ఖాళీ సమయాల్లో యార్కర్, రివర్స్ స్వింగ్ గురించి మరింతగా తెలుసుకోవడానికి యూట్యూబ్‌లో వసీమ్ అక్రమ్, జహీర్ ఖాన్‌ల వీడియోలు చూస్తుంటానని ఓ సందర్భంలో ఫాస్ట్‌బౌలర్ అర్ష్‌దీప్ చెప్పాడు. అలా నేర్చుకున్న దాన్ని టీ20 క్రికెట్లో విజయవంతంగానే అమలు చేశాడతడు. అతడు ఊరికే ఏమీ పొట్టి ఫార్మాట్లో 100 వికెట్ల మైలురాయిని అందుకున్న భారత తొలి బౌలర్ కాలేదు. కానీ దక్షిణాఫ్రికాపై రాంచి, రాయ్‌పుర్‌లో అర్ష్‌దీప్ వేసిన స్పెల్స్ ఈ ఎడమచేతి వాటం స్పిన్నర్‌కు వన్డేల్లో నిలకడగా అవకాశాలు ఇవ్వాలని చెబుతున్నాయి. 2/64, 2/54.. ఈ గణాంకాలేమీ గొప్పగా అనిపించకపోవచ్చు. కానీ దక్షిణాఫ్రికా స్కోరు (332; 362/6) చూస్తే ఆ గణాంకాలు భిన్నంగా కనపడతాయి. రెండు మ్యాచ్‌ల్లోనూ అర్ష్‌దీప్ ఛేదనలో లైట్లకింద, భారీగా మంచు కురుస్తుండగా బౌలింగ్ చేయాల్సివచ్చింది. కానీ ఏ దశలోనూ అతడు బ్యాటర్లకు తనపై ఆధిపత్యాన్ని ప్రదర్శించే అవకాశమివ్వలేదు. పేసర్లలో అత్యుత్తమ ఎకానమీ (రాంచిలో 6.4, రాయ్‌పుర్‌లో 5.4)ని నమోదు చేశాడు. సహకారం లేని పిచ్‌పై డికాక్, యాన్సెన్ వంటి బ్యాటర్లను కట్టడి చేయాలన్నా, ఔట్ చేయాలన్నా ఎంతో నైపుణ్యం ఉండాలి. ఫీల్డింగ్‌కు అనుగుణంగా బౌలింగ్ చేసే సామర్థ్యం ఉండాలి. బుమ్రా, సిరాజ్‌ల గైర్హాజరీలో బాధ్యతాయుతంగా బౌలింగ్ చేశాడు అర్ష్‌దీప్. ఇంకొక్కరైనా సహకరించే ఉంటే సిరీస్ ఇప్పటికే భారత్ సొంతమయ్యేది. రాయ్‌పుర్‌లో హర్షిత్ ఓవర్‌కు ఏడుకు పైగా, ప్రసిద్ధ్‌కృష్ణ ఓవర్‌కు పదికిపైగా పరుగులు సమర్పించుకున్నారు. 26 ఏళ్ల అర్ష్‌దీప్ మాత్రం రెండు వన్డేల్లోనూ ఆకట్టుకున్నాడు. తొలి వన్డేలో దక్షిణాఫ్రికా ఆఖరి పవర్‌ప్లేలో మూడు ఓవర్లలో 16 పరుగులే ఇచ్చిన అతడు.. బర్గర్‌ను ఔట్ చేశాడు కూడా. హోరాహోరీ సాగిన పోరులో అతడి స్పెల్ చాలా కీలకమైంది. బర్గర్ ఔటైన 47వ ఓవర్ మెయిడిన్ కావడం విశేషం. అర్ష్‌దీప్ కచ్చితమైన షార్ట్ పిచ్ బంతులు వేశాడు. బ్యాటర్లు తనను తేలికగా అంచనా వేయకుండా ఉండేందుకు వైవిధ్యంగా బంతులు ఎలా వేయాలో అర్ష్‌దీప్ నేర్చుకున్నాడని అతడి చిన్ననాటి కోచ్ జస్వంత్ రాయ్ చెప్పాడు. బౌలర్‌గా అర్ష్‌దీప్ ఎంతో పరిణతి సాధించాడని, మానసికంగా దృఢంగా మారాడని అన్నాడు.

ఆడింది 13 వన్డేలే..

అర్ష్‌దీప్ ఇప్పుడు విశాఖపట్నంలో జరిగే నిర్ణయాత్మక మూడో వన్డేలో మరింత మెరుగ్గా బౌలింగ్ చేయాలనే ఉత్సాహంతో ఉన్నాడు. అక్కడ మంచు ప్రభావం తొలి రెండు వన్డేల్లో ఉన్నంత ఉండకపోవడం అర్ష్‌దీప్‌కు అతడి సహచరులకు కలిసొచ్చే అంశమే. అయితే అర్ష్‌దీప్ ఇప్పటికే ఎంతో మెరుగయ్యాడని, నిలకడ సాధించాడని 2023 డిసెంబరు తర్వాత అతడి గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. ఈ కాలంలో అతడు 10 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు పడగొట్టాడు. ఎకానమీ అయిదు మాత్రమే. అయితే గణాంకాలు మెరుగ్గానే ఉన్నా వన్డేల్లో అర్ష్‌దీప్‌కు తగినన్ని అవకాశాలు రాలేదనే చెప్పాలి. 2022 నవంబరులో వన్డే అరంగేట్రం చేసిన అతడు.. ఇప్పటివరకు ఆ ఫార్మాట్లో 13 మ్యాచ్‌లే ఆడాడు. 2025 ఫిబ్రవరిలో వన్డే అరంగేట్రం చేసిన హర్షిత్ రాణా మాత్రం ఇప్పటికే 10 వన్డే మ్యాచ్‌లు ఆడేశాడు. 2021లో అరంగేట్రం చేసిన ప్రసిద్ధ్ 20 వన్డేల్లో బరిలోకి దిగాడు. 9.33, 9, 7.42, 6.54, 10.20.. గత అయిదు వన్డేల్లో అతడి ఎకానమీ రేట్ ఇది. 2027 వన్డే ప్రపంచకప్ సమీపిస్తున్న నేపథ్యంలో బుమ్రా, సిరాజ్‌లకు బ్యాకప్‌గా భారత్‌కు సమర్థులైన పేసర్లు అవసరం. జట్టు కూర్పు డిమాండ్ చేస్తే తాను మూడో పేసర్‌ను కాగలనని అర్ష్‌దీప్ ఇప్పటికే చాటుకున్నాడు. ఈ నేపథ్యంలో వన్డేల్లో అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వడం అవసరం.

మెరిసిన షమి..

బెంగాల్ విజయం


షమి

ఈనాడు, హైదరాబాద్: పేసర్ మహ్మద్ షమి (4/13), ఆకాశ్ దీప్ (3/27) విజృంభించడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో బెంగాల్‌కు మరో విజయం దక్కింది. గురువారం జింఖానా మైదానంలో జరిగిన గ్రూపు-సి మ్యాచ్‌లో బెంగాల్ 7 వికెట్ల తేడాతో సర్వీసెస్‌పై గెలుపొందింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' షమి దెబ్బకు తొలుత సర్వీసెస్ 18.2 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. బెంగాల్ 15.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. అభిషేక్ పోరెల్ (56; 29 బంతుల్లో 8×4, 2×6), కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (58; 37 బంతుల్లో 7×4, 1×6) చెలరేగి బెంగాల్‌కు విజయాన్ని అందించారు.

గుజరాత్‌పై బరోడా పైచేయి: బరోడా వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. గురువారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన గ్రూపు-సి మ్యాచ్‌లో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో గుజరాత్‌ను ఓడించింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య బరిలో ఉండటంతో భద్రత కారణాల దృష్ట్యా జింఖానా మైదానం నుంచి ఉప్పల్ స్టేడియానికి ఈ మ్యాచ్‌ను తరలించారు. రాజ్ లింబాని (3/5), అతిత్ సేథ్ (2/14), హార్దిక్ పాండ్య (1/16), కృనాల్ పాండ్య (1/25) దెబ్బకు మొదట గుజరాత్ 14.1 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. బరోడా 6.4 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. శశ్వంత్ రావత్ (30 నాటౌట్; 19 బంతుల్లో 6×4), విష్ణు సోలంకి (27; 15 బంతుల్లో 4×4, 1×6), హార్దిక్ (10; 6 బంతుల్లో 2×4) రాణించారు.


హార్దిక్ పాండ్య

హైదరాబాద్ జోరు: హైదరాబాద్ జోరుమీదుంది. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో నాలుగో విజయంతో అదరగొట్టింది. గురువారం గ్రూపు-బి మ్యాచ్‌లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో జమ్ముకశ్మీర్‌పై విజయం సాధించింది. మొత్తం 16 పాయింట్లతో గ్రూపు-బి పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన జమ్ముకశ్మీర్ 19.3 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లు సి.వి.మిలింద్ (3/31), 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' నితిన్ సాయి యాదవ్ (3/17), రక్షణ్‌రెడ్డి (2/21) విజృంభించారు. హైదరాబాద్ 15.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తనయ్ త్యాగరాజన్ (50; 33 బంతుల్లో 7×4, 1×6), ప్రజ్ఞయ్‌రెడ్డి (31 నాటౌట్; 29 బంతుల్లో 4×4, 1×6) రాణించి హైదరాబాద్‌కు విజయాన్ని అందించారు.

ఆంధ్ర హవా: ఆంధ్ర హవా కొనసాగుతోంది. గురువారం జరిగిన గ్రూపు-ఎ మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్‌ను చిత్తుచేసింది. గ్రూపులో నాలుగో విజయంతో ఆంధ్ర 16 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. మెరుగైన నెట్ రన్‌రేట్‌తో ముంబయి (16 పాయింట్లు) అగ్రస్థానంలో ఉంది. కెప్టెన్ మన్‌దీప్ ఖరె (44; 35 బంతుల్లో 6×4), శశాంక్ సింగ్ (46; 29 బంతుల్లో 3×4, 3×6) రాణించడంతో తొలుత ఛత్తీస్‌గఢ్ 6 వికెట్లకు 158 పరుగులు సాధించింది. శశికాంత్ (2/36), పృథ్వీరాజ్ (2/35), యశ్వంత్ (2/24) రెండేసి వికెట్లు తీశారు. అనంతరం ఆంధ్ర 18.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' షేక్ రషీద్ (59 నాటౌట్; 44 బంతుల్లో 4×4, 2×6), అశ్విన్ హెబ్బర్ (50; 40 బంతుల్లో 4×4, 1×6) అర్ధ సెంచరీలతో జట్టును గెలిపించారు.



రూట్

రూట్ అజేయ శతకం

ఇంగ్లాండ్ 325/9

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాతో యాషెస్ తొలి టెస్టులో పరాజయం పాలైన ఇంగ్లాండ్.. రెండో టెస్టు (డే/నైట్)ను మెరుగ్గా ఆరంభించింది. స్టార్ బ్యాటర్ జో రూట్ (135 బ్యాటింగ్; 202 బంతుల్లో 15×4, 1×6) అద్భుత శతకం సాధించడంతో తొలి రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్.. తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఓపెనర్ జాక్ క్రాలీ (76; 93 బంతుల్లో 11×4) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. రూట్‌తో పాటు జోఫ్రా ఆర్చర్ (32 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ (6/71) సూపర్‌గా బౌలింగ్ చేశాడు. ప్రపంచ నంబర్‌వన్ బ్యాటర్ రూట్ ఆస్ట్రేలియాలో యాషెస్ సెంచరీ చేయడం ఇదే తొలిసారి. కెరీర్‌లో అతడికిది 40వ టెస్టు శతకం. 2013 నుంచి ఆసీస్‌లో పర్యటిస్తోన్న రూట్.. అక్కడ ఇంతకుముందు ఆడిన 15 టెస్టుల్లో ఒక్కసారి కూడా మూడంకెల స్కోరును అందుకోలేకపోయాడు. ఈ టెస్టు ముందు వరకు కంగారూ గడ్డపై అతడి అత్యధిక స్కోరు 89. "రూట్ గొప్ప బ్యాటరని ఇప్పుడు ఆస్ట్రేలియన్లు కూడా అంగీకరించాల్సిందే" అని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ కుక్ అన్నాడు.

పోరాడాడిలా..: ఈ గులాబి బంతి టెస్టు తొలి రోజు ఇంగ్లాండ్ మెరుగైన స్కోరు సాధించిదంటే కారణం రూట్ పోరాటమే. ఆ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా, ఇన్నింగ్స్‌కు రూట్ వెన్నెముకలా నిలిచాడు. ఇంగ్లాండ్ ఆరంభం పేలవం. స్టార్క్ ధాటికి డకెట్ (0), ఒలీ పోప్ (0) ఖాతా అయినా తెరవకుండానే వెనుదిరిగారు. ఆ దశలో క్రాలీతో కలిసి రూట్ జట్టును ఆదుకున్నాడు. ఇద్దరూ మూడో వికెట్‌కు 117 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. క్రాలీ ఔటైనా రూట్ చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించాడు. మరోవైపు బ్యాటర్లు ఔటవుతున్నా.. పట్టుదలగా నిలిచాడు. అతడు బ్రూక్ (31)తో నాలుగో వికెట్‌కు 54, స్టోక్స్ (19)తో అయిదో వికెట్‌కు 34, జాక్స్ (19)తో ఏడో వికెట్‌కు 40 పరుగులు జోడించాడు. ఓ దశలో ఇంగ్లాండ్ 264/9తో నిలవగా.. చక్కని సహకారాన్నిచ్చిన ఆర్చర్‌తో అభేద్యమైన ఆఖరి వికెట్‌కు రూట్ అమూల్యమైన 61 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

సంక్షిప్త స్కోరు... ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 325/9 (రూట్ 135 బ్యాటింగ్, క్రాలీ 76, ఆర్చర్ 32 బ్యాటింగ్, బ్రూక్ 31, స్టోక్స్ 19, జాక్స్ 19; స్టార్క్ 6/71, నెసర్ 1/43, బోలాండ్ 1/87)

అప్పుడు ఏ స్థానమైనా ఒక్కటే


రుతురాజ్

రాయ్‌పుర్: ఆరంభంలోనే కొన్ని షాట్లు ఆడగలిగితే ఓపెనింగ్ అయినా.. మిడిలార్డర్ అయినా పెద్ద తేడా కనిపించదని ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో రెండో వన్డేలో నాలుగో స్థానంలో వచ్చి సెంచరీ సాధించిన నేపథ్యంలో అతడిలా అన్నాడు. "మేనేజ్‌మెంట్ మద్దతు ఇవ్వడంతో నాలుగో స్థానంలో దిగి రాణించగలిగా. తొలి 10-15 బంతులు ఎలా ఆడతామనేది కీలకం. తర్వాత నా దృష్టిలో ఓపెనింగ్ అయినా మిడిల్ ఆర్డర్ అయినా ఒక్కటే. ఓపెనర్‌గా వచ్చినా.. వీలైనంత ఎక్కువ ఓవర్లు నిలదొక్కుకునేందుకే ప్రయత్నిస్తా. 10 ఓవర్ల తర్వాత ఎలా ఆడాలో, స్ట్రైక్ ఎలా రొటేట్ చేయాలో తెలుసు" అని రుతురాజ్ తెలిపాడు. కొన్ని సందర్భాల్లో వీలైనంత తక్కువగా ఆలోచించి.. ముందుకెళ్లాలని రుతురాజ్ పేర్కొన్నాడు. "ఏ విషయం గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. ప్రస్తుతం మనం ఆడే మ్యాచ్‌లపైనే దృష్టి పెట్టాలి. గత విజయ్ హజారే ట్రోఫీలో నేను రాణించలేకపోయా. అందుకే ఈసారి ఎలాంటి అవకాశం వచ్చినా సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నా. దక్షిణాఫ్రికాతో రెండో వన్డేలో ఆ అవకాశం వచ్చింది. కోహ్లి రూపంలో అనుభవజ్ఞుడైన భాగస్వామి దొరకడం కలిసొచ్చింది" అని రుతురాజ్ అన్నాడు.

ఆ సిక్స్‌తోనే అర్థమైంది


గావస్కర్

రాయ్‌పుర్: దక్షిణాఫ్రికాతో రెండో వన్డేలో విరాట్ కోహ్లి జోరు మీదున్నాడని అతడు ఆరంభంలో కొట్టిన సిక్స్‌తోనే అర్థమైందని దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ అన్నాడు. "దక్షిణాఫ్రికాతో రెండో వన్డేలో కోహ్లి సెంచరీ చేస్తాడని అనుకోలేదు కానీ.. ఓ మంచి ఇన్నింగ్స్ ఆడబోతున్నాడని ముందే అర్థమైంది. అతడు ఓ హుక్ షాట్ సిక్స్‌తో ఖాతా తెరిచాడు. సాధారణంగా విరాట్.. ఇన్నింగ్స్ మొదట్లో అలా గాల్లోకి షాట్ ఆడడు. రాంచి తొలి వన్డేలో సెంచరీ చేయడంతో వచ్చిన ఆత్మవిశ్వాసమది. అప్పుడే అనిపించింది అతడు జోరు మీద ఉన్నాడని. అలాంటి ఫామ్‌లో ఉన్న బ్యాటర్ సెంచరీ చేయడం సహజమే" అని సన్నీ తెలిపాడు. కోహ్లి మద్దతుతో రుతురాజ్ గైక్వాడ్ సైతం సత్తా చాటాడని.. మంచి భాగస్వామ్యాన్ని నెలకొల్పాడని గావస్కర్ ప్రశంసించాడు. "రుతురాజ్ ఎదుర్కొన్న తొలి బంతే బౌన్సర్. ఎలాగోలా దాన్ని బౌండరీకి పంపగలిగాడు. వెంటనే విరాట్ వచ్చి అతడితో మాట్లాడాడు. తర్వాత రుతురాజ్ ఆట మారింది. ఆత్మవిశ్వాసంతో ఆడాడు. విరాట్-రుతురాజ్ మధ్య సమన్వయం, వికెట్ల మధ్య పరుగెత్తిన తీరు కూడా చాలా బాగుంది. యువ ఆటగాడిని ఒక సీనియర్ నడిపించిన తీరు ముచ్చటగా అనిపించింది" అని సన్నీ పేర్కొన్నాడు.

భారత్‌కు సవాల్

నేడే బెల్జియంతో క్వార్టర్స్ ● రా.8 గంటల నుంచి


చెన్నై: జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో వరుస విజయాలతో జోరు మీదున్న భారత్‌కు సిసలు సవాల్. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో బలమైన బెల్జియంను భారత్ ఢీకొంటుంది. పూల్-బిలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన రోహిత్ బృందం.. ఏకంగా 29 గోల్స్ కొట్టింది. ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా ఇవ్వలేదు. కానీ సాంకేతికంగా బలంగా ఉండే బెల్జియంతో భారత్ కష్టపడక తప్పదు. ఈ ఐరోపా జట్టుపై పైచేయి సాధించాలంటే బలమైన డిఫెన్స్‌తో పాటు దూకుడు ప్రదర్శించాలి. ముఖ్యంగా వీలైనన్ని పెనాల్టీకార్నర్లను సద్వినియోగం చేసుకోవాలి. భారత్ ఇప్పటిదాకా చేసిన గోల్స్‌లో 18 ఫీల్డ్ గోల్స్. కేవలం 9 మాత్రమే పీసీల ద్వారా, 2 పెనాల్టీ స్ట్రోక్స్ ద్వారా సాధించింది. రోహిత్, అన్మోల్, శిలానంద్ లక్రా రాణించడం జట్టుకు కీలకం. మరోవైపు పూల్-డిలో మూడు మ్యాచ్‌లు ఆడి రెండింట్లో గెలిచిన బెల్జియం రెండో స్థానంతో క్వార్టర్స్ చేరింది. కానీ 22 గోల్స్ (11 ఫీల్డ్, 11 పెనాల్టీ కార్నర్లు) సాధించిన బెల్జియంను తక్కువ అంచనా వేస్తే భారత్‌కు చేదు అనుభవం తప్పదు. ముఖ్యంగా పెనాల్టీ కార్నర్లను గోల్స్ కాకుండా అడ్డుకోవడం చాలా ముఖ్యం. ఇతర క్వార్టర్స్‌లో స్పెయిన్‌తో న్యూజిలాండ్, ఫ్రాన్స్‌తో జర్మనీ, నెదర్లాండ్స్‌తో అర్జెంటీనా తలపడనున్నాయి.

దక్షిణాఫ్రికాతో మూడో వన్డే కోసం గురువారం విశాఖపట్నం చేరుకున్న రోహిత్ శర్మ విరాట్ కోహ్లి





వాళ్లతో పెట్టుకోవద్దు


రవిశాస్త్రి

ముంబయి: సీనియర్ స్టార్లు కోహ్లి, రోహిత్ శర్మ 2027 ప్రపంచకప్‌లో ఆడతారా లేదా అన్న చర్చ చాలా రోజులుగా నడుస్తున్న సంగతి తెలిసిందే. తాజా ప్రదర్శనతో వాళ్లు తమను తేలికగా పక్కన పెట్టలేని పరిస్థితిని కల్పించారు. కానీ కోచ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అగార్కర్‌లతో వాళ్లకు పొసగట్లేదన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. కోహ్లి, రోహిత్ గొప్ప ఆటగాళ్లని, వాళ్లతో పెట్టుకోవద్దని అన్నాడు. వ్యక్తిగత అజెండాతో వాళ్లను ఇబ్బంది పెట్టడమంటే కొరివితో తల గోక్కోవడమేనని చెప్పాడు. "ఆటలో వాళ్లిద్దరు తాతలు. వైట్‌బాల్ దిగ్గజాలు. వాళ్లను అనవసరంగా కెలకొద్దు. వాళ్లకు చిర్రెత్తుకొచ్చిందంటే అందరూ దెబ్బతింటారు" అని రవిశాస్త్రి ఓ ఇంటర్వ్యూలో అన్నాడు. "అనుభవాన్ని బజార్లో కొనుక్కోలేం. ఒకరు ఛేదనలో దిట్ట. ఇంకో ఆటగాడు వన్డేల్లో మూడు డబుల్ సెంచరీలు కొట్టాడు" అని చెప్పాడు.

రో-కో భవిష్యత్తును వాళ్లు నిర్ణయిస్తున్నారు... భజ్జీ: భారత జట్టు చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌పై మాజీ స్పిన్నర్ హర్భజన్‌సింగ్ పరోక్షంగా విమర్శలు గుప్పించాడు. కెరీర్‌లో పెద్దగా సాధించని వ్యక్తులు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి భవిష్యత్తును నిర్ణయిస్తుండటం దురదృష్టకరమని భజ్జీ అన్నాడు. "పెద్ద ఘనతలు లేని కొందరు ఆటగాళ్ల కెరీర్‌లను శాసిస్తుంటారు. నా విషయంలోనూ ఇలా జరిగింది. నా సహచరులలో చాలామందికి ఇలా జరిగింది. చాలా దురదృష్టకరం. దీని గురించి ఎప్పుడూ మాట్లాడం.. చర్చించం. విరాట్ కోహ్లి లాంటి ఆటగాడు అద్భుతంగా రాణిస్తుంటే చాలా సంతోషంగా ఉంది. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు. వాళ్లిద్దరు పరుగులు సాధిస్తున్నారు. కెరీర్‌లో పెద్దగా సాధించని వ్యక్తులు రో-కో భవిష్యత్తును నిర్ణయిస్తుండటం దురదృష్టకరం" అని భజ్జీ తెలిపాడు.

భారత బ్యాడ్మింటన్‌లో మహిళల డబుల్స్‌లో దూసుకెళ్తోంది పుల్లెల గాయత్రి. ట్రీసా జాలీ జంటగా అంతర్జాతీయ స్థాయిలో స్థిరంగా రాణిస్తోంది. తాజాగా సయ్యద్ మోదీ టోర్నీలో గాయత్రి ద్వయం టైటిల్‌తో మెరిసింది. నాన్న గోపీచంద్ మాటల స్ఫూర్తితోనే రాణిస్తున్నానని ఆమె తెలిపింది. పునరాగమనం, ట్రీసాతో ప్రయాణం తదితర విషయాలపై గాయత్రి ఏం మాట్లాడిందంటే..

నాన్న మాటలు ఆత్మవిశ్వాసాన్నిచ్చాయి



గాయత్రి

దిల్లీ

'ఓపిగ్గా వేచి చూసినందుకు, కష్టాన్ని నమ్మినందుకు సయ్యద్ మోదీ టైటిల్ రూపంలో బహుమతి దక్కింది. నా ఆట ఇప్పుడు సరైన మార్గంలో ఉంది. భుజం గాయం తర్వాత పునరాగమనం చేయడం చాలా సంతోషంగా అనిపించింది. సయ్యద్ మోదీ టోర్నీకి ముందు ఈ గాయం చాలా ఇబ్బంది పెట్టింది. మకావు టోర్నీలోనూ కష్టంగానే ఆడాను. ఆ టోర్నీ తర్వాత రెండు నెలల విరామం వచ్చింది. ఆ సమయం క్లిష్టంగా గడిచింది. ఈ సమయంలో నాన్నే నన్ను నడిపించాడు. తాను గాయపడినప్పుడు ఎలాంటి పరిస్థితిని ఎదుర్కొన్నాడో.. దాని నుంచి ఎలా బయటపడాలో వివరించాడు. ఈ మాటలు స్ఫూర్తి నింపాయి. ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చాయి. ఏకాగ్రత కోల్పోకుండా, కోచ్‌లు, ఫిజియోలు చెప్పే విషయాలు పాటించేదాన్ని. వారి సలహాలు మానసికంగా బలపడేందుకు ఉపయోగపడ్డాయి. నేను గాయపడినప్పుడు ట్రీసా ఖాళీగా కూర్చోలేదు. ఆ ఫామ్ కొనసాగించడం కోసం హరిహరన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ ఆడింది. ఈ జంట తుర్కియే టోర్నీ టైటిల్ గెలిచింది.

బలాన్ని పెంచుకుంటే..: వచ్చే సీజన్‌కు ఇంకా సమయం ఉంది. ఈ విరామాన్ని బలం పెంచుకోవడం కోసం ఉపయోగించుకోవాలి. మిగిలిన ప్లేయర్లతో పోలిస్తే శారీరకంగా కాస్త బలహీనంగా ఉన్నా. నేను, ట్రీసా రాబోయే అయిదు నెలలు బలం, చురుకుదనాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టాలి. ర్యాంకు (ప్రస్తుతం 13) విషయంలోనూ మెరుగుపడాలి. స్థిరంగా రాణించి టైటిల్స్ గెలుస్తూ టాప్-10లోకి రావడం లక్ష్యంగా చేసుకున్నాం. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ సత్తా చాటాలనుకుంటున్నాం. తద్వారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించొచ్చు. స్థిరంగా ఆడడం ఇప్పుడు మాకో సవాల్.

ట్రీసాతో ఆ అవగాహన ఉంది: ట్రీసాకు నాకు మధ్య మంచి సమన్వయం ఉంది. మా ఇద్దరి బలాబలాలపై స్పష్టత ఉంది. ట్రీసా ఎప్పుడు దూకుడుగా ఆడుతుందో ముందే తెలిసిపోతుంది. నేను ఎప్పుడు అటాకింగ్ చేస్తానో ఆమెకు తెలుసు. ఏదైనా అస్పష్టత ఉంటే వెంటనే మాట్లాడుకుని సరిదిద్దుకుంటాం. ఇదే మమ్మల్ని క్లిష్ట పరిస్థితుల్లోనూ ముందుకు నడిపించింది. వరుసగా టోర్నీలు గెలవడం బ్యాడ్మింటన్‌లో అంత తేలిక కాదు. కానీ మేం ఆ సవాల్‌ను స్వీకరించాం. ఒక్కో టోర్నీపైనే దృష్టి పెట్టాం. జోరు తగ్గకుండా చూసుకోవడం ముఖ్యం.


లేథమ్

లేథమ్, రచిన్ సెంచరీలు..

కివీస్ 417/4

క్రైస్ట్‌చర్చ్: వెస్టిండీస్‌తో మొదటి టెస్టుపై ఆతిథ్య న్యూజిలాండ్ పట్టుబిగించింది. కెప్టెన్ టామ్ లేథమ్ (145; 250 బంతుల్లో 12×4), రచిన్ రవీంద్ర (176; 185 బంతుల్లో 27×4, 1×6) సెంచరీలతో కదంతొక్కడంతో కివీస్ భారీస్కోరు దిశగా దూసుకెళ్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 32/0తో గురువారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లకు 417 పరుగులు సాధించింది. లేథమ్, రచిన్ మూడో వికెట్‌కు 279 పరుగులు జోడించి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. విండీస్ బౌలర్లలో కీమర్ రోచ్ (2/61), ఒజయ్ షీల్డ్స్ (2/64) సఫలమయ్యారు. మరో రెండ్రోజుల ఆట మిగిలివున్న ఈ మ్యాచ్‌లో ప్రస్తుతం కివీస్ ఖాతాలో 481 పరుగులు ఉన్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 231 పరుగులు చేయగా.. వెస్టిండీస్ 167 పరుగులకే ఆలౌటైంది.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం డిసెంబరు 5, 2025

తారల తళుకులు




హీరో తేజ సజ్జా, హీరోయిన్ మీనాక్షి చౌదరిలు గురువారం నగరంలో సందడి చేశారు. బెంజిసర్కిల్ సమీపంలోని చంద్రమౌళిపురంలో ఏర్పాటు చేసిన ఓ సిల్క్స్ షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వారిని చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. **- న్యూస్‌టుడే, బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ)**

చూస్తే తీగలు.. తాకితే నాగులు..



లారీ పైకెక్కి విద్యుత్తు తీగలను గమనించకుండా ప్రమాదకరంగా తాళ్లతో లోడును ఎలా కడుతున్నారో చూడండి. పైగా చేతిలో ఇనుప రాడ్డు కూడా ఉంది. తీగలకు తగిలితే ఏమిటి పరిస్థితి. హనుమాన్‌పేటలో ప్రైవేటు ట్రావెల్స్ ఏజెన్సీలు ఉండడంతో బస్సులు, లారీలు వరుసగా నిలుపుతారు. బస్సులు, లారీలపైన లోడు కట్టే సమయంలో పైన విద్యుత్తు తీగలను గమనించకుంటే జరిగే ప్రమాదాన్ని ఊహించుకోవచ్చు. తస్మాత్ జాగ్రత్త. **- ఈనాడు, అమరావతి**


డప్పుకొడుతూ..


కూచిపూడి నృత్య ప్రదర్శన


పిల్లనగ్రోవి వాయిస్తూ..

ఉరకలెత్తిన ఉత్సాహం.. ఎగసిపడిన తరంగం

అట్టహాసంగా ప్రారంభమైన కృష్ణాతరంగ్

జానపద నృత్యాలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, సంగీత గానం ఇలా అనేక ప్రదర్శనలు, యువత కేరింతలతో కృష్ణా విశ్వవిద్యాలయం హోరెత్తిపోయింది. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కృష్ణా తరంగ్-2025 కార్యక్రమం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. సంగీతం, డ్యాన్స్, మిమిక్రీ, వివిధ రకాల వాయిద్యాల ప్రదర్శన, క్విజ్ తదితర విభాగాల్లో విశ్వవిద్యాలయ పరిధిలోని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రధానంగా నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయా కళాశాలల విద్యార్థులు ఒకరితో ఒకరు పోటీపడుతూ చేసిన ప్రదర్శనలు ఆహూతుల మన్ననలు అందుకున్నాయి. తోటి విద్యార్థులు చప్పట్లు చరుస్తూ, ఈలలు వేస్తూ సందడి చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం కోలాహలంగా కనిపించింది. **- న్యూస్‌టుడే, కృష్ణా విశ్వవిద్యాలయం (మచిలీపట్నం)**


గిరిజన నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్న దుర్గామల్లేశ్వరి కళాశాల విద్యార్థులు


భక్తిగీతానికి అమ్మోరు నృత్యంతో అలరించిన పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

ఒప్పుకోవద్దు ఓటమి.. వదులుకోవద్దు ఓరిమి..


సమస్యలు అధిగమించలేక.. బలవన్మరణం

ఈనాడు, అమరావతి

ప్రేమ విఫలం.. అనారోగ్య సమస్యలు.. తల్లిదండ్రులు మందలించారని.. ఇలా పలు కారణాలతో ఒత్తిడికి లోనై చాలా మంది ప్రాణాలు తీసుకుంటున్నారు. ఎంతో విలువైన జీవితాన్ని అర్ధంతరంగా ముగిస్తున్నారు. ఈ తరహా ఘటనలు ఇటీవలి కాలంలో జిల్లాలో పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి.

క్షణికావేశంలో నిర్ణయం.. నగరంలోని ఓ సంస్థలో పనిచేస్తున్న యువతికి ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇది ప్రేమ వరకు వెళ్లింది. పెళ్లి చేసుకోవాలని వీరిద్దరు నిర్ణయించుకున్నారు. వీరి పెళ్లికి పెద్దల నుంచి ఆమోదం లభించకపోవడంతో ఇటీవల ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

★ **ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక** చదువుపై సరిగా దృష్టి సారించడం లేదు. నిత్యం మొబైల్ చూస్తుండడంతో ఇటీవల ఆమె తల్లి గట్టిగా మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ప్రాణం తీసుకుంది.



అనారోగ్య సమస్యలతోనే ఎక్కువగా.. ఎన్సీఆర్‌బీ తాజా గణాంకాల ప్రకారం నగర కమిషనరేట్ పరిధిలో మొత్తం 577 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో పురుషుల సంఖ్య ఎక్కువగా ఉంది. 455 మంది పురుషులు, 122 మంది మహిళలు ఉన్నారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటూ 201 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో పురుషులు 147 మంది, మహిళలు 54 మంది ఉన్నారు. కుటుంబ సంబంధిత సమస్యలతో 163 మంది తనువు చాలించారు. ఆర్థికంగా తీవ్ర కష్టాలు ఎదుర్కొని దివాలా తీయడం, అప్పులపాలవడంతో 115 మంది ప్రాణం తీసుకున్నారు.

కుంగుబాటుతో నిర్ణయం.. సమస్యలు ఎదురైనప్పుడు వ్యక్తిలోని క్షణికావేశం ఆత్మహత్యలకు దారితీస్తోంది. ముఖ్యంగా యువతలో జీవితంపై సరైన దృక్పథం లేకపోవడమూ కారణమే. యువతలో ప్రేమ విఫలం కావడం, తమ పెళ్లికి ఆమోదం లభించలేదని తొందరపాటు నిర్ణయం తీసుకుంటున్నారు. వివాహేతర సంబంధాలూ కుటుంబాల్లో గొడవలకు కారణమవుతున్నాయి. భార్యాభర్తలకు తమ మధ్య బంధాలపై సరైన అవగాహన ఉండడం లేదు.

★ వ్యాపారం, వ్యవసాయం వంటి వాటిల్లో అప్పులు పెరిగిపోయి, విద్యార్థులు పరీక్షల్లో తప్పామని, చదువుల్లో వెనుకబడ్డామని జీవితంపై విరక్తితో ప్రాణం తీసుకుంటున్నారు. సమస్యలు ఎదురైనప్పుడు ఆందోళనతో ఆత్మస్థైర్యం దెబ్బతిని, విశ్లేషణశక్తి కొరవడుతుంది.

ఇలా చేస్తే.. ● తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. ● సమస్య ఏదైనా వివేకంతో ఆలోచించాలి. ● ఇతరులెలా అధిగమిస్తున్నారో గమనించాలి. ● కుటుంబ సభ్యులు లేదా స్నేహితులతో సమస్యను పంచుకోవడం ద్వారా కుంగుబాటు నుంచి బయటపడవచ్చు.

6న యువతులకు ఉద్యోగ మేళా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో నగరంలోని ఆంధ్రా లయోలా డిగ్రీ కళాశాలలో ఈనెల ఆరో తేదీ శనివారం ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా (కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల వయసులోపు యువతులు (మహిళలు) అర్హులని పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీ టాటా ఎలక్ట్రానిక్స్ వారు పాల్గొంటున్నట్లు వివరించారు. ఇందులో ఎంపికైన వారికి నెలకు రూ.19,000ల నుంచి రూ.21,000 వరకు జీతం, ఉచిత వసతి, భోజన సదుపాయాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లింక్‌లో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలి. రెజ్యూమ్ (బయోడేటా)తో పాటు ఆధార్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరు, పాన్, సర్టిఫికెట్ల నకళ్లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు రామకృష్ణను (చరవాణి నంబరు 97018 34062) సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువతులకు విజ్ఞప్తి చేశారు.

అమ్మానాన్నలకు స్వాగతం!

మెగా పీటీఎం-3.0 నేడు

విజయవాడ సిటీ: కూటమి ప్రభుత్వం కొలువుదీరాక.. సర్కారు పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. వసతుల కల్పన.. మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం పంపిణీ వంటివి నిర్వహిస్తోంది. ఇక్కడ చదివే పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు పరీక్షల్లో వస్తున్న మార్కులు, ప్రతిభ. తదితరాలను తెలిపేందుకు మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం) ఇప్పటికే రెండుసార్లు నిర్వహించింది. వీటితో సత్ఫలితాలు రావడంతో మూడోసారి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు.

రారండోయ్..

❖ విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, అధికారులు, దాతలను ఆహ్వానిస్తారు. ❖ తర్వాత ఒక్కో విద్యార్థి ప్రోగ్రెస్, బేస్‌లైన్ పరీక్షలో ప్రతిభను ఉపాధ్యాయుడు తల్లిదండ్రులకు వివరిస్తారు. ❖ విద్యార్థి ఇంకా మెరుగ్గా రాణించాలంటే తల్లిదండ్రుల ఎలా సహకరించాలో తెలియజేస్తారు. ❖ లీప్ యాప్‌ను ఎలా ఇన్‌స్టాల్ చేయాలో వీడియో ద్వారా వివరిస్తారు. ❖ మంచి, చెడు స్పర్శలు, కెరీర్ గైడెన్స్, మెంటల్ హెల్త్, స్కిల్ ఎడ్యుకేషన్‌పై వీడియోలు చూపిస్తారు. తర్వాత వేదికలపైకి అతిథులను ఆహ్వానించి ప్రసంగాలు.. ఆపై మధ్యాహ్న భోజనం చేస్తారు.

పాఠశాలలు...	
ప్రాథమిక	682
ప్రాథమికోన్నత	23
ఉన్నత	208
విద్యార్థులు	97,000



వికాస"మస్తు".. ❖ విద్యార్థులు.. సాంస్కృతిక ప్రదర్శనలు, గ్రంథాలయ పుస్తకాలు, క్రీడా పరికరాలు, సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. ❖ ఈ కార్యక్రమంతో పిల్లలు ఎలా చదువుతున్నారు? ప్రతిభ స్థాయిపై అవగాహన వస్తుంది. ❖ లోపాలను సరిదిద్ది.. అత్యధిక మార్కులు సాధించేలా తీర్చిదిద్దడానికి ఉపకరిస్తుంది. ❖ మరోవైపు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగవుతాయి. ❖ విద్యా విషయాలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ పెరిగి.. విద్యార్థి వికాసానికి దోహదం చేస్తుంది.

చెరకు క్రషింగ్ ప్రారంభం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారంలో 2025-26 సీజన్ క్రషింగ్‌ను గురువారం రాత్రి కర్మాగారం యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రాంగణంలో సీతారామదాసు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు చెరకు సాగు విస్తీర్ణం పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్మిక, కర్షక సంక్షేమమే లక్ష్యంగా కర్మాగారం యాజమాన్యం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కేసీపీ ఏరియా చెరకు రైతుల సంఘం అధ్యక్షుడు ఎస్వీ కృష్ణారావు, నాయకులు తిమ్మారెడ్డి, రత్నగిరిరావు, శివరామ్, మోహనరెడ్డి, కేసీపీ జీఎంలు వి.వి.పున్నారావు(కేన్), వసంతరావు(ఆర్థిక విభాగం), చంద్రబాబు(డిస్టిలరీ), డీజీఎంలు వెంకటేశ్వర్లు, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడు చెదిరింది.. గుండె బరువైంది!

ఇళ్లను కాపాడుకోలేక పోయామని బాధితుల గగ్గోలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే

రూపాయి రూపాయి కూడబెట్టుకున్న నిరుపేద, మధ్య తరగతి జీవితాలు వారివి. కలల గూడు సొంతం చేసుకోవాలని కొండంత ఆశతో ఇళ్లను కట్టుకున్నారు. అధికారులు వాటిని కూల్చివేస్తామంటూ రాగా ఆపాలంటూ వేడుకున్నా వీలుకాలేదు. రెండు దశాబ్దాల పాటు ఆత్మీయంగా చూసుకున్న పొదరిళ్లు కళ్లెదుటే కుప్పకూలడంతో గుండెలవిశాయి. ఇళ్లే లేకుంటే బ్యాంకు రుణాలు ఎలా తీర్చాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈసీలో ఎటువంటి అభ్యంతరాల్లేవని నిర్ధారించిన తర్వాత ప్లాట్ కొనుగోలు చేసినా వారికి కష్టాలు తప్పలేదు. ఇంటి పన్ను, కుళాయిలు, విద్యుత్తు కనెక్షన్ల కోసం రూ.వేలు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. విజయవాడ జోజినగర్‌లోని 42 ప్లాట్లలో నివాసం ఉంటున్న బాధితుల వేదన ఇది.


కూల్చిన ఆవాసాల వద్ద బాధితులు

ఖాళీ చేయమనడం అన్యాయం



ప్లాట్ల రిజిస్ట్రేషను సమయంలో పట్టించుకోని సొసైటీ సభ్యులు 15 ఏళ్ల తర్వాత తమను ఖాళీ చేయమనడం అన్యాయం. బ్యాంకు రుణం తీసుకుని రూ.లక్షలు ఖర్చు పెట్టి కొన్న స్థలంలో గృహం నిర్మించుకుంటే దాన్ని కూల్చారు. బ్యాంకు అధికారులకు మేము ఏమి సమాధానం చెప్పాలి. నగదు, ఇల్లు, ప్లాటు పోయి రుణం చెల్లించాలంటే భారమవుతోంది. **- లలిత కుమారి**

పెద్దలు స్పందించాలి



రిజిస్టరైన ప్లాటులో కార్పొరేషన్ అనుమతితో ఇంటి ప్లాను తీసుకొని నిర్మించుకుంటే దాన్ని కూల్చడం ఎంత వరకు సబబు. కుళాయి, విద్యుత్తు కనెక్షన్లు, ఇంటి పన్ను అన్నీ ఉన్నాయి. ఇళ్లను నేలమట్టం చేయడం తగదు. ప్రజాప్రతినిధులు ఈ విషయంపై స్పందించాలి. **- విజయలక్ష్మి**

తప్పని చెప్పే వారు లేరు



డిసెంబరు 31 వరకు తొందర పడొద్దని న్యాయస్థానం ఇచ్చిన స్టే ఉత్తర్వును పోలీసులు, కబ్జాదారులు ఎందుకు ఉల్లంఘించారో? సమాధానం చెప్పాలి. సామగ్రిని రోడ్డు మీద పడేసి ఇల్లు కూలుస్తుంటే తప్పని చెప్పే వారు కరవయ్యారు. సమయం ఇస్తే సర్దుకుంటాం అని చెప్పినా పట్టించుకోలేదు. **- ప్రవీణ్**

పశువులకూ.. వసతి గృహాలొస్తున్నాయ్!

ప్రయోగాత్మకంగా ఎన్టీఆర్ జిల్లాలో అమలు

ఈనాడు, అమరావతి

పశువులను వసతిగృహాల్లో పెట్టే.. యానిమల్ హాస్టల్ అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. స్థలం..సమయం లేని వారి పశువులను ఈ హాస్టళ్లల్లో పెట్టి ఆలనాపాలన వారే చూసుకునే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎన్టీఆర్ జిల్లాను ఎంపిక చేశారు.

ఒక్కో హాస్టల్‌కు 25 పశువులు..

✦ ప్రాథమికంగా రాష్ట్రంలో నియోజకవర్గానికో హాస్టల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎన్టీఆర్ జిల్లాలో ఏర్పాటు చేస్తున్నారు. నందిగామ మండలంలో ఏర్పాటు చేసేందుకు అధికారులు పరిశీలిస్తున్నారు.

✦ ఒక్కో హాస్టల్ అరెకరం స్థలంలో ఏర్పాటు చేయాలన్నది ఆలోచన. ఇందులో 20-25 పశువులు పట్టేలా నిర్మాణం చేపడతారు. మిగిలిన స్థలంలో గడ్డి అభివృద్ధి చేస్తారు. నిర్మాణానికి రూ.10లక్షల నిధులు ఉపాధిహామీ నుంచి విడుదల చేస్తారు.

✦ ఇవన్నీ ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. కొద్ది రోజులు నిర్వహించిన తర్వాత పాడి రైతులంతా సంఘాలుగా ఏర్పడి ఇలాంటి హాస్టళ్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. సొంత స్థలం ఉంటే సరే లేదంటే ప్రభుత్వమే స్థలం సమకూరుస్తుంది. షెడ్డు నిర్మాణానికి సైతం ఉపాధి హామీ నుంచి నిధులు సమకూర్చేలా అధికారులు సమాలోచన చేస్తున్నారు.

✦ గ్రామాల్లో ఆసక్తి ఉన్నవారు తమ పశువులను అక్కడికి తరలిస్తే వాటికి దాణా, గడ్డి, నీరు అన్నీ నిర్వాహకులు చూసుకుంటారు. ఉదయం సాయంత్రం వెళితే యజమానుల ముందే పాలు పితికి అప్పగిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహణకు అయ్యే ఖర్చు యజమానులు చెల్లించాల్సి ఉంటుంది.

కలశ జ్యోతులు.. కమనీయ కాంతులు


సింహ వాహనంపై ఊరేగుతున్న గంగా పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వర స్వామి

భవానీ దీక్షల విరమణను పురస్కరించుకొని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో దీక్షాధారులు కలశజ్యోతుల ఊరేగింపును గురువారం నిర్వహించారు. దారి పొడవున జై భవానీ.. జైజై భవానీ, అమ్మ దుర్గమ్మ.. జగన్మాత దుర్గమ్మ అంటూ అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. **- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి**


కలశజ్యోతుల ప్రదర్శనలో భక్తులు

సత్యవర్ధన్ అపహరణ కేసు..

వంశీ అనుచరుడు రామాంజనేయులు అరెస్టు


రామాంజనేయులు

ఈనాడు, అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో వల్లభనేని వంశీ అనుచరుడైన యర్రంశెట్టి రామాంజనేయులు అలియాస్ రాము అలియాస్ పొట్టి రాము (ఏ9)ను పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలోని ఆయన ఇంట్లో ఉండగా గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. గత పది నెలలుగా నిందితుడు పోలీసులకు దొరక్కుండా అజ్ఞాతంలో ఉన్నాడు. ఇటీవల విజయవాడ ఎస్సీ, ఎస్టీ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. విచారణ అనంతరం నిందితుడిని శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కోర్టులో న్యాయాధికారి ఎదుట హాజరుపరిచే అవకాశం ఉంది.

కిడ్నాప్‌లో కీలకపాత్ర.. .. తెదేపా కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారు సత్యవర్ధన్‌ను బెదిరించి కేసును ఉపసంహరించుకునేలా చేయడంలో రామాంజనేయులు కీలక పాత్ర పోషించాడు. సత్యవర్ధన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో హనుమాన్ జంక్షన్ తీసుకెళ్లి బెదిరించాడు. వాంగ్మూల పత్రాలపై సంతకాలు తీసుకున్నాడు. మరుసటి రోజు బాధితుడిని విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లి.. ఈ కేసుకు తనకు సంబంధం లేదనీ, ఘటన జరిగిన సమయంలో తాను అక్కడ లేనని అతనితో న్యాయాధికారి ఎదుట వాంగ్మూలం ఇప్పించాడు. వాంగ్మూలం ఇచ్చిన అనంతరం.. ఫిబ్రవరి 10న సత్యవర్ధన్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్లి.. మై హోమ్ భుజాలో వంశీని కలిపించారు. ఆ రాత్రి అక్కడే ఉంచి బెదిరించారు. అనంతరం 11న ఏపీ 40 బీజీ 5005 నంబరు గల కారులో మిగిలిన నిందితులతో కలిసి విశాఖపట్నం తీసుకెళ్లాడు.

వైకాపా హయాంలో గన్నవరంలో అక్రమాలు...

వైకాపా హయాంలో వల్లభనేని వంశీ గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అతని పలుకుబడిని ఉపయోగించుకుని అనేక అక్రమాలకు పాల్పడ్డాడు. బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన రామాంజనేయులు.. బాపులపాడు, గన్నవరం మండలాల్లో సీఆర్డీఏ అనుమతి లేకుండా కుప్పలుతెప్పలుగా లే ఔట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. నియోజకవర్గంలో వేసిన జగనన్న కాలనీల కోసం సేకరించిన భూముల విషయంలో భారీగా దండుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. అటు అధికారులు, ఇటు రైతులకు మధ్యవర్తిగా వ్యవహరించి సొమ్ము చేసుకున్నాడు. అంపాపురంలో నిర్వహించిన సంక్రాంతి జూద శిబిరం నిర్వహణలో కీలక భూమిక పోషించాడు. వివాదాల్లో ఉన్న ఆస్తులను గుర్తించి తక్కువ ధరకు చేజిక్కుంచుకునేవాడు.

జిల్లాలో నూతన ఇసుక రేవులు.. 7

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ప్రస్తుతం 9 ఇసుక రేవుల్లో 7.27 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. త్వరలో మరో ఏడు కొత్త రేవులు అందుబాటులోకి రానున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఇసుక విధానాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉల్లంఘనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి 6వ జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని గురువారం వర్చువల్‌గా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరా జరిగేలా పని చేయాలన్నారు. నూతన రేవులకు సంబంధించి కృష్ణా నది, మునేరు వాగు పరిధిలో జగ్గయ్యపేట, చందర్లపాడు మండలాల్లో రెండేసి, కంచికచర్ల మండలంలో మూడు రేవులు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా కాకుండా పోలీసు శాఖ సహకారంతో పటిష్ఠ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 248 కేసులను నమోదు చేయగా, 440 మందిని అరెస్టు చేసినట్టు వివరించారు. జేసీ ఎస్.ఇలక్కియా, గనుల శాఖ డీడీ శ్రీనివాసరావు, సమన్వయ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దాత ఆర్‌వీఆర్ చౌదరికి రసీదు అందిస్తున్న మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే మండలి. పక్కన కొనకళ్ల నారాయణ, కొమ్మారెడ్డి పట్టాభి, ఆలయ డీసీ వరప్రసాదరావు

భక్తుల ఇలవేల్పు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

50 కిలోల వెండితో తయారుచేసిన మండపం, పానవట్టం బహూకరణ



అలంకరణలో మండపం, పానవట్టం

మోపిదేవి, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా మోపిదేవిలోని మోహినీపుర క్షేత్రం భక్తుల పాలిట కల్పతరువని, భక్తుల కోర్కెలు శీఘ్రగతిన నెరవేర్చే ఇలవేల్పు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అని హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వీఆర్ గ్రూపు అధినేత, ఆర్‌వీఆర్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఛైర్మన్ రావి వీరరాఘవ చౌదరి, సౌభాగ్యలక్ష్మి దంపతులు పేర్కొన్నారు. స్వామివారికి రూ.కోటి విలువ చేసే 50 కిలోల వెండితో తయారు చేయించిన మండపం, పానవట్టాన్ని గురువారం వేదమంత్రోచ్ఛరణల మధ్య ఆలయానికి బహూకరించారు. రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, స్వచ్ఛాంధ్ర మిషన్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, తెదేపా పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు ద్వారా స్వహస్తాలతో దాత దంపతులు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావుకు అందించారు. శిలాఫలకం ఆవిష్కరించారు. తొలుత 11 మంది రుత్వికులు, ఆలయ ప్రధానార్చకులు బుద్ధుపవన్‌కుమార్ శర్మ, వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్యశర్మ, బాలకృష్ణ, బండ్లమూడి మణిదీప్‌లు దాత కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. నాగదేవత పుట్టకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు సమర్పించారు.

నగరంలో చిరు జల్లులు

ఎన్టీఆర్ కలెక్టరేట్: దిత్వా తుపాను ప్రభావంతో విజయవాడలో చిరు జల్లులు పడ్డాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ గాంధీనగర్, భవానీపురం 1.8, ఇబ్రహీంపట్నం 1.4, పటమటలో 1.2 మిల్లీ మీటర్ల మేర వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. తుపాను ప్రభావంతో జిల్లాలో ఆకాశం మేఘావృతమైంది.

ఈనాడు క్రికెట్‌కు వేళాయె..

యువ ప్లేయర్లకు అవకాశం ● ఈఎస్‌ఎల్ దరఖాస్తులకు ఆఖరి తేదీ డిసెంబరు 8



తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రికెట్లో సంచలనం.. ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్). గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులకు వేదికగా నిలుస్తూ.. కళాశాలల స్థాయిలో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ టోర్నీగా గిన్నిస్ బుక్ రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన ఈఎస్ఎల్ పండగకు సమయం ఆసన్నమైంది. ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఈఎస్ఎల్ క్రికెట్ టోర్నీ డిసెంబరు 12న ప్రారంభమవనుంది. ఆసక్తిగలవారు సోమవారం లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఈనాడు – హైదరాబాద్

కళాశాలల స్థాయిలో రికార్డులు, సంచలనాలతో చరిత్ర సృష్టించిన ఈనాడు క్రికెట్ పండగ మళ్లీ వచ్చేసింది. ఈనాడు క్రికెట్ 15వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ.. సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఫార్మా కళాశాలలు ఈఎస్ఎల్-2025లో పాల్గొనవచ్చు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో జరుగుతాయి. అమ్మాయిల క్రికెట్లో జిల్లా స్థాయి క్రికెట్ సంఘాల తరఫున మహిళల జట్టు ఈఎస్ఎల్‌లో ప్రాతినిధ్యం వహించొచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదిక. అనంతరం ప్రాంతీయ స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు ఉంటాయి. ప్రాంతీయ స్థాయి విజేతలు అమరావతిలో తుది దశ పోటీల్లో తలపడతాయి. తుది దశ పోటీ లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు.

ముఖ్య విషయం

మ్యాచ్ సమయంలో రెండు జట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు పదో తరగతి మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు తప్పనిసరిగా చూపించాలి. అమ్మాయిలు ఆధార్ కార్డు లేదా పుట్టిన రోజు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్లు, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్లు, అండర్ గార్డ్, హ్యాండ్ గ్లోవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ ధరించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

వయసు నిబంధన

● బాలురలో జూనియర్స్- 18 ఏళ్లలోపు (2007, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● సీనియర్స్- 25 ఏళ్లలోపు (2000, ఆ తర్వాత జన్మించిన వాళ్లు). ● అమ్మాయిల క్రికెట్లో క్రీడాకారిణుల కనీస వయసు 16 ఏళ్లు.. గరిష్ఠ వయసు 24 ఏళ్లు (2001 నుంచి 2009 మధ్య జన్మించిన వారే అర్హులు)

రిజిస్ట్రేషన్ కోసం

☛ రిజిస్ట్రేషన్ కోసం www.eenadu.net వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపల్ సంతకం, రబ్బరు స్టాంప్‌తో 'ఈనాడు' కార్యాలయంలో అందజేయాలి. ఈనాడు కార్యాలయంలో కూడా దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి.

☛ మరిన్ని వివరాలకు www.eenadu.net లో చూడగలరు

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా

పంపాల్సిన చిరునామా
ఈనాడు స్పోర్ట్స్ లీగ్, ఈనాడు ఈవెంట్స్, ఈనాడు ఆఫీసు, గూడవల్లి విలేజ్, విజయవాడ రూరల్ మండలం, ఎన్టీఆర్ జిల్లా-521104
వివరాలకు: 9121170928, 91549 91113
(ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు) ఫోన్ నంబర్లలో సంప్రదించొచ్చు.

ఈఎస్ఎల్‌లో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న ప్రతి జట్టు ఈ కింద పేర్కొన్న డాక్యుమెంట్లను ఈనాడు కార్యాలయానికి పంపాలి.

క్రికెట్ జట్ల నమోదు ఇలా..

పురుషులు

డాక్యుమెంట్-1: కళాశాల లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ఆటగాళ్ల ఫొటోలు అంటించిన లిస్ట్‌పై ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర ప్రిన్సిపల్ సంతకం, కాలేజ్ సీల్/ ప్రిన్సిపల్ స్టాంప్‌తో పంపాలి.

మహిళలు

డాక్యుమెంట్-1: అసోసియేషన్ లెటర్ హెడ్‌పై టీమ్ మెంబర్ల పేర్లు, తరగతి రాసి అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-2: ప్లేయర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, పుట్టిన తేదీ, తరగతి వంటి వివరాలతో పాటు ప్లేయర్ ఫొటోలు అంటించిన లిస్ట్‌పై అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-3: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు/ కార్యదర్శి సంతకం, సీల్/ స్టాంప్‌తో పంపాలి.

డాక్యుమెంట్-4: గైడ్‌లైన్స్‌తో ఉన్న డిక్లరేషన్ ఫామ్ చివర తల్లిదండ్రుల సంతకం, ఫోన్ నంబరుతో పంపాలి.

నాకౌట్ పద్ధతిలో.. జిల్లా, ప్రాంతీయ, తుది దశల్లో పోటీలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్‌కు ఒకే జిల్లాగా పోటీలు ఉంటాయి.

ఎస్సీ.. ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం పటిష్ఠంగా అమలు



నూతన కమిటీ సభ్యులతో కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీలపై వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సదరు చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నగరంలోని కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. వేధింపుల కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పని చేయాలని సభ్యులను సూచించారు. ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే తెలియజేయాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పాత కమిటీ గడువు ముగియడంతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీసీపీ సరిత మాట్లాడుతూ.. జిల్లాలో 49 కేసులు విచారణ దశలో ఉన్నట్లు తెలిపారు.

పీఎం ఏజీవై కింద 82 గ్రామాలు: ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎం ఏజీవై) కింద మూడు దశల్లో జిల్లాలో 82 గ్రామాలను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న గ్రామాలను సదరు పథకం కింద అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, ఏసీపీలు పావన్ కుమార్, దుర్గారావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీవో విజయకుమార్, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు దీక్షిత, బి.కీర్తి, కమిటీ అనధికార సభ్యులు బి.రాజు, పి. ఆనంద కీర్తి, ముత్యాల రాణి, వై.వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నయన మనోహరంగా కలశజ్యోతుల ఊరేగింపు



జ్యోతులతో వెళ్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ తదితరులు



సందడిగా కోలాట ప్రదర్శన

ఇంద్రకీలాద్రి, సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణను పురస్కరించుకొని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో దీక్షాధారులు కలశజ్యోతుల ఊరేగింపు గురువారం నిర్వహించారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రి వరకు ప్రదర్శన సాగింది. శివరామకృష్ణ క్షేత్రంలో ఉత్సవమూర్తులకు విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండ ఉమామహేశ్వరరావు, దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దీక్షాధారులతో కలిసి ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు మాట్లాడుతూ 1981 నుంచి భవానీ దీక్షల విరమణ సందర్భంగా కలశజ్యోతుల ఊరేగింపును నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడిందని చెప్పారు. సత్యనారాయణపురం నుంచి గాంధీనగర్, ఏలూరు రోడ్డు, బందరు రోడ్డు, పోలీసు కంట్రోల్ రూమ్, వినాయకుడి గుడి పైవంతెన, రథం సెంటర్ మీదుగా ఊరేగింపు ఇంద్రకీలాద్రికి చేరింది. ఇందులో కోలాట, నృత్య బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కనకదుర్గానగర్‌లో భవానీ దీక్షాధారులు తీసుకొచ్చిన కలశజ్యోతులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఉంచి లిఫ్టు, మెట్ల మార్గంలో దీక్షాధారులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇందులో పాల్గొన్న దీక్షాధారులకు అధికారులు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు బడేటి ధర్మారావు, గూడపాటి సరోజనీ దేవి, శ్రీనివాసరావు, రాఘవ రాజు, వెలగపూడి శంకర్ బాబు పాల్గొన్నారు.

ఇళ్ల కూల్చివేతపై కొనసాగుతున్న ఆందోళన

కలెక్టర్‌ను కలిసిన బాధితులు



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బాధితుల నిరసన

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే- విద్యాధరపురం, భవానీపురం: విజయవాడ జోజినగర్‌లో న్యాయస్థానం ఆదేశాలతో కూల్చేసిన 42 ఇళ్ల వ్యవహారం అంశంపై ఆందోళన కొనసాగుతోంది. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని ప్లాట్లు కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న పేద గృహాలను కూల్చడంపై బాధితులు ఆందోళన బాట పట్టారు.

న్యాయం చేయాలి: భవానీపురంలోని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన నిర్వహించారు. అన్యాయంగా తమ గృహాలను కూల్చారని, తప్పుడు పత్రాలు సృష్టించి న్యాయస్థానంలో కేసులు వేశారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేయాలని కార్యాలయం వద్దనే బైఠాయించారు.

అండగా నిలుస్తాం: బాధితులకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ అన్నారు. ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి బాధితులతో మాట్లాడారు. న్యాయబద్ధంగా ప్లాట్లు కొని ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఏళ్లతరబడి నివాసం ఉంటున్న వారిని గృహాల నుంచి ఖాళీ చేయించడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని చెప్పారు.

విచారణ చేయిస్తాం: బాధితులు ఆదివారం కలెక్టర్ లక్ష్మీశను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. బాధితులకు సంబంధించిన స్థల పత్రాలను పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విచారణ చేయిస్తానని తెలిపారు.



బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 లేయర్ ధర 107 ఏజెన్సీ ఫామ్ రేట్స్ - 228, స్కిన్‌లెస్ - 250, అమలాపురం: లిఫ్టింగ్ ధర - 149, లేయర్ 109 ఏజెన్సీ ఫామ్ రేట్స్ - 268 స్కిన్‌లెస్ - 294.

విద్యుత్తు శాఖ పనితీరుపై ఎమ్మెల్యే మండిపాటు



పైపులైన్ పగిలిన వీడియో చూపుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే: ఎ.కొండూరు మండలానికి కృష్ణా జలాలను తీసుకురావాలనే లక్ష్యంతో రూ.50 కోట్ల అంచనాతో పైపులైన్ పనులు చేస్తుంటే.. విద్యుత్తు శాఖ దానికి తూట్లు పొడుస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మండిపడ్డారు. గురువారం తిరువూరు మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన కృష్ణా జలాల సరఫరాకు ఏర్పాటు చేస్తున్న పైపులైన్ల పగిలిన వీడియోలను సభ్యులకు చూపించారు. విద్యుత్తు శాఖ తీరుతో పైపులు పగలడంతో రూ.మూడున్నర కోట్ల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. అనంతరం పలువురు సభ్యులు లేవనెత్తిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. శృంగవరపుకోట ఇబ్బందులపై పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి స్థలం పరిశీలించి సత్వరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ గద్దల భారతి, జడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఎంపీడీవో రవిబాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నావికాదళ మాజీ సైనికుల కుటుంబ సభ్యుల సదస్సు నేడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నావికాదళ మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో నేవీ హెడ్‌క్వార్టర్స్ ఈస్టర్న్ నావెల్ కమాండ్ ఐఎన్ఎస్ కళింగ అధికారులతో కలిసి నేవీ మాజీ సైనికులు, కుటుంబ సభ్యులకు ముఖాముఖి నిర్వహిస్తామని జిల్లా సైనిక సంక్షేమాధికారిణి కె.కల్యాణవీణ తెలిపారు. నేవీకి చెందిన మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల కోసం అమలు చేస్తున్న ఉపకారవేతనాలు, మ్యారేజ్ గ్రాంట్ పెన్షన్ల మంజూరు, పంపిణీలో ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన నేవీ మాజీ సైనికులు /వితంతువులు, వారి కుటుంబ సభ్యులు హాజరవ్వాలని ఆమె కోరారు.

NOTICE

As per the instructions given by my clients (1) Katarapu Rani wife of Katarapu Jaya Rao (2) Katarapu Suresh Babu Son of Katarapu Jaya Rao, (3) Yarasani Mariyamma Daughter of Katarapu Jaya Rao, (4) Katarapu Chanti Babu Son of Katarapu Jaya Rao. All of them are resident at Door No 24-161, Gollapudi, Vijayawada Rural Mandal, NTR District, A.P., India.

Whereas my first client Katarapu Rani's husband, and my remaining clients father Mr. Katarapu Jayarao is the absolute true and lawful owner of an extent of 250-0 Sq. Yards or 209-032 Sq. Mts of vacant site, situated at Surayapalem area in Re-Survey No 7/2A Situated at the Gollapudi Village, Vijayawada Rural Mandal, NTR District, that property was purchased from Sri. Kukutla Koteswara Rao, on 22-June-2000 and got the sale deed registered before the Sub-Registrar of Ibrahimpatnam, vide document No. 2304/2000 and entered into book No.1, and Sri. Kukutla Koteswara Rao has delivered the possession and title to Mr. Katarapu Jayarao on the same day. And enjoying the same in Mr. Katarapu Jayarao possession with absolute rights without any disputes whatsoever. The said Mr. Katarapu Jayarao died intestate on 20-October-2021. But above said document Layout plan number and Plot no are not mentioned

My claints acquired the plan and conducted survey of the plot in the year 2023, Plot No 19, an extent of 250 Sq. yards of site in re-survey No 7/2A situated at the Gollapudi Village, on the basis of layout plan bearing No 53/81/ASUDA, Plot No 19 was demarcated with stones in accordance with the layout plan bearing No 53/81/ASUDA belongs to File No. C3-1931/81. My claints are jointly enjoying the same in their possession with absolute rights without any disputes from anybody and with specific boundaries of Plot No 19, an extent of an extent of 250-0 Sq. Yards of vacant site I declare to all that, my clients are not getting any income from the below mentioned schedule property and decided to sell the property for sale and for the offer made by my clients, the purchaser Mr. Sompaka Mani Kumar son of Mohan Rao, resident at 24-175, Nallakunta, Gollapudi Village and others has agreed to purchase the below mentioned schedule property for a valuable consideration. If anybody has any objections in this conection over the scheduled property should intimate within one week from the date of this notice by registered post to the below mentioned address. I declare to all that the objections which come after seven days shall not bind my clients.

SCHEDULE: An extent of 250-0 Sq. Yards or 209-032 Sq. Mts, Plot No 19, bearing L.P No 53/81, Property situated at Surayapalem area, in re-survey No. 7/2A situated at the Gollapudi Village, within the limits of the Vijayawada Rural mandal, NTR district, within the jurisdiction of the Joint Sub-Registrar, Ibrahimpatnam and within the following **boundaries: EAST:** Plot No 26 belong to Katamneni Rangarao, **SOUTH:** Plot No 20 belong to Gudavalli Ramabhadra Acharlu and others, **WEST:** 33-0 feet wide Road, **NORTH:** Plot No 18 belong to Kota rajaiha and others. In between the above four boundaries an extent of **250-0 Sq. Yards or 209-032 Sq.mts** of vacant site, along with all easements rights was already agreed to sold by my clients to the purchaser Mr. Sompaka Mani Kumar and Others.

G. SIVA PRASADA RAJU B.Com., B.L.
ADVOCATE & NOTARY
23-5-6, Vandanapu Vari Street, Satyanarayanapuram,
VIJAYAWADA-520 011, Cell: 99480 84840

తిరువూరు

• తిరువూరు • మైలవరం

రైతు సంక్షేమమే ధ్యేయం


కార్యక్రమంలో తెదేపా నాయకులు, రైతులు

తిరువూరు, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు కిలారు విజయబిందు పేర్కొన్నారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని రోలుపడి గ్రామ సచివాలయం వద్ద రైతులతో కలిసి హర్షం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో 270 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.3.5 కోట్లను 24 గంటల్లోనే ఖాతాల్లో జమ చేశారని పేర్కొన్నారు.

డీఎల్‌డీవో కార్యాలయం ప్రారంభం

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురంలో డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) కార్యాలయాన్ని స్థానిక శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వెంకటరమణ, అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

★ పట్టణంలోని ఆరో వార్డులో డ్రైనేజీలో పూడిక పేరుకుపోయి మురుగు పారడం లేదని స్థానిక రాజశేఖర్ 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించి శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని నాలుగో వార్డులో డ్రైనేజీలో మురుగు పారక దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికుడు కృష్ణారావు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించి.. శుభ్రం చేయించారు. **- తిరువూరు టౌన్ న్యూస్‌టుడే** ★ మండలంలోని నరసాపురం ఎస్సీకాలనీలో వీధుల వెంట చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. పంచాయతీ ఈవో జీ.స్వాతి స్పందించి.. శుభ్రం చేయించారు. **- విస్సన్నపేట, న్యూస్‌టుడే**

? స్థానిక పులివాగు వంతెన దాటాక మైలవరం వెళ్లే ప్రధాన రహదారి వెంట మురుగు కాలువలు పూడిపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. -వెంకటేశ్వరరావు గ్రామస్థుడు. ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో కాలువలు పూడిక తీయించి దోమల నివారణకు చర్యలు చేపడతాం. **-వై.బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**
– జి.కొండూరు, న్యూస్‌టుడే

మద్దతు దక్కక.. మార్పు దిశగా..

పెరుగుతున్న విత్తన మొక్కజొన్న సాగు

మైలవరం, న్యూస్‌టుడే

సాధారణ మొక్కజొన్నకు మద్దతు ధర గగనంగా మారుతోంది. అష్టకష్టాలు పడి పండించిన ప్రభుత్వ వైఫల్యాలతోపాటు కొనుగోళ్లు పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకెళ్లాల్సి ఆధారపడడంతో సాగుపై కర్షకుల్లో నిరుత్సాహం ఆవహించింది. దాంతో వారు లాభాల మాట దేవుడెరుగు.. పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవని మూడింతలకు పైగా విత్తన మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు.

రబీలో ఆరుతడి పంటల్లో ప్రధానంగా గత నాలుగైదేళ్లుగా మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాల వరకు సాగు చేస్తుండగా, గత రెండేళ్ల నుంచి విత్తన కంపెనీలు మైలవరం, తిరువూరు ప్రాంతాల్లో ప్రవేశించాయి. అప్పటివరకు తిప్పలు పడుతూ సాధారణ (తినేరకం) మొక్కజొన్న సాగు చేసిన రైతులు విత్తన కంపెనీల ఆఫర్లు ఊరించడంతో ఆ దిశగా సేద్యం చేపట్టారు. విత్తనాల సరఫరా, రసాయన ఎరువుల పంపిణీ ఆయా కంపెనీలే బాధ్యత తీసుకోవడంతోపాటు ఒప్పందం మేరకు విత్తన దశలోనే సగం నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తుండడంతో ఈ సాగుపై ఆసక్తి పెరిగింది. ఎకరానికి కనీసం 3 టన్నుల


పామాయిల్‌లో అంతర పంటగా మొక్కజొన్న సాగు

పొట్టు దిగుబడులు అంచనాలతో.. రూ.90 వేల చొప్పున చెల్లిస్తుండగా, అందులో తొలి విడతగా సగం డబ్బులు, విత్తనాలు నాటక ముందే రైతుల ఖాతాల్లో వేస్తుండడంతో సాగుకు వెనుకాడడం లేదు. సాధారణ రకం సాగుచేస్తే విత్తనాలు అమ్మే వరకు డబ్బులు చేతికందుతాయో లేదోనని ఆలోచనతో ఈ ఏడాది విత్తన సాగు పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

మూడొంతులు ఇదే..

ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా మొక్కజొన్న సాగు మొదలైంది. దాదాపు 70 నుంచి 80 శాతం విత్తనాలను నాటారు. మిగతా రైతులు పత్తి చేలను దున్నేసి, నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటివరకు చేపట్టిన సాగులో మూడొంతులకు పైగా విత్తన మొక్కజొన్న కావడం విశేషం.

దాంతో పాటు ఈ ఏడాది పాప్‌కార్న్ మొక్కజొన్నపైనా ఆసక్తి పెరగడంతో, కొంతమేరకు ఆ దిశగానూ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ సీజన్లో పాప్‌కార్న్ రకం విత్తనాలకు గిరాకీ ఏర్పడగా, అవి దొరకడం లేదని చెబుతున్నారు. సాధారణ రకం విత్తనాలతో సాగు కనీసం 15 శాతం లోపేనని రైతులు, అధికారులు చెబుతున్నారు.

దళారులతో జాగ్రత్త

వాస్తవానికి అధికారులు, ప్రభుత్వంతో ఎటువంటి సంబంధం లేకుండా రైతులతో విత్తన కంపెనీలు, నేరుగా పంట ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అంతా సవ్యంగా సాగితే ఎకరానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు రైతులకు దక్కుతుంది. అయితే కంపెనీలు, రైతులకు మధ్య ఉంటున్న దళారులు కంపెనీల నుంచి వచ్చే సొమ్మును నొక్కేసి కర్షకులను ఏడిపిస్తున్నారు. గతేడాది పంట కోశాక, ఎగుమతుల సమయంలో డబ్బులు చెల్లించకపోవడంతో పలు గ్రామాల్లో గొడవలు జరిగాయి. లారీలను కదలనివ్వకుండా ఆపిన ఉదంతాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచిస్తున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తెదేపా మండల కార్యాలయంలో కొర్ల మండ గ్రామానికి చెందిన అయిదుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2,51,341 విలువైన చెక్కులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, నాయకులు నెక్కలపు వెంకటేశ్వరరావు, కవులూరు రాజా, కొంగల శ్రీను, పల్లెపాము రాంబాబు, బద్రి, వంశీ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకుడు సుబ్బారావు తదితరులు

బుల్లా రాజుకు అభినందన

జి.కొండూరు: మండలంలోని కవులూరు గ్రామానికి చెందిన బుల్లా రాజు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడిగా గురువారం కలెక్టర్ నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహన్‌రావు, జి.కొండూరు మండల అధ్యక్షుడు వై.ఎల్.నరసింహారావు అభినందించారు. రాజు నియామకానికి తోడ్పాటు అందించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌లకు జనసేన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధురాలి నేత్రాలు దానం

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడేనికి చెందిన వజినేపల్లి సుభద్ర(79) అనే వృద్ధురాలు మృతిచెందగా.. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రి వారికి దానం చేశారు. నేత్రదానం ఆవశ్యకతను లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి వివరించగా సుభద్ర కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆసుపత్రి వైద్యులు గురువారం గంపలగూడెం వచ్చి కార్నియాలు సేకరించారు.


సుభద్ర (పాతచిత్రం)

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

తిరువూరుటౌన్ న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం.. తిరువూరు మండల పరిధిలోని లక్ష్మీపురం, దళితవాడ, మల్లెల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ

మైలవరం, న్యూస్‌టుడే: అంతర కళాశాలల సెంట్రల్ జోన్ యోగా పోటీల్లో స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో సీహెచ్ అనురాఘవ(తృతీయ స్థానం), జి.షణ్ముఖరావు(నాలుగో స్థానం), ఎం.గౌతమ్(9వ స్థానం) సత్తా చాటి జాతీయ పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. బాలికల విభాగంలో కె.భవానీ అయిదో స్థానం సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

హిందీ పోటీల్లో..

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: గత సెప్టెంబరులో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన ప్రాథమిక పరీక్షల పోటీలో స్థానిక శ్రీనిధి పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను క్రీడా రంగంలో ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జీసీడీవో విశ్వభారతి పేర్కొన్నారు. గుంటుపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో గురువారం ఆమె జిల్లాస్థాయి పారా ఒలింపిక్స్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గలిగిన విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందన్నారు. సహిత విద్య సమన్వయకర్త కె.నారాయణ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో దాదాపు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారికి పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలు విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు పుష్పలత, మాలినిలు మాట్లాడారు. క్రీడా ఉపాధ్యాయులు సురేంద్రబాబు, శ్రీనివాసరావు, చక్రవర్తి, పద్మప్రణీతలు పోటీలు నిర్వహించారు. విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు.


క్రీడా కోర్టు ప్రారంభిస్తున్న ఎంఈవో పుష్పలత

ఘనంగా దత్త జయంతి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను శిర్డీసాయిబాబా మందిరంలో గురువారం దత్త జయంతి ఘనంగా నిర్వహించారు. సాయిబాబా మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు డి.రామలింగేశ్వరశర్మ, సత్యనారాయణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు 108 దీపాలు వెలిగించారు. సాయిబాబా నామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా మధిరలో గీతా ప్రచార పరిషత్తు వారు నిర్వహించిన భగవద్గీత పారాయణం పోటీల్లో గెలుపొందిన బాలిక దాములూరు రిత్విశాఉమామహేశ్వరిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.


పెనుగొలను శిర్డీ సాయిబాబా ఆలయంలో దీపాలు వెలిగించిన భక్తులు


గంపలగూడెంలో దత్తాత్రేయుని వ్రతంలో మహిళలు

గోపాలపురం (ఎ.కొండూరు), గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం శిర్డీసాయి ధ్యాన నిలయంలో అర్చకులు శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో బాబా విగ్రహాన్ని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయంలోని దత్తాత్రేయుని విగ్రహం వద్ద మహిళలు వ్రతం ఆచరించారు. ఎ.కొండూరు మండలం గోపాలపురంలోని సాయి మందిరంలో బాబాకు, దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

8న కలెక్టరేట్ వద్ద ఆత్మగౌరవ దీక్ష

మైలవరం, గంపలగూడెం, జి.కొండూరు, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం, హక్కుల కోసం ఈనెల 8న జిల్లా కలెక్టరేట్ వద్ద ఆత్మగౌరవ దీక్ష నిర్వహిస్తున్నట్లు సీఆర్ఎం ఉపాధ్యాయ ఐక్యఫోరం నాయకులు గోపాలరావు, నాగరాజు, ఉషారాణిలు పేర్కొన్నారు. ఆందోళనా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఎంఈవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్లకార్డులు ప్రదర్శించి, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను వివరించారు. 22న విజయవాడలో రాష్ట్రస్థాయి ఆత్మగౌరవ దీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారు.★ గంపలగూడెం, జి.కొండూరులో తహసీల్దార్‌లు రాజకుమారి, వెంకటేశ్వర్లకు వినతిపత్రాలు అందజేశారు.


జి.కొండూరు: తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్ఎంటీలు


గంపలగూడెంలో...

వైభవంగా గరుడ సేవ

తిరువూరు, న్యూస్‌టుడే: పాత తిరువూరులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటాచలస్వామి ఆలయంలో గురువారం రాత్రి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. అర్చకులు డీవీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్‌లకు విశేష పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. పంచహారతులు ఇచ్చారు.


స్వామికి హారతి ఇస్తున్న భక్తులు

శబరిమలకు తరలిన అయ్యప్ప దీక్షాధారులు

ఊటుకూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరులో అయ్యప్ప దీక్ష తీసుకున్న 21 మంది భక్తులు గురువారం స్థానిక రామాలయంలో కె.పవన్‌శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి ధరించి, శబరిమల యాత్రకు తరలివెళ్లారు.



వేణుగోపాలుని కల్యాణం

నెమలి (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి కృష్ణాలయంలో గురువారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మాస కల్యాణం.. అర్చకులు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు దంపతులు కన్యాదాన క్రతువులో పాల్గొన్నారు. ఆలయ పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ పర్యవేక్షించారు.


కల్యాణ శోభలో ఉత్సవమూర్తులు

పశుపోషకులు..రాయితీలు వినియోగించుకోండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా పాల ఉత్పత్తి మెరుగుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు ఎం.హనుమంతరావు సూచించారు. జూపూడి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో గురువారం 'లాభసాటి పాడి పశువుల పెంపకం' అంశంపై మండల స్థాయిలో పాడిపోషకులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. పాడి రైతుల ఆర్థిక అభ్యున్నతికి ప్రభుత్వం అనేక రాయితీలు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు మోజెస్ వెస్లీ, సహాయ సంచాలకులు కృష్ణమూర్తి, పశు వైద్యులు టి.శ్రీనివాస్, మోహన్ కృష్ణ, శైలు మాధురి, స్వాతి అయ్యప్ప, సిబ్బంది పాల ఉత్పత్తిపై పోషకులకు సూచనలు చేశారు.

తెదేపా నాయకుడికి నివాళి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేటకు చెందిన తెదేపా నాయకుడు అబ్బినేని రామాంజనేయులు(కొండయ్య) వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి.. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. రామాంజనేయులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాయల సుబ్బారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల గోడపత్రికలు ఆవిష్కరణ

మైలవరం, న్యూస్‌టుడే: ఈనెల 31వ తేదీ నుంచి విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ అఖిలభారత మహాసభల గోడపత్రికలను గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో నాయకులు, కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ సుధాకర్ పేర్కొన్నారు. కేంద్రం కొత్తగా తెచ్చిన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, గతంలో ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మధు, శ్రీనివాసరావు, శారద, పుష్పకుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ సేవకుల పాదయాత్ర



మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: పౌర్ణమిని పురస్కరించుకుని గంపలగూడెం, తోటమూలకు చెందిన శ్రీరామ సేవకుల ఆధ్వర్యంలో గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి మేడూరులోని వీరాంజనేయస్వామి గుడి వరకు 30వ పాదయాత్ర గురువారం నిర్వహించారు. జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో 5 కి.మీ పాదయాత్ర చేశారు. మేడూరు వీరాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

మత్తు పదార్థాల వాడకం అనర్థం

మైలవరం, న్యూస్‌టుడే: ప్రాణాంతకమైన మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండాలని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పేర్కొన్నారు. మండలంలోని మొర్సుమిల్లిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా గురువారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి డ్రగ్స్, ఆల్కహాల్, ధూమపానం నివారణ, నీటి పొదుపు, నీటి వనరుల పునరుద్ధరణ అంశాలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. మత్తు పదార్థాల వాడకంతో జీవితాలు నాశనమవుతాయని వివరించారు. ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ప్రోగ్రాం ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

వివాహిత బలవన్మరణం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నంకు చెందిన పి.రత్నకుమారి(38)కి కొండపల్లికి చెందిన వెంకటేశ్వరరావుకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వెంకటేశ్వరరావు కొంతకాలంగా మద్యం, ఇతర వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన రత్నకుమారి భర్తతో వివాదానికి దిగింది. బుధవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొంది. కొంత సమయానికి ఆమెను గమనించిన ఇరుగుపొరుగు వారు ఇంటిలోకి వెళ్లి ఆమెను కిందకు దింపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారా ఒలింపిక్స్‌లో ప్రతిభ

విస్సన్నపేట: గుంటుపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పారా ఒలింపిక్స్ పోటీల్లో విస్సన్నపేట మండలానికి చెందిన ఆరుగురు దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో పెరుమాళ్ల దుర్గా భవానీ 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో (ప్రథమ), మర్రి అఖిలసాయి మణికంఠ లాంగ్‌జంప్‌లో ద్వితీయ బహుమతి గెలుపొందినట్లు ఎంఈవోలు శంకరరావు, సుధాకర్ తెలిపారు.

రోశయ్యకు నివాళి



తిరువూరు, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రిగా, వివిధ శాఖల మంత్రిగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బి.ప్రకాశరావు, మండల అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, నాయకులు కృష్ణమోహన్, గోపాలకృష్ణ, జగన్నాథం, ఆర్.శ్రీనివాసరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని పురస్కరించుకొని తిరువూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మురళి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో

కూటమి పాలనలో బీసీలకు ప్రాధాన్యం

గొల్లపూడి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు పూర్వ వైభవం వచ్చిందని విజయవాడ మధ్య ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ఏపీ నాగవంశం అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం గొల్లపూడిలోని బీసీభవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత తెదేపాకే దక్కుతుందన్నారు. చేతివృత్తులు చేసుకునే వారికి అనేక పరికరాలు అందించి చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి నాగవంశం కార్పొరేషన్‌లో డైరెక్టర్లుగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. ఏపీ నాగవంశం కార్పొరేషన్ అభివృద్ధి ఛైర్మన్ ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సహకారంతో నాగవంశం కల్యాణమండపానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ గురునాథం, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటండి

కొండపల్లి, న్యూస్‌టుడే: వాలీబాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీల్లో సత్తా చాటి టోర్నీని సొంతం చేసుకోవాలని పురపాలక సంఘం ఛైర్మన్ చిట్టిబాబు సూచించారు. అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికైన స్థానిక బాలికోన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులను కూటమి నాయకులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని హేమలత, పీడీ రత్నం, రుద్వానా, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం శుక్రవారం పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న టీచర్-పేరెంట్ సమావేశం ఏర్పాట్లను వీరు పరిశీలించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న నాయకులు

ఈనాడు ప్రతిభ
https://pratibha.eenadu.net • https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్ — మాదిరి ప్రశ్నలు

★ ప్రపంచ నివాస దినోత్సవం (వరల్డ్ హాబిటాట్ డే)ను ఏటా ఎప్పుడు నిర్వహిస్తారు?

జ: అక్టోబరు నెల మొదటి సోమవారం



(2015లో ఈ దినోత్సవాన్ని 'అర్బన్ క్రైసిస్ రెస్పాన్స్' అనే థీమ్‌తో నిర్వహించారు.)

★ 2025 అక్టోబరు 5 నుంచి 12 వరకు 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు (సీపీసీ)ను ఎక్కడ నిర్వహించారు?

జ: బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్ ('ది కామన్వెల్త్-గ్లోబల్ పార్టనర్' అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో పాల్గొన్న భారత బృందానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నాయకత్వం వహించారు.)

★ భారతదేశం తన గగన్‌యాన్ మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమంలో భాగంగా ఏ పేరు కలిగిన హ్యూమనాయిడ్ రోబోను అంతరిక్షంలోకి పంపడానికి సన్నాహాలు చేస్తుంది?

జ: వ్యోమమిత్ర (ఇస్రో ఆధ్వర్యంలో కేరళలోని విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రం ఈ రోబో అభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది.)

★ 2025 సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 5 వరకు ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2025ను ఎక్కడ నిర్వహించారు? (ఈ పోటీల్లో ఆరు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, ఏడు కాంస్యాలతో మొత్తం 22 పతకాలతో భారత్ పతకాల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. మొత్తం 44 పతకాలతో (15 + 20 + 9) బ్రెజిల్ అగ్రస్థానంలో నిలిచింది.)

జ: న్యూఢిల్లీ

మరింత సమాచారం

జనరల్ స్టడీస్ — ఇండియన్ జాగ్రఫీ


సమర్థ సాగు ప్రణాళికలకు ఆధారాలు!

విశాల భూభాగం, విభిన్న భూస్వరూపాలు, వైవిధ్య శీతోష్ణస్థితి ఉన్న భారతదేశంలో అన్నిరకాల పంటలకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. ప్రధాన జీవనాధారమైన వ్యవసాయంలో ప్రాంతీయ వైవిధ్యం ఎక్కువగా కనిపిస్తుంది. సారవంతమైన భూములున్న గంగా, సింధు మైదానాల్లో గోధుమ, వరి, చెరకు తదితర పంటలను పండిస్తే, పీఠభూమి స్వభావం పత్తి, మిరప, పప్పు ధాన్యాలకు అనుకూలంగా ఉంటుంది. కొండలున్న ప్రాంతాల్లో టీ, కాఫీ, రబ్బరు పంటలను సాగు చేస్తారు. హిమాలయాల్లో పండ్ల తోటలు అధికంగా ఉంటాయి. ఎక్కడ ఏ పంటలు పండుతాయో తెలిస్తేనే దేశ వ్యవసాయం తీరుపై స్థూల అవగాహన ఏర్పడుతుంది. ఇందుకోసమే నేల రకం, వాతావరణం మొదలైన అంశాల ఆధారంగా దేశాన్ని వ్యవసాయ ప్రాంతాలుగా విభజించారు. ఈ వర్గీకరణపై పోటీ పరీక్షార్థులకు తగిన పరిజ్ఞానం ఉండాలి.

భారతదేశ వ్యవసాయ ప్రాంతాలు

భారతదేశ వ్యవసాయక ప్రాంతాలను వ్యవసాయ శీతోష్ణస్థితి మండలాలుగా వ్యవహరిస్తారు. శీతోష్ణస్థితి ఆధారంగా ఏర్పాటు చేసిన ఒక యూనిట్‌నే వ్యవసాయ లేదా వ్యావసాయక ప్రాంతం అంటారు. ఇది సస్యస్థితి (క్రాపింగ్), సాగుకు అనుకూలం. దేశంలో వ్యవసాయ ప్రాంతాలను గుర్తించడానికి వర్షపాతం, ఉష్ణోగ్రత, అక్షాంశం, ఎత్తు, మృత్తిక, పంటలను పరిగణనలోకి తీసుకోవాలి. వ్యవసాయ ప్రణాళికల కోసం వివిధ రకాల వ్యవసాయ ప్రాంతాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వ్యవసాయ శీతోష్ణస్థితి పరిస్థితులు ప్రధానంగా నేలలు, వర్షపాతం, ఉష్ణోగ్రత, నీటిలభ్యతలను సూచిస్తాయి. 329 మిలియన్ హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణం ఉన్న భారత్‌లో పెద్దసంఖ్యలో సంక్లిష్ట వ్యవసాయ శీతోష్ణస్థితులు ఉన్నాయి. డాక్టర్ చెన్నెన్ సెంగ్ అనే శాస్త్రవేత్త దేశాన్ని 16 వ్యవసాయ ప్రాంతాలుగా గుర్తించారు. కె.విలియం ఇన్ఫర్ అనే శాస్త్రవేత్త వ్యవసాయ ప్రణాళిక, నియంత్రణ కోసం వివిధ పద్ధతులను అవలంబించారు.

15 మండలాలు: విస్తృత వ్యవసాయ లక్షణాల, భవిష్యత్తు వ్యూహాలను దృష్టిలో ఉంచుకుని నీటిపారుదల, ఖనిజ వనరుల ఆధారంగా దేశాన్ని 15 విస్తృత వ్యవసాయ మండలాలుగా, 72 ఉప మండలాలుగా ప్రణాళికా సంఘం విభజించింది. 14 ప్రాంతాలు ప్రధాన భూభాగంలో ఉండగా, మిగిలిన ఒక ప్రాంతం బంగాళాఖాతం, అరేబియా మహాసముద్ర దీవుల్లో ఉంది.



1 పశ్చిమ హిమాలయ ప్రాంతం

ఈ ప్రాంతంలో వేసవి ఉష్ణోగ్రత సగటున 5°-30°C వరకు, శీతాకాలంలో – 4°C వర్షపాతం 75-100 సెం.మీ.లు ఉంటుంది. జమ్మూ-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో విస్తరించింది. ఆపిల్, పీచ్, బెరి లాంటి సమశీతోష్ణ పండ్లకు ప్రసిద్ధి. ఇక్కడి కొండవాలుల్లో వరి, మొక్కజొన్న, బార్లీ పండిస్తారు.

2 తూర్పు హిమాలయాలు

దేశ తూర్పు భూభాగంలోని పశ్చిమ బెంగాల్, సిక్కిం, డార్జిలింగ్ కొండ ప్రాంతాలు, అస్సాం కొండలు, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపుర మేఘాలయ ఈ ప్రాంతంలో ఉన్నాయి. వార్షిక వర్షపాతం 200 సెం.మీ. కన్నా ఎక్కువ. 30°-10°C వరకు ఉష్ణోగ్రత. తక్కువ సారవంతమైన ఎరుపు, గోధుమ రంగులో నేల ఉంటుంది. వరి, మొక్క జొన్న, పండ్లతోటలతో పాటు తేయాకు పండిస్తారు.

3 దిగువ గంగా మైదానం

100 - 200 సెం.మీ. వర్షపాతం, ఉష్ణోగ్రత 12°-30°C. వాతావరణం తేమగా ఉంటుంది. బిహార్ తూర్పుప్రాంతం, పశ్చిమ బెంగాల్, అస్సాంలో బ్రహ్మపుత్ర లోయ ఈ ప్రాంతంలోకి వస్తాయి. వరి, జనపనార సాగుకు అనుకూలం. గోధుమ ఇక్కడి శీతాకాల పంట.

4 మధ్య గంగా - మైదానం

ఉత్తర్‌ప్రదేశ్ తూర్పు భాగం, బిహార్ ప్రాంతం, గంగానది నిక్షిప్త సారవంతమైన నేల. వార్షిక వర్షపాతం 100-150 సెం.మీ., ఉష్ణోగ్రత 10°-40°C వరకు ఉండి వేడి, తేమతో కూడిన వాతావరణం ఉంటుంది. ప్రధాన ఖరీఫ్ పంటలు వరి, మొక్కజొన్న, మినుములు. రబీ పంటలు గోధుమ, పప్పుధాన్యాలు, బార్లీ, బఠానీ, ఆవాలు.

5 ఎగువ గంగా మైదానం

గంగా, యమునా దోబ్, లఖీమ్‌పూర్ డివిజన్, పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోహిల్ ఖండ్, ఉత్తరాఖండ్ లోని ఇతర ప్రాంతాల్లో విస్తరించి ఉంది. ఇక్కడ ఉష్ణోగ్రత 10°-40°C, ఈ ప్రాంతం ఉప-తేమతో కూడిన ఖండాంతర వాతావరణంతో ఉంటుంది. గోధుమ, వరి, చెరకు, మినుములు, పప్పుధాన్యాలు ప్రధాన పంటలు.

6 ట్రాన్స్ - గంగా మైదానం

ఇది పంజాబ్, హరియాణా, ఢిల్లీ, చండీగఢ్, ఉత్తరాఖండ్‌లో విస్తరించింది. ఉష్ణోగ్రత 10° - 40°C వరకు ఉంటుంది. వార్షిక వర్షపాతం 75 - 100 సెం.మీ. చలి, ఎండ ఎక్కువ. ప్రధాన పంటలు గోధుమ, వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, పప్పుధాన్యాలు.

7 తూర్పు పీఠభూములు, కొండలు

చోటానాగ్‌పూర్ పీఠభూమి, రాజ్‌మహల్ కొండలు, ఛత్తీస్‌గఢ్ మైదానాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడి నేలలు లేటరైట్, ఒండ్రుమట్టితో ఎరుపు, పసుపు రంగులో ఉంటాయి. వార్షిక వర్షపాతం 75-150 సెం.మీ. ఉష్ణోగ్రత 10° - 40°C. వర్షాధార వ్యవసాయం ఎక్కువ. వరి, మొక్కజొన్న, చిరుధాన్యాలు, రాగి, ప్రధాన పంటలు.

8 మధ్య పీఠభూములు, కొండలు

వీటిలో తూర్పు మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోని అంచుల ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ పాక్షిక-శుష్క పరిస్థితులు ఉంటాయి. వార్షిక వర్షపాతం 50-100 సెం.మీ. ఉష్ణోగ్రత 10°-40°C. ఎరుపు, పసుపు, నలుపు రంగులో నేలలు ఉంటాయి. ఎక్కువగా గోధుమ సాగవుతుంది.

9 పశ్చిమ పీఠ భూమి, కొండలు

ఇది మాల్వా పీఠభూమి దక్షిణ ప్రాంతం, మహారాష్ట్రలోని దక్కన్ పీఠభూమి ప్రాంతం. ఇక్కడ రేగర్ (నల్ల) నేలలు ఉంటాయి. పాక్షిక శుష్క వాతావరణం ఉంటుంది. వార్షిక వర్షపాతం25 - 75 సెం.మీ. జొన్న, పత్తి, చెరకు, వరి పండుతాయి.

10 దక్కన్ పీఠ భూమి, కొండలు

ఈ ప్రాంతంలో దక్షిణ మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు ఉన్నాయి. పాక్షిక శుష్క వాతావరణం ఉంటుంది. వార్షిక వర్షపాతం 50 - 100 సెం.మీ. ఉష్ణోగ్రత 13° - 40°C వరకు ఉంటుంది. ఇక్కడ సిరిధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, కాఫీ, టీ, యాలకులు పండుతాయి.

11 తూర్పు తీరమైదానాలు, కొండలు

వార్షిక వర్షపాతం 75-150 సెం.మీ. ఉష్ణోగ్రత 20°-30°C. ప్రధానంగా వరి, జనుము, పొగాకు పండుతాయి. ఈ ప్రాంతంలో గోదావరి, కృష్ణా, కావేరి నదుల నిక్షేపణ ద్వారా డెల్టా ఏర్పడుతుంది.

12 పశ్చిమ తీరమైదానం, కనుమలు

ఇది తపతి నది నుంచి కన్యాకుమారి వరకు విస్తరించింది. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ తీర ప్రాంతాల్లో ఉంటుంది. సగటు వర్షపాతం 200 సెం.మీ. కన్నా ఎక్కువ. ఉష్ణోగ్రత 18° - 32°C. వరి, కొబ్బరి, నూనె గింజలు, చెరకు, మినుములు, పప్పులు, పత్తి పండుతాయి.

13 గుజరాత్ మైదానాలు, కొండలు

ఇక్కడ కథియావార్ మైదానాలు, కొండలు, మహీ నది, సబర్మతి నదులు ఉంటాయి. పాక్షిక - శుష్క ప్రాంతం, సగటు వార్షిక వర్షపాతం 50-100 సెం.మీ. ఉష్ణోగ్రత 15° - 42°C. వరి, పత్తి, వేరుశనగ, మినుములు, నూనె గింజలు ప్రధాన పంటలు.

14 పశ్చిమ పొడి ప్రాంతం

ఆరావళి పర్వతాల పశ్చిమాన అంటే రాజస్థాన్ పశ్చిమ ప్రాంతం ఇందులో ప్రధాన భాగం. ఇది శుష్క ప్రాంతం. వార్షిక వర్షపాతం 25 సెం.మీ. శీతాకాలం 5°C కంటే తక్కువగా, వేసవి కాలం 40°C కన్నా ఎక్కువగా వేడి ఉంటుంది.

15 ద్వీప ప్రాంతం


అండమాన్ - నికోబార్ (బంగాళాఖాతం), లక్షదీవులు (అరేబియన్ సముద్రం) ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడి భూమధ్య రేఖా శీతోష్ణస్థితి ఉంటుంది. సగటు వర్షపాతం 200 సెం.మీ., సగటు ఉష్ణోగ్రత 30°C. తీరం వెంట ఇసుక నేలలు, దిగువ వాలుల్లో బంకమట్టి ఉంటాయి. వరి ప్రధాన పంట.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

SENIOR INTER Mathematics - IIA — Complex Numbers

1. If $x + iy = \frac{1}{1 + \cos\theta + i\sin\theta}$ then show that $4x^2 = 1$.



Sol: Given $x + iy = \frac{1}{1 + \cos\theta + i\sin\theta}$

$$= \frac{1}{1 + \cos\theta + i\sin\theta} \times \frac{1 + \cos\theta - i\sin\theta}{1 + \cos\theta - i\sin\theta}$$

$$\therefore x + iy = \frac{1 + \cos\theta}{2(1 + \cos\theta)} + i\left(\frac{-\sin\theta}{2(1 + \cos\theta)}\right)$$

4 Marks

Real point $x = \frac{1 + \cos\theta}{2(1 + \cos\theta)} = \frac{1}{2} \Rightarrow 2x = 1 \Rightarrow 4x^2 = 1$

2. If $x + iy = \frac{3}{2 + \cos\theta + i\sin\theta}$ then show that $x^2 + y^2 = 4x - 3$.

Sol: Given $x + iy = \frac{3}{2 + \cos\theta + i\sin\theta} \times \frac{2 + \cos\theta - i\sin\theta}{2 + \cos\theta - i\sin\theta}$

$$\therefore x + iy = \frac{6 + 3\cos\theta}{5 + 4\cos\theta} + i\left(\frac{-3\sin\theta}{5 + 4\cos\theta}\right)$$

$$L.H.S = x^2 + y^2 = \frac{(6 + 3\cos\theta)^2 + 9\sin^2\theta}{(5 + 4\cos\theta)^2}$$

$$= \frac{9(5 + 4\cos\theta)}{(5 + 4\cos\theta)^2} = \frac{9}{5 + 4\cos\theta}$$

Final Exams-2026 IMPORTANT Q & A

$$R.H.S = 4x - 3 = 4\left(\frac{6 + 3\cos\theta}{5 + 4\cos\theta}\right) - 3$$

$$= \frac{9}{5 + 4\cos\theta} \quad \therefore L.H.S = R.H.S$$

3. If $(x - iy)^{1/3} = a - ib$ then show that $\frac{x}{a} + \frac{y}{b} = 4(a^2 - b^2)$.

Sol: Given $(x - iy)^{\frac{1}{3}} = a - ib \Rightarrow x - iy = (a - ib)^3$

$$\therefore x - iy = (a^3 - 3ab^2) - i(3a^2b - b^3)$$

$$\therefore \frac{x}{a} + \frac{y}{b} = \frac{a(a^2 - 3b^2)}{a} + \frac{b(3a^2 - b^2)}{b}$$

$$= 4a^2 - 4b^2 = 4(a^2 - b^2).$$

For more Imp Q & A

Practice Questions

4 Marks

1. If $u + iv = \frac{2 + i}{z + 3}$ and $z = x + iy$ then find u, v.
2. Show that the points in the argand diagram represented by the complex number $2 + 2i$, $-2 - 2i$ and $-2\sqrt{3} + 2\sqrt{3}i$ are the vertical of an equilateral triangle.



Writer: B.Eswar Rao

తిరుపతమ్మా.. తిప్పలు తప్పించమ్మా..!



శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తులు కనీస సౌకర్యాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ఉద్యోగుల పర్యవేక్షణ లేకపోవడంతో భక్తులు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు. ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకుందామని ఎంతో దూరం నుంచి వచ్చే భక్తులకు నిరాశే మిగులుతుంది.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలపై నిర్వహించిన సమీక్షలోనూ పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులకు అందించే సేవల్లో చివరి స్థానంలో ఉంది. దీంతో ఆలయ అధికారి కిశోర్‌కుమార్‌ను దీర్ఘకాలిక సెలవుపై పంపించారు. అధికారులున్నా.. రెండు, మూడు గంటలు ఉండి వెళ్లిపోతున్నారు. ఒకరిద్దరు ఉద్యోగులు చెప్పిన మాటలతోనే అధికారులు విధులు నిర్వహిస్తున్నారని, దీంతో దిగువ స్థాయిలో ఉద్యోగులు భక్తులకు సేవలందించడంపై దృష్టి సారించట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేలల్లో భక్తులు రాక

తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతి శుక్ర, ఆదివారాలు, అమ్మవారి ఉత్సవాల సమయంలో వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. గతంలో ఆర్‌జేసీ స్థాయిలో ఉండే ఆలయ స్థాయిని తగ్గించి ప్రస్తుతం డిప్యూటీ కమిషనర్ అధికారి స్థాయికి తగ్గించారు. అమ్మవారికి మొక్కుబడులు సమర్పించి పూజలు చేసుకునే క్రమంలో ఆలయం వద్ద, సత్రాలు, మునేరు అవతలి వైపు ఉన్న ప్రైవేట్ మామిడి తోటల్లో భక్తులు విడిది చేస్తుంటారు. వీరికి రక్షణ కరవైంది. కనీస భద్రత లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

◆ ఆలయం వద్ద పలు దుకాణాలకు పాటలు నిర్వహిస్తున్న కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ భక్తులను దోపిడీ చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ భక్తులపై స్థానికులు దాడులు చేస్తే.. అధికారులు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుల చేసినా ఫలితం ఉండట్లేదు. స్థానికులకు రాజకీయ అండదండలు ఉండడంతో ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. చివరికి భక్తులే అవమానాలతో, గాయాలతో సొంత ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు.

◆ ఆలయం వద్ద హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు సౌకర్యాల కల్పనతో పాటు భద్రతకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రాచీన మానవుడు.. ఎంతో వివేకవంతుడు



'గ్రామ దేవత' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బండ్ల మాధవరావు, శ్రీపద్మ, బాలాంత్రపు ప్రసూన, చినవీరభద్రుడు

ఈనాడు, అమరావతి: ప్రాచీన మానవుడు.. మనకంటే ఎంతో వివేకంతో, సమగ్రమైన పరిజ్ఞానం కలిగి ఉండేవాడని.. విశ్రాంత ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు పేర్కొన్నారు. ప్రస్తుతం మనం పూజిస్తున్న దేవతలంతా చరిత్ర(కాంస్య) యుగానికి చెందిన వాళ్లేనన్నారు. నింగి, నేల విడిపోయిన సమయంలో కొందరు ఆకాశ దేవతలుగా, మరికొందరు పృథ్వీ దేవతలుగా విడిపోయారని.. చారిత్రక పుస్తకాల్లో నిక్షిప్తమై ఉందన్నారు. ప్రవాసాంధ్రురాలైన ప్రముఖ రచయిత డాక్టర్ శ్రీపద్మ రాసిన.. 'గ్రామ దేవత' పుస్తకావిష్కరణ విజయవాడలో గురువారం జరిగింది. 2013లో శ్రీపద్మ రాసిని 'Vicissitudes of the Goddess' పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రచురించింది. ఈ పుస్తకాన్ని ప్రస్తుతం తెలుగులో అనువదించి ఆవిష్కరించారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్(ఇన్‌టాక్) విజయవాడ ఛాప్టర్ ఆధ్వర్యంలో కృష్ణా నదిలో నౌకావిహారం చేస్తూ ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని గ్రామ దేవతలపై సుదీర్ఘ అధ్యయనం చేసి శ్రీపద్మ రాసిన ఈ పుస్తకం వల్ల.. ప్రపంచమంతా మన ఊరి దేవుళ్ల గురించి చదువుతోందన్నారు. దీనివల్ల మన ఎల్లమ్మ, పోలేరమ్మ, అంకాలమ్మ.. లాంటి గ్రామ దేవతలను చూసేందుకు వాళ్లు ఇక్కడికి వస్తారని పేర్కొన్నారు. ఇది మన సమాజానికి అత్యంత విలువైన పుస్తకమన్నారు. బెజవాడ కనకదుర్గమ్మ నుంచి ప్రస్తుతం మనం పూజించే అనేక మంది దేవతలంతా.. ఒకప్పుడు గ్రామ దేవతలుగానే ఉండేవారని పుస్తక రచయిత్రి శ్రీపద్మ పేర్కొన్నారు. అన్ని ప్రముఖ ఆలయాలకూ గ్రామదేవతలే మూలమన్నారు. గ్రామ దేవతగా ఉండే కనకదుర్గమ్మ.. కాలనుగుణంగా బ్రాహ్మణ దేవతగా, తర్వాత రాజుల కులదేవత, శైవ దేవతగా.. పరిణామ క్రమంలో ఎలా మారిందనేది లోతుగా అధ్యయనం చేశానన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలు, గ్రామ దేవతలపై ఏళ్ల తరబడి అధ్యయనం చేశాక.. అనేక చారిత్రక విషయాలను పొందుపరుస్తూ పుస్తకాన్ని రాశానన్నారు. మన సంస్కృతి, వారసత్వం గురించి ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ప్రముఖ రచయిత, చరిత్రకారులు, ఇన్‌టాక్ విజయవాడ ఛాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని తెలిపారు. కార్యక్రమంలో.. ఇన్‌టాక్ కోకన్వీనర్ బాలాంత్రపు ప్రసూన, ప్రముఖ కవి బండ్ల మాధవరావు, విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చారిత్రక ప్రియులు హాజరయ్యారు.

ఎస్ఈలకు ఉద్యోగోన్నతి.. బదిలీలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యానందం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఏపీ సీపీడీసీఎల్‌లోని పలువురు ఎస్ఈలకు సీఈలుగా పదోన్నతి కల్పిస్తూ ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణాజిల్లా ఎస్ఈ ఎం.సత్యానందంకు సీఈగా ఉద్యోగోన్నతి కల్పించి.. కార్పొరేట్ ఆఫీస్‌లో సీజీఎం (ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్)గా బదిలీ చేశారు. సీజీఎం (ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్) కె.వెంకటకృష్ణను సీజీఎం (ప్లానింగ్ అండ్ మెయిన్‌టెనెన్స్)గా బదిలీ చేశారు. అదే విధంగా జి.జయకృష్ణబాబును సీఈగా పదోన్నతి కల్పించి కార్పొరేట్ ఆఫీస్‌లో సీజీఎం (హెచ్‌ఆర్‌డీ)గా నియమించారు. గురువారం సాయంత్రం ఎం.సత్యానందం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలు



చీరలు ప్రదర్శిస్తున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి, స్పందన, మణిదీప్, హీరో తేజ సజ్జా

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: విజయవాడ ఎంజీ రోడ్డు బెంజిసర్కిల్ సమీపంలోని చంద్రమౌళిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి సిల్క్స్ షోరూమ్‌ను హీరో తేజ సజ్జా, హీరోయిన్ మీనాక్షి చౌదరి గురువారం ప్రారంభించారు. తేజ సజ్జా మాట్లాడుతూ విస్తృత శ్రేణి వస్త్రాలు ఈ షోరూమ్‌లో ఉన్నాయని, పండగైనా, వివాహమైనా ఇక్కడ కొనుగోలు చేయాలని కోరారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ ఈ షోరూమ్ విజయవాడలో చీరలకు ల్యాండ్ మార్క్‌గా నిలుస్తుందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్లు మణిదీప్ యేచూరి, డాక్టర్ స్పందన మద్దుల మాట్లాడుతూ నాణ్యమైన సంప్రదాయ, ఆధునిక వస్త్రాలను అందిస్తూ వినియోగదారుల ఆదరణ, నమ్మకాన్ని పొందుతున్నామన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా రూ.10వేలు కొనుగోలుపై బంగారు నాణెం, రూ.15వేలు కొనుగోలుపై బంగారం, వెండి ఉచితంగా అందించడంతో పాటు రూ.1500 ఓచర్ ఉచితంగా ఇస్తామన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఈ నెల 14 వరకు మాత్రమే ఉంటుందని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలకు ఐఫోన్(ప్రథమ), 500 గ్రాముల వెండి(ద్వితీయ) బహుమతులుగా అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సినిమా పైరసీ చాలా బాధాకరం

సినిమా పైరసీ చేయడం చాలా బాధాకరమని హీరో తేజ సజ్జా అన్నారు. విజయవాడకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మల్టీస్టార్ సినిమాలు చేయాలని ఉందని తెలిపారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ సంక్రాంతికి తన సినిమా అనగనగ ఒక రాజు వస్తోందని తెలిపారు.

నకిలీ మద్యం కేసులో..బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై ఎక్సైజ్ కోర్టులో వాదనలు ముగిశాయి. 11 మంది నిందితులు వేసిన పిటిషన్లపై గురువారం ఇరుపక్షాల వాదనలు జరిగాయి. అనంతరం తీర్పుల నిమిత్తం వాయిదా పడ్డాయి. మాజీ మంత్రి జోగి రమేష్ (ఏ18), జోగి రాము (ఏ19), అద్దేపల్లి జనార్దన్‌రావు (ఏ1), జగన్మోహన్‌రావు (ఏ2), బాదల్ దాస్ (ఏ7), ప్రదీప్ దాస్ (ఏ8), రవి (ఏ4), కల్యాణ్ (ఏ12), తిరుమలశెట్టి శ్రీనివాసరావు పిటిషన్ల తీర్పు కోసం ఈనెల 18కి వాయిదా వేశారు. శ్రీనివాస్‌రెడ్డి (ఏ11), చెక్కా సతీష్ (ఏ17) బెయిల్ పిటిషన్లపై తీర్పు నిమిత్తం ఈనెల 11కి వాయిదా పడింది.

మాదిగ జాతి ముద్దుబిడ్డ.. చంద్రబాబు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు మాదిగ. వేదికపై ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, విల్సన్, కృపాకర్, వీరయ్య, సువర్ణరాజు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో చట్టబద్ధం చేసి, 59 కులాల్లో సామాజిక న్యాయం చేసిన మాదిగజాతి ముద్దు బిడ్డ ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కొనియాడారు. ఆయనకు మాదిగ జాతి జీవితాంతం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం రాత్రి విజయవాడలోని జింఖానా మైదానంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు హయాంలోనే వర్గీకరణ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సుప్రీం కోర్టులో సుదీర్ఘపోరాటం తర్వాత ఇప్పుడు చట్టబద్ధత కల్పించి.. మాదిగలకు మేలు చేసింది కూడా ఆయనేనని పేర్కొన్నారు. వైకాపా అధినేత జగన్.. మాదిగలను అన్ని విధాలా వంచించారని మండిపడ్డారు. చంద్రబాబు కృషితో నేడు వివిధ విభాగాల్లో 24500 ఉద్యోగాలు వచ్చాయని, అలాగే డీఎస్సీలో మరో 1650 ఉద్యోగాలు వచ్చాయని, రాజకీయంగానూ ఎంతో మేలు జరిగిందని వివరించారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ వెంకటేశ్వరరావు మాదిగ నేతృత్వంలో బహిరంగ సభ నిర్వహించడం అభినందనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు అన్నారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మాదిగలకు 14 సీట్లు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు సంస్కృతి అకాడమీ ఛైర్మన్ ఆర్.డి.విల్సన్, మాదిగ సంఘం రాష్ట్ర నాయకులు కృపాకర్ మాదిగ, దండు వీరయ్య మాదిగ, దాసరి సువర్ణరాజు, రాయగంటి రాందాసు, అన్ని జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవర్ధన్‌పై దాడి కేసు పునర్విచారణకు అనుమతి

ఏసీపీ దామోదర్ పిటిషన్‌పై ఉత్తర్వులిచ్చిన ఎస్సీ, ఎస్టీ కోర్టు

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసు పునర్విచారణకు ... ఎస్సీ, ఎస్టీ కోర్టు శుక్రవారం అనుమతి ఇచ్చింది. కేసు దర్యాప్తు అధికారి, సెంట్రల్ ఏసీపీ దామోదర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. ఇటీవల నిందితులు తేలప్రోలు రాము, వజ్రకుమార్‌లు కోర్టులో లొంగిపోయారు. తాజాగా రామాంజనేయులును పోలీసులు అరెస్టు చేశారు. ఇంకా ముగ్గురు నిందితులు కొమ్మా కోట్లు (ఏ2), చేబోలు శ్రీనివాస్ (ఏ11), వేణు (ఏ12) అరెస్టు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉందని, పరారీలో ఉన్న నిందితులు ఇంకా దొరకలేదని.. అపహరణకు వాడిన ఏపీ 40 బీజె 5005 నెంబరు గల కారును ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేసులో నేరపూరిత కుట్రకు సంబంధించి, ఆర్థిక వనరులు సమకూర్చిన వ్యక్తులు, డిజిటల్, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను సేకరించాల్సి ఉన్న దృష్ట్యా కేసును లోతుగా దర్యాప్తు చేపట్టాలని ఐవో దామోదర్ వేసిన పిటిషన్‌కు కోర్టు అనుమతి ఇవ్వడంతో తిరిగి విచారణ చేపట్టనున్నారు. కొందరు నిందితులను తిరిగి కస్టడీకి కోరే వీలుందని తెలిసింది.

ఏ3, ఏ6 బెయిల్, కస్టడీ పిటిషన్లపై విచారణ వాయిదా...

ఈ కేసులో కోర్టులో లొంగిపోయి రిమాండ్‌లో ఉన్న తేలప్రోలు రాము (ఏ3), చోడవరపు వజ్రకుమార్ (ఏ6)లు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై ప్రాసిక్యూషన్ కౌంటర్ల దాఖలు కోసం ఈనెల 8కి కోర్టు వాయిదా వేసింది. వీరిని 5 రోజులు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు వేసిన పిటిషన్‌పై నిందితుల తరఫు న్యాయవాది కౌంటరు కోసం సోమవారానికి వాయిదా వేశారు.

పటమట స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీపై..


ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి 15 వరకు పటమట పోలీసుస్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని కోర్టు ముందుంచేలా ఆదేశించాలని వల్లభనేని వంశీ వేసిన పిటిషన్ గురువారం విచారణకు వచ్చింది. దీనిపై ప్రాసిక్యూషన్ కౌంటరు దాఖలుకు ఈనెల 8కి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు.

తిరుపతమ్మ ఆలయ ఉపకమిషనర్‌గా మహేశ్వరరెడ్డి



పూజలో పాల్గొన్న మహేశ్వరరెడ్డి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయం ఉప కమిషనర్‌గా బి.మహేశ్వరరెడ్డి నియమితులయ్యారు. గురువారం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఉద్యోగులు స్వాగతం పలకగా.. అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం కార్యాలయంలో ఆలయ ఉప కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. దీనిలో భక్తులకు మెరుగైన సేవలందించడంలో ఉపకమిషనర్ స్థాయి కలిగిన 14 ముఖ్య ఆలయాల్లో పెనుగంచిప్రోలు భక్తుల సంతృప్తి స్థాయిలో 52.7 శాతంతో చివరి స్థానంలో ఉంది. దీనిపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్ ఆలయాల ఈవోలతో సమీక్షించారు. భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన పెనుగంచిప్రోలు ఆలయ ఈవో కిశోర్‌కుమార్‌ను వెంటనే తొలగించాలని, ఎక్కడా పోస్టింగ్ ఇవ్వొద్దని ఆదేశించారు. దీంతో బుధవారం రాత్రికే మూడు నెలల దీర్ఘకాలిక సెలవుపై ఈవో కిశోర్‌కుమార్ వెళ్లిపోయారు. ఆ స్థానంలో మహేశ్వరరెడ్డి నియమితులయ్యారు.



ఇది పేరెంట్స్-ఏఐ మీటింగ్!

పాఠశాలకు వచ్చిన పేరెంట్ తాను ఫలానా విద్యార్థి తండ్రి లేదా తల్లి అనగానే ఒక ఏఐ అప్లికేషన్ వారిని పేరు పెట్టి పలకరించి, పిల్లల చదువుకు సంబంధించి సమగ్ర నివేదిక తెలుగులో చెబితే ఎంత బాగుంటుందో కదా.. అలాంటి ప్రయత్నం చేశారు కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయుడు వెలుగుబంట్ల వెంకట రమణమూర్తి. దీనికోసం ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఉండే గూగుల్ జెమినైకు పాఠశాల విద్యార్థుల డేటాను కమాండ్స్ రూపంలో ఇచ్చారు. దీంతో పేరెంట్ లేదా ఉపాధ్యాయుడు ఈ అప్లికేషన్‌లో విద్యార్థి పేరు టైప్ చేయగానే ఆ స్టూడెంట్ పరీక్షల ప్రోగ్రెస్ అంతా ఎనలైజ్ చేసి తెలుగులో సమగ్ర నివేదిక ఇస్తుంది. ఏ సబ్జెక్టుల్లో విద్యార్థి వెనుకబడి ఉన్నాడు, ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందనే విషయాలను ప్రాక్టికల్‌గా చెబుతుంది. శుక్రవారం జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఈ అప్లికేషన్‌ను ఉపయోగించే విద్యార్థుల ప్రోగ్రెస్‌ను ఇక్కడి టీచర్లు వివరించనున్నారు.

- కరప, న్యూస్‌టుడే

లోన్.. ఒక మాయ ఆపై.. అదీ మాయం!



- ఈనాడు అమరావతి

● ఓ ప్రైవేటు కాలేజీలో పనిచేసే లెక్చరర్‌కు.. బ్యాంకు లోగో డీపీగా ఉన్న వాట్సప్ నంబరు నుంచి సందేశం వచ్చింది. మీ పాన్‌కార్డు అప్‌డేట్ చేయాల్సి ఉందన్నది దాని సారాంశం. అందులోని లింక్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇది నిజమేనని నమ్మి లింక్‌ను క్లిక్ చేసి.. అకౌంట్, మొబైల్ నంబరు, డెబిట్ కార్డు పిన్, గ్రిడ్ నెంబర్లు, పాన్ కార్డు వివరాలను నమోదుచేశారు. కొద్ది సేపటికే బ్యాంకు ఖాతాలో రూ.11 లక్షలు క్రెడిట్ అయినట్లు అతడి ఫోన్‌కు ఎస్ఎంఎస్ వచ్చింది. ఇంకాసేపట్లో రూ.2 లక్షలు, రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.లక్ష చొప్పున డెబిట్ అయినట్లు సమాచారం వచ్చింది. ఆగమేఘాల మీద బ్యాంకుకు వెళ్లి ఆరా తీశారు. వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేసినట్లు, మంజూరు కాగానే.. ఆ మొత్తం వివిధ ఖాతాలకు బదిలీ అయినట్లు సిబ్బందిచెప్పారు.

● సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న యువకుడికి ఇటీవల ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. 'మీకు క్రెడిట్ కార్డు పంపించాం.. వచ్చిందా?' అని అడిగాడు. తనకు అవసరం లేదని చెప్పగానే.. కార్డు క్లోజ్ చేయాలంటే కొన్ని వివరాలు కావాలని అవతలి వ్యక్తి అడిగాడు. సరే అని పాన్ నంబరు, పుట్టిన తేదీ, ఈ-మెయిల్ ఐడీ వివరాలు చెప్పాడు. అనంతరం ఓటీపీ వివరాలను కూడా చెప్పాడు. తర్వాత కొద్ది సేపటికే పర్సనల్ లోన్ కోసం చేసిన దరఖాస్తు స్వీకరించినట్లు వచ్చిన మెయిల్ చూసి యువకుడు ఆశ్చర్యపోయాడు. వెంటనే కస్టమర్ కేర్ సెంటర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. మరుసటి రోజే అతడి బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమయ్యాయి. అనంతరం ఆ మొత్తం వేరే ఖాతాకు బదిలీ అయిపోయింది.

డిజిటల్ సాంకేతికత పెరగడంతో ప్రతి ఒక్కరూ బ్యాంకు లావాదేవీలను ఫోన్‌లోనే నిర్వహిస్తున్నారు. ఈ సౌకర్యాలు ఎంతగా పెరుగుతున్నాయో అంతే వేగంగా సైబర్ నేరాలూ చోటుచేసుకుంటున్నాయి. వీటి గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వాలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఎంతగానో శ్రమిస్తున్నాయి. అయితే ఒక రకమైన సైబర్ నేరం గురించి జనాలకు అవగాహన పెరగగానే ఈ నేరగాళ్లు సరికొత్త విధానానికి తెరలేపుతున్నారు. అందులో భాగంగానే వ్యక్తిగత రుణాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వైనం బెంబేలెత్తిస్తోంది.

మోసం చేసే విధానం..

మన వివరాలు తెలుసుకుని.. మన ప్రమేయం లేకుండానే రుణాలకు దరఖాస్తు చేసి.. మంజూరైన తర్వాత, ఆ మొత్తాన్ని ఇతర ఖాతాలకు దారి మళ్లించేస్తున్నారు. దీని నుంచి తేరుకునే లోగానే అంతా అయిపోతోంది. ఇలా కొత్త పంథాలో మొదలైన మోసాలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

నెట్ బ్యాంకింగ్, మొబైల్ యాప్‌లే ఆధారం

సాధారణంగా బ్యాంకులు తమ ఖాతాదారుల లావాదేవీలు, వారి సిబిల్ స్కోర్‌ల ఆధారంగా రుణాలిస్తుంటాయి. ఈ మధ్య కాలంలో ఎటువంటి తనిఖీలు లేకుండానే ఖాతాదారులకు నిమిషాల వ్యవధిలో రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఇందులో భాగంగా సంబంధిత వ్యక్తి స్థాయిని బట్టి మొత్తాన్ని ఆమోదిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఎవరికి ఎంత పరిమితి ఉంది? తదితర వివరాలను మోసగాళ్లు వివిధ మార్గాల ద్వారా తెలుసుకుంటున్నారు. వాటి ఆధారంగా ఆ వ్యక్తి నుంచి కొన్ని వివరాలు రాబడుతున్నారు. అనంతరం ఇంటర్‌నెట్, మొబైల్ బ్యాంకింగ్‌లో లాగిన్ అయ్యి రుణం కోసం దరఖాస్తు చేస్తున్నారు. ఆ డబ్బులు ఖాతాలో జమ కాగానే ఇతర అకౌంట్లకు మళ్లిస్తున్నారు.

వెంటనే అప్రమత్తం కావాలి

- మోసం బారిన పడితే వెంటనే మీ బ్యాంకును సంప్రదించాలి. ఖాతాను ఫ్రీజ్ చేయించాలి.
- నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కానీ, 1930కు ఫోన్ చేసి కానీ ఫిర్యాదు చేయాలి.
- సంబంధిత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆధారాలతో ఫిర్యాదు చేయాలి.
- నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకు యాప్‌లో పాస్‌వర్డ్‌లను మార్చుకోవాలి.
- తరచూ బ్యాంకు స్టేట్‌మెంట్లను పరిశీలిస్తుండాలి. అనుమానాస్పద లావాదేవీలు కనిపిస్తే.. అప్రమత్తం కావాలి.

పొలం నుంచి వంటింటికి..



పసుపురైతు మార్కెటింగ్ భళా!

ఛత్రపతి శంభాజీనగర్: ఆరుగాలం కష్టపడే రైతులు తమ ఉత్పత్తులను వ్యాపారుల చేతుల్లో పెట్టి గిట్టుబాటు ధరల కోసం ప్రాధేయపడుతుంటారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంత వాశిమ్ జిల్లాకు చెందిన పసుపురైతు శివాజీ కుర్హే తానే వ్యాపారిగా మారి రెక్కల కష్టానికి తగ్గ ఫలితం పొందుతున్నారు. తన పొలంలో పండించిన పసుపును ఈయన ఇళ్ల ముంగిటకు తీసుకువెళతారు. వాహనంపై ఓ యంత్రం అమర్చుకొని, వినియోగదారుల అవసరం మేరకు అక్కడికక్కడే పసుపు మరపట్టించి విక్రయిస్తారు. ఇలా రోజుకు 50 కిలోల పసుపుపొడిని అమ్ముతున్నట్లు శివాజీ తెలిపారు. "ఇదే పసుపును నేను వ్యాపారులకు అమ్మితే కిలోకు రూ.130 ఇస్తారు. ఇప్పుడు దాని కంటే రెట్టింపుగా రూ.300కు విక్రయిస్తున్నా" అని వివరించారు. స్వచ్ఛమైన పసుపును కల్తీ లేకుండా కళ్ల ముందే మరపట్టించి ఇస్తుండటంతో వినియోగదారులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మహారాష్ట్రకు చెందిన బొప్పాయి-15 మొక్కలు తూర్పుగోదావరి జిల్లా కడియం నర్సరీల్లో కనువిందు చేస్తున్నాయి. పూర్తి హైబ్రిడ్ రకం కావడంతో 3 నెలలకే కాపు కొచ్చాయి. నీటి ఎద్దడిని తట్టుకోవడంతో పాటు తెగుళ్లను సమర్థంగా ఎదుర్కొంటోందని ఇక్కడి రైతులు చెబుతున్నారు. 3 అడుగుల ఎత్తున్న మొక్కే విరగ్గాస్తోంది. దీనిపై జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావును సంప్రదించగా 'సాధారణంగా బొప్పాయి 5 అడుగుల ఎత్తు నుంచి కాస్తుంటాయి. 3 అడుగుల మొక్కకే కాయలు కాయడం డ్వార్ఫ్ జాతి ప్రత్యేకత' అని తెలిపారు.

– న్యూస్‌టుడే, కడియం



పదిలంగా

అల్లుకున్న పొదరిల్లు...

అంతా కలిపి 232 చదరపు గజాల్లో ఇల్లు. రెండు వైపులా చిన్న వరండాలు. ఆ విస్తీర్ణంలోనే సుమారు కొన్ని వందల రకాల ఫల, పుష్ప, కూర జాతుల మొక్కలు పెంచుతున్నారంటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. విశాఖలోని గాజువాక వినాయకనగర్ వుడాకాలనీకి చెందిన స్టీల్‌ప్లాంటు విశ్రాంత ఉద్యోగి మాసవరపు శ్రీనివాస వరప్రసాద్, ఐశ్వర్య దంపతులు తమ ఇంటి డాబాను, ఇంటి పరిసరాలను ఓ ఉద్యానవనంలా మార్చేశారు. ఆ ఇంటికి వెళితే బుజ్జి బుజ్జి బోన్సాయ్ మొక్కల అందాలు, వివిధ వర్ణాల్లో విరగబూసిన పూలు.. చూపు తిప్పుకోనివ్వవు. పదేళ్లుగా మిద్దె పంటలు పండిస్తున్నామని, రోజుకు 4 నుంచి 6 గంటల సమయం కేటాయిస్తామని వరప్రసాద్ దంపతులు చెబుతున్నారు. అంతే కాకుండా మిద్దె పంటలపై ఆసక్తి ఉన్నవారందరినీ కలిపి 'నేచర్ గార్డెనర్స్' పేరుతో ఐశ్వర్య ప్రత్యేక వేదికనూ ఏర్పాటు చేశారు. సుమారు 2,300 మంది ఇందులో సభ్యులుగా చేరారు. వీరందరికీ సేంద్రియ ఎరువులతో మొక్కలు ఎలా పెంచాలనేదానిపై అవగాహన కల్పిస్తున్నానని, ఇంట్లోనే సీడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి విత్తనాలు అందిస్తుంటానని ఆమె తెలిపారు. మిద్దె పంటల సాగుపై అవగాహన ర్యాలీలు, సదస్సులు సైతం ఐశ్వర్య నిర్వహిస్తుంటారు. ఆమె కృషికి గుర్తింపుగా గత నెల 22న దిల్లీలో జరిగిన నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సదస్సులో మొక్కల పెంపకంపై జాతీయ అవార్డు సైతం వచ్చింది. **– న్యూస్‌టుడే, గాజువాక**




గబ్బిలాలను ఆరాధించే గ్రామం

ఈటీవీ భారత్: బిహార్‌లో పట్నాకు 40 కి.మీ.ల దూరాన ఉన్న సర్సాయ్ గ్రామం గబ్బిలాలకు ప్రసిద్ధి. గ్రామంలోని కొలను చుట్టూ ఉన్న భారీవృక్షాల నిండా లక్షల సంఖ్యలో ఇవి వేలాడుతుంటాయి. చాలా కాలంగా ఈ చెట్లు ఆవాసం కల్పిస్తున్న గబ్బిలాలు గ్రామ రక్షకులుగా స్థానికుల నమ్మకం. వేసవిలో వాటి కోసం గ్రామంలోని ఇళ్ల మిద్దెలపై నీళ్లు పెడతారు. గబ్బిలాలకు ఎవరైనా హాని తలపెడితే జరిమానా విధిస్తారు. గ్రామస్థులు జబ్బు పడినా త్వరగా నయం కావాలని వీటిని ప్రార్థిస్తారు. విశ్వాసం, పర్యావరణ పరిరక్షణ మిళితమైన మంచి సంప్రదాయానికి సర్సాయ్ ప్రతీక అని, ఈ గబ్బిలాలు తమకు ఆధ్యాత్మిక వారసత్వ చిహ్నాలని గ్రామంలోని ఆలయ పూజారి శంభునాథ్ శర్మ తెలిపారు.

10 రోజుల్లో హైదరాబాద్-విజయవాడ మధ్య పెద్ద విమానాలు

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి ఇండిగో హామీ

ఈనాడు, దిల్లీ: హైదరాబాద్-విజయవాడల మధ్య పెద్ద విమానాల రాకపోకలు లేకపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందువల్ల వైడ్‌బాడీ విమానాలు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని తెదేపా ఎంపీల బృందం చేసిన విజ్ఞప్తిపై పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు స్పందించారు. ఆయన గురువారం తన కార్యాలయంలో ఎంపీలు కేశినేని శివనాథ్, జీఎం హరీష్ బాలయోగిలతో కలిసి ఇండిగో విమానయాన సంస్థ ప్రత్యేక డైరెక్టర్ ఏకే సింగ్‌తో చర్చించారు. విజయవాడతో పాటు ఏలూరు, గుంటూరు, నరసరావుపేట, మచిలీపట్నం, ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ప్రజలంతా విజయవాడ విమానాశ్రయంపైనే ఆధారపడినందున వారి అవసరాలకు తగ్గట్టు విమానాలు నడిపేందుకు చర్యలు తీసుకోవాలని ఇండిగో డైరెక్టర్‌కు సూచించారు. ఎంపీ కేశినేని శివనాథ్ కూడా ప్రయాణికుల ఇబ్బందుల గురించి వారికి వివరించారు. అన్నింటినీ సావధానంగా ఉన్న ఏకే సింగ్... వారం, పదిరోజుల్లో హైదరాబాద్-విజయవాడల మధ్య వైడ్‌బాడీ విమాన సర్వీసులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ కేశినేని శివనాథ్ కోరినట్లు విజయవాడ నుంచి వారణాసి, అహ్మదాబాద్, పుణె, కొచ్చి, గోవాలకు విమాన సర్వీసులు మొదలుపెట్టేందుకు రూట్‌మ్యాపింగ్ చేస్తామని స్పష్టంచేశారు. వైడ్‌బాడీ విమానాలు వస్తే సీట్ల సమస్యతో పాటు, లగేజీ విషయంలోనూ ఇబ్బందులు తప్పుతాయని శివనాథ్ పేర్కొన్నారు.



వ్యాపారం అంటే విక్రయాలే కాదు..

వ్యాపారం అంటే అమ్మకాలు మాత్రమే కాదు..ఇంకా చాలా ఉంటాయి. అవేంటంటే.. ✦ ఎదుటివారు చెప్పింది వినడం. ✦ నిరంతరం నేర్చుకోవడం. ✦ ప్రతిరోజు మెరుగుపడుతుండటం.

– ప్రకాశ్ దడ్లాని, ఎలక్ట్రానిక్ పరికరాల వ్యాపార నిపుణుడు

వరుస మరణాలతో వణుకు

- ఐదుకు చేరిన 'స్క్రబ్ టైఫస్' మృతులు
- విజయనగరం, పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాల్లో మరణాలు
- రాష్ట్రమంతటా పాజిటివ్ కేసులు వెలుగులోకి
- వ్యాక్సిన్ లేని వ్యాధికి.. అప్రమత్తతే మందు
- ప్రాథమిక దశలోనే మేల్కొంటే ప్రాణాపాయం తప్పినట్లే



ఈనాడు, అమరావతి: శరీరంపై ఏదో కుడితే అది దోమో లేక చీమో అని తేలిగ్గా తీసుకోవద్దు.. చర్మంపై కాలినట్లు చిన్న మచ్చ లేదా దద్దుర్లు ఏర్పడినా.. ఒకట్రెండు రోజులకు తలనొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు కనిపించినా అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు. అది 'స్క్రబ్ టైఫస్' కావచ్చు. కొంతమంది వైద్యులను సంప్రదించకుండా ఏవో మాత్రలు వాడి కాలయాపన చేసి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు గత కొన్నేళ్లుగా వెలుగుచూస్తున్నా.. ఈసారి వరుస మరణాలు వణుకు పుట్టిస్తున్నాయి. నల్లి వంటి ఈ చిన్న కీటకం కరవడం వల్ల ప్రాణాలు పోయే ప్రమాదం పొంచి ఉందని.. జాగ్రత్త వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కీటకాల తాకిడి ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు అనుకూల వాతావరణం కావడంతో వ్యాధి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచిస్తోంది. తాజా పరిస్థితిపై వైద్యారోగ్యశాఖ అప్రమత్తం అయింది. ఈ వ్యాధిని ప్రాథమిక దశలో వైద్య పరీక్షలతో, సరైన వైద్యంతో కట్టడి చేయవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలే రక్ష..:

✦ ఇంటి పరిసరాలు, పశువుల పాకలు శుభ్రంగా ఉంచాలి.
✦ తోటలు, గడ్డి, పొదలు ఉన్న ప్రాంతాలను తరచూ చక్కదిద్దుతుండాలి.
✦ రాత్రి వేళల్లో ఈ కీటకాల సంచారం ఎక్కువ. ఇంట్లో ఎలుకలు, కీటకాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
✦ పిల్లలు, పెద్దలు శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
✦ జాగ్రత్తలు తీసుకోకుండా ఆరుబయట నిద్రించడం, నేలపై నిద్రించడం శ్రేయస్కరం కాదు.
✦ ఇంట్లో పాత మంచాలు, ఫర్నిచర్ సందుల్లో కీటకాలు చొరబడే అవకాశం ఉంది. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.
✦ పరుపులు, దుప్పట్లు పూర్తిగా దులిపి, శుభ్రం చేశాకే వినియోగించాలి.
✦ స్క్రబ్ టైఫస్ వ్యాధి పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

'పబ్లిక్ హెల్త్ ల్యాబ్'లలో కేసుల పరీక్షలు

రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ అనుమానిత కేసులను ప్రధాన ఆసుపత్రులతోపాటు.. బోధనాసుపత్రులు, జీజీహెచ్‌లలో పరీక్షలకు వీలుంది. 17 ప్రజారోగ్య ప్రయోగశాలల్లోనూ సేవలు అందుబాటులో ఉన్నాయి.

'స్క్రబ్ టైఫస్'తో చనిపోయినవారు

1. విజయనగరం జిల్లాకు చెందిన సీహెచ్.రాజేశ్వరి (40) నవంబరు 26న స్క్రబ్ టైఫస్ అనుమానిత లక్షణాలతో మృతిచెందారు. ఈమె తీవ్ర శ్వాసకోశ సమస్యలతో చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.
2. పల్నాడు జిల్లాకు చెందిన ఎం.జ్యోతి (10) నవంబరు 1న స్క్రబ్ టైఫస్‌తో మృతిచెందారు. ఈమె శరీరంలో పలు అవయవాలు దెబ్బతిన్నట్లు వైద్యులు గుర్తించారు.
3. బాపట్ల జిల్లాకు చెందిన ఎస్కే మస్తాన్‌బీ (43) నవంబరు 14న మృతిచెందారు. ఈయనకు తీవ్ర జ్వరం, మల్టీఆర్గాన్ ఫెయిల్యూర్, కిడ్నీలు దెబ్బతినడం, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో చనిపోయారని తేల్చారు.
4. పల్నాడు జిల్లాకు చెందిన వై.నాగమ్మ (64) నవంబరు 16న చనిపోయారు. ఈమె మరణానికి శరీరంలో తీవ్ర ఇన్‌ఫెక్షన్, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమని వైద్యులు నిర్ధారించారు.
5. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన సంతోషి (5) డిసెంబరు 4న మృత్యువాత పడ్డారు. ఈ చిన్నారి మరణానికి మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణమని వైద్యులు గుర్తించారు.

ఏమిటీ వ్యాధి.. కట్టడి ఎలా..

✦ **వ్యాధి:** స్క్రబ్ టైఫస్
✦ **వ్యాధి కారక బ్యాక్టీరియా:** ఓరింయెంటియా సుట్సుగముషి
✦ **వ్యాప్తి:** నల్లిని పోలిన చిగ్గర్ మైట్ కీటకం కాటు వల్ల స్క్రబ్ టైఫస్ వ్యాధి మనుషులకు సోకుతుంది. వ్యక్తి నుంచి వ్యక్తికి సోకే అంటువ్యాధి కాదు.
✦ **కీటకాలకు ఆవాసం:** నిర్వహణ సవ్యంగా లేని కూరగాయల తోటలు, పొలాలు, గడి మైదానాలు, నదీ తీరాలు, ఇసుక మేటలు.. పశువుల పాకలు, ఎలుకలు, పశువులు ఇతర జంతువుల శరీరం..
✦ **బాధిత వ్యక్తులు:** పొలాల్లో, తోటల్లో పనిచేసే రైతులు, నిర్వహణలో లేని గడ్డి మైదానాలు, తోటల్లో ఆడే పిల్లలు.
✦ **వ్యాధి లక్షణాలు:** నీరసం, తీవ్ర జ్వరం, వణుకు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు.... కీటకం కాటు వేసిన చోట నల్లని మచ్చలా ఏర్పడి, దద్దుర్లు, జీర్ణ, శ్వాసకోశ సమస్యలు.. సకాలంలో వైద్యం అందకపోతే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, మెదడు, కిడ్నీ, శరీరంలోని ఇతర భాగాల పనితీరుపై ప్రభావం చూపి కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం.
✦ **మరణాల రేటు:** సకాలంలో మేల్కొని చికిత్స పొందితే మరణాల రేటు 2% లోపు. చికిత్సలో జాప్యం జరిగితే తీవ్రతను బట్టి 6% నుంచి 30% వరకు.
✦ **వైద్య పరీక్షలు:** ర్యాపిడ్, వైల్- ఫెలిక్స్, ఐజీఎం ఎలీసా, ఇతర పరీక్షల ద్వారా వ్యాధి గుర్తించే వీలుంది. ప్రాథమిక దశలో వైద్యులు సూచించిన యాంటీబయాటిక్స్ వాడితే నయం అవుతుంది.

రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసుల తీవ్రత ఇలా..

సంవత్సరం	అనుమానిత కేసులకు పరీక్షలు	పాజిటివ్ కేసులు
2023	4,131	579
2024	6,215	803
2025 (ఇప్పటివరకు)	4,724	774 (స్థానికేతరులతో కలిపి 1,317)

స్క్రబ్ టైఫస్ అనుమానిత కేసులకు పరీక్షలు

వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్

ఈనాడు, అమరావతి: స్క్రబ్ టైఫస్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేలా చర్యలు చేపట్టామని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రుల్లో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆసుపత్రుల్లో 1.07 కోట్ల అజిత్రోమైసిన్, 80 లక్షల డాక్సీసైక్లిన్ మాత్రల నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ల్యాబుల్లో పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచామని, అనుమానిత కేసుల నమూనాలు ఆయా కేంద్రాల్లో పరీక్షిస్తామని తెలిపారు. వైద్యశాలల్లో ఏటా స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్నాయని, ఎవ్వరూ ఆందోళన చెందొద్దన్నారు. శరీరంపై నల్లమచ్చలు, వాపు, జ్వరం లాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

గడువు ముగిసిందని దిగులొద్దు!

- ఎల్ఆర్ఎస్-2020లో పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం
- వైకాపా ప్రభుత్వంలో పక్కన పెట్టిన వాటికి మోక్షం
- అనధికార లేఔట్లలో ప్లాట్లు కొన్నవారి వెతలపై ప్రభుత్వం సానుకూలత


ఈనాడు, అమరావతి: అనుమతుల్లేని లేఔట్‌లో కొన్న ఇంటి స్థలం క్రమబద్ధీకరణ కోసం గతంలో దరఖాస్తు చేసినా ఫీజులు సకాలంలో చెల్లించలేక గడువు ముగిసిపోయి అవకాశం కోల్పోయామని విచారిస్తున్నారా? ఆ దిగులు వద్దంటూ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇలాంటి పెండింగ్ దరఖాస్తులను కూడా అనధికార లేఔట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్-2025లో పరిష్కరించుకోవడానికి అవకాశమిచ్చింది. 2025 జూన్ 30కి ముందు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్లాట్లను ఎల్ఆర్ఎస్-2025లో క్రమబద్ధీకరించనున్నారు. 2026 జనవరి 23లోగా దరఖాస్తులు చేసుకోవాలి. ఇదే సమయంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఎల్ఆర్ఎస్-2020లో పెండింగ్‌లో ఉన్న దాదాపు 6 వేల దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

వేడుకున్నా పట్టించుకోని గత ప్రభుత్వం

వైకాపా హయాంలో ఎల్ఆర్ఎస్-2020 తీసుకొచ్చారు. 2019 ఆగస్టు 31కి ముందు రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్లాట్లను అందులో కమబద్ధీకరించుకోవచ్చని ప్రకటించారు. వచ్చిన దరఖాస్తుల్లో 6 వేలు గడువు ముగిసిందని పక్కన పెట్టారు. పెండింగ్ దరఖాస్తుదారుల్లో అత్యధికులు గడువులోగా క్రమబద్ధీకరణ రుసుములు చెల్లించలేకపోయారు. అధికారులు అడిగిన పత్రాలు అందించలేకపోయారు. గడువు పొడిగించి, క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి అప్పట్లో ఎంతో మంది విజ్ఞప్తులు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి పట్టణ స్థానిక సంస్థలు అనుమతులివ్వడం లేదు. కొనుగోలుదారుల సమస్యను దృష్టిలో పెట్టుకుని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ మేరకు పట్టణాభివృద్ధి సంస్థలు, పుర, నగరపాలక సంస్థల వైస్ ఛైర్మన్లు, కమిషనర్లు ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాలని దరఖాస్తుదారులకు సమాచారం పంపుతున్నారు. వివాదాల్లేని, అర్హత కలిగిన అన్ని ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించనున్నారు.

ఇన్-ప్రిన్సిపల్ లేఔట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణ సులువు

✦ ఎల్ఆర్ఎస్-2020లో అనధికార లేఔట్‌లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వాటిలోని మొత్తం ప్లాట్ల ఆధారంగా ఇన్-ప్రిన్సిపల్ లేఔట్లు రూపొందించారు. ఇవి పట్టణ ప్రణాళిక అధికారులు అప్పట్లో సూత్రప్రాయంగా ఆమోదించిన లేఔట్లు. నిబంధనల ప్రకారం వీటిలో రోడ్లు, కాలువలు, పార్కులకు స్థలాలు మార్కింగ్ చేసి, మిగిలిన ప్రాంతంలో ప్లాట్లు చూపిస్తారు.
✦ ఎల్ఆర్ఎస్-2020లో రాష్ట్రవ్యాప్తంగా 9 వేల వరకు ఇన్-ప్రిన్సిపల్ లేఔట్లు తయారు చేశారు. వీటిలో క్రమబద్ధీకరించుకోగా మిగిలిన ప్లాట్లకు సంబంధించిన యజమానులు ప్రస్తుత ఎల్ఆర్ఎస్‌లో ఫీజులు చెల్లించిన వెంటనే క్రమబద్ధీకరణ పూర్తవుతుంది.



మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు భూమి దస్తావేజులు ఇస్తున్న రైతు తులసిబాబు

7,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీస్

రాజధాని భూసమీకరణ రైతులతో మంత్రి నారాయణ

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, అమరావతి: రాజధాని అమరావతి పరిధిలో రెండో దశ భూసమీకరణ చేసే 7500 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో స్మార్ట్ ఇండస్ట్రీస్, అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ క్రీడా నగరం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి నారాయణ తెలిపారు. వాటి ద్వారా యువతకు ఉద్యోగాలు వస్తాయని, ఆయా ప్రాంతాలు ఆర్థికాభివృద్ధి సాధిస్తాయన్నారు. వచ్చే ఏడాదిలో స్పోర్ట్స్‌సిటీ పనులు ప్రారంభమవుతాయన్నారు. గురువారం పల్నాడు జిల్లా అమరావతి మండలం యండ్రాయి గ్రామంలో వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి రైతులతో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. రెండో దశ భూసమీకరణపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధాని రైల్వే మార్గం వెళుతున్న గ్రామాల్లో రైతులకు నష్టం జరగకుండా రెండో దశ భూసమీకరణకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఏడు గ్రామాల్లో 16,666 ఎకరాలు భూసేకరణ ద్వారా తీసుకుని, కాలుష్యరహిత పరిశ్రమల ఏర్పాటే ముఖ్యమంత్రి ఉద్దేశ్యమన్నారు. ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తీసుకోగా. . 90 శాతం మంది ఆమోదం తెలిపారన్నారు. రైతులకు క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు కోసం ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వినతి పత్రం ఇచ్చామని, ప్రస్తుతం అది పరిశీలనలో ఉందన్నారు. ప్రస్తుతం రూ.50 వేల కోట్ల పనులు జరుగుతున్నాయని, రోజు 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి వివరించారు.

మంత్రి సమక్షంలో నాలుగెకరాలు ఇచ్చిన రైతు.. యండ్రాయిలో రైతులతో సమావేశమైన మంత్రి నారాయణకు అదే గ్రామ రెవెన్యూలో భూమి ఉన్న రైతు నంబూరు తులసిబాబు(బలరామ్) తన నాలుగెకరాలు భూసమీకరణ ద్వారా ప్రభుత్వానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు భూమికి సంబంధించిన దస్తావేజులను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు అందజేశారు. తులసిబాబు స్ఫూర్తితో రైతులు ముందుకు రావాలని మంత్రి కోరారు.

టోవోరాగ్.. కౌజుపిట్ట గుడ్లు

• పుతిన్ ఇష్టపడే ఆహారం ఇదే..

ఇంటర్నెట్ డెస్క్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గురువారం భారత పర్యటనకు వచ్చారు. నాలుగేళ్ల తర్వాత మన దేశానికి వచ్చిన ఆయన పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో ప్రైవేటు విందులో పాల్గొన్నారు. పుతిన్ తేలికగా జీర్ణమయ్యే, సంప్రదాయ వంటకాలను ఇష్టపడతారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో రష్యాలో ప్రసిద్ధిగాంచిన టోవోరాగ్‌ను (కాటన్ చీజ్, తేనె కలిపి చేసే వంటకం) తింటారు. దీంతోపాటు కౌజుపిట్ట గుడ్లు, తాజా పళ్లతో చేసే జ్యూస్ తీసుకుంటారు. ప్రొటీన్ కోసం చేపలను ఎక్కువగా తింటారు. స్టర్జియన్ చేప, గొర్రె పిల్ల మాంసం అంటే పుతిన్‌కు చాలా ఇష్టం. చక్కెరతో చేసే పదార్థాలకు ఆయన దూరంగా ఉంటారు. టమాటాలు, దోసకాయల వంటి కూరగాయలతో చేసే



సలాడ్‌లను తీసుకుంటారు. చాలా అరుదుగా ఐస్‌క్రీమ్, పేస్ట్రీలు వంటివి తింటారు. అధికారిక డిన్నర్లలో ఎక్కువగా చేపలతో చేసే సూప్, మాంసాహారానికి ప్రాధాన్యమిస్తారు.

కేరళవాసికి రూ.61 కోట్ల అబుధాబీ లాటరీ జాక్‌పాట్

ఇంటర్నెట్ డెస్క్: సౌదీ అరేబియాలో ఉంటున్న కేరళవాసికి లాటరీలో భారీ జాక్‌పాట్ తగిలింది. అబుధాబీ వేదికగా నిర్వహించే 'బిగ్ టికెట్ డ్రా సిరీస్ 281' లాటరీలో పి.వి.రాజన్ రూ.61.38 కోట్లు (25 మిలియన్ల దిర్హామ్‌లు) గెలుచుకున్నారు. ఈయన నవంబరు 9న ఈ టికెటు కొనుగోలు చేయగా, డిసెంబరు 3న తీసిన లక్కీ డ్రాలో విజేతగా నిలిచారు. గత పదిహేనేళ్లుగా రాజన్ 'బిగ్ టికెట్' లాటరీ కొంటుండగా.. ఇన్నాళ్లకు అదృష్టం వరించింది. లాటరీ నిర్వాహకులు రిచర్డ్, బౌచ్రా సమక్షంలో గత నెల విజేత అయిన మరో భారతీయుడు శరవణన్ వెంకటాచలం లక్కీ డ్రా తీశారు. లాటరీ తగిలిన విషయాన్ని నిర్వాహకులు ఫోనులో చెప్పగా, రాజన్ ఉబ్బితబ్బిబ్బు అయ్యారు. ఈ డబ్బును తన 15 మంది సహచరులతో పంచుకుంటానని సౌదీ కంపెనీలో సూపర్‌వైజరుగా పనిచేస్తున్న రాజన్ తెలిపారు.



లక్కీ డ్రా తీస్తున్న లాటరీ నిర్వాహకులు

'బిగ్ టికెట్ అబుధాబీ' ప్రతినెలా లక్కీడ్రా నిర్వహిస్తుంది. ఈసారి 10 మంది కన్సోలేషన్ విజేతలు రూ.2.45 లక్షల (10 వేల దిర్హాములు) చొప్పున అందుకున్నారు. వీరిలోనూ ముగ్గురు భారతీయులు ఉన్నారు.

మా బంధం ఎవరికీ వ్యతిరేకం కాదు

• భారత్ ఎదుగుదలను కొందరు ఓర్వలేకపోతున్నారు
• మోదీ సుదృఢ నేత: పుతిన్



దిల్లీ: భారత్, రష్యా బంధం ఏ ఒక్కరికీ, ఏ దేశానికీ వ్యతిరేకం కాదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. ఈ బంధం రెండు దేశాల ప్రయోజనాలను కాపాడుకోవడానికేనని పేర్కొన్నారు. భారత్ పర్యటన నేపథ్యంలో ఆయన 'ఇండియా టుడే' ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. అది గురువారం విడుదలైంది. 'అంతర్జాతీయ మార్కెట్లో భారత్ ఎదుగుదలను కొంత మంది జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే రష్యాతో సన్నిహిత సంబంధాలను అడ్డు పెట్టుకుని భారత్ ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజకీయ కారణాలతో కృత్రిమ అడ్డంకులను సృష్టిస్తున్నారు' అని పుతిన్ వ్యాఖ్యానించారు. పాశ్చాత్య దేశాల ఆంక్షలు భారత్, రష్యా ఇంధన బంధంపై పెద్దగా ప్రభావం చూపలేదని స్పష్టం చేశారు. 'బయటి నుంచి ఒత్తిళ్లు వస్తున్నా నేనుగానీ, మోదీగానీ మా బంధాన్ని ఎవరికీ వ్యతిరేకంగా వినియోగించుకోలేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన సొంత ఎజెండా ఉంది. ఆయనకు ప్రత్యేక లక్ష్యాలున్నాయి. మేము మా లక్ష్యాలపై దృష్టి పెట్టాం. అవి ఎవరికీ వ్యతిరేకం కాదు. మా ప్రయోజనాల కోసమే' అని పుతిన్ పేర్కొన్నారు.

■ ఇప్పటికే 90శాతం ద్వైపాక్షిక వాణిజ్య లావాదేవీలు సొంత కరెన్సీల్లో చోటుచేసుకుంటున్నాయని, ఓ 10శాతంలో పలు మధ్యవర్తిత్వ సంస్థల కారణంగా ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. వాటికి పరిష్కారాలను చూస్తున్నామని వెల్లడించారు.

■ రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేయడంపై అమెరికా అభ్యంతరాలను పుతిన్ తోసిపుచ్చారు. రష్యా చమురును కొనడానికి అమెరికాకు హక్కున్నప్పుడు భారత్‌కు ఎందుకు ఉండదని ప్రశ్నించారు.

■ అణు ఇంధన అవసరాల కోసం అమెరికా ఇప్పటికీ తమవద్ద అణు ఇంధనాన్ని కొంటోందని తెలిపారు.

■ పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో భారత్ గత 9 నెలల్లో చమురు దిగుమతులను తగ్గించిన మాట వాస్తవమేనని పుతిన్ అంగీకరించారు. అయితే అది స్వల్ప సర్దుబాటేనని, వాణిజ్య టర్నోవరులో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

ఒత్తిళ్లకు మోదీ తలొగ్గరు

'గతంలో భారత్‌ను చూసినట్లు ఇప్పుడు చూడలేరు. ప్రధాని మోదీ ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గే రకం కాదు. ఆయనను చూసి భారత ప్రజలు గర్వించాలి. ఆయన వైఖరి దృఢంగానూ, ముక్కుసూటిగానూ ఉంటుంది. ఎవరితోనూ ఘర్షణపడే తత్వం కాదు. మా లక్ష్యం ఘర్షణలను ప్రోత్సహించడం కాదు. మా చట్టబద్ధ హక్కులను కాపాడుకోవడమే. భారత్ అదే చేస్తోంది' అని పుతిన్ పేర్కొన్నారు. 'దేశం కోసం మోదీ సవాళ్లతో కూడిన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఇందులో తాను మొదటి స్థానంలో ఉండి.. అధికార వ్యవస్థను ఆ తరువాత భాగస్వామిని చేస్తున్నారు' అని పుతిన్ వివరించారు.

■ గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400 క్షిపణులను అదనంగా భారత్ సేకరించడంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. రష్యా కేవలం రక్షణ సాంకేతికతను భారత్‌కు అమ్మడం లేదని, దానిని పంచుకుంటోందని తెలిపారు.

ఈసీకి అదనపు సిబ్బందిని కేటాయించండి: సుప్రీంకోర్టు

దిల్లీ: ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తు విధులు నిర్వర్తిస్తున్న బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వో) తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారంటూ దాఖలైన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. వారి పని భారాన్ని తగ్గించేందుకు గాను ఎన్నికల సంఘానికి అదనపు సిబ్బందిని కేటాయించే విషయాన్ని రాష్ట్రాలు పరిశీలించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం గురువారం సూచించింది. 'సర్' విధుల్లో పాల్గొంటున్న పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురికావడం, ఆత్మహత్యకు పాల్పడుతుండడంపై నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. '''సర్' విధుల నుంచి మినహాయించాలని ఎవరైనా కోరితే అటువంటి కేసులను విడివిడిగా పరిశీలించి, వారి స్థానంలో మరొకరిని భర్తీ చేయొచ్చు. సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై ఉంది'' అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

నిత్యావసర వస్తువులపై సెస్సు లేదు

• మేలు చేయనివాటిపైనే విధిస్తాం
• ఆ ఆదాయాన్నీ రాష్ట్రాలకు పంచుతాం: నిర్మల
• లోక్‌సభలో 'ఆరోగ్య- జాతీయ భద్రత సెస్సు' బిల్లు

దిల్లీ: పాన్‌మసాలా వంటి అయోగ్య (డీమెరిట్) ఉత్పత్తులపై తప్పిస్తే నిత్యావసర వస్తువులపై ప్రతిపాదిత 'ఆరోగ్య- జాతీయ భద్రత సెస్సు'ను విధించబోమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తేల్చిచెప్పారు. కొన్నింటిపై వచ్చే సెస్సు ఆదాయాన్నీ రాష్ట్రాలతో పంచుకుంటామని, ఆరోగ్య సంబంధిత పథకాలపై ఖర్చుచేసేందుకు అది ఉపయోగపడుతుందని తెలిపారు. 'ఆరోగ్య భద్రత, జాతీయ భద్రత సెస్సు బిల్లు-2025'ను గురువారం ఆమె లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దేశానికి ముఖ్యమైన ఆరోగ్యం, జాతీయ భద్రతలకు ప్రత్యేకంగా వనరులు అందుబాటులో ఉండేలా చూడటమే బిల్లు ఉద్దేశమని వివరించారు. ''ఇదొక సెస్సు. నిత్యావసర వస్తువుల్లో దేనిపైనా ఇది పడదు. ఆరోగ్యానికి ముప్పుతెచ్చేవాటిపైనే వేస్తాం. అదికూడా ఎందుకంటే.. అలాగైనా వాటిని ప్రజలు వాడకుండా చూడాలనే. పాన్‌మసాలా తయారు



నిర్మలా సీతారామన్

చేసే కర్మాగారాల్లో యంత్రాల ఉత్పత్తి సామర్థ్యంపై దీనిని విధిస్తాం. ఇది ప్రతి కర్మాగారానికి వేరుగా ఉంటుంది'' అని నిర్మల చెప్పారు. పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం విధించడానికి ఉద్దేశించిన 'సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు'కు పార్లమెంటు ఆమోదం లభించింది. దీనిని బుధవారం లోక్‌సభ, గురువారం రాజ్యసభ ఆమోదించాయి.

నచ్చిన భాషలో మాట్లాడతా.. ఇబ్బందేంటి?

బిల్లుపై నిర్మల హిందీలో మాట్లాడటం వల్ల తాను అర్థం చేసుకోలేకపోతున్నానని తృణమూల్ ఎంపీ సౌగతారాయ్ అభ్యంతరం తెలిపారు. సభాపతి కల్పించిన సాంకేతిక అనువాద పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు ఇబ్బందేం ఉంటుందని నిర్మల ప్రశ్నించారు. ''నేను హిందీలో మాట్లాడతాను. తమిళం, తెలుగు, ఆంగ్లంలోనైనా మాట్లాడతా. దాంతో సభ్యునికేం సంబంధం? అనువాద సదుపాయం వాడుకోవచ్చు కదా! బిల్లు నుంచి దృష్టి మళ్లించడానికి రాయ్ ప్రయత్నిస్తున్నారు. ఇది అభ్యంతరకరం'' అని తెగేసి చెప్పారు.

85 ఏళ్ల ట్రీమ్యాన్

ఈటీవీ భారత్: ఒడిశాలోని కేంద్రపాడా జిల్లా నికిరాయ్ పట్నా గ్రామానికి చెందిన ఈయన పేరు ధనేశ్వర్ బారిక్ (85). విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో నిత్యం భుజంపై పార పెట్టుకొని మైళ్ల దూరం నడుస్తారు. గత మూడు దశాబ్దాలుగా రోడ్డు పొడవునా తాను నాటిన వేలాది చెట్లకు నీరు పోయడం, కలుపు



తీయడం, ముళ్లకంచెలు ఏర్పాటు చేయడం ఆయన దినచర్య. వృద్ధాప్య పింఛనుతోపాటు గ్రామస్థులు ఇచ్చే ధాన్యమే జీవనాధారం. తాను నాటిన చెట్ల కింద విద్యార్థులు కూర్చోవడం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంటుందని ధనేశ్వర్ చెబుతారు. ఈ ఏడాది ఒడిశా ప్రభుత్వం 'ప్రకృతి బంధు సమ్మాన్' పురస్కారంతో ఆయనను సత్కరించింది.



గట్ హెల్త్ సరిగాలేదనడానికి చిహ్నాలు

✦ తిన్నవెంటనే పొట్ట ఉబ్బరంగా ఉండటం. ✦ రోజూ మలవిసర్జన జరగకపోవడం. ✦ పలు ఆహారపదార్థాలు పడకపోవడం. ✦ చర్మసంబంధ సమస్యలు. ✦ అయోమయస్థితి. ✦ భోజనానంతరం అలసిపోవడం. ✦ తరచుగా దురదలు, దద్దుర్లు, తలనొప్పి. ✦ ఇన్ఫెక్షన్లు

– ప్రీతి కసిరెడ్డి, ఆంత్రప్రెన్యూర్

హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులపై వెట్టింగ్

• 'హెచ్-4'కూ వర్తింపు
• ట్రంప్ సర్కారు నిర్ణయం



న్యూయార్క్, వాషింగ్టన్: హెచ్-1బీ వీసాల జారీకి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని సర్కారు తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారి సామాజిక మాధ్యమ ఖాతాలను ఈ నెల 15 నుంచి క్షుణ్నంగా తనిఖీ చేయనున్నట్లు బుధవారం వెల్లడించింది. ఈ వెట్టింగ్‌కు వీలుగా దరఖాస్తుదారులంతా తమ సోషల్ మీడియా ఖాతాల ప్రైవసీ సెట్టింగ్స్‌ను 'పబ్లిక్'గా ఉంచాలని ఆదేశించింది. హెచ్-1బీ వీసాదారులపై ఆధారపడి ఉండే హెచ్-4 వీసా దరఖాస్తుదారులకూ తాజా ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అమెరికా జాతీయ భద్రతకు ముప్పుగా మారే అవకాశమున్న వ్యక్తులకు వీసా తిరస్కరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ సర్కారు తెలిపింది. వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేలా సెన్సార్‌షిప్‌ను అమలు చేసేందుకు గతంలో పనిచేసినట్లు తేలినా.. ఆయా వ్యక్తుల వీసాలు తిరస్కరణకు గురవ్వొచ్చని పేర్కొంది. తాజా ఆదేశాల్లో భాగంగా వీసా దరఖాస్తుదారుల రెజ్యూమె, లింక్డిన్ వంటి ప్రొఫైళ్లను అధికారులు క్షుణ్నంగా సమీక్షిస్తారు.

16 ఏళ్లుగా యాసిడ్ దాడి కేసు విచారణా?

• దేశానికే అవమానకరం: సుప్రీంకోర్టు

దిల్లీ: యాసిడ్ దాడులకు గురైన బాధితుల కేసుల విచారణ ఏళ్ల తరబడి నత్తనడకన కొనసాగుతుండడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయవ్యవస్థను అవహేళన చేయడమేనంటూ మండిపడింది. దేశవ్యాప్తంగా యాసిడ్ దాడుల కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో నాలుగు వారాల్లో నివేదించాలని అన్ని రాష్ట్రాల్లోని హైకోర్టులను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం గురువారం ఆదేశించింది. ఈ తరహా కేసుల సత్వర విచారణకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటును పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. యాసిడ్ దాడి వల్ల తీవ్రంగా గాయపడిన వ్యక్తులకు దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం సంక్షేమ పథకాలను వర్తింపజేయడానికి అవసరమైన చర్యలను పరిశీలించాలని కేంద్రాన్ని కోరింది. ప్రస్తుత చట్టాన్ని సవరించడం లేదా ఆర్డినెన్స్ మార్గాన్ని అనుసరించే విషయాన్నీ పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. ఈ మేరకు కేంద్రానికి, దివ్యాంగుల సాధికార విభాగానికి నోటీసులు జారీ చేసింది. యాసిడ్ దాడి బాధితురాలు షహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలిచ్చింది. న్యాయకోసం పోరాడుతున్న షహీన్‌మాలిక్ కేసు దిల్లీలోని రోహిణి కోర్టులో 16 ఏళ్లుగా విచారణలో ఉండడటం దేశానికే అవమానకరమని వ్యాఖ్యానించింది.

ప్రతిపక్ష నేతను కలవొద్దని

విదేశీ నేతలకు చెబుతున్నారు: రాహుల్



దిల్లీ: విదేశీ అతిథులు భారత్ పర్యటనకు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతను కలవకూడదని వారికి కేంద్ర ప్రభుత్వం చెబుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇది పూర్తిగా వారి అభద్రతా భావానికి నిదర్శనమని విమర్శించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు కొన్ని గంటల ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'విదేశీ అతిథులు సాధారణంగా ప్రతిపక్ష నేతను కూడా కలుస్తారు. ఇది పార్లమెంటరీ సంప్రదాయం. దీనిని ప్రధాని మోదీ, విదేశీ వ్యవహారాలశాఖ పాటించడంలేదు. విదేశీ అతిథులు భారత్‌కు వచ్చినప్పుడు, నేను విదేశాలకు వెళ్లినప్పుడూ ప్రభుత్వం ప్రతిపక్ష నేతను కలవొద్దని చెబుతూ వస్తోంది. కేవలం ప్రభుత్వమే దేశాన్ని నడపదు. మేం కూడా భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాం. విదేశీ నాయకులు ప్రతిపక్షాల అభిప్రాయాలు కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం' అని రాహుల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా దీనిపై స్పందించారు. 'విదేశీ అతిథులు ప్రతిపక్ష నేతను కలవడం ప్రోటోకాల్. ప్రజాస్వామ్యంలో కొన్ని నిబంధనలు, సంప్రదాయాలు పాటించాల్సిందే. కానీ ఎన్డీయే ప్రభుత్వం ఇతర స్వరాలకు చోటివ్వకూడదని చూస్తోంది' అని విమర్శించారు.

అవి పచ్చి అబద్ధాలు: భాజపా

ఈ ఆరోపణల్ని భాజపా ముఖ్య అధికార ప్రతినిధి అనిల్ బలూనీ ఖండించారు. అవన్నీ పచ్చి అబద్ధాలని 'ఎక్స్'లో పేర్కొంటూ.. న్యూజిలాండ్, మారిషస్ ప్రధానులతో రాహుల్ కలిసిన ఫొటోలను జతచేశారు. గత ఒకటిన్నరేళ్లలో ఇలా ఐదుగురు నేతలతో ఆయన సమావేశమయ్యారని తేదీలతో సహా చెప్పారు. విపక్షనేత బాధ్యతతో మెలగాలని భాజపా అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర హితవుపలికారు.

దిల్లీ కాలుష్యంపై ప్రతిపక్షాల నిరసన



పార్లమెంటు ఆవరణలో మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, విపక్ష ఎంపీల నిరసన

దిల్లీ: దేశ రాజధానిలో వాయు కాలుష్యానికి నిరసనగా ప్రతిపక్ష పార్టీల నేతలు గురువారం పార్లమెంటు భవనం ముందు ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులతో నినాదాలు చేశారు. కాలుష్యంపై ప్రధాన మంత్రి మాటలు చెప్పడం కాదు.. చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. కొందరు నాయకులు మాస్కులు ధరించి నిరసన తెలిపారు. సోనియా గాంధీ మాట్లాడుతూ.. 'పిల్లలు మరణిస్తున్నారు. నాలాంటి వృద్ధులకూ కాలుష్యం ఇబ్బందికరంగా మారింది. దీనిపై ఏదైనా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే' అని స్పష్టం చేశారు. కాలుష్యంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యపై చర్చలు, కఠినమైన చర్యలను కోరుతున్నానని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా పేర్కొన్నారు. ఇది రాజకీయ పరమైంది కాదని స్పష్టం చేశారు.

ఎయిరిండియా విమానంలో దెబ్బతిన్న అనౌష్క శంకర్ సితార్

దిల్లీ: ప్రముఖ సితార్ విద్వాంసురాలు అనౌష్క శంకర్ ఇటీవల ఎయిరిండియాలో ప్రయాణించిన సమయంలో ఆమెకు చెందిన సితార్ వాయిద్య పరికరం దెబ్బతింది. దీంతో ఆ సంస్థపై ఆమె విరుచుకుపడ్డారు. లగేజీలో దానిని ఉంచగా రవాణా సమయంలో దెబ్బతిందని ఆరోపించారు. దీనిపై



సామాజిక మాధ్యమ వేదికగా ఆమె పెట్టిన పోస్టు వైరలవుతోంది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని ఎయిరిండియా తెలిపింది. అనౌష్క శంకర్ ప్రముఖ భారతీయ సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్ కుమార్తె.

పీఎం, సీఎంల తొలగింపు బిల్లుపై నిపుణులతో చర్చకు నిర్ణయం

దిల్లీ: తీవ్రమైన నేరాల్లో అరెస్టయి, నెలరోజుల్లోపు బెయిల్ పొందలేకపోతే ప్రధాని, ముఖ్యమంత్రులు, మంత్రులు ఆటోమేటిగ్గా పదవులు కోల్పోవాలని చెబుతున్న బిల్లుల్ని పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీ.. దానిలో నిపుణుల అభిప్రాయాలను తెలుసుకోనుంది. గురువారం ఈ కమిటీ తొలిసారిగా సమావేశమైంది. రాజ్యాంగ నిపుణుల్ని, బార్ అసోసియేషన్ల సభ్యులను కూడా సంప్రదించాలని దీనిలో నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాలకూ వెళ్లి వివిధ వర్గాల అభిప్రాయాలు తెలుసుకోవాలని నిర్ణయించినట్లు ఎంపీ అపరాజిత సారంగి విలేకరులకు తెలిపారు. కమిటీలో చేరడానికి నిరాకరించిన విపక్షాలతో కూడా సంప్రదిస్తామని చెప్పారు.

పుతిన్‌కు భగవద్గీత బహూకరించిన మోదీ

దిల్లీ: రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు భగవద్గీతను బహూకరించానని ప్రధాని మోదీ తెలిపారు. లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని తన అధికారిక నివాసంలో గురువారం రాత్రి ఆయనకు ప్రధాని విందు ఇచ్చారు. ఈ సందర్భంగా గీతను బహూకరించారు.

కూడంకుళానికి అణు ఇంధనం చేరిక

దిల్లీ: తమిళనాడు కూడంకుళంలోని మూడో అణు రియాక్టర్ కోసం ఉద్దేశించిన తొలి విడత అణు ఇంధనాన్ని డెలివరీ చేశామని రష్యా ప్రభుత్వ అణు కార్పొరేషన్ రోస్‌ఆటమ్ వెల్లడించింది. తమ అణు ఇంధన విభాగానికి చెందిన కార్గో విమానం.. నోవోసిబిర్స్క్ రసాయన సాంద్రీకరణ ప్లాంటులో తయారైన ఇంధన సమూహాన్ని కూడంకుళానికి చేర్చిందని గురువారం తెలిపింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు వచ్చిన రోజే ఈ ప్రకటన వెలువడటం విశేషం.

అమెరికాలో కూలిన ఎఫ్-16

వాషింగ్టన్: అమెరికా వాయుసేనకు చెందిన అత్యాధునిక యుద్ధ విమానం ఎఫ్-16సి బుధవారం ప్రమాదవశాత్తూ కూలిపోయింది. ఈ ఘటనలో పైలట్ ప్రాణాలతో బయటపడ్డారు. కాలిఫోర్నియాలోని ట్రోనా విమానాశ్రయానికి సమీప ఎడారిలో ఈ విమానం నేలను ఢీకొట్టింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10.45 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. అప్రమత్తమైన పైలట్ పారాచూట్ సాయంతో బయటపడ్డారు. స్వల్ప గాయాలు అయిన ఆయనను అధికారులు ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఎఫ్-16 ఫైటర్ ఫాల్కన్ జెట్‌లతో ఈ ప్రాంతంలో తరచూ అమెరికా వాయుసేన యుద్ధ విన్యాసాల శిక్షణ చేపడుతోంది.

అంధకారంలో క్యూబా

లక్షల మందికి విద్యుత్తు సరఫరా బంద్

హవానా: ద్వీప దేశం క్యూబాను అంధకారం అలముకుంది. దేశంలోని రెండు ప్రధాన విద్యుత్తు గ్రిడ్లను కలిపే తీగలు తెగిపోవడంతో రాజధాని హవానా సహా పశ్చిమ క్యూబాలోని పలు ప్రాంతాలను చీకటి కమ్మేసింది. లక్షల మందికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దాదాపు 12 గంటలపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగడంతో జనజీవనం స్తంభించిపోయిందని అధికారులు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం నాటికి పవర్ గ్రిడ్ తిరిగి పని చేసినప్పటికీ విద్యుత్ సరఫరా పూర్తిగా పునరుద్ధరణ కావడానికి సమయం పడుతుందని తెలిపారు.

ఓటరు నమోదు అధికారులు

పౌరసత్వాన్ని నిర్ధారించలేరు

• కేంద్ర హోంశాఖ, కోర్టులే ఆ పని చేయగలవు
• సుప్రీం కోర్టులో 'సర్'ను సవాల్ చేసిన పిటిషనర్ వాదనలు

దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను అతిక్రమిస్తోందని, లేని అధికారాలను చెలాయిస్తోందని... 'సర్' కసరత్తును సవాల్ చేసిన పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. ఓటరు నమోదు అధికారులు (ఈఆర్‌వో) పౌరసత్వాన్ని నిర్ధారించలేరని తెలిపారు. ఓటరు పౌరసత్వంపై సందేహం తలెత్తితే ఈఆర్‌వో కారణాలను నమోదు చేసి ఆ విషయాన్ని సంబంధిత యంత్రాంగానికి తెలియజేయాలని పేర్కొన్నారు. అప్పుడు ఈ అంశంపై పౌరసత్వ చట్టం ద్వారా లభించిన అధికారాల మేరకు కేంద్ర హోంశాఖ, లేదా విదేశీ ట్రైబ్యునల్, లేదా న్యాయస్థానం మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ముందు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ గురువారం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ భూషణ్ వివిధ కోర్టు తీర్పులను ఉటంకించారు. ఎవరైనా ఓటరు మతిస్థిమితాన్ని కోల్పోయారని తెలిసినప్పటికీ ఓటర్ల జాబితా నుంచి ఆ వ్యక్తి పేరును ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించరాదన్నారు. సామాజిక తనిఖీ నిర్వహించకుండానే బిహార్‌లో సామూహిక ఓట్ల తొలగింపునకు ఈసీ పాల్పడిందని ఆక్షేపించారు. తొలగించిన ఓటర్లను ఫారం-6 ద్వారా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకొనేలా బలవంతపెట్టారన్నారు. కానీ, ఆ దరఖాస్తు కొత్త ఓటర్లకు ఉద్దేశించిందని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. ఓటర్ల జాబితాలో ఇప్పటి వరకు తమ పేరులేదంటూ తప్పుడు డిక్లరేషన్ ఇచ్చేలా ఎన్నికల సంఘం అధికారులు చేశారని, ఇది ఈసీ నిబంధనావళిని ఉల్లంఘించడమేనని వాదించారు. దేశంలో చాలా మంది నిరుపేదలున్నారని, వారు మళ్లీమళ్లీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోలేరని, అంతిమంగా ఓటరు జాబితాల నుంచి కనుమరుగవుతారని తెలిపారు. కేసు విచారణ మంగళవారం నాడు కొనసాగించనుంది.

రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలో మహిళా లాయర్లకు

30 శాతం పదవులు కేటాయించండి

• బీసీఐకి సూచించిన సుప్రీంకోర్టు

దిల్లీ: రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆయా కౌన్సిళ్ల కార్యనిర్వాహక కమిటీల్లోనూ మహిళా లాయర్ల ప్రాతినిధ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)కి గురువారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సూచించింది. యోగమయ, శెహ్లా చౌదరి అనే ఇద్దరు మహిళా న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. బార్ కౌన్సిళ్లలో మహిళా లాయర్లకు రిజర్వేషన్లు కల్పించాలంటే న్యాయవాదుల చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుందని బీసీఐ తరఫు ప్లీడరు తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో బార్ కౌన్సిళ్ల ఎన్నికలు ప్రారంభమయ్యాయని, తక్షణమే మార్పులు చేయడం సాధ్యపడదని వివరించారు. రిజర్వేషన్లు కల్పించటానికి అంత సంఖ్యలో మహిళా న్యాయవాదులు పోటీ చేయాలి కదా అని ప్రశ్నించినప్పుడు ఇటీవల వర్క్‌షాప్‌లో వ్యక్తమైన అభిప్రాయాలను సీజేఐ ప్రస్తావించారు. 83శాతం మంది మహిళా న్యాయవాదులు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు.



గురువారం నేవీ దినోత్సవం సందర్భంగా దిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకానికి సెల్యూట్ చేస్తున్న త్రిదళాధిపతి అనిల్ చౌహాన్, నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి తదితరులు

ఎల్గార్ పరిషద్ కేసులో మాజీ ప్రొఫెసర్ హనీ బాబుకు బెయిల్

ఐదేళ్లుగా జైలులో ఖైదు

ముంబయి: ఎల్గార్ పరిషద్ కేసులో నిందితుడిగా గత ఐదేళ్లుగా తలోజా జైలులో ఉన్న దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ హనీ బాబుకు గురువారం బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. విచారణ లేకుండా దీర్ఘకాలం జైలులో ఖైదు చేశారని పేర్కొంటూ ఆయన విడుదలకు జస్టిస్ ఎ.ఎస్.గడ్కరీ, జస్టిస్ ఆర్.ఆర్.భోంస్లే ధర్మాసనం ఆదేశించింది. రూ.లక్షకు పూచీకత్తును, అంతే విలువైన మొత్తానికి వ్యక్తిగత హామీని సమర్పించాలన్న షరతు విధించింది. ఈ కేసుకు సంబంధించిన వాదప్రతివాదనలు ఈ ఏడాది అక్టోబరు తొలి వారంలో ముగిశాయి. బెయిల్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ అభ్యంతరాలను ధర్మాసనం తోసిపుచ్చింది.

వలపు వల.. పాక్‌కు రహస్య సమాచారం చేరవేత!

ఆర్మీ విశ్రాంత ఉద్యోగి, మహిళ అరెస్టు

అహ్మదాబాద్: సైనిక వ్యవహారాలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఓ ఆర్మీ విశ్రాంత ఉద్యోగి, మరో మహిళను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) అరెస్టు చేసింది. ఈ ఇద్దరూ పాకిస్థానీ ఏజెంట్లతో సమాచారాన్ని పంచుకుంటున్నట్లు ఏటీఎస్ వెల్లడించింది. నిందితులను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ సింగ్(47), యూపీకి చెందిన రష్మనీ పాల్(35)గా గుర్తించారు. సైన్యం కదలికలు, కీలక అధికారుల బదిలీల గురించి సమాచారం అందించాలని సింగ్‌ను పాక్ నిఘా సిబ్బంది ప్రలోభపెట్టినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు..కొంతమంది సైనిక సిబ్బందిని హనీట్రాప్ చేయమని పాల్‌కు చెప్పారన్నారు.

జమిలి ఎన్నికలపై ఈసీకి అధికారం ఏకపక్షం కాదు: లా కమిషన్

దిల్లీ: లోక్‌సభ, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘానికి తగిన అధికారం ఇవ్వాలనే బిల్లు ఏకపక్షం కాదని లా కమిషన్ పేర్కొంది. బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ సంయుక్త కమిటీకి గురువారం ఈ విషయం తెలిపింది. రాజ్యాంగ సవరణ బిల్లు అమల్లోకి రావాలంటే కనీసం 50% రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదం తెలపాల్సిన అవసరం లేదని కూడా కమిషన్ స్పష్టంచేసింది.

■ లోక్‌పాల్‌లో దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విభాగాలు పనిచేసేలా తక్షణం చర్యలు చేపట్టాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. ఈ నివేదికను రాజ్యసభకు సమర్పించింది.

విపత్తు ప్రతిస్పందనపై శ్రీలంకకు ఏపీ మార్గనిర్దేశం

కొలంబో: తుపాను ప్రభావానికి గురైన శ్రీలంకకు విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గనిర్దేశం చేసింది. తుపానుల సమయంలో సహాయక చర్యలకు సంబంధించి తాము అనుసరించిన ఉత్తమ విధానాలను ఏపీ రియల్‌టైమ్ గవర్నెన్స్(ఏపీఆర్టీజీ) శ్రీలంకకు వివరించింది. ఏపీఆర్టీజీ సెక్రటరీ భాస్కర్ కాటమనేని బుధవారం శ్రీలంక అధ్యక్షుడి ప్రధాన సలహాదారు(డిజిటల్ ఎకానమీ) హాన్స్ విజయసురియాతో వర్చువల్‌గా సమావేశమై దీనికి సంబంధించిన డిజిటల్ టూల్‌కిట్‌ను పంచుకున్నారు. మరోవైపు భారత ప్రభుత్వం శ్రీలంకలో జలదిగ్బంధ ప్రాంతాలకు చేరుకునేందుకు వీలుగా మూవబుల్ మాడ్యులర్ వంతెన వ్యవస్థతోపాటు 500 నీటి శుద్ధి యూనిట్లను అందించింది. ఈ వంతెనను ఏర్పాటు చేయడానికి ఇంజినీర్లు, వైద్య బృందంతో కలిపి 22 మందిని సహాయం కోసం పంపింది. వరదల కారణంగా బుధవారం వరకూ దాదాపు 479 మంది మృతి చెందారు. 350 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లి మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి చేరిందని అధికారులు తెలిపారు.

ఏపీఎండీసీ జీఎం సూర్యకళ సస్పెన్షన్

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చర్యలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) జనరల్ మేనేజర్ మల్లాది విజయ సూర్యకళను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సూర్యకళపై అనిశా అధికారులు నవంబర్ 20న కేసు నమోదు చేశారు. 21న విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌లలో ఉన్న సూర్యకళతో పాటు ఆమె సంబంధీకుల నివాసాల్లో సోదాలు సాగాయి. వారి పేరిట 27 స్థిరాస్తులున్నట్లు, మొత్తం రూ.6 కోట్ల మేర అక్రమాస్తులు కూడబెట్టినట్లు అనిశా అధికారులు గుర్తించారు. అదే రోజు ఆమెను అరెస్టు చేసి విజయవాడలోని ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి డిసెంబర్ 5 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకుపైగా జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండడంతో ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబర్ 21 నుంచి సూర్యకళ సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని రెవెన్యూ (విజిలెన్స్) శాఖ ఉత్వర్వుల్లో పేర్కొంది.

ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జనవరి 5, 6 తేదీల్లో దేశవ్యాప్త ఆందోళన

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జనవరి 5, 6 తేదీల్లో దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. ఉపాధి హామీ పథకానికి నిధుల కోత, కార్మిక ప్రయోజనాలను దెబ్బతీసే లేబర్ కోడ్‌లు, బలవంతపు భూసేకరణ, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ ఆందోళనలు చేపట్టబోతున్నట్లు ఐక్యవేదిక నాయకులు బి. వెంకట్, గోరియా, విక్రమ్‌సింగ్, శ్రీనివాస్, కర్నల్ సింగ్, దేవేందర్‌లు తెలిపారు. గురువారం వారిక్కడ ఏపీ, తెలంగాణ ఉమ్మడి భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు.

శ్రీలక్ష్మిపై అభియోగాలకు ఆధారాలున్నాయి

- తేలిన అంశంపై మళ్లీ పిటిషన్ చెల్లదు
- 'పెన్నా' కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన సీబీఐ

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో భాగంగా వైఎస్ రాజశేఖరరెడ్డి సన్నిహితుడైన ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు లీజుల మంజూరులో అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి వై.శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలకు ఆధారాలున్నాయని సీబీఐ గురువారం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. శ్రీలక్ష్మిపై కేసును కొనసాగించడానికి సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని తెలిపింది. అంతేకాకుండా గతంలో తేలిన అంశంపై మళ్లీ పిటిషన్ వేయడానికి వీల్లేదని పేర్కొంది. పెన్నా ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు అనంతపురం జిల్లా యాడికిలో 231 ఎకరాల భూకేటాయింపు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కౌలపల్లిలో 304.70 హెక్టార్లలో ప్రాస్పెక్టింగ్ లీజు, రంగారెడ్డి జిల్లా తాండూరులో 822.13 ఎకరాల్లో లీజు రెన్యువల్‌తోపాటు హైదరాబాద్‌లో పయనీర్ హోటళ్ల నిర్మాణాలకు రాయితీల కల్పనలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, ఇందుకుగాను వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన కంపెనీల్లో ప్రతాప్‌రెడ్డి రూ.68 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు సీబీఐ కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఇందులో నిందితురాలిగా ఉన్న అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి వై.శ్రీలక్ష్మి తనపై కేసును కొట్టివేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ అభియోగ పత్రాన్ని కాగ్నిజెన్స్ తీసుకుంటూ, సీబీఐ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ శ్రీలక్ష్మి గతంలోనే పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పూర్తయి తీర్పు రిజర్వు అయిన తరువాత ఉపసంహరించుకున్నారన్నారు. అంటే అవే తుది ఉత్తర్వులని, మళ్లీ అదే కాగ్నిజెన్స్ ఉత్తర్వులను సవాలు చేస్తూ మళ్లీ పిటిషన్ వేయడానికి వీల్లేదన్నారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులపై అభ్యంతరాలుంటే కింది కోర్టులో తేల్చుకోవాలని, ఈ కోర్టులో కాదని తెలిపారు. అందువల్ల పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. శ్రీలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది కె. వివేక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గతంలో పిటిషన్‌లో వాదనలు పూర్తయ్యాక ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరైందని, ఇదే విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి పిటిషన్‌ను ఉపసంహరించుకుని మళ్లీ దాఖలు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం అవినీతి నిరోధక చట్టం కింద మాత్రమే అనుమతి ఉందని, ఐపీసీ కింద అభియోగాలపై విచారణకు అనుమతి మంజూరు కాలేదన్నారు. ఐపీసీ, పీసీ చట్టాల కింద అనుమతులు ఉండాల్సిందేనని, దీనికి సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ప్రస్తావించారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి ఉత్తర్వుల నిమిత్తం విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. 18కి చేరిన మృతుల సంఖ్య



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ-బీజాపుర్ జిల్లాల సరిహద్దులోని గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొత్తం 18 మంది మావోయిస్టులు మృతిచెందారు. వారిలో 9 మంది మహిళలు ఉన్నారు. మృతుల వివరాలను బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ గురువారం వెల్లడించారు. 'బుధవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన 12 మంది మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. గురువారం జరిగిన సెర్చింగ్ ఆపరేషన్‌లో మరో 6 మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతిచెందిన మావోయిస్టులపై రూ.1.3 కోట్ల రివార్డు ఉంది. మావోయిస్టు పీఎల్‌జీఏ రెండో బెటాలియన్ కమాండర్ వెల్ల మొడియంపై రూ.10 లక్షల రివార్డు ఉంది. కంపెనీ నంబరు-2, 7కు చెందిన కీలక మావోయిస్టులు రైను ఓయం, సన్ను అవలం, నందా మిడియం, లాలు, రాజు పూనెం, కమేశ్ కవాసీ, లక్ష్మి తాటి, బండి మద్వి, సుఖి లేఖమ్, సోమ్డి కుంజం, చందు కుర్సం, మాసే, రీనా మార్కం, సోనీ మాద్వి, సంగీత పద్దంగా గుర్తించాం. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉంది. ఘటనా స్థలంలో 19 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాం' అని ఐజీ పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన డీఆర్‌జీ హెడ్‌కానిస్టేబుళ్లు మోను వడాడి, రమేశ్ సోడి, కానిస్టేబుల్ దుకారు గోండే పార్థివ దేహాలను బీజాపుర్‌లోని పోలీసు లైన్‌కు తీసుకువచ్చి.. ప్రభుత్వ లాంఛనాలతో పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు అశ్రునివాళులర్పించారు. అనంతరం డీఆర్‌జీ జవాన్ల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దక్షిణాఫ్రికాలో శ్రీసత్యసాయి జిల్లా వాసి కిడ్నాప్


రామచంద్ర

తలుపుల, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం కొవ్వూరివాండ్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రామచంద్ర (26) దక్షిణాఫ్రికా దేశంలో కిడ్నాప్‌నకు గురైనట్లు ఆయన తల్లి శాంతమ్మ కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రామచంద్ర ఏడాది క్రితం దక్షిణాఫ్రికాలోని ఓ బోర్‌వెల్స్ కంపెనీలో పనిచేసేందుకు వెళ్లారు. గత నెల 22న చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. తరువాత రోజు ఆగంతకులు ఆయన్ను కిడ్నాప్ చేశారంటూ సంబంధిత కంపెనీ నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత వారి నుంచి కూడా ఎలాంటి సమాచారం లేకపోవడంతో తల్లి ఆందోళనకు గురవుతున్నారు. రామచంద్ర తండ్రి గతంలోనే చనిపోయారు. తనను బాగా చూసుకోవాలన్న తపనతో కుమారుడు దక్షిణాఫ్రికాకు వెళ్లాడని, తన బిడ్డ జాడ తెలియడం లేదంటూ శాంతమ్మ రోదిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తన బిడ్డను క్షేమంగా స్వగ్రామానికి తీసుకురావాలని ఆమె కోరుతున్నారు.

హిడ్మాది ముమ్మాటికీ హత్యే!

మావోయిస్టు పార్టీ డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శి వికల్ప్ ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు నేత హిడ్మాది ముమ్మాటికీ హత్యేనని... నిరాయుధుడిగా పట్టుకొని చిత్రహింసల అనంతరం చంపారని పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జడ్‌సీ) కార్యదర్శి వికల్ప్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కాంట్రాక్టర్లతోపాటు పార్టీ నుంచి పారిపోయిన ఒక సభ్యుడు ఇచ్చిన సమాచారంతోనే అతడిని పట్టుకున్నారన్నారు. గత నెల 27వ తేదీతో ఉన్న ప్రకటన గురువారం బహిర్గతమైంది. 'హిడ్మా అక్టోబరు 27న విజయవాడకు చెందిన ఒక కలప వ్యాపారితో కలిసి చికిత్స కోసం అక్కడికి వెళ్లారు. అనంతరం మరికొందరు పార్టీ సభ్యులూ వెళ్లారు. నిరాయుధులైన ఆరుగురిని నవంబరు 15న పోలీసులు అరెస్టుచేశారు. మూడు రోజులపాటు హింసించి... మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు కట్టుకథ అల్లారు. నవంబరు 19న రంపచోడవరం అడవిలో మరో ఏడుగురు మావోయిస్టులను పట్టుకొని చంపారు. నవంబరు 9న ఓ సభ్యుడు పార్టీ నుంచి పారిపోయి... తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. హిడ్మా ఆచూకీ గురించి అతడికి తెలుసు. నవంబరు 14న హిడ్మాతో పాటు ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. 50 మంది సభ్యులను అరెస్టు చేశారు. హిడ్మాను పోలీసులను పట్టుకున్నట్టు తెలిశాకే ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ పూవర్తి గ్రామానికి వెళ్లి అతడి తల్లిని కలిశారు. లొంగిపోవాలంటూ ఆమెతో ప్రకటన ఇప్పించారు. మారేడుమిల్లి, రంపచోడవరం హత్యాకాండలపై న్యాయవిచారణ జరిపించాలి' అని ప్రకటనలో వికల్ప్ డిమాండ్ చేశారు.

మైనారిటీలకు జగన్ ద్రోహం: రఫీ

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు జగన్ తీరని ద్రోహం చేశారని తెదేపా అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు.


ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో జస్టిస్ వి.శ్రీనివాస్ తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. శ్రీనివాస్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి, దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుమల వీధులకు శ్రీవారి పరమభక్తుల పేర్లు

తితిదే ప్రతిపాదనకు సీఎం ఆమోదం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల క్షేత్రంలోని వీధులకు శ్రీవారి పరమభక్తుల పేర్లు పెట్టాలని తితిదే ప్రతిపాదించగా.. దీనికి ముఖ్యమంత్రి కూడా ఆమోదం తెలిపినట్లు తెలిసింది. తిరుమలలో కొన్ని వీధులకు ప్రస్తుతం మేదరమిట్ట, ఆర్‌బీ సెంటర్, ముళ్లగుంత వంటి పేర్లున్నాయి. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇటువంటి పేర్లు ఉండటంతో భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీఅనంతాళ్వారు రోడ్డు, శ్రీసామవై రోడ్డు, శ్రీతిరుమలనంబి రోడ్డు, శ్రీవెంగమాంబ రోడ్డు, శ్రీఅన్నమాచార్యులు, శ్రీపురందరదాసు రోడ్డు వంటి పేర్లు పెట్టాలని తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబుతో సమావేశమైన తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరిలు ఈ విషయం ప్రస్తావించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. త్వరలో వీధులకు మహనీయుల పేర్లు పెట్టనున్నారు.

త్వరలో తితిదే స్థానిక ఆలయాల్లో శ్రీవారి సేవ

తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల, న్యూస్‌టుడే: తితిదే పరిధిలోని స్థానిక ఆలయాలన్నింటిలోనూ త్వరలో 'శ్రీవారి సేవ'ను విడతల వారీగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. స్థానిక శ్రీవారి సేవాసదన్‌లో సేవాగ్రూప్ సూపర్‌వైజర్లకు నిర్వహిస్తున్న 'ట్రైన్ ద ట్రైనర్స్' కార్యక్రమానికి గురువారం ఈవో హాజరై మాట్లాడారు. 'శ్రీవారి సేవకులు తమ ప్రాంతాల్లోని ఆలయాల్లోనూ సేవ చేసేందుకు ముందుకు రావాలి. హిందూ ధర్మ ప్రచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని ఈవో పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో భద్రాచలం ఉత్తర ద్వార దర్శన టికెట్లు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ నుంచి ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 29న స్వామివారికి తెప్పోత్సవం, 30న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శన పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఉత్తర ద్వార దర్శన పూజల్లో ప్రత్యక్షంగా పాల్గొనే భక్తులు ఆయా రుసుములు గల సెక్టార్ టికెట్లను కొనాల్సి ఉంటుంది. ఇందులో రూ.2వేలు, రూ.వెయ్యి, రూ.500, రూ.250 విలువైన టికెట్లను https://bhadradritemple.telangana.gov.in అనే వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని రామాలయం ఈఓ దామోదర్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకున్న వారు ఈ నెల 18 నుంచి 30వ తేదీ ఉదయం 5 గంటల లోగా రామాలయ కార్యాలయాన్ని సంప్రదించి ఒరిజినల్ టికెట్లను తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. కౌంటర్‌లోనూ ఉత్తర ద్వార దర్శన టికెట్లను నేరుగా తీసుకునే సదుపాయం కల్పించనున్నారు.

మిస్‌ఫైర్.. క్రాస్‌ఫైర్.. మన పార్టీలో ఉండవు

- చంద్రబాబే సేనాధిపతి.. మనమంతా సైనికులం
- పదిహేనేళ్లు కూటమిగానే ముందుకు
- తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్



తెదేపా శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

పార్వతీపురం, భామిని, సీతంపేట, న్యూస్‌టుడే: మిస్‌ఫైర్, క్రాస్‌ఫైర్, విడాకులు వంటివి మన పార్టీలో ఉండవని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. తెదేపాకు వ్యక్తులు శాశ్వతం కాదని, కార్యకర్తలే బలమని పేర్కొన్నారు. రాబోయే పదిహేనేళ్ల పొత్తుతోనే ముందుకెళ్తామని స్పష్టం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా భామినిలో పాలకొండ నియోజకవర్గ తెదేపా కార్యకర్తలు, పార్టీ నేతలతో గురువారం రాత్రి ఆయన మాట్లాడారు. పరకామణిలో రూ.50 కోట్లు దొంగతనం చేస్తే అది చిన్నదంటున్న జగన్‌ను దేవుడే చూసుకుంటాడని వ్యాఖ్యానించారు. మెగా డీఎస్సీపై వైకాపా వాళ్లు చాలా కేసులు పెట్టినప్పటికీ చిత్తశుద్ధితో 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో సాధించలేని విశాఖ రైల్వేజోన్‌ను కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే సాధించిందని గుర్తుచేశారు.

అలక జబ్బుతో నష్టపోతున్నాం

పార్టీలో చిన్నచిన్న సమస్యలున్నా మనలో మనమే చర్చించుకుని పరిష్కరించుకుందామని లోకేశ్ శ్రేణులకు సూచించారు. కలిసికట్టుగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. పార్టీలో అలక జబ్బు ఉందని, దానివల్ల మనమే నష్టపోతున్నామని చురకంటించారు. గ్రూపు రాజకీయాలు విడనాడాలని హితవు పలికారు. మనందరికీ చంద్రబాబు సేనాధిపతని.. సైనికులుగా ఆయన వెంట నడవాల్సిన బాధ్యత మనపై ఉందని తేల్చిచెప్పారు. తెదేపా కార్యకర్త కోరుకునేది గౌరవం మాత్రమేనన్నారు. ప్రతి పనికి లోకేశ్, ఎమ్మెల్యేలు ఫోను చేయాలంటే కుదరదని, చట్టబద్ధంగా ఉన్న ఏ పని అయినా కార్యకర్తలు చెబితే అధికారులు చేయాల్సిందేనని సూచించారు. మైటీడీపీ యాప్ ద్వారా క్యాడర్‌కు బాధ్యతలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి, విప్ జగదీశ్వరి, ఎమ్మెల్యే విజయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుణ్ని కాలేకపోయాను.. వైద్యశాఖ మంత్రినయ్యా

- మంత్రి సత్యకుమార్



ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వైద్యుల ఆత్మీయ సమావేశంలో మంత్రి సత్యకుమార్‌ను సన్మానించిన వైద్యులు

ఈనాడు, అమరావతి: తన తల్లి, సోదరి క్యాన్సర్‌తో చనిపోయారని.. తనను వైద్యుడిగా చూడాలని సోదరి కోరినా నెరవేర్చలేకపోయానని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గుర్తు చేశారు. వైద్యుణ్ని కాలేకపోయినా ఆ శాఖకు మంత్రిగా సేవచేసే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. ప్రాణం పోసేవాడు దేవుడైతే.. ప్రాణం నిలిపేవాడు వైద్యుడు.. అలాంటి పవిత్రమైన వైద్య వృత్తిని ఉద్యోగంలా కాకుండా సేవా భావంతో, మానవతా దృక్పథంతో చూడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో గురువారం నిర్వహించిన ఏపీ ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వైద్యుల ఆత్మీయ సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామీణ పేదలకు అందుబాటులో ఉండాల్సిన కొందరు వైద్యులు పీహెచ్‌సీల్లో ఉండడం లేదని, కమిషనర్ తనిఖీల్లోనూ తాళాలు వేసి ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఒక్క ప్రాణమైనా పోయిందన్న మాట రాకూడదన్నారు. ఎంబీబీఎస్ వైద్యులకు ఇన్‌సర్వీస్ కోటా, పదోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు, గిరిజన అలవెన్సులు తదితర హామీల అమలు దస్త్రం ఆర్థిక శాఖ వద్ద ఉందన్నారు. వైద్యారోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు పద్మావతి, పీహెచ్‌సీ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవీంద్ర నాయక్, కోశాధికారి డా.వినోద్ తదితరులు మాట్లాడారు.

గంజాయి కేసులో అరుణకు షరతులతో హైకోర్టు బెయిల్

ఈనాడు, అమరావతి: నెల్లూరు నగరం వేదాయపాళెం పోలీసులు నమోదు చేసిన గంజాయి కేసులో లేడీ డాన్ నిడిగుంట అరుణకు(ఏ4) హైకోర్టు షరతులతో బెయిలు ఇచ్చింది. 'రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలి. అభియోగపత్రం దాఖలు చేసేంత వరకు ప్రతి శనివారం ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకావాలి. ఎస్‌హెచ్‌వో అనుమతి లేకుండా రాష్ట్రం దాటి వెళ్లడానికి వీల్లేదు' అని అరుణకు షరతులు విధించింది. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. ఇటీవల గంజాయిని తరలిస్తున్న వాహనాన్ని వేదాయపాళెం పోలీసులు పట్టుకున్నారు. అరుణ ఆదేశాల మేరకు గంజాయిని విక్రయిస్తున్నట్లు అందులో ఉన్నవారు చెప్పారు. ఈ వ్యవహారంలో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

గోపీచంద్ అకాడమీ నిర్మాణానికి భూమిపూజ



కుటుంబసభ్యులతో కలిసి భూమిపూజ చేస్తున్న పుల్లెల గోపీచంద్ దంపతులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి భూమిపూజ జరిగింది. ఈ విషయాన్ని ఏపీ సీఆర్డీఏ కార్యాలయం గురువారం తెలిపింది. కుటుంబసభ్యులతో గోపీచంద్ దంపతులు అకాడమీకి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు. అబ్బరాజుపాలెం రెవెన్యూ పరిధిలో 12 ఎకరాల భూమిని అకాడమీ నిర్మాణానికి సీఆర్డీఏ కేటాయించింది. అకాడమీలో అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ, మౌలిక క్రీడా సదుపాయాలు, ఇండోర్ కోర్టులు నిర్మిస్తామని గోపీచంద్ తెలిపారు. దేశంలో ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్ శిక్షణకు అమరావతి ప్రధాన కేంద్రంగా నిలవడమే కాకుండా రాష్ట్ర క్రీడారంగం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని ఆయన చెప్పారు.



21 ఏళ్ల లోపే తెలుసుకోవలసిన ఆర్థికచిట్కాలు


- కారు రుణాలు ఉండకూడదు.
- విభిన్న ఉద్యోగాలు చేయాలి.
- అత్యున్నతమైన నైపుణ్యాలు నేర్వాలి.
- జీతం అందుకున్న ప్రతిసారి కొంత డబ్బు దాచాలి.
- పెట్టుబడులు ఎలా పెట్టాలో తెలుసుకోవాలి.

– జాన్ హెన్రీ, ఇన్వెస్టర్

EENADU Vol: 52, Issue: 115 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు సినిమా

ట్రెండీగా... స్టైలిష్‌గా...



రామ్ చరణ్



అల్లు అర్జున్

కొన్నేళ్లుగా అగ్ర కథానాయకులు చాలావరకూ పీరియాడిక్ కథలపైనే మొగ్గు చూపుతూ ప్రయాణం చేస్తున్నారు. అల్లు అర్జున్ 'పుష్ప' సినిమాల కారణంగా ఐదారేళ్లుగా ఒకే రకమైన గెటప్‌లోనే కనిపిస్తూ వచ్చారు. స్టైల్‌కి పెట్టింది పేరైన ఆయన... పుష్ప పాత్ర కోసం తన లుక్‌ని, హావభావాల్ని పూర్తిగా మార్చుకుని తెరపై కనిపించాల్సి వచ్చింది. రామ్‌చరణ్ కూడా అంతే. 'గేమ్ ఛేంజర్'లో ఓ గెటప్ మినహా, ఆయన ప్రయాణం కూడా ఎక్కువగా పీరియాడిక్ గెటప్స్‌తోనే సాగిపోయింది. ఇప్పుడు ఆయన చేస్తున్న 'పెద్ది' కూడా పీరియాడిక్ సినిమానే. అయితే ఆయన తదుపరి చేస్తున్న సినిమా మాత్రం పూర్తి ట్రెండీగా సాగే కథతోనే రూపొందుతుందని సమాచారం. 'పెద్ది' తర్వాత సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆ సినిమాకి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అగ్ర దర్శకుడు సుకుమార్ కూడా కొన్నేళ్లుగా 'రంగస్థలం' నుంచీ పీరియాడిక్ కథలతోనే ప్రయాణం చేస్తున్నారు. ఈసారి ఆయన స్టైల్ మార్చి వర్తమాన అంశాలతో కూడిన కథని సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అందుకు తగ్గట్టే రామ్‌చరణ్ ట్రెండీగా తెరపై కనిపించే అవకాశాలున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రం వచ్చే వేసవి తర్వాత పట్టాలెక్కే అవకాశాలున్నాయి. అల్లు అర్జున్ కూడా కొత్త సినిమాలో తన మార్క్ స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ కథతో రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఈ పాత్ర కోసం ఇప్పటికే అల్లు అర్జున్ తన గెటప్‌ని మార్చి స్టైల్‌గా మారిపోయారు. తెరపై ఆయన ఎన్ని రకాలుగా కనిపిస్తారో స్పష్టత లేదు కానీ, ఒక లుక్‌లో మాత్రం స్టైల్‌గా కనిపిస్తారనే విషయం స్పష్టమవుతోంది.

అనుకోకుండానే జీవించేస్తాం



కీర్తి సురేశ్

కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తూ.. ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది అందాల తార కీర్తి సురేశ్. ఇటీవలే 'రివాల్వర్ రీటా'తో తెరపై మెరిసిందీ భామ. ఈ క్రైమ్ కామెడీ కథలో తుపాకీ చేతపట్టి తనదైన స్టైల్‌లో అభిమానుల్ని ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి కామెడీ జానర్‌లో నటించడం గురించి పంచుకుంది. "కామెడీ అనేది అత్యంత కష్టమైన భావోద్వేగం. ఎందుకంటే ఒకరిని నవ్వించడం అనేది అంత సులభమైన విషయం కాదు. కానీ ఈ సినిమాలో నేను పోషించిన పాత్ర నా వ్యక్తిత్వానికి చాలా దగ్గరగా ఉంటుంది. ఈ జానర్‌లో పనిచేయడం మంచి అనుభవం. మీరు ఒత్తిడిలో ఉన్నప్పుడు ఇలాంటి చిత్ర షూటింగ్‌లో పాల్గొంటే రిఫ్రెషింగ్‌గా అనిపిస్తుంది. ఓ పది సార్లు పేపర్లను చదువుతూ.. సంభాషణల్ని రిహార్సల్స్ చేసే సినిమా కాదు ఇది. అనుకోకుండానే ఇలాంటి కామెడీ సినిమాల్లో జీవించేస్తాం" అని చెప్పుకొచ్చింది కీర్తి. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'కన్నెవెడి' అనే సినిమా ఉంది.

ఈసారి శశిరేఖ పాటతో..



నయనతార, చిరంజీవి

'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో సంక్రాంతి బరిలో అలరించనున్నారు కథానాయకుడు చిరంజీవి. ఆయన.. నయనతార జంటగా నటిస్తున్న ఈ సినిమాని అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. హీరో వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్ర రెండో గీతాన్ని ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు చిరు కొత్త స్టిల్‌ను నెట్టింట పంచుకున్నారు. "శశిరేఖ.." అంటూ సాగే ఈ మెలోడీ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చడమే కాక మధుప్రియతో కలిసి ఆలపించారని.. అనంత శ్రీరామ్ సాహిత్యమందించారని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ పాట ప్రోమోను ఈ నెల 6న విడుదల చేయనున్నారు. వినోదం, యాక్షన్ అంశాలతో మిళితమైన ఈ కుటుంబ కథా చిత్రం వచ్చే సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ చిత్రం చూశాక థియేటర్లోకి వెళ్లడానికి భయపడ్డా - బన్నీవాస్



వంశీ, బన్నీ వాస్, దామోదర్ ప్రసాద్, అఖిల్‌రాజ్

"ఎవరి డబ్బుల్నీ వృథా చేయని సినిమా 'ఈషా'. నాకు దెయ్యాలు, ఆత్మలపై నమ్మకం లేదు కానీ.. ఈ చిత్రం చూశాక నేను కూడా థియేటర్లలోకి వెళ్లడానికి భయపడ్డా" అన్నారు నిర్మాత బన్నీ వాస్. 'లిటిల్‌హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాల తర్వాత ఆయన.. వంశీ నందిపాటి సంయుక్తంగా విడుదల చేస్తున్న చిత్రమే 'ఈషా'. అఖిల్ రాజ్, త్రిగుణ్ హీరోలుగా నటించారు. శ్రీనివాస్ మన్నె తెరకెక్కించారు. హెబ్బా పటేల్ కథానాయిక. దామోదర్ ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. "ఐబొమ్మ రవిని హీరోలా చూడటం తప్పు. తను చేసింది నేరం. ప్రజలు పైరసీ చిత్రాలు చూడటం మానేయాలి. ఇండస్ట్రీని మనమే కాపాడుకోవాలి. టికెట్ రేట్ల పెంపును ఛాంబర్ కూడా ప్రోత్సహించడం లేదు' అన్నారు. 'పుష్ప 2' తొక్కిసలాట ఘటనలో గాయపడి.. చికిత్స పొందుతున్న శ్రీతేజ్ ఆరోగ్యం గురించి స్పందించారు బన్నీవాస్. "శ్రీతేజ్, అతని కుటుంబానికి సాయం కొనసాగుతోంది. దిల్‌రాజు సహా ఇతర పెద్దలు ఎప్పటికప్పుడు ఈ పరిస్థితుల్ని పర్యవేక్షిస్తున్నారు. మావైపు నుంచి ఇంకా దిద్దుకోవాల్సినవి ఏమైనా ఉంటే దానికి సిద్ధంగా ఉన్నామ"ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మన్నె, అఖిల్‌రాజ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ నిర్మాత ఏవీఎం శరవణన్ కన్నుమూత



ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ ఏవీఎం ప్రొడక్షన్స్ అధినేత, నిర్మాత ఏవీఎం శరవణన్ (86) ఇకలేరు. కొంత కాలంగా వయోధిక సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం 5.30 గంటలకు చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఏవీఎం స్టూడియో వ్యవస్థాపకుడు ఏవీ మెయ్యప్పన్ చెట్టియార్‌కు మూడో సంతానంగా 1939 డిసెంబరు 3న శరవణన్ జన్మించారు. ఆయన పూర్తిపేరు శరవణన్ సూర్యమణి. అప్పటికే చిత్రపరిశ్రమలో ఉన్న మెయ్యప్పన్ చెట్టియార్ 1945లో ఏవీఎం స్టూడియోను ప్రారంభించి తర్వాత నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. 1958 నుంచి ఏవీఎం ప్రొడక్షన్స్ నిర్మాణ సంస్థ బాధ్యతలు చూస్తున్నారు శరవణన్. ఏవీఎం బ్యానరుపై తమిళ, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సుమారు 300 చిత్రాలు రాగా వాటిలో సుమారు 180 చిత్రాలను శరవణన్ నిర్మించారు. ఆయన రజనీకాంత్, కమల్ హాసన్ లాంటి నట దిగ్గజాల సినీ ప్రస్థానంలో కీలకమైన మైలురాళ్లుగా నిలిచే పలు విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. రజనీకాంత్‌తో నిర్మించిన 9 చిత్రాలూ భారీ హిట్లను సాధించాయి. వాటిలో 'శివాజి' ఒకటి. మారుతున్న కాలానికి అనుగుణంగా తన చిత్రాల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించడంలో ఆయన దిట్ట. 'పున్నమి నాగు', 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'మెరుపు కలలు', 'లీడర్' (2010) తదితర తెలుగు చిత్రాలను నిర్మించారు శరవణన్.

తండ్రి కోరికను నెరవేర్చిన తనయుడు


సినిమాలు నిర్మించకున్నా ఫర్వాలేదు కానీ, చివరి వరకు స్టూడియోను నడిపించాలనే తండ్రి మాటను తన చివరి శ్వాస వరకు శరవణన్ కాపాడారు. మధ్యలో కొంతకాలం ఏవీఎం సంస్థ చిత్రాలను నిర్మించడాన్ని నిలిపివేసింది. అలాంటి పరిస్థితుల్లో శరణ్ దర్శకత్వంలో విక్రమ్ తమిళంలో నటించిన 'జెమిని' చిత్రాన్ని నిర్మించి నిర్మాణ రంగంలోకి ఏవీఎం సంస్థ పునరాగమనానికి శరవణన్ కారణమయ్యారు. ఆ చిత్రం విజయం తర్వాత 2000వ ఏడాది నుంచి మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వచ్చి చిత్రాలను నిర్మించారు. కొన్ని సంవత్సరాలుగా సినీ నిర్మాణ పనులను ఏవీఎం సంస్థ చేపట్టడంలేదు. మధ్యలో అరివళగన్ దర్శకత్వంలో అరుణ్ విజయ్ నటించిన 'తమిళ్ రాకర్స్' వెబ్ సిరీస్‌ను నిర్మించింది. వయోధిక కారణాలు దృష్ట్యా శరవణన్ నిర్మాణ పనులు నుంచి తప్పుకుని పూర్తి విశ్రాంతిలో ఉన్నారు. స్టూడియోలోని ఓ అంతస్తును సినీ రంగానికి చెందిన పాత వస్తువులను ప్రదర్శించే మ్యూజియంగా మార్చారు. శరవణన్ సోదరులు ఎం.కుమరన్, ఎం.బాలసుబ్రమణియన్ కూడా నిర్మాతలే. వారు ఏవీఎం పతాకంపై శరవణన్‌తో కలిసి పలు చిత్రాలు నిర్మించారు. శరవణన్ కుమారుడు ఎం.ఎస్.గుహన్ కూడా నిర్మాతే. 'నానుం ఒరు పెణ్' (1963), 'సంసారం అదు మిన్సారం' (1986) చిత్రాలకుగాను ఉత్తమ చిత్రాల కేటగిరిలో ఫిల్మ్‌ఫేర్ అవార్డులను శరవణన్ అందుకున్నారు. 1986లో మద్రాస్ షరీఫ్‌గా సేవలందించారు. గతంలో భారతీయ చలనచిత్ర సమాఖ్య అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కలైమామణి', పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి 'శిఖరం' పురస్కారాలు అందుకున్నారు.

తమిళనాడు సీఎం నివాళి

శరవణన్ భౌతికకాయానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌తో పాటు ప్రముఖ నటుడు రజనీకాంత్, సీనియర్ నటుడు శివకుమార్, ఆయన కుమారుడు, నటుడు సూర్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్య కన్నీటి పర్యంతమయ్యారు. సినీ ప్రముఖులు నాజర్, విశాల్, కె.ఆర్.విజయ, వైరముత్తు, పి.వాసు, వసంత్, పార్తిబన్, ఎండీఎంకే అధినేత వైగో తదితరులు నివాళులర్పించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్ కల్యాణ్, నటుడు కమల్‌హాసన్ వేరువేరు ప్రకటనల్లో తమ సంతాపాన్ని ప్రకటించారు. శరవణన్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం ముగిశాయి.

– న్యూస్‌టుడే, చెన్నై

ఆ హ్యాకర్ ఎవరు?



ఆది పినిశెట్టి

ఆది పినిశెట్టి హీరోగా జెనూస్ మొహమద్ తెరకెక్కించిన చిత్రం 'డ్రైవ్'. వి.ఆనంద్ ప్రసాద్ నిర్మించారు. మడోన్నా సెబాస్టియన్ కథానాయిక. కమల్ కామరాజు, అనీశ్ కురువిల్లా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని ఈనెల 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఈ చిత్ర టీజర్ బయటకు వదిలారు. ఆది ఈ చిత్రంలో ప్రజా మీడియా కార్పొరేషన్ సంస్థ వారసుడి పాత్రను పోషిస్తున్నారు. ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఈ వ్యాపార సంస్థ అకౌంట్స్‌ను ఓ హ్యాకర్ హ్యాక్ చేస్తాడు. హీరో వ్యక్తిగత జీవితం సమస్యల్లో చిక్కుకోవడమే గాక తన ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. మరి ఆ హ్యాకర్‌ను హీరో పట్టుకోగలిగాడా? లేదా? అన్నది ఆసక్తికరం. ఈ చిత్రానికి సంగీతం: ఓషో వెంకట్.

తోబుట్టువుల అనుబంధం



నాగశౌర్య, శ్రీదేవి

'బ్యాడ్‌బాయ్ కార్తీక్'గా ప్రేక్షకుల్ని పలకరించనున్నారు హీరో నాగశౌర్య. ఆయన టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ దేశిన తెరకెక్కించారు. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మాత. విధి కథానాయిక. శ్రీదేవి విజయ్ కుమార్, సముద్రఖని, నరేశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో గురువారం ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "పొమ్మంటే పో పొమ్మంటే నువ్వే.. నా ఊపిరి పోతోందే" అంటూ తోబుట్టువుల అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ సాగిన ఈ పాటకు హారిస్ జయరాజ్ స్వరాలు సమకూర్చగా.. చంద్రబోస్ సాహిత్యమందించారు. విజయ్ యేసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ ఆలపించారు. ఈ పాటలో అక్క, తమ్ముడుగా శ్రీదేవి, శౌర్యల అనుబంధం ఆకర్షణగా నిలిచింది. ఈ మాస్ యాక్షన్ చిత్రం ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ సినిమాకి కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ఛాయాగ్రహణం: రసూల్ ఎల్లోర్.

'దిల్‌వాలే దుల్హనియా... రికార్డు





కాజోల్, షారుక్

భారతీయ చిత్ర సీమలో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రేమ కథలో 'దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే' ఒకటి. షారుక్‌ఖాన్, కాజోల్ జంటగా తెరకెక్కిన ఈ చిత్రం విడుదలై 30 ఏళ్లు. ఇప్పటికే పలు రికార్డులు సాధించిన ఈ సినిమా ఖాతాలో మరో రికార్డు చేరింది. ఈ సినిమాలోని షారుక్, కాజోల్‌ల సిగ్నేచర్ పోజుతో కాంస్య విగ్రహాన్ని రూపొందించి లండన్‌లోని లీసెస్టర్ స్క్వేర్‌లో ఏర్పాటు చేశారు. దీన్ని గురువారం షారుక్, కాజోల్‌లు ఆవిష్కరించారు. అనంతరం ఈ అరుదైన గౌరవం దక్కినందుకు ఆనందం వ్యక్తం చేశారు.

వినోద రంగంలో పరస్పర సహకారంపై చర్చ



కొరియన్ ప్రతినిధులతో తెలుగు సినీ ప్రముఖులు

కొరియన్ చలన చిత్రోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌కు వచ్చిన ప్రముఖ కొరియన్ దర్శకనిర్మాత యూ ఇన్ - షిక్‌తో తెలుగు సినీ ప్రముఖులు గురువారం సమావేశమయ్యారు. వినోద రంగంలో కొరియన్, తెలుగు చిత్ర పరిశ్రమల పరస్పర సహకారం, సృజనాత్మకత, కంటెంట్ అభివృద్ధిపైనా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ ప్రముఖులు దిల్‌రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, కె.ఎల్.నారాయణ, చిరంజీవి, సూర్యదేవర నాగవంశీ, శోభు యార్లగడ్డ, బన్నీ వాస్, ధీరజ్ మొగిలినేని, ఆనంద్ దేవరకొండ, సుధాకర్ చెరుకూరి, ఎస్.కె.ఎన్, రాజీవ్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీతేజ్ కోలుకుంటున్నాడు: దిల్‌రాజు

'పుష్ప 2' తొక్కిసలాట ఘటనలో ఆస్పత్రి పాలైన చిన్నారి శ్రీతేజ్ క్రమంగా కోలుకుంటున్నట్లు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు తెలియజేశారు. ఆ ఘటన జరిగి ఏడాది అయిన నేపథ్యంలో ఆయన.. చిన్నారి తండ్రి భాస్కర్‌తో కలిసి మాట్లాడారు. "సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో భాస్కర్ తనయుడు శ్రీతేజ్ ఆస్పత్రి పాలయ్యాడు. తనిప్పుడు కోలుకుంటున్నాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు అల్లు అర్జున్ ముందుకొచ్చి రూ.2కోట్లు డిపాజిట్ చేశారు. దానిపై వచ్చే వడ్డీలో నెలకు రూ.75వేలు భాస్కర్ కుటుంబ ఖర్చులు, శ్రీతేజ్ ఆస్పత్రి బిల్లులకు వినియోగిస్తున్నాం. మిగిలిన మొత్తాన్ని అసలులో కలిపి ఆపై వచ్చే వడ్డీని పెంచి ఇచ్చేలా ఏర్పాటు చేశాం. ప్రస్తుతం ఆ బాబు వైద్య సేవల నిమిత్తం అదనపు సహకారం కావాలని భాస్కర్ కోరారు" అని దిల్‌రాజు అన్నారు. అనంతరం శ్రీతేజ్ తండ్రి భాస్కర్ మాట్లాడుతూ.. "ఆ ఘటన జరిగిన రెండో రోజు నుంచి ఇప్పటిదాకా అల్లు అర్జున్, బన్నీవాస్‌ల సపోర్ట్ లభిస్తూనే ఉంది. ఇప్పుడు అదనపు సహకారం కావాల్సి వచ్చింది. ముఖ్యంగా బాబుకు ఆర్నెళ్ల పాటు రిహాబిలిటేషన్ కొనసాగాల్సి ఉంది. ఇదే విషయాన్ని దిల్‌రాజు దృష్టికి తీసుకొచ్చాం. దానికి అవసరమైన వైద్య ఖర్చుల గురించి చెప్పాను. అల్లు అర్జున్‌తో మాట్లాడి ఓకే చేశారు. అందుకు ధన్యవాదాల"ని పేర్కొన్నారు. శ్రీతేజ్ కోలుకునేందుకు అవసరమైతే ఏడాది పాటు రిహాబిలిటేషన్ సదుపాయాన్ని అందించడానికి సిద్ధంగా ఉన్నామని దిల్ రాజు స్పష్టం చేశారు.

అది షారుక్ చెప్పిన టెక్నిక్



అనన్య పాండే

యువ తను ఆకట్టుకునే కథలతో మెప్పిస్తుంటుంది బాలీవుడ్ కథానాయిక అనన్యపాండే. మరి కొద్దిరోజుల్లో కార్తిక్ ఆర్యన్‌తో కలిసి 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ'తో అలరించడానికి సిద్ధమైన ఈ తార.. ఓ సందర్భంలో అగ్రహీరో షారుక్ ఖాన్ ఇచ్చిన సలహా తన నటనా నైపుణ్యాల్ని మెరుగుపరిచిందని అంటోంది. 'ఒక చనిపోయిన వ్యక్తి గురించి బాధపడే సన్నివేశంలో సహజంగా భావోద్వేగాలను పండించడానికి షారుక్ నాకు ఓ సలహా ఇచ్చారు. 'ఏదైనా సినిమాలో ఎవరైనా మరణించే సన్నివేశంలో ఉన్నప్పుడు.. ఆ వ్యక్తి చనిపోయాడని ఆలోచించే బదులు.. అతను లేకుండా జీవితం ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఆ వ్యక్తితో గడిపిన సంతోషకరమైన క్షణాల్ని గుర్తుతెచ్చుకోండి. అది మిమ్మల్ని బాధపెడుతుంది. అప్పుడు తెరపై భావోద్వేగాలు సహజంగా కనిపిస్తాయ'ని సూచించారు. ఆయన చెప్పిన ఈ టెక్నిక్ నాకు బాగా ఉపయోగపడింది'' అని చెప్పుకొచ్చింది అనన్య.


అది చూసి మేమిద్దరం కంటతడి పెట్టుకున్నాం!



యామిని

"ఓ సహజమైన ప్రేమకథతో రూపొందిన సినిమా 'సైకొసిద్ధార్థ'' అంది నటి యామిని భాస్కర్. ఆమె.. శ్రీనందు జంటగా నటించిన ఈ చిత్రాన్ని వరుణ్ రెడ్డి తెరకెక్కించారు. ఈ సినిమా ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే యామిని గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ..."టీజర్, ట్రైలర్లు చూసి కొందరు దీన్ని 'అర్జున్ రెడ్డి'తో పోలుస్తున్నారు. నిజానికి దానికి ఈ సినిమాకి ఏ సంబంధం లేదు. ఈ సినిమాని సురేశ్‌బాబు తీసుకోవడం మా అందరికీ పెద్ద సర్‌ప్రైజ్. రామానాయుడు స్టూడియోలో మా సినిమా పోస్టర్‌ను చూసుకున్నప్పుడు నేను.. దర్శకుడు వరుణ్ కంటతడి పెట్టుకున్నాం" అని చెప్పింది.

సందేశ సూత్రం



వినయ్‌వర్మ

వినయ్‌వర్మ, తమేశ్వరయ్య అక్కల, చంద్రకళ.ఎస్, అర్జున్, సురభి లలిత ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'కామ అండ్ ది డిజిటల్ సూత్రాస్'. ఎన్.హెచ్.ప్రసాద్ దర్శకనిర్మాత. ఈ చిత్రాన్ని శ్రీలక్ష్మి పిక్చర్స్ పతాకంపై బాపిరాజు ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో చిత్రబృందం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకనిర్మాత మాట్లాడుతూ "కోరికలు ఇతివృత్తంగా... ఎక్కడా అసభ్యతకి చోటు లేకుండా రూపొందించిన చిత్రమిది. మా సినిమా విడుదల తర్వాత ఫలితాలు ఎలా ఉన్నా... నాణ్యమైన సినిమా అనే పేరు మాత్రం తప్పకుండా వస్తుంది'' అన్నారు.

గూగుల్‌తో టాటా భాగస్వామ్యం?

ఇప్పటికే దేశీయ దిగ్గజ సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్, భారతీ ఎయిర్‌టెల్‌తో భాగస్వామ్యాలు కుదుర్చుకున్న టెక్ సంస్థ గూగుల్.. మరిన్ని ఒప్పందాల దిశగా అడుగులు వేస్తోంది. 'టాటా గ్రూప్ కూడా మాకు కీలక భాగస్వామి, కస్టమర్. అయితే భాగస్వామ్యం విషయాన్ని సరైన సమయంలోనే వెల్లడిస్తామ'ని గూగుల్ కంట్రీ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ ప్రీతి లోబానా పేర్కొన్నారు. భారత్‌లో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను అందిపుచ్చుకోవడాన్ని వేగవంతం చేయడం కోసం అక్టోబరులో రిలయన్స్ ఇంటెలిజెన్స్‌తో గూగుల్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీని కింద 18 నెలల పాటు జియో వినియోగదార్లకు గూగుల్ జెమినై తాజా వెర్షన్‌ను ఉచితంగా అందిస్తోంది. భారత్‌లో అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను, విశాఖలో కొత్త హరిత ఇంధన మౌలిక వసతుల ఏర్పాటుకు అదానీ కనెక్స్‌తో గూగుల్ జట్టు కట్టింది. భారతీ ఎయిర్‌టెల్ కూడా విశాఖలో భారత తొలి ఏఐ హబ్ ఏర్పాటు చేసే నిమిత్తం గూగుల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. టాటా గ్రూప్ సంస్థ టీసీఎస్‌తో 500 మెగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యం కోసం అమెరికాకు చెందిన ఓపెన్ ఏఐ ఒప్పందం చేసుకోనుందని ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి.

టోల్ కోసం వాహనం ఆపనవసరం ఉండదు

- చెల్లింపునకు ఏడాదిలో సరికొత్త వ్యవస్థ
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



ప్రస్తుత టోల్ వసూలు వ్యవస్థకు ఏడాదిలోగా ముగింపు పలకనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దీని స్థానంలో సరికొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థను తీసుకొస్తామన్నారు. 'జాతీయ రహదారులపై వాహనదార్లు టోల్ చెల్లించేందుకు వాహనాన్ని ఆపి, ఫాస్టాగ్ స్కాన్ అయ్యాక కదులుతోంది. నూతన విధానంలో వాహనం ఆగాల్సిన అవసరం లేకుండానే, చెల్లింపు జరుగుతుంది. కొత్త వ్యవస్థను ముందుగా 10 ప్రాంతాల్లో అమలు చేసి, ఏడాదిలోగా దేశవ్యాప్తంగా విస్తరిస్తామ'ని మంత్రి లోక్‌సభలో వెల్లడించారు.

భవిష్యత్తులో ఇలా: ఇటీవల విడుదలైన అధికారిక ఉత్తర్వు ప్రకారం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్తగా నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ (ఎన్ఈటీసీ) ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేసింది. ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపులకు ఇది ఒక విశిష్ట, ఇంటర్‌ఆపరబుల్ ప్లాట్‌ఫాంగా పనిచేస్తుంది. టోల్‌ప్లాజాల వద్ద ఆగకుండానే, వాహనం విండ్‌స్క్రీన్‌పై ఉండే ఫాస్టాగ్ నుంచి ఆటోమేటిక్ టోల్ చెల్లింపులను ఇది వసూలు చేయగలదు. 'ఏఐ అనలిటిక్స్‌తో, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్‌తో పాటు ఆర్ఎఫ్ఐడీ ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్(ఫాస్టాగ్) వంటి ఇంటిగ్రేటెడ్ సాంకేతికతలను వినియోగించి ఈ విధానాన్ని తీసుకువస్తు'న్నట్లు గడ్కరీ తెలిపారు.

✦ ఇప్పటికే హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డులో ఇలాంటి వ్యవస్థ కొంతవరకు అమలవుతోంది.

✦ దేశంలో ప్రస్తుతం రూ.10 లక్షల కోట్ల విలువైన 4500 హైవే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని మంత్రి గడ్కరీ వివరించారు.

'మిరాయ్' వాడుతున్న గడ్కరీ: దిల్లీలో కాలుష్యం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఇంధనాలకు ప్రాధాన్యతనిస్తోందని, తాను టయోటాకు చెందిన 'మిరాయ్' హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ కారు వినియోగిస్తున్నట్లు లోక్‌సభకు గడ్కరీ తెలిపారు. 'మెర్సిడెస్ బెంజ్ ఇచ్చేంత సౌలభ్యం ఇదీ ఇస్తుంది. ఈ కారు పేరు మిరాయ్. అంటే జపనీస్‌లో భవిష్యత్ అని అర్థమ'ని ఆయన అన్నారు.

బంగారం.. తగ్గేదేలే!



- వచ్చే ఏడాదీ ధర 15-30% పెరగొచ్చు
- అమెరికా వృద్ధి ఆధారంగానే దిద్దుబాటు: డబ్ల్యూజీసీ

పసిడి ధరలు ప్రస్తుత స్థాయిల నుంచి వచ్చే ఏడాదిలో 15-30% పెరగొచ్చని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) అంచనా వేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధాన నిర్ణయాలు విజయవంతమై.. ఆ దేశ వృద్ధి అంచనాలకు మించి రాణిస్తేనే, పసిడి ధర దిగివచ్చేందుకు అవకాశాలు ఉంటాయని విశ్లేషించింది. ఈ ఏడాదిలో ఇప్పటికే పసిడి ధర 53% పెరిగింది. అమెరికా సుంకాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో.. సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించి బంగారంలో పెట్టుబడులు పెట్టేందుకు మదుపర్లు ఆసక్తి చూపడం, వివిధ దేశాల కేంద్రీయ బ్యాంకులూ పసిడి కొనుగోళ్లు చేయడం, కీలక వడ్డీ రేట్లపై అవి తీసుకున్న నిర్ణయాలు కూడా పసిడి ధరలకు ఊతమిచ్చాయి. బాండ్లపై ప్రతిఫలాలు తగ్గడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న దృష్ట్యా వచ్చే ఏడాది కూడా పసిడి జోరు కొనసాగొచ్చని అంచనా వేస్తున్నామని డబ్ల్యూజీసీ వివరించింది.

పసిడి ఈటీఎఫ్‌లే కీలకం..: పసిడి ధర పెరుగుదలలో పసిడి ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)లు కీలక పాత్ర పోషిస్తున్నాయని డబ్ల్యూజీసీ పేర్కొంది. ఈ ఫండ్‌లు భారీ పరిమాణంలో పసిడిని కొనుగోలు చేయడం వల్ల.. పసిడి ధర పెరుగుదలకు కారణమవుతోందని డబ్ల్యూజీసీ వెల్లడించింది.

✦ ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా పసిడి ఈటీఎఫ్‌ల్లోకి 77 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6,93,000 కోట్ల) పెట్టుబడులు వచ్చినట్లు డబ్ల్యూజీసీ వివరించింది. అంటే దాదాపు 700 టన్నుల పసిడిని ఫండ్ సంస్థలు తమ హోల్డింగ్స్‌కు జత చేసుకున్నాయి. భవిష్యత్‌లోనూ పసిడి ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు మరింత పెరిగే అవకాశాలున్నాయని.. ఇది పసిడి ధరపైనా ప్రభావం చూపుతుందని డబ్ల్యూజీసీ వివరించింది.

5-20% వరకు దిగివస్తుందా?: అమెరికా వృద్ధి గాడిన పడి, డాలర్ బలోపేతమైతే.. పసిడి ధర దిగివచ్చేందుకూ అవకాశాలు ఉన్నాయని డబ్ల్యూజీసీ తెలిపింది. అప్పుడు పసిడి ఈటీఎఫ్‌ల్లో నుంచి పెట్టుబడుల ఉపసంహరణ జరిగి.. ఈక్విటీలు, బాండ్లలోకి వాటిని మదుపర్లు మళ్లిస్తారని పేర్కొంది. ఫలితంగా పసిడి ధర 5-20% వరకు దిగిరావొచ్చన్నది తమ అంచనాగా డబ్ల్యూజీసీ తెలిపింది.

ఈనాడు బిజినెస్

17 లక్షల వెండి ఆభరణాలకు హెచ్‌యూఐడీ హాల్‌మార్కింగ్

హాల్‌మార్కింగ్ యునీక్ ఐడెంటిఫికేషన్ (హెచ్‌యూఐడీ)ను తప్పనిసరి చేశాక, 3 నెలల వ్యవధిలోనే 17.35 లక్షల వెండి ఆభరణాలకు ఈ ధ్రువీకరణ చిహ్నం వేసినట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆభరణాల విక్రేతలు, వినియోగదార్ల నుంచి హాల్‌మార్కింగుకు విశేష ఆదరణ లభిస్తోందనే విషయాన్ని ఇది తెలియజేస్తోందని కేంద్ర ఆహార, వినియోగదారు వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 2025 సెప్టెంబరు 1 నుంచి వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్ పథకం స్వచ్ఛందమే అయినా, హాల్‌మార్కింగ్ ఉన్న ప్రతి వెండి వస్తువుకు హెచ్‌యూఐడీ మార్కింగ్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. హాల్‌మార్కింగ్ పొందిన వెండి ఆభరణాల స్వచ్ఛత 925, 800గా ఉందని పేర్కొంది.

త్వరలో సాయి పేరెంటరల్స్ పబ్లిక్ ఇష్యూ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ల సంస్థ, సాయి పేరెంటరల్స్ త్వరలో తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రానుంది. ఐపీఓలో రూ.285 కోట్లకు కొత్త షేర్లు జారీ చేయడంతో పాటు, ప్రమోటర్లు ఓఎఫ్ఎస్ (ఆఫర్ ఫర్ సేల్) కింద రూ.125 కోట్ల విలువైన షేర్లు విక్రయిస్తారు. కంపెనీకి లభించిన నిధుల్లో రూ.110 కోట్లను మూలధన పెట్టుబడికి, రూ.26 కోట్లు పరిశోధనలకు, మిగిలిన సొమ్మును ఇతర అవసరాలకు వినియోగిస్తారు. ఈ సంస్థ ప్రస్తుతం బ్రాండెడ్ జనరిక్ ఫార్ములేషన్లు, సీడీఎంఓ (కాంట్రాక్టు అభివృద్ధి, ఉత్పత్తి) విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. స్టెరైల్ ఇంజెక్టబుల్స్, ఓరల్ సాలిడ్స్, లిక్విడ్స్, ఫార్ములేషన్లు ఈ సంస్థ ఉత్పత్తుల్లో ఉన్నాయి. ఆస్ట్రేలియాలో ఇటీవల నౌమెడ్ ఫార్మా అనే కంపెనీని సాయి పేరెంటరల్స్ కొనుగోలు చేసింది. యూఏఈ, సౌదీ అరేబియా, ఫిలిప్పీన్స్ దేశాలకు సైతం కార్యకలాపాలు విస్తరించనున్నట్లు కంపెనీ ఎండీ కె.అనిల్ కుమార్ వివరించారు.

పసిడి బాండ్లపై 341% లాభం

రూ.లక్ష పెట్టుబడి పెడితే 8 ఏళ్లలో రూ.4.41 లక్షలైంది

2017-18లో జారీచేసిన పదోవిడత సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ)లో పెట్టుబడులు పెట్టిన మదుపర్లకు కాసుల వర్షం కురుస్తోంది. అప్పట్లో రూ.లక్ష పెట్టుబడి పెట్టిన వారికి, 8 ఏళ్లలో ఏకంగా రూ.3.41 లక్షల (341%) లాభం వచ్చింది. 2017 డిసెంబరు 4న ఈ సిరీస్ బాండ్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) జారీ చేసింది. అప్పట్లో గ్రాముకు రూ.2,961 ధరను నిర్ణయించింది. 8 ఏళ్లు పూర్తయినందున.. వీటి రిడెమ్షన్ ధరను తాజాగా రూ.12,820గా ప్రకటించింది. దీంతో గ్రాముకు (రూ.12,820-రూ.2,911) రూ.9,909 ప్రతిఫలం వచ్చింది. అంటే సుమారు 341% లాభం వచ్చింది. గత 3 రోజుల్లో మేలిమి (999 స్వచ్ఛత) బంగారం సగటు ధర ఆధారంగా, పసిడి బాండు రిడెంప్షన్ ధరను నిర్ణయించారు. ఇండియన్ బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) 24 క్యారెట్ల పసిడి గ్రాము ధరను డిసెంబరు 1న రూ.12,821, 2న రూ.12,759, 3న రూ.12,880గా ప్రకటించింది. వీటి సగటు రూ.12,820 అయ్యింది.

కోడి గుడ్లు

5న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	651
వరంగల్	653
విజయవాడ	670
తూ/ప గోదావరి	650
విశాఖపట్నం	640
చిత్తూరు	663

పరిశోధనతోనే సత్వర విజయాలు

- రక్షణ, అంతరిక్ష రంగాల్లో ప్రైవేటు రంగ సంస్థల విస్తరణ
- సీఐఐ సదస్సులో వక్తల విశ్లేషణ



రక్షణ, అంతరిక్ష రంగాలపై నిర్వహించిన సదస్సులో కమడోర్ ఎ.మాధవరావు (రిటైర్డ్), జయరామ్, బాలకిష్టారెడ్డి, శివప్రసాదరెడ్డి, సుబ్బారావు పావులూరి, పూజా జామ్వాల్, అనూష.

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రక్షణ, అంతరిక్ష రంగాల్లో ప్రైవేటు రంగ సంస్థల భాగస్వామ్యం విస్తరిస్తోందని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎండీ కమడోర్ ఎ.మాధవరావు (రిటైర్డ్) అన్నారు. 2024-25లో దేశ రక్షణ ఎగుమతులు రూ.23,000 కోట్లకు మించాయని, ప్రస్తుతం ఇతరదేశాల కోసం ఇక్కడ తయారు చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), తెలంగాణ విభాగం గురువారం ఇక్కడ రక్షణ, అంతరిక్ష రంగాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏ రంగంలో అయినా విజయం సాధించాలంటే పరిశోధన- అభివృద్ధికి పెద్దపీట వేయాలని మాధవరావు అభిప్రాయపడ్డారు. బీడీఎల్ వార్షిక టర్నోవర్‌లో 6% నిధులను పరిశోధనకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. బీడీఎల్‌తో 3,500 సంస్థలు వ్యాపార భాగస్వాములుగా నమోదైనట్లు, ఇందులో 1500 సంస్థలు ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవేనని వివరించారు. యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా.. ఉద్యోగాలు కల్పించే వ్యాపారవేత్తలు కావాలని ఆయన అభిలషించారు.

డిజిటల్ హైవేలు పెద్ద అవకాశం: అనంత్ టెక్నాలజీస్ సీఎండీ సుబ్బారావు పావులూరి మాట్లాడుతూ గతంలో హైదరాబాద్‌లోని కంపెనీలు ప్రభుత్వ రంగ సంస్థలు ఇచ్చిన డిజైన్ల ప్రకారం ఉత్పత్తి కార్యకలాపాలు సాగించేవని.. ఇప్పుడు అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలు సొంత డిజైన్లను ఆవిష్కరిస్తూ, వాటి ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరిస్తున్నాయని అన్నారు. అంతరిక్ష కార్యకలాపాల్లోకి ఇప్పుడు ఎవరైనా అడుగు పెట్టొచ్చని, ఉపగ్రహాలు ప్రయోగించవచ్చని తెలిపారు. 'డిజిటల్ హైవే'లను ఏర్పాటు చేయడం అంతరిక్ష రంగంలో పెద్ద అవకాశంగా కనిపిస్తోందని వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికీ: నిత్యజీవితంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించటానికి అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి సూచించారు. ఏరోస్పేస్, ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో సత్వర ప్రగతి సాధించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీలుకల్పిస్తోందని, ఆదిభట్ల ఎస్ఈజడ్ ఈ కోవకు చెందుతుందని రాచమల్లు ఫోర్జింగ్స్ లిమిటెడ్ ఎండీ ఆర్.శివప్రసాదరెడ్డి వివరించారు.

అంతరిక్షం, రక్షణ రంగాల్లో ఏఐ (కృత్రిమ మేధ) సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తోందని సైయెంట్ డీఎల్ఎం హెడ్ (బిజినెస్ డెవలప్‌మెంట్) పూజా జామ్వాల్ అన్నారు. రక్షణ, అంతరిక్ష రంగాల్లో తెలంగాణ రాష్ట్రం సత్వర ప్రగతి సాధిస్తోందని కళ్యాణి రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈఓ కల్నల్ ఎం.జయరామ్ వివరించారు.

క్రిప్టో, స్టేబుల్‌కాయిన్స్‌తో డ్రగ్స్, బంగారం స్మగ్లింగ్‌కు నిధులు



దిల్లీ: చట్టవ్యతిరేక చెల్లింపులకు క్రిప్టో కరెన్సీని వినియోగించడం పెరిగిపోతోంది. ముఖ్యంగా మత్తుపదార్థాలు(డ్రగ్స్), పసిడి స్మగ్లింగ్‌కు యూఎస్‌డీటీ వంటి స్టేబుల్ కాయిన్లను వాడుతున్నారు. సంప్రదాయ హవాలా నెట్‌వర్క్ స్థానాన్ని ఇవి ఆక్రమిస్తున్నాయని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) తన నివేదికలో పేర్కొంది. స్మగ్లింగ్ ఇన్ ఇండియా 2024-25 నివేదిక ప్రకారం, సంప్రదాయ ఆర్థిక వనరులకు బదులుగా క్రిప్టోకరెన్సీలతో వేగవంతమైన, ట్రేసింగ్ క్లిష్టమయ్యే లావాదేవీలను జరుపుతున్నారు. ఈ ధోరణి పెరగడం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు సవాళ్లను విసరనుందని, అధునాతన బ్లాక్‌చైన్ ఫోరెన్సిక్‌ను అధికారులు అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని ఆ నివేదిక పేర్కొంది.

కొరియర్, ఇ-కామర్స్‌లో స్మగ్లింగ్: భారత్‌లో నార్కోటిక్స్ స్మగ్లింగ్ పెరుగుతూనే ఉందని, కొరియర్లు, ఇ-కామర్స్‌ను స్మగ్లింగ్ సిండికేట్లు వాడుతున్నాయని కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) ఛైర్మన్ వివేక్ చతుర్వేది తెలిపారు. డీఆర్ఐ 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అధికారులు ఇటువంటి వర్ధమాన ప్రమాదాలను ఎదుర్కోవడానికి డేటా అనలిటిక్స్‌ను వాడాలి. స్మగ్లింగ్ ధోరణులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తుండాల'ని సూచించారు. గతేడాది డీఆర్ఐ 65 కిలోల కొకైన్, 225 కిలోల మెథాఫేటమిన్, 9 టన్నుల గంజాయిని పట్టుకున్నట్లు చతుర్వేది తెలిపారు.

ఇ-శ్రమ్ పోర్టల్‌పై 31.38 కోట్ల మంది కార్మికుల నమోదు

అసంఘటిత రంగ కార్మికుల కోసం తీసుకొచ్చిన ఇ-శ్రమ్ పోర్టల్‌పై ఈ ఏడాది నవంబరు 27 నాటికి 31.38 కోట్ల మంది నమోదయ్యారని రాజ్యసభలో కేంద్ర కార్మిక మంత్రి సుశ్రీ శోభా కరాంద్లజే తెలిపారు. 2021 ఆగస్టు 21న ఇ-శ్రమ్ పోర్టల్‌ను తీసుకొచ్చారు. అసంఘటిత రంగ కార్మికుల జాతీయ డేటా బేస్‌గా ఇది పనిచేస్తుంది. ఇందులో నమోదయ్యే కార్మికుల ఆధార్‌ను అనుసంధానం చేస్తారు.

భారత స్టాక్‌మార్కెట్‌లో నేరుగా రష్యా మదుపర్ల పెట్టుబడులు

రష్యా అతిపెద్ద బ్యాంక్ ఎస్‌బెర్‌బ్యాంక్, జేఎస్‌సీ ఫస్ట్ అసెట్ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా కొత్త మ్యూచువల్ ఫండ్ '**ఫస్ట్ ఇండియా**'ను తీసుకొచ్చాయి. నిఫ్టీ 50 సూచీ ఆధారంగా ఈ ఫండ్ పనిచేస్తుంది. భారత స్టాక్ మార్కెట్‌లో రష్యా రిటెయిల్ మదుపర్లు నేరుగా పెట్టుబడులు పెట్టేందుకు ఇది దోహదపడనుంది.

సుజ్లాన్ గ్రూప్ 3 ఏఐ బ్లేడ్ ఫ్యాక్టరీలు

దేశీయ పవన విద్యుత్ పరిశ్రమ నుంచి పెరుగుతున్న గిరాకీని అందుకునేందుకు, ఆర్డర్లను వేగంగా పూర్తి చేసేందుకు 3 కృత్రిమ మేధ (ఏఐ) బ్లేడ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సుజ్లాన్ గ్రూప్ సహవ్యవస్థాపకుడు గిరీశ్ తంతి వెల్లడించారు. గుజరాత్, కర్ణాటకల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, మూడో ప్లాంటు ఏర్పాటు కోసం ప్రదేశాన్ని అన్వేషిస్తున్నట్లు వివరించారు.

అంకురాలకు నిరుత్సాహం

భారత్, అమెరికా అంకుర సంస్థల్లో పెట్టుబడులు పెట్టేందుకు 700 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.6,300 కోట్లు)తో ఏర్పాటు చేసిన నెక్సస్ వెంచర్స్ 8 ఫండ్‌ను మూసివేస్తున్నట్లు వెంచర్ క్యాపిటల్ సంస్థ నెక్సస్ వెంచర్ పార్టనర్స్ వెల్లడించింది.

విన్‌ఫాస్ట్ రూ.4500 కోట్ల పెట్టుబడులు

తమిళనాడు ప్లాంట్‌లో విద్యుత్ బస్సులు, స్కూటర్లను ఉత్పత్తి చేసేందుకు అదనంగా 500 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.4500 కోట్లు) పెట్టుబడులు పెట్టనున్నట్లు వియత్నాం విద్యుత్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ప్రకటించింది.

4 రోజుల్లో రూ.13,121 కోట్ల ఉపసంహరణ



జనవరి నుంచి ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.1.56 లక్షల కోట్లు

దేశీయ స్టాక్‌మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు, ఈనెల తొలి 4 రోజుల్లోనే రూ.13,121 కోట్లు ఉపసంహరించుకున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి చూస్తే, వీరి విక్రయాల మొత్తం రూ.1.56 లక్షల కోట్లని ఎన్ఎస్‌డీఎల్ గురువారం తెలిపింది. సాధారణంగా డిసెంబరులో విదేశీ మదుపర్లు అమ్మకాలు జరుపుతుంటారని, తాజా అమ్మకాలకు ఇదీ కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతోపాటు డాలర్‌తో పోలిస్తే, రూపాయి విలువ తగ్గిపోతుండటమూ విదేశీ మదుపర్లను నిరుత్సాహపరుస్తోందన్నారు. అమెరికాతో భారత్‌కు వాణిజ్య ఒప్పందం కుదిరితే పరిస్థితి మెరుగవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. డాలర్‌తో పోలిస్తే, రూపాయి విలువ గురువారం మెరుగుపడేందుకు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోక్యమే కారణమనే వాదనా ఉంది.

2025లో క్రయ/విక్రయాలు (రూ.కోట్లలో)	
నవంబరు	-3765
అక్టోబరు	+ 14,610
సెప్టెంబరు	-23,885
ఆగస్టు	-34,990
జులై	- 17,700
జూన్	+14,590
మే	+19,860
ఏప్రిల్	+4223
మార్చి	-3,973
ఫిబ్రవరి	-34,574
జనవరి	-78,027

ఇమాస్‌కు చెందిన ఈసీఎస్-డీఓటీ చిప్‌నకు

మాస్‌చిప్ టెక్నాలజీస్ ఇంజినీరింగ్ మద్దతు

ఈనాడు, హైదరాబాద్: సిలికాన్, ప్రోడక్ట్ ఇంజినీరింగ్ విభాగాల్లో సేవలు అందిస్తున్న మాస్‌చిప్ టెక్నాలజీస్, ఆస్ట్రేలియాకు చెందిన నానోవ్యూ లిమిటెడ్‌కు సబ్సిడరీ అయిన ఇమాస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుని, కలిసి పనిచేస్తోంది. ఎడ్జ్ కంప్యూటింగ్ కోసం తక్కువ విద్యుత్తును వినియోగించే ఏఐ సిస్టమ్-ఆన్-చిప్ (ఎస్ఓసీ)పై ఇమాస్‌కు నైపుణ్యం ఉంది. దీనికి చెందిన ఈసీఎస్-డీఓటీ చిప్ విజన్, ఆడియో, సెన్సర్ డేటా విభాగాల్లో అత్యధిక ఏఐ ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుంది. డ్రోన్లు, ఇండస్ట్రియల్ ఐఓటీ, ఎడ్జ్ సెన్సార్లలో దీన్ని వినియోగిస్తారు. సంప్రదాయ ఎడ్జ్ ఏఐ సొల్యూషన్లతో పోల్చితే ఈ చిప్ 90% తక్కువ విద్యుత్తు వినియోగించుకుంటుంది. 93% అధిక ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం మాస్‌చిప్ టెక్నాలజీస్ ఇంజినీరింగ్ సేవలను అందించింది. డిజైన్, టేప్-అవుట్ కోఆర్డినేషన్, ప్యాకేజింగ్, అసెంబ్లీ, హార్డ్‌వేర్, వాలిడేషన్ సేవలు ఇందులో ఉన్నాయి. దీనివల్ల పూర్తిస్థాయి ఎస్ఓసీ, ఎవల్యూషన్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించే అవకాశం కలిగినట్లు మాస్‌చిప్ టెక్నాలజీస్ వివరించింది. వినూత్న ఎస్ఓసీ ఆర్కిటెక్చర్‌కు ఎంతో అనుభవంతో సాధించిన ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని అందించినట్లు మాస్‌చిప్ టెక్నాలజీస్ సీఈఓ శ్రీనివాసరావు కాకుమాను తెలిపారు.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ జీసీసీల్లో ఆకర్షణీయ జీతభత్యాలు



ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్) ల్లో అన్ని స్థాయిల ఉద్యోగులకు అధిక జీతభత్యాలు లభిస్తున్నాయని 'కెరీర్‌నెట్- బీఎఫ్ఎస్ఐ జీసీసీస్ ఇన్ ఇండియా' అనే నివేదిక వివరించింది. 2025-26 సంవత్సరానికి వివిధ రంగాలకు చెందిన జీసీసీల్లో 50,000 మంది ఉద్యోగుల వివరాలను సేకరించి, ఈ నివేదిక రూపొందించారు. దీని ప్రకారం.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ తర్వాత రిటెయిల్, కమర్షియల్ బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా జీసీసీల్లో జీతభత్యాలు బాగున్నాయి. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో డేటా సైంటిస్ట్‌కు రూ.22.1-46.9 లక్షల వార్షిక వేతనం లభిస్తోంది. ఫుల్-స్టాక్ డెవలపర్లకు రూ.20.7- 47.5 లక్షలు వస్తోంది. రిటెయిల్ బ్యాంకింగ్‌లో రూ.19.9- 44.5 లక్షలు, బీమాలో రూ.18.4- 44.3 లక్షల జీతభత్యాలు ఉన్నాయని వివరించింది. స్క్రమ్ మాస్టర్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్‌లకు ప్రారంభంలో ఒక మోస్తరు జీతమే అయినా, అనుభవం వచ్చే కొద్దీ ఎంతో వేగంగా జీతాలు పెరుగుతున్నట్లు నివేదిక వివరించింది. త్వరితంగా నిర్ణయాలు తీసుకోవటానికి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ జీసీసీలు ఎంబెడెడ్ టెక్నాలజీని, డేటా సైన్స్‌ను అధికంగా వినియోగిస్తున్నాయని కెరీర్‌నెట్ సెక్టార్ లీడర్ (బీఎఫ్ఎస్ఐ జీసీసీ) రంజీత్ సింగ్ నారంగ్ తెలిపారు.

అంతర్జాతీయ ప్రభావశీలుర జాబితాలో భారతీయ కంపెనీల ఉన్నతాధికారులు

దిల్లీ: ప్రోవోక్ మీడియాకు చెందిన 2025 గ్లోబల్ 100 మంది ప్రభావశీల పారిశ్రామిక నేతల జాబితాలో, భారత అగ్రగామి కంపెనీల కమ్యూనికేషన్స్, మార్కెటింగ్ విభాగాల అధిపతులు చోటు చేసుకున్నారు. రిలయన్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ కమ్యూనికేషన్స్ రోహిత్ బన్సల్, ఇన్ఫోసిస్ గ్లోబల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సుమిత్ విర్మానీ, టీసీఎస్ గ్లోబల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అభినవ్ కుమార్, వేదాంతా గ్రూప్ డైరెక్టర్ ఆఫ్ కమ్యూనికేషన్స్ రితు ఝింగాన్, గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ చీఫ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సుజిత్ పాటిల్, జిందాల్ స్టీల్ కార్పొరేట్ బ్రాండ్, కమ్యూనికేషన్స్ అధిపతి అర్పణ కుమార్ అహూజా తదితరులు ఈ జాబితాలో చోటు చేసుకున్నారు. 'ద ఇన్‌ఫ్లూయెన్స్ 100 అనేది ప్రోవోక్ మీడియా వార్షిక జాబితా. ఇందులో ప్రపంచ వ్యాప్తంగా ప్రభావశీలురైన సీనియర్ కమ్యూనికేషన్స్, కార్పొరేట్ వ్యవహారాలు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను ఎంపిక చేస్తామ'ని పేర్కొంది.

నాలుగు రోజుల తర్వాత లాభాలు

సెన్సెక్స్ ▲ 159 **85265** | నిఫ్టీ ▲ 48 **26034**

డాలర్ విలువ రూ.89.89



సూచీల నాలుగు రోజుల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. ఐటీ, టెక్ షేర్లు రాణించడంతో నిఫ్టీ 26,000 పాయింట్ల ఎగువన ముగిసింది. ఆర్‌బీఐ పరపతి సమీక్ష నిర్ణయాలు శుక్రవారం ఉదయం వెలువడనుండటంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి రికార్డు కనిష్ఠ స్థాయిల నుంచి కోలుకుంది. గురువారం 26 పైసలు పుంజుకుని 89.89 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.38% లాభంతో 62.91 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ గురువారం రూ.18,000 కోట్లు పెరిగి రూ.469.85 లక్షల కోట్లు (5.21 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 119 పాయింట్ల (క్రితం ముగింపు 85,106.81) నష్టంతో 84,987.56 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకుల మధ్య కదలాడిన సూచీ, ఇంట్రాడేలో 85,487.21 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 158.51 పాయింట్ల లాభంతో 85,265.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 47.75 పాయింట్లు రాణించి 26,033.75 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,938.95- 26,098.25 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 18 మెరిశాయి. టీసీఎస్ 1.54%, టెక్ మహీంద్రా 1.28%, ఇన్ఫోసిస్ 1.24%, హెచ్‌సీఎల్ టెక్ 0.94%, బజాజ్ ఫైనాన్స్ 0.88% లాభపడ్డాయి. ఎటర్నల్, మారుతీ, కోటక్ బ్యాంక్, టైటన్, ఐసీఐసీఐ బ్యాంక్ 0.69% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ 1.41%, ఐటీ 1.31%, టెక్ 1.12%, స్థిరాస్తి 0.53% పెరిగాయి. సేవలు, వినియోగ, ఆర్థిక సేవలు, పరిశ్రమలు, యుటిలిటీస్, మన్నికైన వినిమయ వస్తువులు, విద్యుత్ తగ్గాయి. బీఎస్ఈలో 1732 షేర్లు లాభపడగా, 2418 స్క్రిప్‌లు నష్టపోయాయి.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధిరేటు 7.4 శాతంగా నమోదు కావచ్చని ఫిచ్ రేటింగ్స్ తాజాగా అంచనా వేసింది. గతంలో 6.9% వృద్ధి లభించొచ్చని అంచనా వేసిన ఫిచ్, తాజాగా మరింత పెంచింది.

✦ ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లూయెన్సర్ అవధూత్ సాథే, ఆయన సంస్థ అవధూత్ సాథే ట్రేడింగ్ అకాడమీని మార్కెట్ల నుంచి నిషేధించడమే కాక, అనైతికంగా సంపాదించిన రూ.546 కోట్లు చెల్లించాలని సెబీ ఆదేశించింది.

నేడు ఉదయం 10 గంటలకు ఆర్‌బీఐ నిర్ణయాలు: రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ద్రవ్యపరపతి విధాన సమీక్ష కమిటీ నిర్ణయాలను శుక్రవారం ఉదయం 10 గంటలకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించనున్నారు. ఈ సారి కీలక రేట్లలో 0.25% కోత విధించొచ్చన్న అంచనాలు ఉన్నాయి. రూపాయి క్షీణత నేపథ్యంలో, కీలక రేట్లను యథాతథంగా కొనసాగించొచ్చనీ కొంత మంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఐపీఓ సమాచారం..

✦ **నెఫ్రోప్లస్ ధరల శ్రేణి రూ.438- 460:** డయాలసిస్ సేవలు అందించే నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ ఐపీఓ ఈనెల 10న ప్రారంభమై 12న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.438- 460 నిర్ణయించారు. గరిష్ఠ ధర ప్రకారం.. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.871 కోట్లు సమీకరించనుంది. యాంకర్ మదుపర్లు డిసెంబరు 9న బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. రిటెయిల్ మదుపర్లు కనీసం 32 షేర్ల (ఒక లాట్ రూ.14,720)కు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 17న కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుకానున్నాయి.

✦ ఏక్వస్ ఐపీఓ రెండో రోజుకు 11.10 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 4,20,26,913 షేర్లను ఆఫర్ చేయగా, 46,66,16,040 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ మీషో ఐపీఓ రెండో రోజుకు 7.97 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 27,79,38,446 షేర్లను జారీ చేయనుండగా, 2,21,60,17,845 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి.

బంగారం అద్దెకు ఇద్దాం..
ఆదాయం ఆర్జిద్దాం

ఎంతో విలువైన బంగారం ఇంట్లో వృథాగా ఉందా.. దొంగల భయంతో బ్యాంకు లాకర్లలో పెట్టి, వేల రూపాయల అద్దె కడుతున్నారా.. ఇదీ ఖర్చు కదా అని బాధపడుతున్న వారికి సరికొత్త ఆదాయ మార్గం అందుబాటులోకి వస్తోంది. అదే మన బంగారాన్ని అద్దెకు ఇచ్చి వడ్డీ ఆదాయాన్ని పొందే వీలుంది. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పసిడి నగదీకరణ పథకం కింద, ప్రైవేటు సంస్థల్లోనూ 'అద్దె/లీజ్' పేరిట ఇలా బంగారాన్ని జమ చేయొచ్చు. ప్రైవేటు సంస్థలు కొంచెం అధిక వడ్డీ ఇస్తుండగా, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో తక్కువ వడ్డీ లభిస్తుంది.. బ్యాంకుల్లో మన బంగారం సురక్షితంగా ఉంటుందనే విశ్వాసం అందరికీ ఉంటుంది.



అన్ని ఆదాయ వర్గాల వారు బంగారాన్ని ఆభరణాల రూపంలో కొంటారు. దీంతోపాటు మిగులు ఆదాయం ఉన్న వారు, మేలిమి (24 క్యారెట్ల) బంగారాన్ని బిస్కెట్ల రూపంలో కొని అట్టే పెట్టుకుంటారు. డబ్బు రూపంలో కంటే బంగారం రూపేణ తక్కువ స్థలంలో దాచుకునేందుకు వీలు కావడం, విలువ ఎప్పటికప్పుడు పెరుగుతూ ఉన్నందున.. సంపద విలువ అధికమవుతుండటం ఇందుకు కారణం. ఇళ్ల వంటి స్థిరాస్తులపై పెట్టుబడులు పెడితే విలువ పెరగడంతో పాటు, అద్దె/లీజ్ రూపేణ నెలవారీ ఆర్జన కూడా వస్తోంది. బంగారం కొని అట్టే పెట్టుకుంటే.. విలువ పెరిగినా, దీనిపై ఆదాయం రావడం లేదనే అసంతృప్తి కొందరికి ఉంటోంది. ఇటువంటి వారికి ఊరట కలిగించేదే పసిడి 'లీజ్' విధానం.

వీరికి ఇవ్వొచ్చు

మేలిమి బంగారం బిస్కెట్లను ఆభరణాల విక్రేతలు, రిఫైనర్లు, ఫ్యాబ్రికేటర్లకూ అద్దెకు ఇవ్వొచ్చు. రోజువారీ కార్యకలాపాల కోసం ఆభరణాల విక్రేతలకు నగదు/మేలిమి బంగారం కావాలి. నగదు అయితే అధిక వడ్డీ చెల్లించాలి. తక్కువ వడ్డీకి పసిడి లభిస్తుంది కాబట్టి, దీనికి దుకాణదారులూ ముందుకొస్తున్నారు. బంగారాన్ని పూచీకత్తుపై లీజ్‌కు ఇస్తే 2% వడ్డీ, పూచీకత్తు లేకుండా ఇస్తే 4% వడ్డీని సంస్థలు ఆఫర్ చేస్తున్నాయని చెబుతున్నారు. హైదరాబాద్ వ్యాపారులు కొందరు ఇలా తీసుకుంటున్నారని.. అయితే బంగారం విలువపై నూటికి 50 పైసల చొప్పున వడ్డీ చెల్లిస్తున్నట్లు ఒక బులియన్ వ్యాపారి తెలిపారు.

రుణం తరహాలోనే

మన దగ్గర వృథాగా పసిడి ఆభరణాలు ఉంటే, అద్దెకు ఇవ్వొచ్చు. వాటిని కరిగించి, లోహ రూపంలో 999 స్వచ్ఛత తెచ్చి, ఎంత బరువుందో చూస్తారు. కాలావధి తీరాక మళ్లీ మేలిమి బంగారం రూపంలోనే తిరిగి ఇస్తారు. అప్పటివరకు పసిడి విలువపై వడ్డీ చెల్లిస్తారు. అందువల్ల మన ఆభరణాలు పాత రూపంలోనే ఉండాలనుకుంటే మాత్రం వీరికి ఇవ్వకూడదు. పసిడి బిస్కెట్లు అయితే ఇబ్బంది ఉండదు.

✦ పసిడి ధర ఈ ఏడాదిలోనే 50% పెరిగిన నేపథ్యంలో.. ఈ ఏడాది పండగ సీజన్ నుంచి పసిడి లీజుకు గిరాకీ తీవ్రమైందని ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు చెబుతున్నారు. ఇప్పటివరకు కేంద్రీయ బ్యాంకులు, బులియన్ బ్యాంకులు ఇలా పసిడిని లీజుకు ఇచ్చేవని.. ఇప్పుడు సంపన్నులు కూడా ఈ విధానానికి ముందుకు వస్తున్నారని తెలిపారు.

నష్టభయాలుంటాయ్

లాకర్‌లో పెట్టుకున్న బంగారాన్ని కావాల్సి వచ్చినప్పుడు తెచ్చుకోవచ్చు. మనం నమ్మి లీజుకు ఇచ్చిన వ్యాపారి కనుక, ఆలస్యం చేస్తే.. అసలు దుకాణమే కట్టేస్తే.. ఈ నష్టభయం మాత్రం పొంచి ఉంటుంది. ఎందుకంటే సంవత్సరాలుగా వ్యాపార సంస్థల నుంచి బంగారం బిస్కెట్లు తీసుకుని, ఆభరణాలు తయారు చేసి ఇచ్చే కొందరు.. పెద్దమొత్తం బంగారంతో పరారు కావడాన్ని చూస్తూనే ఉన్నాం. పసిడి ధర బాగా పెరిగిన నేపథ్యంలో, లీజుకు తీసుకున్న సంస్థ నిర్వాహకులు పరారైతే, ఏం చేయగలమనేది కూడా ఆలోచించుకోవాల్సిందే. ఇదే విషయాన్ని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) కూడా హెచ్చరిస్తోంది. మన దగ్గర తీసుకున్నప్పుడు, పరీక్షించి మరీ 999 స్వచ్ఛతను నిర్ధారించుకున్నా.. తిరిగి ఇచ్చేపుడు తక్కువ స్వచ్ఛత కలిగిన పసిడి బిస్కెట్లు ఇస్తే పరిస్థితి ఏంటో చూసుకోవాలి. ప్రైవేటు వ్యాపారులను నమ్మి బంగారం ఇవ్వడం అంటే, వారిపై పూర్తి అవగాహన - వారి కార్యకలాపాలపై విశ్వాసం ఉంటేనే ముందడుగు వేయాలి.

✦ తమ ప్లాట్‌ఫామ్ ద్వారా తీసుకుని, తిరిగి ఇచ్చేప్పుడు పసిడి స్వచ్ఛతను పూర్తిగా నిర్ధారిస్తామని సేఫ్‌గోల్డ్ చెబుతోంది. బీమా, ఆడిట్, కెమేరాలు, రేడియో ఫ్రీక్వెన్సీ ధ్రువీకరణ సాంకేతికతతో పసిడి స్వచ్ఛతను నిర్ధారిస్తామని మానిటరీ మెటల్స్ అంటోంది. లీజ్డ్ బంగారంతో చేసే ప్రతి ఆభరణానికి ఆర్‌ఎఫ్ఐడీ ట్యాగ్ వేస్తామని.. అందువల్ల ప్రతి ఆభరణం లెక్క తమకు తెలుస్తుందని గోల్డ్‌స్టార్మ్ చెబుతోంది. ఎంత సరకు ఉందనే విషయాన్ని కెమేరాలు, సెన్సర్లు ట్రాక్ చేస్తాయని, బంగారం అపహరణకు గురయినా - ఉద్యోగి మోసం చేసినా బీమా వర్తిస్తుందని.. తద్వారా బంగారం రికవరీ అవుతుందని వివరించింది. పశ్చిమాసియాలో 2006 నుంచే పసిడి లీజ్ విధానం అమలవుతోందని గుర్తు చేసింది.

సురక్షితంగా బ్యాంకుల్లో పసిడి నగదీకరణ పథకం

ప్రైవేటు వ్యక్తులతో ఇబ్బంది అనుకుంటే, ప్రభుత్వరంగ బ్యాంకుల్లోనూ బంగారాన్ని డిపాజిట్ చేసి, వడ్డీ పొందే అవకాశం ఉంది. దీనినే పసిడి నగదీకరణ పథకంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల వద్ద వృథాగా ఉన్న బంగారాన్ని, వినియోగంలోకి తెచ్చేందుకు.. తద్వారా బంగారాన్ని దిగుమతి చేసుకునేందుకు విదేశీ మారకపు ద్రవ్యాన్ని వెచ్చించకుండా చూసేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది.

ఈ పథకం వినియోగానికి..

బ్యాంకులో కేవైసీ పూర్తిచేసిన వారు, గోల్డ్ డిపాజిట్ పథకం అకౌంట్ తెరవాలి. మన బంగారాన్ని బ్యాంకు తరఫున కలెక్షన్ - టెస్టింగ్ ఏజెంట్ తీసుకుని, స్వచ్ఛతను నిర్ధారిస్తారు. మన ఖాతాలో డిపాజిట్ అయిన బంగారం విలువ ఆధారంగా వడ్డీ లభిస్తుంది.

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియానే తీసుకుంటే ఏడాది వ్యవధికి 0.50%, రెండేళ్ల వరకు 0.55%, మూడేళ్లకు 0.60% వడ్డీ చెల్లిస్తోంది. గతంలో దీర్ఘకాలానికి తీసుకునే వారు. ఈ ఏడాది మార్చి 26 నుంచి మధ్య (5-7 ఏళ్లు), దీర్ఘకాల (12-15 ఏళ్లు) పసిడి నగదీకరణ పథకాలను ప్రభుత్వం నిలిపేసింది. మధ్యకాల పథకాలపై 2.25%, దీర్ఘకాల పథకాలపై 2.50% వడ్డీ ఇచ్చేవారు. స్వల్పకాల (1-3 ఏళ్లు) పథకాలు కూడా బ్యాంకుల ఇష్టప్రకారం నిర్వహించొచ్చు.

✦ కనీసం 10 గ్రాముల పసిడి నుంచి స్వీకరిస్తారు. ఆభరణాలు, నాణేలు, బిస్కెట్లు కూడా తీసుకుంటారు. అయితే ఆభరణాలపై ఉన్న రాళ్లను పరిగణనలోకి తీసుకోరు.

✦ ఎంపిక చేసిన కలెక్షన్-స్వచ్ఛత నిర్ధారణ కేంద్రాల్లో ఈ బంగారాన్ని అప్పగించాలి. కరిగించి, 999 స్వచ్ఛతకు చేర్చి, ఎంత బరువుందో ధ్రువీకరిస్తారు. కాలావధి ముగిశాక.. మనకు అదేమొత్తం మేలిమి బంగారాన్ని లేదా ఆ విలువకు సమానమైన నగదును ఇస్తారు. వడ్డీని ఏటా మార్చి 31న లేదా గడువు తీరాక, ఒకేసారి మొత్తం రూపాయల్లో చెల్లిస్తారు.

✦ ప్రభుత్వ బ్యాంకులు కనుక బంగారం పోతుందనే ఆందోళన ఉండదు.

– కె.అమర్ కుమార్

మీరు గృహరుణం తీసుకున్నారా? అప్పటితో పోలిస్తే, ఇప్పుడు మీ క్రెడిట్ స్కోరు గణనీయంగా పెరిగిందా? ఈ విషయాన్ని ఒకసారి మీ బ్యాంకుకు చెప్పండి. ఎందుకంటారా.. స్కోరు పెరిగితే, బ్యాంకులు వడ్డీలో రాయితీనిస్తాయి.

స్కోరు పెరిగితే వడ్డీ తగ్గుతుంది

siri@eenadu.net



ప్రస్తుతం బ్యాంకులు రెపో ఆధారిత వడ్డీ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్) ఆధారంగా గృహరుణాలను అందిస్తున్నాయి. రెపో రేటుకు కొంత వడ్డీని కలిపి దీన్ని నిర్ణయిస్తాయి. ఈ అదనపు శాతాన్ని 'స్ప్రెడ్' అని పిలుస్తారు. ఉదాహరణకు ఒక బ్యాంకు ప్రస్తుతం ఉన్న రెపో రేటుపై 2.75 శాతం వడ్డీని అదనంగా విధిస్తుంది. అనుకుందాం. అప్పుడు రెపో రేటు 5.5 శాతం అనుకుంటే.. బ్యాంకు గృహరుణాన్ని 8.25 శాతానికి అందిస్తుంది. క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉన్నప్పుడు బ్యాంకు దృష్టిలో మీరు నమ్మకమైన రుణగ్రహీతగా మారతారు. కాబట్టి, బ్యాంకు తాను అదనంగా వసూలు చేసే స్ప్రెడ్‌ను కాస్త తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తుంది. ప్రామాణిక వడ్డీ రేటు స్థిరంగా ఉన్నప్పటికీ, బ్యాంకు అదనంగా వసూలు చేసే వడ్డీని పావు శాతం నుంచి అర శాతం వరకూ తగ్గించుకుంటుంది. దీనివల్ల రుణగ్రహీతలపై వడ్డీ భారం తగ్గుతుంది.

- మీ క్రెడిట్ స్కోరులో గణనీయమైన పెరుగుదల కనిపించిన వెంటనే, మీ బ్యాంకును సంప్రదించండి. మీ స్కోరు గురించి చెప్పండి. మీరోసారి మీ ఆర్థిక చరిత్రను పరిశీలించాలని కోరాలి. వడ్డీ స్ప్రెడ్‌ను తగ్గించాల్సిందిగా అడగాలి. మీకు రుణం ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ మీ ఆదాయం, స్కోరు పెరిగిందని బ్యాంకు భావిస్తే.. వడ్డీ రేటును తగ్గిస్తుంది.
- గతంలో ఇలా వడ్డీ రేటు మార్చేందుకు మూడేళ్ల తర్వాత మాత్రమే అవకాశం ఉండేది. ఇప్పుడా నిబంధనను ఆర్‌బీఐ తొలగించింది. కాబట్టి, అవకాశం ఉన్నప్పుడల్లా వడ్డీ మార్పు గురించి అడిగేందుకు వీలవుతుంది.
- వడ్డీ రేటును తగ్గిస్తే రెండు రకాల వెసులుబాట్లు ఉంటాయి. కాలపరిమితి మారకుండా నెలవారీ వాయిదా (ఈఎంఐ)ని తగ్గించుకోవచ్చు.
- ఈఎంఐని అలాగే కొనసాగిస్తే, రుణం కాల పరిమితి తగ్గుతుంది. సాధారణంగా ఈ పద్ధతిని ఎంచుకోవడమే మేలు. కొన్నిసార్లు బ్యాంకు మీ దరఖాస్తును తిరస్కరించే అవకాశమూ ఉంది. కొన్ని బ్యాంకులు ఇలా వడ్డీ రేటు మార్చేందుకు రుసుమునూ వసూలు చేస్తాయి.

20-25 ఏళ్ల సుదీర్ఘకాలం కొనసాగే ఇంటి రుణానికి 0.25 శాతం వడ్డీ తగ్గినా, దీర్ఘకాలంలో చాలా పెద్ద మొత్తంలో వడ్డీ ఆదా అవుతుంది. కాబట్టి, ఈ రెండింటిలో ఏది మంచిదో బ్యాంకును అడిగి తెలుసుకొని, దాన్ని బట్టి నిర్ణయం తీసుకోండి.

వినియోగం ఆధారంగా

యూనియన్ మ్యూచువల్ ఫండ్, కొత్తగా వినియోగం థీమ్ ఆధారంగా ఒక పథకాన్ని తీసుకొచ్చింది. యూనియన్ కన్సంప్షన్ ఫండ్' అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 15 వరకూ అందుబాటులో ఉంటుంది. ఎన్ఎఫ్ఓలో కనీస పెట్టుబడి రూ.1,000. మనదేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో కీలకమైన దశలో ఉన్న విషయం విదితమే. తక్కువ పన్ను రేటు, జీఎస్టీ సవరణ, 8వ పే కమిషన్, తక్కువ ద్రవ్యోల్బణం, ఆర్‌బీఐ సమయానుకూలమైన చర్యలు, సానుకూల రుతుపవనాలు...వినియోగాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. దీనివల్ల తలసరి ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. 2008 నుంచి ఇప్పటికి తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగిన విషయం గమనార్హం. ఇంకా 2030 నాటికి 1.6 రెట్లు పెరుగుతుందని అంచనా. తత్ఫలితంగా గతంలో ఎన్నడూ లేనంత అధికంగా వినియోగం పెరిగే అవకాశం ఏర్పడుతోంది. దీర్ఘకాలంలో వినియోగ ఉత్పత్తులు, సేవలు అందించే సంస్థలు అధిక ఆదాయాలు, లాభాలు ఆర్జించగలుగుతాయి. గత 19 ఏళ్ల కాలంలో వినియోగ సూచీ 13 రెట్లు పెరిగిన విషయం గమనార్హం. 2019- 2024 మధ్యకాలంలో నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ సగటున 14.7 శాతం ప్రతిఫలాన్ని ఇచ్చింది. నిఫ్టీ 500 సూచీ ఇచ్చిన 12.5 శాతం లాభం కంటే ఇది అధికం. అందువల్ల ఈ పథకం దీర్ఘకాలిక మదుపరులకు అనుకూలంగా ఉంటుందని చెప్పొచ్చు. ఈ పథకానికి వినోద్ మాళవీయ, సంజయ్ బెంబాల్కర్ ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు.

ప్రతి నెలా జీతం రాగానే కొంత మొత్తం పెట్టుబడికి మళ్లించాలనుకునే వారికి మ్యూచువల్ ఫండ్లు అందించే ఒక మార్గమే క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్). కొంతమంది నెలలో మిగిలిన మొత్తాన్నీ ఒకేసారి మదుపు చేస్తారు. ఎవరు ఏ మార్గం ఎంచుకున్నా దీర్ఘకాలంలో సంపదను సృష్టించడమే లక్ష్యం.

సిప్ చేయొద్దు ఈ పొరపాట్లు



మీరు మదుపు చేస్తున్న సిప్ మీ కోసం నిజంగా పని చేస్తోందా? చాలా మంది మదుపరులు కొన్ని చిన్న పొరపాట్లతో దాని పనితీరును దెబ్బతీస్తుంటారు. ఫలితంగా అది ఇచ్చే రాబడులు తగ్గిపోతాయి.

మార్కెట్లు పడిపోతే..

స్టాక్ మార్కెట్లో హెచ్చుతగ్గులు సహజం. ఇలాంటప్పుడు ఆందోళనతో నిర్ణయాలు తీసుకోవద్దు. మార్కెట్ విలువ తగ్గినప్పుడు ఎక్కువ యూనిట్లు కొనుగోలు చేసే విధంగానే సిప్‌లు రూపొందాయి. మీ పోర్ట్‌ఫోలియో ప్రతికూలంగా ఉన్నప్పుడు సిప్‌లను నిలిపేయడం పెట్టుబడిదారులు చేసే అతిపెద్ద తప్పు అని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్ తగ్గినప్పుడు సిప్‌లను కొనసాగించడం వల్ల సగటు కొనుగోలు ధర కంటే తక్కువ ధరకు యూనిట్లు లభిస్తాయి. తర్వాత మార్కెట్లు పెరిగినప్పుడు మంచి రాబడి కనిపిస్తుంది.

త్వరగా వెనక్కి తీసుకోవడం

మీ సిప్‌లో లాభాలు కనిపించగానే డబ్బును వెనక్కి తీసుకోవాలని అనిపించడం సహజమే. కానీ, సిప్ మొదటి 3-5 ఏళ్లపాటు పెద్ద రాబడిని స్వీకరించే దశ కాదు. అది కేవలం పెట్టుబడి పెట్టాల్సిన సమయం. ఈ సమయంలో మీ డబ్బు చక్రవడ్డీని ఆర్జించే ప్రక్రియలో ఉంటుంది. మీరు త్వరగా పెట్టుబడిని వెనక్కి తీసుకుంటే.. ఆ ప్రయోజనాన్ని మధ్యలోనే ఆపేసినట్లు అవుతుంది. కొన్నాళ్లపాటు మీ పోర్ట్‌ఫోలియో వైపు చూడకుండా ఉండండి. ఓపిక పట్టండి. కొన్నేళ్ల తర్వాత మీ పెట్టుబడిలో వృద్ధి మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది. పెట్టుబడి అనేది క్రమశిక్షణతో పాటు, ఓర్పు అనే లక్షణాన్నీ నేర్పిస్తుంది.

పనితీరు ఆధారంగా

మనం తరచూ పోర్ట్‌ఫోలియోను పరిశీలిస్తుంటే మంచి రాబడి వచ్చిన ఫండ్‌లూ కనిపిస్తాయి. మిగతా ఫండ్ల పనితీరు నచ్చకపోవచ్చు. మొత్తం డబ్బును ఆ మంచి ఫండ్లలోకే మళ్లించాలని అనిపిస్తుంది. కానీ, ప్రతిసారీ ఇలా ఫండ్లను మార్చుకుంటూ వెళ్తే ఎగ్జిట్ లోడ్ పడుతుంది. పన్నులూ వర్తిస్తాయి. అంతేకాకుండా చక్రవడ్డీ లాభాలనూ కోల్పోవచ్చు. తరచుగా ఫండ్లను మార్చడం వల్ల మీ డబ్బు ఆర్జించిన రాబడి రుసుములు, పన్నులు చెల్లించేందుకే సరిపోతుంది. అందుకే, కొన్నిసార్లు సిప్‌ను పట్టించుకోకుండా వదిలేయడమే మనం చేయగలిగే అత్యుత్తమ పని.

ఒకే ఫండ్ సంస్థలో

చాలా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఒక నిర్ణీత పెట్టుబడి శైలిని, వ్యూహాన్ని అనుసరించి పోర్ట్‌ఫోలియోలను నిర్మిస్తాయి. అందుకే, చాలా సందర్భాల్లో ఒక ఫండ్ సంస్థలోని అనేక పథకాలు బాగా పనిచేస్తాయి. లేదా కొన్నిసార్లు అసలు పని చేయవు. కాబట్టి, పెట్టుబడి పెట్టబోయే ముందు ఆ ఫండ్ పెట్టుబడి శైలిని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఒక ఫండ్ సంస్థకు చెందిన అనేక పథకాల్లో పెట్టుబడి పెట్టకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.

సిప్‌లతో పూర్తిగా విజయం సాధించాలంటే, మార్కెట్ పతనం సమయంలో క్రమశిక్షణతో మదుపు చేయడం, మీ వ్యూహాన్ని సమయానుకూలంగా సమీక్షించుకోవడం అవసరమని మర్చిపోవద్దు.

కొత్త పథకం

అన్ని రకాల షేర్లలో

అబక్కస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక ఫ్లెక్సీక్యాప్ పథకాన్ని ఆవిష్కరించింది. 'అబక్కస్ ఫ్లెక్సీక్యాప్ ఫండ్' అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ఈ నెల 8న మొదలవుతుంది. ఈ నెల 22 ముగింపు తేదీ. దీర్ఘకాలంలో తక్కువ రిస్కుతో లాభాలు ఆర్జించటం ఈ పథకం ప్రధానోద్దేశం. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన షేర్లలో పెట్టుబడి అవకాశం ఈ పథకంలో ఉంటుంది. అదే సమయంలో కొంత మొత్తాన్ని రుణ పత్రాలు, రీట్, ఇన్విట్‌లకు కేటాయించవచ్చు. బీఎస్ఈ 500 ఇండెక్స్ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. సొంతంగా రూపొందించుకున్న 'మీట్స్' పెట్టుబడి విధానాన్ని అబక్కస్ మ్యూచువల్ ఫండ్ అనుసరిస్తుంది. ప్రధానంగా యాజమాన్యం తీరుతెన్నులు, ఆదాయాలు- లాభాలు ఆర్జించే సామర్థ్యం, దీర్ఘకాలిక వృద్ధి అంచనాలు, షేర్ ధర... తదితర ముఖ్యమైన అంశాలను లోతుగా విశ్లేషించి పెట్టుబడి నిర్ణయం తీసుకోవటం 'మీట్స్' విధానంలో ప్రత్యేకత. దీర్ఘకాలిక మదుపరులు ఈ పథకాన్ని పరిశీలించవచ్చు.

టాప్ 20 షేర్లపై ఆసక్తి ఉంటే

మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ ఒక ఈక్వల్ వెయిట్ ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్) పథకాన్ని తీసుకొచ్చింది. 'మిరే అసెట్ నిఫ్టీ టాప్ 20 ఈక్వల్ వెయిట్ ఈటీఎఫ్' అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 10. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. నిఫ్టీ టాప్ 20 ఈక్వల్ వెయిట్ టీఆర్ఐ సూచీ ఈ పథకం పనితీరుకు కొలమానంగా ఉంటుంది. రితేష్ పటేల్, అక్షయ్ ఉదేషి దీనికి ఫండ్ మేనేజర్లుగా వ్యవహరిస్తారు. నిఫ్టీలో భాగంగా ఉన్న 20 అగ్రశ్రేణి కంపెనీల్లో సమానంగా పెట్టుబడి పెట్టి, స్థిరమైన లాభాలు ఆర్జించటం ఈ పథకం ప్రధాన లక్ష్యం. మార్కెట్ క్యాప్ ఆధారిత వెయిటెడ్ ఇండెక్స్ మీద ఆధారపడకుండా కంపెనీలను వివిధ ప్రమాణాల ప్రకారం విలువ కట్టి 20 కంపెనీలను ఎంపిక చేస్తారు. దీర్ఘకాలిక మదుపరులకు ఈ పథకం అనువుగా ఉంటుంది. తక్కువ రిస్కుతో ఒక మోస్తరు లాభాలు లభిస్తాయి.

కారు రుణం తీసుకోవచ్చా?

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిని. మరో రెండేళ్లలో పదవీ విరమణ చేయబోతున్నాను. ఇప్పటి నుంచి నెలకు రూ.50వేల వరకూ ఏదైనా పెట్టుబడి పథకంలో మదుపు చేయాలని అనుకుంటున్నా. నెలకు కనీసం రూ.40 వేల వరకూ రావాలంటే ఎంత మొత్తం పెట్టుబడి పెట్టాలి? - హరిత



రెండేళ్లలో పదవీ విరమణ చేయబోతున్నారు కాబట్టి, మీ డబ్బు కాస్త సురక్షితంగానే ఉండేలా చూసుకోవాలి. రెండేళ్ల పాటు పెట్టుబడి పెట్టిన తర్వాత, మరో మూడేళ్లపాటు వేచి చూస్తే మంచిది. రూ.50వేల పెట్టుబడి కోసం మల్టీ అసెట్ లేదా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్లను పరిశీలించవచ్చు. ఇలా వేచి చూసినప్పుడు మీ డబ్బు పెరుగుతుంది. నెలకు రూ.40వేలు మీకు వెనక్కి రావాలంటే.. కనీసం 8 శాతం రాబడినిచ్చే పథకాల్లో రూ.60లక్షల వరకూ జమ చేయాల్సి ఉంటుంది.

మార్గదర్శి

నా వయసు 32. మూడేళ్లుగా పీపీఎఫ్‌లో నెలకు రూ.10వేల చొప్పున జమ చేస్తూ వస్తున్నాను. దీనికి బదులుగా షేర్లలో పెట్టుబడి పెడితే లాభం వస్తుందని అంటున్నారు. నిజమేనా? - శేఖర్

ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) ప్రభుత్వ హామీ ఉన్న పథకం. దీంతో షేర్లను పోల్చలేం. ప్రస్తుతం పీపీఎఫ్‌లో 7.1 శాతం పన్ను రహిత వడ్డీ అందుతోంది. షేర్లలో దీర్ఘకాలం పెట్టుబడి పెడితే లాభం వస్తుంది. కానీ, నష్టభయమూ ఉంటుందని మర్చిపోవద్దు. షేర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. ఇది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. పీపీఎఫ్‌లో రూ.3వేలు కొనసాగించండి. మిగతా రూ.7వేలు డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో కనీసం 10ఏళ్లకు మించి పెట్టుబడి పెట్టండి. సాధ్యమైనప్పుడల్లా పెట్టుబడి పెంచుకోండి.

నా దగ్గర రూ.15 లక్షలున్నాయి. కారు కొనాలనే ఆలోచన ఉంది. రుణం తీసుకొని, కారు కొనడం మంచిదా? నా దగ్గర ఉన్న మొత్తంతో ఎలాంటి అప్పు లేకుండా తీసుకోవాలా? ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఉన్న ఈ మొత్తాన్ని అధిక రాబడి వచ్చేలా ఎక్కడ మదుపు చేయాలి? - కరుణాకర్

ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు, రుణాలపైన వడ్డీ రేట్లు తక్కువగానే ఉన్నాయి. ఇప్పుడు ఏడాది చివర్లో ఉన్నాం కాబట్టి, కార్లపైన మంచి రాయితీ లభించే అవకాశం ఉంది. బ్యాంకులో కారు రుణం 7.5-9శాతం మధ్యలో వచ్చే అవకాశం ఉంది. కారు రుణం తీసుకుంటే నెలనెలా ఈఎంఐ చెల్లించాలి. దీనికి ఇబ్బందేమీ లేదు అనుకుంటే.. రుణం తీసుకోండి. మీ దగ్గరున్న మొత్తాన్ని డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్లలో కనీసం ఏడేళ్లకు మించి మదుపు చేయండి.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

నేను ఒక నకిలీ షాపింగ్ వెబ్‌సైటులో నా క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేశాను. దీంతో నా కార్డులో ఉన్న మొత్తం అంతా నష్టపోయాను. దీనికి సైబర్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందా? ఏం చేయాలి? - నవీన్

నకిలీ షాపింగ్ వెబ్‌సైటులో డెబిట్/క్రెడిట్ కార్డు వివరాలు ఇచ్చి, డబ్బు కోల్పోయిన సందర్భాల్లో సైబర్ ఇన్సూరెన్స్ పాలసీ ఆ ఆర్థిక నష్టాన్ని భర్తీ చేయగలదు. కానీ, ఇది మీ పాలసీలో ఏ రకం కవరేజీలు తీసుకున్నారన్న దాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది.

ఈ రోజుల్లో చాలా సైబర్ ఇన్సూరెన్స్ పాలసీలు ఫిషింగ్ మోసాలు, నకిలీ ఆన్‌లైన్ లావాదేవీలు, అనధికార నిధుల బదిలీల నుంచి వ్యక్తులను రక్షిస్తాయి. మీరు నకిలీ వెబ్‌సైట్‌లో కార్డు వివరాలు నమోదు చేశారు కాబట్టి, ఇది సాధారణంగా ఫిషింగ్ కవర్ లేదా ఆన్‌లైన్ షాపింగ్ కవర్ కిందుకు వస్తుంది. మీ పాలసీ నిబంధనలను ఒకసారి చూసుకోండి. అనధికారిక లావాదేవీల రక్షణ ఉంటే, మీరు మోసపోయిన మొత్తాన్ని తిరిగి పొందవచ్చు. మీరు నిజంగా సైబర్ నేరానికి బాధితులు అని నిరూపణ అయ్యాకే పరిహారం లభిస్తుంది.

✦ సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే కార్డును బ్లాక్ చేయించాలి.

✦ స్థానిక సైబర్ క్రైమ్ లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీని తీసుకోవాలి.

✦ మోసం గురించి 24-48 గంటల్లోపు బీమా కంపెనీకి తెలియజేయాలి.

✦ బ్యాంకు స్టేట్‌మెంట్‌తో పాటు, ఎఫ్ఐఆర్ కాపీ, నకిలీ వెబ్‌సైట్‌తో మీరు చేసిన లావాదేవీలకు సంబంధించిన వివరాలు (స్క్రీన్‌షాట్, డాక్యుమెంట్లు) ఉంటే సమర్పించాలి.

బీమా సంస్థ నిజంగా సైబర్ మోసం జరిగిందని ధ్రువీకరించుకున్న తర్వాత, పాలసీ నిబంధనల మేరకు పరిహారం అందిస్తుంది.

- అమర్‌నాథ్ సక్సేనా
చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ (కమర్షియల్), బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్.

ఐటీఆర్.. 31 వరకూ

గత ఆర్థిక సంవత్సరం అంటే.. 2024-25కు గాను ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేయలేదా? మీకు ఇప్పటికీ అవకాశం ఉంది. డిసెంబరు 31 వరకూ సవరించిన (రివైజ్డ్), ఆలస్య (బిలేటెడ్) పన్ను రిటర్నులు దాఖలు చేయొచ్చు. వాస్తవానికి ఈ మదింపు సంవత్సరం (2025-26) ఐటీఆర్ దాఖలు చేసేందుకు గడువు సెప్టెంబరు 16తో ముగిసింది. మీ రిటర్నులలో ఏదైనా పొరపాటు చేశారని ఇప్పుడు గ్రహించినా, లేదా అసలు రిటర్నులు దాఖలు చేయకపోయినా.. సెక్షన్ 139(5) కింద రివైజ్డ్, బిలేటెడ్ రిటర్నులు సమర్పించేందుకు వీలుంది. పన్ను వర్తించే ఆదాయం రూ.5లక్షల లోపు ఉంటే రూ.1,000, రూ.5లక్షలపైన ఉంటే రూ.5వేల వరకూ అపరాధ రుసుము చెల్లించి, బిలేటెడ్ రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ మీకు రిఫండు రావాల్సి ఉంటే, డిసెంబరు 31 తర్వాత ఆ అవకాశాన్ని కోల్పోయినట్లే.

✦ పన్ను చెల్లింపుదారుడు ఐటీఆర్ దాఖలు చేసినప్పుడు అనుకోకుండా ముఖ్యమైన సమాచారాన్ని తెలియజేయడం మర్చిపోయినా, పొరపాటు దొర్లినా ఆ తప్పును సరిచేసుకునేందుకు సవరించిన పన్ను రిటర్నులు దాఖలు చేయొచ్చు. ముఖ్యంగా విదేశీ ఆస్తులను చూపకపోవడం, అధిక రిఫండును కోరడం, ఏదైనా మినహాయింపు మర్చిపోవడం, తప్పు టీడీఎస్ తదితర సందర్భాల్లో రిటర్నులను సవరించుకోవచ్చు. గుర్తుంచుకోండి... బిలేటెడ్ రిటర్నులను కొత్త పన్ను విధానంలో మాత్రమే సమర్పించేందుకు వీలవుతుంది.

మన భూమి అనేక జీవులకు నిలయం. వాటి మధ్య వ్యత్యాసాన్ని తెలిపేదే జీవవైవిధ్యం. పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటే ఇందులో అనేక మార్పులు కలుగుతాయి. ప్రస్తుత మానవ చర్యల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతోంది. దీన్ని అధిగమించేందుకు అంతర్జాతీయంగా అనేక చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే వివిధ సదస్సులు నిర్వహిస్తూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు అనుసరించాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఇటీవల కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) - 30 సదస్సు జరిగింది. అందులో తీసుకున్న నిర్ణయాలు, సభ్య దేశాలకు నిర్దేశించిన లక్ష్యాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



ఈనాడు ప్రతిభ
■ e-mail: support@epratibha.net
20
శుక్రవారం డిసెంబరు 5, 2025

కాప్ సదస్సులతో.. పటిష్ఠ పర్యావరణానికి బాటలు!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
సైన్స్ అండ్ టెక్నాలజీ

కాప్ - 30 సదస్సు

కాప్ నేపథ్యం

1992లో 198 దేశాలతో ఏర్పాటైన యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (యూఎన్ఎఫ్‌సీసీ) కాప్ సదస్సులను నిర్వహిస్తోంది.

✦ ఈ సదస్సుల ముఖ్య లక్ష్యం దేశీయ ఉద్గారాల సమాచారాన్ని సేకరించడం (NDCs), ఆయా ఉద్గారాల నియంత్రణను పరిశీలించడం, వాతావరణ మార్పు వ్యతిరేక ప్రభావాలను తగ్గించడానికి కావాల్సిన గ్లోబల్ క్లైమేట్ పాలసీలను రూపొందించడం.

✦ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాలు వాతావరణ మార్పులపై అవలంబించే కార్యాచరణ ప్రాతిపదికగా ఏటా కాప్ సదస్సులను నిర్వహిస్తారు.

✦ దాదాపు మూడు దశాబ్దాల ప్రస్థానం కలిగిన కాప్ సదస్సుల్లో వివిధ స్థాయుల్లో ప్రపంచ పర్యావరణానికి సంభవించే పెను ప్రమాదాలను అంచనా వేస్తూ, వాటిని నియంత్రించడానికి అవసరమైన లక్ష్యాలను నిరంతరం రూపొందిస్తున్నాయి. తద్వారా అంతర్జాతీయ సమాజాన్ని చైతన్యపరుస్తూ పటిష్ఠ పర్యావరణానికి అవసరమైన బాటలను వేస్తున్నాయి.

కాప్ 30 సదస్సు ముఖ్యాంశాలు

యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) 30వ సదస్సు 2025 నవంబరు 10 నుంచి 21 వరకు బ్రెజిల్‌లోని బేలంలో జరిగింది. మొత్తం 198 దేశాలకు చెందిన 50వేల మందికి పైగా ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు.

▮ బ్రెజిల్ ప్రాంతం అమెజాన్ రీజియన్‌లో ఉంది. ఇక్కడ ఉష్ణ అరణ్యాలు (ట్రాపికల్ ఫారెస్ట్స్) అధికంగా ఉన్నాయి. వాటి ప్రాముఖ్యతను గుర్తించడానికి కాప్ 30 సమావేశాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. బ్రెజిల్‌లో చేపడుతున్న అటవీ పరిరక్షణ కార్యక్రమాలు కూడా ఇక్కడ సదస్సు ఏర్పాటుకు ప్రేరణగా నిలిచాయి. బ్రెజిల్ నాయకత్వంలో వాతావరణ కార్యాచరణ సామాజిక న్యాయం, అన్ని వర్గాల భాగస్వామ్యం, బహు పాక్షికత మొదలైనవాటిని పరిగణనలోకి తీసుకుని అన్ని వర్గాలకు వాతావరణం న్యాయం అందేలా చేయనున్నట్లు సభ్యదేశాలు తీర్మానించాయి.

▮ పారిస్ ఒప్పందం ఆధారంగా రూపొందించిన 'గ్లోబల్ స్టాక్ టెక్' లక్ష్యాలను సమీక్షించి వివిధ దేశాల స్థాయులను కాప్ 30 సదస్సులో అంచనా వేశారు.

గతంలో జరిగిన ముఖ్యమైన ఇతర కాప్ సదస్సులు

కాప్ 1: తొలి కాప్ సదస్సు జర్మనీలోని బెర్లిన్‌లో 1995లో జరిగింది.
☛ ఇందులో మొదటిసారిగా ఉద్గారాల నియంత్రణకు చట్టబద్ధత కల్పించాలని తీర్మానించారు.

కాప్ 3: 1997లో క్యోటో (జపాన్)లో జరిగింది. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన దేశాల నుంచి విడుదలయ్యే ఉద్గారాలను నియంత్రించడమే లక్ష్యంగా క్యోటో ప్రొటోకాల్ రూపొందించారు.
☛ ఈ సదస్సులో క్లీన్ డెవలప్‌మెంట్ మెకానిజం (సీడీఎం), జాయింట్ ఇంప్లిమెంటేషన్, ఎమిషన్ ట్రేడింగ్ మొదలైన అంశాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించారు.

కాప్ 13: 2007లో ఇండోనేసియాలోని బాలిలో జరిగింది. క్యోటో ప్రొటోకాల్‌ను పటిష్ఠంగా అమలు చేసేలా ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించారు. దీన్నే పోస్ట్ క్యోటో ఫ్రేమ్ వర్క్‌గా పిలుస్తారు.

కాప్ 15: డెన్మార్క్‌లోని కోపెన్‌హెగెన్‌లో 2009లో జరిగింది. హరితగృహ ప్రభావాన్ని రెండు డిగ్రీల సెంటీగ్రేడ్‌కు నియంత్రించాలని తీర్మానించారు. 2020 నాటికి 100 బిలియన్ డాలర్ల క్లైమేట్ ఫైనాన్స్ నిధులను సమకూర్చాలని నిర్ణయించారు.

కాప్ 21: 2015లో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో జరిగింది. అంతర్జాతీయంగా ఉద్గార స్థాయులను పూర్వ పారిశ్రామిక యుగ ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు తగ్గించేందుకు ప్రతి దేశం, దేశీయ నిర్దేశిత లక్ష్యాలను రూపొందించాలని తీర్మానించారు.
☛ పర్యావరణ రక్షిత ఒప్పందాల్లో దీన్ని అత్యంత ప్రాముఖ్యమైందిగా పేర్కొంటారు.
☛ జాతీయ నిర్దేశిత ఉద్గార లక్ష్యాలను (నేషనల్లీ డిటర్మైండ్ కంట్రిబ్యూషన్స్) ఈ సదస్సులోనే ఏర్పాటు చేశారు.

కాప్ 26: స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో 2021లో నిర్వహించారు. దీన్ని గ్లాస్గో క్లైమేట్ ప్యాక్ట్ అని కూడా అంటారు ఈ సదస్సు ముఖ్య లక్ష్యం ఇంధన వనరుగా బొగ్గు వినియోగాన్ని ప్రపంచవ్యాప్తంగా తగ్గించటం, అంతర్జాతీయంగా ఉద్గారాలను 2030 నాటికి 45 శాతానికి నియంత్రించడం.
☛ ఇదే సదస్సులో భారత ప్రభుత్వం పంచామృత లక్ష్యాలను, మెరుగైన పర్యావరణం కోసం 'లైఫ్' కార్యక్రమాన్ని ప్రతిపాదించింది.

కాప్ 29: కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ - 29వ సదస్సు (కాప్ 29)ను 2024 నవంబరు 11 నుంచి 22 వరకు అజర్‌బైజాన్ దేశంలోని బాకులో నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం న్యూ క్లైమేట్ ఫైనాన్స్ క్వాంటిఫైడ్ గోల్స్ (ఎన్‌సీక్యూజీ)ని ఏర్పాటు చేశారు.

ప్రాధాన్యత

2015లో పారిస్ ఒప్పందం జరిగిన దశాబ్దం తర్వాత కాప్ 30 సదస్సు నిర్వహించారు. ఇందులో నాటి ఒప్పంద లక్ష్యాల అమలుపై ప్రధానంగా దృష్టి సారించారు. ప్రతి దేశానికి కేటాయించిన 'నేషనల్లీ డిటర్మైండ్ కంట్రిబ్యూషన్స్' అంచనా, పారిస్ ఒప్పంద అమలుతీరును నిశితంగా పరిశీలించి దానికి అనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేలా లక్ష్యాలను నిర్దేశించారు.

❖ ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉష్ణ మండల అరణ్యాలను.. ముఖ్యంగా అమెజాన్ వర్షారణ్యాలను పరిరక్షించడానికి కావాల్సిన ఆర్థిక నిధులను సమీకరించడానికి 'ట్రాపికల్ ఫారెస్ట్ ఫైనాన్స్ ఫండ్ (టీఎఫ్ఎఫ్ఎఫ్)' ఏర్పాటు గురించి సమీక్షించాలని సూచించారు.

❖ వాతావరణ మార్పుల ప్రభావం ప్రధానంగా ఆరోగ్యంపై ఉంటోందని సభ్య దేశాలు అభిప్రాయపడ్డాయి. దీంతో వాతావరణ మార్పులను ఆరోగ్య సంక్షోభంగా గుర్తించారు.

❖ మెరుగైన నిధుల సమీకరణ కోసం 'రుణం లేని వాతావరణ ఆర్థిక సాయాన్ని (Non-debt climate finance) ప్రతిపాదించారు.

❖ పారిస్ ఒప్పందానికి అనుగుణంగా జాతీయ నిర్దేశిత ఉద్గార లక్ష్యాలను అనుసంధానించి నూతన నేషనల్లీ డిటర్మైండ్ కంట్రిబ్యూషన్స్‌ను రూపొందించడానికి అవసరమైన విధివిధానాలను కూడా కాప్ 30వ సదస్సులో నిర్ణయించారు.

❖ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంఘీభావ యంత్రాంగాన్ని (Solidarity finance mechanism) ఏర్పాటు చేసి అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత పారదర్శకంగా నిధులు సమకూర్చడం కూడా కాప్ 30వ సదస్సు అజెండాలో భాగం.

లక్ష్యాలు

Non-debt climate finance రూపంలో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వాతావరణ మార్పులపై తీసుకోవాల్సిన చర్యలకు ఆర్థిక సాయం అందించాలి. 2035 నాటికి ఏడాదికి కనీసం 1.3 ట్రిలియన్ డాలర్లు సమీకరించేలా సభ్యదేశాలు పనిచేయాలి.

◆ 2030 నాటికి అటవీ నిర్మూలనను నియంత్రించటం అనేది కాప్ 30 సదస్సు ప్రధాన అజెండా. తద్వారా అటవీ సంరక్షణ చేపట్టి, దీర్ఘకాలంలో ప్రకృతిని పునరుద్ధరింపజేసి, జీవవైవిధ్య పరిరక్షణ - జీవావరణ వ్యవస్థల సంరక్షణ చేయాలనేది లక్ష్యం.

◆ రెట్టింపు ఇంధన సామర్థ్యం, మూడు రెట్లు పునరుత్పాదక ఇంధన వనరుల పెంపు మొదలైనవి ఎనర్జీ ట్రాన్సిషన్ (శక్తి పరివర్తన)లోని ముఖ్యాంశాలు.

◆ ప్రపంచవ్యాప్తంగా నూతన వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా సాగు రంగాన్ని నవీకరించి, సుస్థిర వ్యవసాయం దిశగా మార్పు తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాల రూపకల్పన, ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చడంపై చర్చించారు.

◆ గ్రీన్ డిజిటల్ యాక్షన్ హబ్, ఏఐ క్లైమేట్ ఇన్‌స్టిట్యూట్‌లను ఏర్పాటు చేసి ఆయా దేశాలకు కావాల్సిన సాంకేతిక సహకారాన్ని అందించటం.

◆ అడవులు లాంటి ప్రాకృతిక ప్రాంతాల్లో నివసించే ప్రజల హక్కులను రక్షించడం. వాతావరణ మార్పు ఆధారిత అసమానతలను తొలగించి సమన్యాయం అందించటం.



రచయిత
రేమల్లి సౌజన్య
విషయ నిపుణులు

Word of the Day 851

Grouse

Telugu meaning: పేచీ, ఫిర్యాదు

English meaning: The word grouse (గ్రౌస్) is a verb that means to complain in a grumbling or petty manner.

Synonyms: Complain, Whine;

Antonyms: Praise, Commend

Usage: **1.** Employees continued to grouse about the long working hours despite recent improvements.

2. He tends to grouse over minor inconveniences, making teamwork quite challenging.

నోటిఫికేషన్స్

నర్స్ పోస్టులు

మహాత్మా పండిట్ మదన్ మోహన్ మాలవ్య క్యాన్సర్ సెంటర్ (ఎంపీఎంఎంసీసీ) వారణాసి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నర్స్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. మొత్తం పోస్టులు సంఖ్య 35. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 19న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

టెక్నీషియన్ పోస్టులు

ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ ఆధ్వర్యంలోని సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీడీఆర్ఐ) వివిధ విభాగాల్లో టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం పోస్టుల సంఖ్య 44. ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 26 డిసెంబరు 2025.

సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, అంక్లేశ్వర్ (గుజరాత్) ఒప్పంద ప్రాతిపదికన ఫుల్ టైమ్ స్పెషలిస్ట్/ పార్ట్ టైమ్ స్పెషలిస్ట్, సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 16. ఇంటర్వ్యూ తేదీ 2025, డిసెంబరు 11.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 5) చివరి తేదీ

☛ డిజిటల్ ఇండియా కార్పొరేషన్‌లో 19 కన్సల్టెంట్ ఉద్యోగాలు. బీఈ/ బీటెక్/ ఎంటెక్/ ఎంమ్మెస్సీ/ ఎంబీఏ/ ఎంసీఏలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.

☛ పెద్దపల్లి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో 17 ఉద్యోగాలు. డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్, ఏఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, ఎంఎస్‌డబ్ల్యూలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.

☛ సెయిల్‌లో 124 మేనేజ్‌మెంట్ ట్రెయినీ (టెక్నికల్) పోస్టులు. డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ మృత్తికా దినోత్సవం

డిసెంబరు 5
చరిత్రలో ఈనాడు

సహజ వనరుల్లో మృత్తికలు ప్రధానమైనవి. ఇవి భూమి ఉపరితలంపై చిన్న రేణువులు, అనేక కర్బన - అకర్బన పదార్థాలతో కూడిన పలుచటి పొరగా ఉంటాయి. వీటినే నేలలు అని కూడా అంటారు. ఇవి జీవ, పునర్వినియోగ వనరులు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉండే దేశాల్లో వీటికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. భూమిపై ఆరోగ్యకరమైన నేల ప్రాముఖ్యాన్ని తెలియజేసే లక్ష్యంతో ఏటా డిసెంబరు 5న 'ప్రపంచ మృత్తికా దినోత్సవం'గా (World Soil Day) నిర్వహిస్తారు. పర్యావరణ వ్యవస్థలో నేలలు పోషించే పాత్రను తెలియజేయడంతోపాటు ఈ అమూల్యమైన వనరును రక్షించుకోవాల్సిన ఆవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

నేల ప్రాముఖ్యత

భూమిపై జీవించడానికి నేల చాలా ముఖ్యమైంది. దీని మందం సుమారు 25 నుంచి 35 సెం.మీ. ఉంటుంది. మొక్కలు, వృక్షాలకు కావాల్సిన నీరు, పోషకాలు దీని ద్వారానే అందుతాయి. మానవ ఆహార అవసరాలను తీర్చడంలోనూ ఇదే కీలకంగా వ్యవహరిస్తుంది. పంటలు, ఇతర ఉపయోగకర మొక్కలు పెంచాలంటే ఆరోగ్యకరమైన నేల అవసరం. పశువులకు అవసరమైన గడ్డి కూడా దీని ద్వారానే లభిస్తుంది.

చారిత్రక నేపథ్యం

వేగవంతమైన పారిశ్రామికీకరణ, పట్టణీకరణ కారణంగా ప్రపంచవ్యాప్తంగా నేల క్షీణతకు గురవుతోందని 2002లో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ సాయిల్ సైన్సెస్ (ఐయూఎస్ఎస్) గుర్తించింది. మృత్తికల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా ఒక



రోజును ఏర్పాటు చేయాలని ఇది భావించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ), థాయ్‌లాండ్ సంయుక్తంగా ఏటా డిసెంబరు 5న 'ప్రపంచ మృత్తికా దినోత్సవం'గా జరపాలని 2013లో తీర్మానించాయి.

మృత్తికల రకాలు, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

నీతి ఆయోగ్ - రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచీ 2025

దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధించాలంటే రాష్ట్రాల పాత్రే కీలకం. దేశం లేదా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థల్లో, పాలనా విధానాల్లో ఆర్థిక క్రమశిక్షణ ఎంతో అవసరం. అది కొరవడితే ఆర్థిక విధ్వంసం జరిగి, వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా మారతాయి. అందుకే నీతి ఆయోగ్ ఎప్పటికప్పుడు దేశం, రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను విశ్లేషిస్తూ వివిధ నివేదికలను తయారు చేసి సూచనలు, సలహాలు అందిస్తోంది. ఇటీవల 'రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక-2025' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. దీనిపై పోటీపరీక్షార్థులకు అవగాహన అవసరం.



2022-23 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 18 పెద్ద రాష్ట్రాల్లో ఆర్థిక స్థితిగతులను విశ్లేషిస్తూ నీతి ఆయోగ్ 'రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచిక - 2025' పేరిట ఒక నివేదికను తయారు చేసింది. కాగ్, ఆర్‌బీఐతో పాటు వివిధ సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా దీన్ని రూపొందించారు. 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ ప్రొఫెసర్ అరవింద్ పనగడియా, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షులు సుమన్ బేరి, సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం దీన్ని 2025 జనవరి 24న విడుదల చేశారు.

పరిగణించిన అంశాలు

రాష్ట్ర ప్రభుత్వ మొత్తం ఖర్చులో అభివృద్ధి పనులకు చేసిన వ్యయం వాటా.

✦ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో మూలధన వ్యయం వాటా.

✦ రాష్ట్ర స్థూల ఉత్పత్తికి, రెవెన్యూ రాబడికి మధ్య పోలిక.

నివేదికలోని ముఖ్యాంశాలు, ద్రవ్య వివేచన, ఆర్థిక ఆరోగ్య సూచీ - 2025లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

The book 'No Holding Back' is authored by?

Current Affairs

1. Nagaland Statehood Day is observed every year to commemorate the formation of Nagaland as the ...... state of India.
A) 14th B) 15th C) 16th D) 18th

2. UPI Transactions recorded a significant growth in November 2025. What was the trend observed?
A) Declined by 10%
B) Increased by 23%
C) Remained unchanged
D) Dropped by 5%

3. World AIDS Day 2025 highlights India's ongoing efforts and future strategies to combat HIV/AIDS. When is World AIDS Day observed every year?
A) 30 November B) 1 December
C) 5 December D) 10 December

4. Sipan Garg recently took additional charge as the CMD of which organisation?
A) NTPC Limited
B) THDC India Limited C) NHPC Limited
D) Power Grid Corporation of India

5. Who has been honoured with the title "Indian of the Year 2025"?
A) Rohit Sharma B) Jay Shah
C) Neeraj Chopra D) R. Praggnanandhaa

6. According to Moody's latest projection, what is India's expected GDP growth rate for 2025?
A) 6.2% B) 7% C) 8.1% D) 5.7%

7. India recently signed a Rs.7,900 crore agreement with the United States for support related to which defence asset?
A) Rafale-M fighter aircraft
B) MH-60R multi-role naval helicopters
C) C-130J Super Hercules transport aircraft
D) P-8I maritime patrol aircraft

8. When is International Jaguar Day 2025 observed?
A) 10 October B) 29 November
C) 5 December
D) 21 September

General Knowledge

9. Bhanu Athaiya won the Academy Award for which category for her work in the film Gandhi?
A) Best Cinematography
B) Best Costume Design
C) Best Production Design
D) Best Makeup and Hairstyling

10. The book "No Holding Back" is authored by which famous cricketer?
A) Viv Richards B) Michael Holding
C) Clive Lloyd D) Ian Bishop

SSC Exams Special


General Awareness

11. When was the Aatmanirbhar Bharat Rojgar Yojana launched?
A) 1st January 2021 B) 1st October 2020
C) 1st July 2019 D) 1st December 2020

12. Table tennis, also known as ping-pong, is recognised as the national sport of which country?
A) Japan B) China
C) South Korea D) Singapore

History

13. The Tripartite Struggle (Kannauj Triangle Wars) was fought mainly between which three ruling dynasties?
A) The Cholas, Cheras and Pandyas
B) The Satavahanas, Guptas and Vakatakas



C) The Palas, Pratiharas and Rashtrakutas
D) The Kushanas, Mauryas and Shungas

14. Who translated the Sanskrit play Mrichchhakatika into English as "The Little Clay Cart" in 1905?
A) Max Müller B) Arthur W. Ryder
C) William Jones D) Ralph Griffith

15. Where is Visva-Bharati University, founded by Rabindranath Tagore, located?
A) Kolkata, West Bengal
B) Shantiniketan, West Bengal
C) Cuttack, Odisha
D) Guntur, Andhra Pradesh

16. Who presided over the 27th session of the Indian National Congress held in 1912?
A) Bishan Narayan Dar
B) Raghunath Narasinha Mudholkar
C) Nawab Syed Mohammed Bahadur
D) Bhupendra Nath Bose

General Science

17. Henri Becquerel shared the Nobel Prize with Pierre and Marie Curie for the discovery of which type of radiation?
A) Infrared radiation B) Radioactivity
C) Ultraviolet radiation D) X-rays

18. Pernicious anemia is primarily caused by which of the following?
A) Excess absorption of folic acid
B) Autoimmune destruction leading to poor absorption of Vitamin B12
C) Deficiency of iron due to chronic blood loss
D) Lack of Vitamin D affecting bone marrow function

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

పాతికేళ్లుగా రష్యా అధినేతగా పుతిన్



ఈటీవీ భారత్: రష్యా అధ్యక్షుడిగా పుతిన్ పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పలు దేశాల్లో అనేక మంది పాలకులు మారారు. కానీ ఆయన మారలేదు. 1999లో తొలిసారి రష్యా పాలనా పగ్గాలు చేపట్టిన పుతిన్ గత 25 ఏళ్లుగా ఆ దేశ ప్రధానిగా, అధ్యక్షుడిగా కొనసాగుతూనే ఉన్నారు. ఈ కాలంలో అమెరికాలో ఐదుగురు అధ్యక్షులు మారారు. భారత్ ముగ్గురు ప్రధానులను చూసింది. పుతిన్ తప్ప మరో అధ్యక్షుడి పేరు తెలియని యువ ఓటర్లు రష్యాలో చాలా మందే ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

1952 అక్టోబరు 7న లెనిన్‌గ్రాడ్‌లో పుతిన్ జన్మించారు. ఆయన బాల్యం సాధారణంగా గడిచింది. న్యాయ శాస్త్రం చదివిన పుతిన్.. 1975లో రష్యా గూఢచార సంస్థ కేజీబీలో చేరారు. 1985లో తూర్పు జర్మనీలో గూఢచారిగా పని చేశారు. స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత రాజకీయాలవైపు అడుగులు వేశారు. 1991లో రాజకీయ రంగప్రవేశం చేసిన ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్ డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. 1998లో పుతిన్‌ను రష్యా సెక్యూరిటీ సర్వీసెస్ అధిపతిగా అప్పటి అధ్యక్షుడు బోరిస్ ఎల్సిన్ నియమించారు. ఆ మరుసటి ఏడాదిలో అప్పటి ప్రధాన మంత్రిని తొలగించిన బోరిస్.. 46 ఏళ్ల పుతిన్‌ను ఆ స్థానానికి ఎంపిక చేశారు. ఆ తర్వాత కొన్ని నెలలకే బోరిస్ రాజీనామా చేయడంతో తాత్కాలికంగా అధ్యక్ష బాధ్యతలను పుతిన్ చేపట్టారు. అలా తొలిసారి రష్యా అధ్యక్ష పీఠాన్ని చేజిక్కించుకున్నారు. 2000లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో గెలవడంతో పాటు 2004లో రెండోసారి ఆ బాధ్యతల్లో పుతిన్ కొనసాగారు. రష్యా రాజ్యాంగం ప్రకారం వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం లేకపోవడంతో 2008లో పుతిన్ ప్రధాని పదవి చేపట్టారు. ఈ సమయంలోనే అధ్యక్ష పదవీ కాలాన్ని ఆరేళ్లకు పెంచుతూ రాజ్యాంగ సవరణ చేశారు. మళ్లీ 2012లో మరోసారి అధ్యక్ష పగ్గాలు చేపట్టిన పుతిన్ 2018లో నాలుగోసారి ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో ఐదోసారి గెలిచిన ఆయన.. 2030 వరకు అధ్యక్ష పదవిలో కొనసాగనున్నారు.

పుతిన్ పర్యటనపై అమెరికా నిఘా!

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పర్యటన వేళ ఇప్పుడు యావత్ ప్రపంచం దృష్టి భారత్‌వైపే ఉంది. ఈ పర్యటనపై అగ్రరాజ్యం డేగ కన్ను వేసినట్లు తెలుస్తోంది. దిల్లీలో పుతిన్ దిగింది మొదలు.. వెళ్లేదాకా అమెరికా విదేశాంగ వ్యవహారాల నిపుణులు అత్యంత నిశితంగా పుతిన్ పర్యటనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. 2022లో రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత భారత పర్యటనకు పుతిన్ రావడం ఇదే తొలిసారి.

రష్యాలో ఎన్నారై ప్రజాప్రతినిధి



ఇంటర్నెట్ డెస్క్: ప్రవాస భారతీయుడైన అభయ్ సింగ్ రష్యా చట్టసభ సభ్యుడిగా ఉన్నారు. బిహార్ రాజధాని పట్నాలో జన్మించిన ఆయన.. మెడిసిన్ చదివేందుకు 1991లో నాటి యూఎస్ఎస్ఆర్‌కు వెళ్లారు. కొంతకాలం తర్వాత అక్కడి చలి తీవ్రత దృష్ట్యా స్వదేశానికి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. అయితే తాను చదివిన యూనివర్సిటీ డీన్ సూచన మేరకు అక్కడే ఉండిపోయారు. 1992లో కర్స్క్ స్టేట్ మెడికల్ కాలేజీలో చేరిన ఆయన.. 1999లో కర్స్క్ స్టేట్ మెడికల్ అకాడమీ నుంచి డిగ్రీ పట్టా పొందారు. 2010లో ఆయనకు రష్యా పౌరసత్వం వచ్చింది. 2013లో రష్యా స్టేట్ సోషల్ యూనివర్సిటీ నుంచి ఆర్గనైజేషన్ మేనేజ్‌మెంట్‌లో పట్టా పొందారు. సోవియట్ యూనియన్ పతనం తర్వాత పుతిన్‌ను తొలిసారిగా చూసిన అభయ్ సింగ్.. ఆయన నుంచి ఎంతో ప్రేరణ పొందారు. కర్స్క్‌లో స్థిరపడిన ఆయన కొంతకాలానికి రాజకీయాల్లో చేరారు. అధికార యునైటెడ్ రష్యా పార్టీ సభ్యుడిగా ఉన్న ఆయన కర్స్క్ శాసనసభ డిప్యూటీగా (మన దగ్గర ఎమ్మెల్యే మాదిరి) 2017 నుంచి కొనసాగుతున్నారు. స్థానిక ప్రజలతో బలమైన సంబంధాలు పెంపొందించుకోవడమే స్థానిక చట్టసభకు రెండుసార్లు ప్రతినిధిగా ఎన్నికయ్యేలా చేసిందని అభయ్ చెబుతుంటారు. రష్యాలో భారతీయుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, వారు రాజకీయాల్లోకి రావాలని సూచిస్తున్నారు.

చీతా వైభవాన్ని చూడాలంటే భారత్‌కు రండి: మోదీ

దిల్లీ: ప్రపంచవ్యాప్త వన్యప్రాణి ఔత్సాహికులు చీతాల సంపూర్ణ వైభవాన్ని చూడాలంటే భారతదేశాన్ని సందర్శించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ చీతా దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో ఆయన ఈ మేరకు పోస్టు చేశారు. చీతాల రక్షణ, సంరక్షణకు అంకితమైన వ్యక్తుల ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ జీవుల మనుగడకు అనువైన వాతావరణాన్ని సృష్టించేందుకు మూడేళ్ల కిందట ప్రాజెక్ట్ చీతాను ప్రారంభించామన్నారు.



జీవ వైవిధ్యాన్ని బలోపేతం చేయడానికి 2022, 2023 సంవత్సరాల్లో నమీబియా, దక్షిణాఫ్రికా దేశాల నుంచి 32 చీతాలను భారత్‌కు తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటికి మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఆవాసం ఏర్పాటు చేశారు. ఇటీవల భారత్‌కు చెందిన ఆడ చీతాకు ఐదు పిల్లలు పుట్టినట్లు తెలియజేశారు. ప్రస్తుతానికి దేశంలో 32 చీతాలున్నాయని, వాటిలో 21 భారత్‌లో పుట్టినవేనని చెప్పారు.

ఈ శీతాకాలంలో బలహీన లా నినా

దిల్లీ: రానున్న మూడు నెలల కాలంలో బలహీన లా నినా ఏర్పడి, వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేసే అవకాశాలు 55 శాతం వరకూ ఉన్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) గురువారం తెలిపింది. సాధారణంగా లా నినా ప్రభావంతో అంతర్జాతీయ సగటు ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అయితే చాలా ప్రాంతాల్లో వెచ్చదనం ఈసారి సాధారణం కంటే ఎక్కువగానే ఉంటుందని డబ్ల్యూఎంవో తన తాజా నివేదికలో అంచనా వేసింది.

ఉద్యానపంటల రైతులకు అండగా యాప్

- రూపొందించిన కశ్మీరీ యువకుడు

ఈటీవీ భారత్: యాపిల్‌తో పాటు పలు ఉద్యానపంటల సాగు సమస్యలకు పరిష్కారం చూపేందుకు జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందిన హాజిక్ హుసేన్ అనే యువకుడు సరికొత్త ఇంటిగ్రేటెడ్ యాప్‌ను రూపొందించారు. 'కాష్ క్రాప్'గా దానికి నామకరణం చేశారు. వాతావరణ మార్పులు, తెగుళ్లు, వాటి నివారణ/పరిష్కార మార్గాలు, పంటలకు మార్కెట్ రేట్ల వంటి బోలెడు సమాచారం ఈ యాప్‌లో అందుబాటులో ఉంటుంది. ఇందులోని ఇంటిగ్రేటెడ్ జీపీఎస్, అంతర్నిర్మిత ఏఐ అసిస్టెంట్‌లు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందిస్తాయి. ఈ యాప్ జనవరి 1 నుంచి గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంటుందని హాజిక్ తెలిపారు.

హసీనా కుమారుడు జాయ్‌పై అరెస్టు వారెంట్ జారీ

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజీబ్ వాజెద్ జాయ్‌పై (54) ఆ దేశ ప్రత్యేక ట్రైబ్యునల్ గురువారం అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ ఏడాది జులైలో చెలరేగిన అల్లర్లలో మానవ హననానికి పాల్పడ్డారనే కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్‌కు (ఐసీటీ-బీడీ) చెందిన ప్రాసిక్యూటర్ ఒకరు మీడియాకు తెలిపారు. గతంలో ఐసీటీ వ్యవహారాల సలహాదారుడిగా పని చేసిన వాజెద్ జాయ్ ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు.

లండన్‌కు ఖాలిదా జియా!

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి ఖాలిదా జియాకు (80) మెరుగైన చికిత్స అందించేందుకు ఆమెను లండన్‌కు తరలించనున్నారు. ఈ మేరకు వైద్య బృందం ఏకగ్రీవంగా నిర్ణయించింది. గురువారం అర్ధరాత్రిగానీ, శుక్రవారం తెల్లవారుజామునగానీ ఖతార్ సమకూర్చిన ఎయిర్ అంబులెన్సులో ఆమెను లండన్ తీసుకెళ్తారని జియా వ్యక్తిగత వైద్యుడు తెలిపారు. జియా కుమారుడు, బీఎన్‌పీ తాత్కాలిక ఛైర్‌పర్సన్ తారిక్ రెహమాన్ లండన్‌లోనే నివాసముంటున్నారు.

అజ్‌మేర్ దర్గాకు బాంబు బెదిరింపు

జైపుర్: రాజస్థాన్‌లోని ప్రఖ్యాత అజ్‌మేర్ షరీఫ్ దర్గాకు గురువారం బాంబు బెదిరింపు ఈమెయిల్ రావడం కలకలం రేపింది. దర్గాతో పాటు తమిళనాడులోని కూడంకుళం అణు ప్లాంట్‌లో ఆర్డీఎక్స్ బాంబులు అమర్చామని, రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో అడుగుపెట్టిన మరుక్షణమే అవి పేలుతాయని అజ్‌మేర్ జిల్లా యంత్రాంగానికి పంపిన ఈమెయిల్‌లో ఆగంతుకుడు హెచ్చరించాడు. దీంతో అజ్‌మేర్ దర్గా వద్ద బాంబు స్క్వాడ్ బృందాలు, భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులను గుర్తించలేదని అధికారులు తెలిపారు.

హమాస్ అప్పగించాల్సింది ఇంకొక్క మృతదేహమే

జెరూసలెం: కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో భాగంగా ఇజ్రాయెల్‌కు బందీలు, మృతదేహాల అప్పగింత ప్రక్రియను హమాస్ దాదాపుగా పూర్తిచేసింది. ఇంకొక్క మృతదేహమే టెల్ అవీవ్‌కు అందాల్సి ఉంది. హమాస్ బుధవారం అప్పగించిన అవశేషాలు థాయ్‌లాండ్‌కు చెందిన వ్యవసాయ కార్మికుడు సుద్తిసాక్ రింథాలక్(42)వని గుర్తించినట్లు అధికారులు గురువారం తెలిపారు. సుద్తిసాక్‌ను ముష్కరులు 2023 అక్టోబరు 7న చంపేశారని చెప్పారు. హమాస్ నుంచి అందాల్సిన మరొక్క మృతదేహం ఇజ్రాయెల్‌కు చెందిన రణ్ గ్విలీది. గ్విలీ పోలీసు అధికారి.

న్యూయార్క్‌ను సందర్శించాలని అనుకుంటున్నా: నెతన్యాహు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోని న్యూయార్క్ నగరాన్ని తాను సందర్శించాలనుకుంటున్నట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తాజాగా తెలిపారు. ఓ మీడియాకు వర్చువల్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు తన మనసులో మాటను బయటపెట్టారు. న్యూయార్క్ వెళ్తే మేయర్ జోహ్రాన్ మమ్దానీతో మాట్లాడతారా అన్న ప్రశ్నకు నెతన్యాహు బదులిస్తూ.. "మమ్దానీ తన మనసు మార్చుకోవాలి. మనకు జీవించే హక్కు ఉందని ఆయన చెబితే.. మా మధ్య సంభాషణకు అది మంచి ఆరంభం అవుతుంది" అని వ్యాఖ్యానించారు. గతంలో ఎన్నికల ప్రచారంలో నెతన్యాహుపై మమ్దానీ తీవ్ర విమర్శలు చేశారు. ఆయన్ను యుద్ధ నేరస్తుడిగా పేర్కొన్నారు. తాను మేయర్‌గా గెలిచాక నెతన్యాహు ఎప్పుడైనా న్యూయార్క్‌కు వస్తే.. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారెంట్ ప్రకారం ఆయన్ను అరెస్టు చేయిస్తానని స్పష్టం చేశారు.

వీసాల జారీ.. ప్రభుత్వ సార్వభౌమ హక్కు

- అమెరికా నుంచి ఈ ఏడాది 3,258 మంది వెనక్కి
- పార్లమెంటుకు తెలిపిన కేంద్రం



దిల్లీ: వీసాలు జారీ చేయడం ఆయా దేశాల సార్వభౌమ హక్కు అని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. ఒక వ్యక్తి వల్ల దేశ భద్రతలో తలెత్తే పరిణామాలపై ఆధారపడి వీసాపై నిర్ణయం తీసుకునే హక్కు అమెరికాకు ఉందని స్పష్టంచేశారు. గురువారం రాజ్యసభలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. వీసాలను కట్టుదిట్టం చేయడం, అమెరికా నుంచి పలువురిని వెనక్కి పంపిస్తుండటంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. "విద్యార్థులకు వీసాలు ఇచ్చేముందు వారి సామాజిక మాధ్యమ ఖాతాలను పరిశీలించే అవకాశం ఇవ్వాలని అమెరికా వర్గాలు బాహాటంగానే చెప్పాయి. విద్యార్థి వీసాల రద్దు సమస్య ఏప్రిల్‌లో మొదలైంది. చిన్నచిన్న తప్పులకూ వీసాలు రద్దవుతున్నాయి. తమంత తాముగా దేశం నుంచి వెళ్లిపోవాలని విద్యార్థులపై ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇలాంటివి మా దృష్టికి వచ్చిన వెంటనే అమెరికా అధికారులతో మాట్లాడుతున్నాం. ఈ ఏడాది ఇంతవరకు 3,258 మందిని అమెరికా వెనక్కి తిప్పిపంపింది. వీరితో కలిపి 2009 నుంచి ఇప్పటివరకు 18,822 మందిని పంపించేశారు. వలసదారుల్ని వెనక్కి పంపేటప్పుడు సంకెళ్లు వేసిన సందర్భాలపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తంచేశాం" అని మంత్రి వెల్లడించారు. గత ఐదేళ్లలో 62 మంది భారతీయ విద్యార్థులకు అమెరికాలోకి అనుమతిని నిరాకరించారని ఈ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ రాతపూర్వకంగా తెలిపారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించి తగిన పత్రాలను సమర్పించకపోవడం దానికి కారణమన్నారు.

267 నిబంధన ఎప్పుడంటే..

దిల్లీ: సభలో ఆయారోజుల్లో చర్చించడానికి తీసుకున్న అంశాలపైనే 267 నిబంధన కింద నోటీసు ఇవ్వాలని, వాటికి సంబంధం లేనివాటికైతే కుదరదని రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ స్పష్టంచేశారు. గత రెండు దశాబ్దాలలో వాయిదా తీర్మానాలకు విపక్ష సభ్యులు ఈ నిబంధన కింద ఇస్తున్న నోటీసులలో ఏవీ ఆమోదం పొందలేదు. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనూ ఇలా ఇచ్చిన నోటీసులు తిరస్కరణకు గురైన నేపథ్యంలో ఛైర్మన్ గురువారం స్పందించారు. ప్రతిరోజూ ఈ నోటీసులు వస్తున్నాయని చెప్పారు. లోక్‌సభలో ఇచ్చినట్లు వాయిదా తీర్మానాలను ఇవ్వజాలరని, రాజ్యసభ నిబంధనల్లో దీనికి అవకాశం లేదని తేల్చిచెప్పారు. 15.5.2000 తేదీన ఈ నిబంధనను సవరించిన విషయం గుర్తుచేశారు. అత్యంత అరుదైన సందర్భాల్లోనే వాయిదా తీర్మానాన్ని అనుమతించేవారని చెప్పారు. నిర్ణీత ప్రమాణాలకు లోబడి లేని నోటీసులను అనుమతించేది లేదన్నారు.

మిజోరం మాజీ గవర్నరు స్వరాజ్ కౌశల్ కన్నుమూత

- తలకొరివి పెట్టిన కుమార్తె బాంసురీ స్వరాజ్
- రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

దిల్లీ: మిజోరం మాజీ గవర్నరు, భాజపా దివంగత నేత సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ (73) గురువారం కన్నుమూశారు. ఆయనకు ఛాతీ నొప్పి రావడంతో ఎయిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచినట్లు స్వరాజ్ కౌశల్ కుమార్తె, భాజపా ఎంపీ బాంసురీ స్వరాజ్ వెల్లడించారు. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. 34 ఏళ్లకే సీనియర్ అడ్వొకేట్ హోదాను అందుకున్న స్వరాజ్ కౌశల్ తన వృత్తిలో భాగంగా పేదలకు న్యాయం అందించడానికి కృషి చేశారని మోదీ కొనియాడారు. 1952లో హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్‌లో జన్మించిన స్వరాజ్ కౌశల్, మిజోరం తొలి అడ్వొకేట్ జనరల్‌గా సేవలందించారు. 1986లో మిజోరం శాంతి ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించారు. ఎమర్జెన్సీ సమయంలో బరోడా డైనమైట్ కేసులో రక్షణ శాఖ మాజీ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ తరపున వాదించి గెలిచారు. 37 ఏళ్ల వయసులోనే (1990లో) మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆ పదవిని అలంకరించిన పిన్న వయస్కుడిగా ప్రత్యేకత చాటుకున్నారు. ఆ తర్వాత 1998-2004 మధ్య హరియాణా వికాస్ పార్టీ తరపున రాజ్యసభ ఎంపీగా కొనసాగారు.



స్వరాజ్ కౌశల్ అంత్యక్రియల్లో కుమార్తె బాంసురీ

కేంద్ర మంత్రుల నివాళి

స్వరాజ్ కౌశల్ పార్థివ దేహానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, పలువురు కేంద్ర మంత్రులు, భాజపా, ఆరెస్సెస్ నేతలు నివాళి అర్పించారు. అనంతరం లోధీరోడ్‌లోని శ్మశానవాటికలో స్వరాజ్ కౌశల్ అంత్యక్రియలు ముగిశాయి. బాంసురీ స్వరాజ్ తన తండ్రి భౌతిక కాయానికి తలకొరివి పెట్టి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలనకు 'సర్'ను వాడుతున్నారు

- అమిత్‌షాపై మమత విమర్శలు

బహ్రంపుర్: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై విమర్శలు గుప్పించారు. అమిత్‌షా ఎత్తుగడలో భాగంగానే ఎన్నికల సంఘం(ఈసీ) రాష్ట్రంలోని ప్రజలను భయాందోళనకు గురిచేయడానికి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టిందని ఆరోపించారు. దీనిని తన ప్రభుత్వం అడ్డుకుని ఉంటే బెంగాల్‌లో కేంద్రం రాష్ట్రపతి పాలనను విధించి ఉండేదన్నారు. కానీ తమ ప్రభుత్వం వారి వలలో చిక్కుకునేంత మూర్ఖత్వంతో లేదన్నారు. భయపడకుండా ఎస్ఐఆర్‌కు అవసరమైన పత్రాలను సమర్పించాలని గురువారం ముర్షిదాబాద్‌లో జరిగిన ర్యాలీలో ఆమె ప్రజలను కోరారు. మరోవైపు రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువును మూడునెలలు పొడిగించాలని కోరుతూ కోల్‌కతాలోని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం ముందు బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌వో)లు మరోసారి నిరసనకు దిగారు. పోలీసు బ్యారికేడ్లను తొలగించి భవనంలోపలికి ప్రవేశించేందుకు యత్నించారు. ప్రవేశద్వారానికి ఎదురుగా బైఠాయించారు.

ధోబీ ఘాట్లలో నీటి శుద్ధికి చవకైన వ్యవస్థ

- అభివృద్ధి చేసిన ఎన్ఐటీ రవుర్కెలా

దిల్లీ: ధోబీ ఘాట్లలో విడుదలయ్యే డిటర్జెంట్లతో కూడిన నీటిని తక్కువ ఖర్చుతో శుద్ధి చేసే ప్రకృతి ఆధారిత వ్యవస్థను ఎన్ఐటీ రవుర్కెలాకు చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. కన్‌స్ట్రక్టడ్ వెట్‌ల్యాండ్-మైక్రోబియల్ ఫ్యూయల్ సెల్ (సీడబ్ల్యూ-ఎంఎఫ్‌సీ) పేరుతో పిలిచే ఈ వ్యవస్థ.. చిత్తడి నేలల మొక్కలు, గ్రావెల్, ఇసుక, మట్టి పొరలు, విద్యుత్‌ను ఉత్పత్తి చేసే సూక్ష్మజీవులను కలిగి ఉంటుంది. ఇవన్నీ కలిసి డిటర్జెంట్లతో నిండిపోయిన లాండ్రీ నీటిని శుద్ధి చేస్తాయి. పైగా ఇది పనిచేయడానికి ఎటువంటి విద్యుత్ సరఫరా కూడా అవసరం లేదు. ఈ వ్యవస్థ పనిచేస్తున్నప్పుడే బయో ఎలక్ట్రిసిటీ ఉత్పత్తి అవుతుంది. "రవుర్కెలా ధోబీ ఘాట్‌లో రోజూ 1,400 లీటర్ల రసాయన నీరు ఉత్పత్తవుతుంది. అక్కడ ప్రయోగాత్మకంగా ఈ వ్యవస్థను ప్రయోగించి విజయవంతమయ్యాం. సీడబ్ల్యూ-ఎంఎఫ్‌సీ అక్కడి నీటిలో ఉన్న రసాయనాలు, కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సీఓడీ)ల స్థాయిలను బాగా తగ్గించింది. రద్దీ ప్రాంతాల్లో ఉండే ముంబయిలోని మహాలక్ష్మీ, బెంగళూరులోని హాలసూరు వంటి ధోబీ ఘాట్లకు ఈ వ్యవస్థ అద్భుతంగా పని చేస్తుంది. శుద్ధి అయిన తర్వాత ఆ నీటిని మరోసారి వినియోగించుకోవచ్చు. తద్వారా చెరువులు, నదులు కలుషితం కాకుండా ఉంటాయి" అని ప్రాజెక్టు రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన అసోసియేట్ ప్రొఫెసర్ కస్తూరి దత్తా వివరించారు.

భారత్‌లో ఎదుగుదల లేక బాలల మరణాలు

దిల్లీ: పోషకాహారం కొరవడటంతో ఎదుగుదల లేక అయిదేళ్ల వయసులోపే మరణించే బాలల సంఖ్యలో నైజీరియా మొదటి స్థానంలో ఉంటే, భారత్ రెండో స్థానంలో, కాంగో మూడో స్థానంలో ఉన్నాయని లాన్సెట్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం తెలిపింది. బరువు తక్కువగా ఉండటం, కృశించిపోవడం, ఎదుగుదల లేక గిడసబారిపోవడం వంటి రుగ్మతలు నీళ్ల విరేచనాలకూ, శ్వాసకోశ సమస్యలకు, మలేరియా, పొంగు వంటి వ్యాధులకు దారితీస్తాయి. ప్రపంచంలో 2023లో ఎదుగుదల కొరవడి అయిదేళ్లలోపే మరణించిన బాలల సంఖ్య 10 లక్షలైతే, వాటిలో 1,88,000 మరణాలతో నైజీరియా, లక్ష మరణాలతో భారత్, 50,000 మరణాలతో డెమోకటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలు మొదటి మూడు స్థానాలను ఆక్రమిస్తున్నాయి. ఎదుగుదల లేక సంభవించే మరణాలు 2000 సంవత్సరంలో 27.5 లక్షలు కాగా, 2023లో అవి బాగా తగ్గాయి. ఈ మరణాల్లో అత్యధికం సహారా ఎడారికి దిగువ దేశాల్లో, దక్షిణాసియా దేశాల్లోనూ సంభవించాయి. ఆహార కొరత, వాతావరణ మార్పులు, పారిశుద్ధ్య లోపం, యుద్ధాలు బాలల్లో ఎదుగుదలను దెబ్బతీస్తున్నాయి.

దువ్వూరి సుబ్బారావు రచనకు క్రాస్‌వర్డ్ అవార్డు




దిల్లీ: ఈ ఏడాది 19వ క్రాస్‌వర్డ్ బుక్ స్టోర్స్ అవార్డుల విజేతలలో రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, సుధామూర్తి కూడా ఉన్నారు. సుబ్బారావు రాసిన 'జస్ట్ ఏ మెర్సెనరీ?: నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరియర్' బిజినెస్, మేనేజ్‌మెంట్ విభాగంలో బహుమతి పొందింది. సుధామూర్తి రాసిన 'గ్రాండ్ పాస్ బ్యాగ్ ఆఫ్ స్టోరీస్' బాలల విభాగంలో అవార్డు పొందింది. ముంబయిలో బుధవారం అవార్డుల ప్రదానం జరిగింది. రుచిర్ జోషీ నవల 'గ్రేట్ ఈస్టర్న్ హోటల్'కు కాల్పనిక సాహిత్యంలోనూ, చరిత్రకారుడు మను పిళ్లై రాసిన 'గాడ్స్ గన్స్ అండ్ మిషనరీస్' కు నాన్-ఫిక్షన్‌లోనూ అవార్డులు లభించాయి. ఇంకా ప్రజాక్త కోలీ తొలి నవల టూ గుడ్ టు బి ట్రూ, మొహర్ బసు రాసిన షారుఖ్ ఖాన్ జీవితకథ క్రాస్ వర్డ్ అవార్డులు పొందాయి. థామస్ మాథ్యూ రాసిన 'రతన్ టాటా', సద్గురు రాసిన 'ఎన్‌లైటెన్‌మెంట్' లకూ అవార్డులు లభించాయి. విఖ్యాత మరాఠీ రచయిత్రి శాంతా గోఖలేకి లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. గతంలో ఈ అవార్డును పొందినవారిలో రస్కిన్ బాండ్, సుధామూర్తి, శశి థరూర్, అమితావ్ ఘోష్ ఉన్నారు.

ఉక్రెయిన్ చిన్నారుల తరలింపుపై తీర్మానం.. ఐరాసలో ఓటింగుకు భారత్ దూరం

ఐరాస: ఉక్రెయిన్ నుంచి బలవంతంగా తరలించిన చిన్నారులందరినీ స్వదేశానికి రష్యా బేషరతుగా, సురక్షితంగా పంపించేయాలంటూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తాజాగా ఓ ముసాయిదా తీర్మానాన్ని ఆమోదించింది. తీర్మానానికి అనుకూలంగా 91, వ్యతిరేకంగా 12 ఓట్లు వచ్చాయి. భారత్, చైనా, పాకిస్థాన్, శ్రీలంక, బ్రెజిల్ సహా మొత్తం 57 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. మరోవైపు- 2018 మార్చి నాటి సాలిస్‌బరీ విషప్రయోగ ఉదంతం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆమోదంతోనే జరిగినట్లు బ్రిటన్ తమ దర్యాప్తులో గుర్తించింది. ఈ నేపథ్యంలో రష్యాకు చెందిన నిఘా నెట్‌వర్క్‌లపై తాజాగా మరిన్ని ఆంక్షలు విధించింది.

నివాస ప్రాంగణాన్ని విద్యార్థుల వసతికి లీజుకిస్తే జీఎస్టీ వర్తించదు

- సుప్రీంకోర్టు తీర్పు



దిల్లీ: విద్యార్థులు, ఉద్యోగుల హాస్టల్ కోసం ఏదైనా సంస్థకు నివాస ప్రాంగణాన్ని లీజుకు ఇస్తే ఆ లావాదేవీకి జీఎస్టీ నుంచి మినహాయింపు వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం ఈ మేరకు గురువారం నిర్ణయాన్ని వెలువరించింది. ఇదే విషయమై కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. 'నివాస వినియోగాన్ని పన్ను నుంచి మినహాయించాలన్నది చట్టం లక్ష్యం. లీజు లావాదేవీపై జీఎస్టీ విధిస్తే ఆ భారం విద్యార్థులు, ఉద్యోగులపై పడుతుంది. అప్పుడు చట్టం అసలు లక్ష్యం దెబ్బతింటుంది' అని ధర్మాసనం పేర్కొంది. బెంగళూరులో 42 గదులున్న భవనాన్ని వర్కింగ్ మెన్ హాస్టల్‌కు లీజుకిచ్చిన వ్యవహారంలో జీఎస్టీ వసూలుపై తలెత్తిన వివాదంలో ధర్మాసనం ఈ స్పష్టతనిచ్చింది.

పాక్ తొలి సీడీఎఫ్‌గా మునీర్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తొలి 'రక్షణ బలగాల అధిపతి (సీడీఎఫ్)'గా సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ గురువారం నియమితులయ్యారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సిఫార్సు మేరకు ఆయన నియామకానికి దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ ఆమోద ముద్ర వేశారు. మునీర్ ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. సీడీఎఫ్ పదవిని కొత్తగా ఏర్పాటు చేస్తూ పాక్ పార్లమెంటు గత నెలలో 27వ రాజ్యాంగ సవరణకు ఆమోదం తెలిపిన సంగతి గమనార్హం. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీజేసీఎస్‌సీ) ఛైర్మన్ పదవిని రద్దు చేసి.. దాని స్థానంలో సీడీఎఫ్‌ను తీసుకొచ్చారు. మరోవైపు- తమ దేశ సరిహద్దుల గుండా అఫ్గానిస్థాన్‌కు ఐక్యరాజ్య సమితి సహాయక సామగ్రిని తరలించేందుకు అనుమతించాలని పాకిస్థాన్ గురువారం నిర్ణయించింది. వాయవ్య పాకిస్థాన్‌లోని రెండు బోర్డర్ క్రాసింగ్‌ల ద్వారా వాటిని అనుమతిస్తామని తెలిపింది.

పాక్‌తో సంబంధమున్న డ్రగ్ రాకెట్ గుట్టు రట్టు

జమ్మూ: పాకిస్థాన్‌తో సంబంధమున్న మాదకద్రవ్యాల రాకెట్ గుట్టును జమ్మూ అధికారులు ఛేదించారు. ఈ కేసుతో సంబంధమున్న ఆరుగురిని అరెస్టు చేసి దాదాపు 5 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.30కోట్లకు పైగా ఉంటుందని అధికారులు తెలిపారు. మూడు తుపాకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.



రసగుల్లాల లొల్లి.. ఆగిన పెళ్లి

ఈటీవీ భారత్: బిహార్‌లోని గయా జిల్లాలో రసగుల్లాల కోసం గొడవ జరిగి ఇరుపక్షాల బంధువులు బాహాబాహీకి దిగడంతో పెళ్లి ఆగిపోయింది. జిల్లాలోని హథియావాన్ గ్రామానికి చెందిన పవన్ కుమార్‌కు బక్‌రౌర్ గ్రామవాసి సురేశ్ ప్రసాద్ కుమార్తెతో పెళ్లి కుదిరింది. ముహూర్తం వేళకు వధూవరులు మాలలు మార్చుకోగా, తదుపరి వివాహ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సరిగ్గా ఇదే సమయానికి భోజనశాలలో.. వరుడి తరఫు బంధువులకు రసగుల్లాలు తక్కువ పడటంతో గొడవ మొదలైంది. కుర్చీలు, వంటపాత్రలు.. ఇలా చేతికి దొరికింది తీసుకొని కొట్టుకోవడంతో పలువురు గాయపడ్డారు. గొడవ సద్దుమణిగాక.. పెళ్లి తంతును పూర్తి చేయడానికి వరుడి తండ్రి సుముఖత వ్యక్తం చేయగా, తమపై భౌతిక దాడులకు పాల్పడిన కుటుంబానికి తన కుమార్తెను ఇచ్చేది లేదని వధువు తండ్రి ససేమిరా అన్నారు. అదనపు కట్నం డిమాండు చేసి గొడవకు దిగారంటూ వరుడి కుటుంబంపై బోధ్ గయా పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాబ్రీ తరహా మసీదు నిర్మాణ ప్రతిపాదన... ఎమ్మెల్యే కబీర్‌ను సస్పెండ్ చేసిన టీఎంసీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో బాబ్రీ తరహా మసీదు నిర్మాణాన్ని చేపట్టాలంటూ ప్రతిపాదన చేసి దుమారం రేపిన ఎమ్మెల్యే హుమాయున్ కబీర్‌ను అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సస్పెండ్ చేసింది. కబీర్ మతపరమైన రాజకీయాలకు పాల్పడుతున్నందునే ఈ చర్య తీసుకున్నట్లు పార్టీ సీనియర్ నేతలు గురువారం చెప్పారు. 1992 డిసెంబరు 6న అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేసిన విషయం తెలిసిందే. సరిగ్గా అదేరోజున బాబ్రీ తరహా మసీదు కోసం బెంగాల్‌లోని బెల్‌డాంగాలో శంకుస్థాపన జరగనున్నట్లు కబీర్ ప్రకటించడంతో తీవ్ర రాజకీయం దుమారం చెలరేగింది. ఈ క్రమంలోనే శాంతిభద్రతల దృష్ట్యా కబీర్‌ను అరెస్టు చేయాలని కోరుతూ గవర్నర్ ఆనంద బోస్ రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం లేఖ రాశారు. మరుసటి రోజే ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు టీఎంసీ ప్రకటించింది. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినా.. అనుకున్న సమయానికి మసీదు శంకుస్థాపన పనులు జరుగుతాయని కబీర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఈనెల 22న కొత్త పార్టీని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ముర్షిదాబాద్‌లో జరిగిన ర్యాలీలో కబీర్ పేరును ప్రస్తావించకుండానే సీఎం మమత ఆయనపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ప్రతి మతంలో ద్రోహం చేసే వ్యక్తులు ఉంటారని, సరిగ్గా ఎన్నికల ముందు అల్లర్లను ఉసిగొల్పుతారని విమర్శించారు. భాజపా నుంచి డబ్బులు తీసుకుని మత విద్వేషాలను రెచ్చగొడతారని ఆరోపించారు.

..అప్పటి నుంచే దిల్లీలో వాయు కాలుష్యం మూడింతలైంది

- అధ్యయనం వెల్లడి

దిల్లీ: పంజాబ్-హరియాణాల మధ్య 2009లో భూగర్భజల సంరక్షణ విధానం కుదిరినప్పటి నుంచే దిల్లీలో వాయు కాలుష్యం మరింత పెరిగినట్లు ఓ అధ్యయనం వెల్లడించింది. మరుసటి ఏడాది నుంచే దేశరాజధానిలో వాయు కాలుష్యం 'తీవ్రస్థాయి'కు చేరుకోవడం మూడింతలైందని తెలిపింది. దిల్లీలో గాలి నాణ్యతను తగ్గించడంలో వాతావరణం, భూగర్భజలాల పాత్ర ఉందని, సాయంత్రం 4 తర్వాత వాయు నాణ్యత సూచి (ఏక్యూఐ)లో 90 పాయింట్లు పెరుగుదల నమోదైందని వివరించింది. 'తీవ్రస్థాయి' గంటలను 275శాతం పెంచేసిందని భారత ఉష్ణమండల వాతావరణ సంస్థ, అమెరికాలోని జాతీయ వాతావరణ పరిశోధన సంస్థ, గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది. ఎండలు తక్కువగా ఉండే సమయంలో పంట వ్యర్థాలను కాల్చడం సహజంగానే వాయు కాలుష్యాన్ని తీవ్రతరం చేసిందని తెలిపింది.

వాయునాణ్యత మరింత పతనం

దిల్లీలో గాలి నాణ్యత మరింత పతనమైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) ప్రకారం 24 గంటల సగటు ఏక్యూఐ 304కు చేరుకుంది. ఉదయం సమయంలో గాలి నాణ్యత కొంత మెరుగ్గానే ఉంది. శుక్రవారం నగరంలో చలిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది.

ఎస్ఐపీబీలో ప్రభుత్వం ఆమోదించిన పెట్టుబడులివీ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన 13వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం రూ.20,444 కోట్ల పెట్టుబడులు, 56,278 మందికి ఉపాధి కల్పించే ప్రతిపాదనలను ఆమోదించింది. వాటి వివరాలు...

ఆమోదించిన పెట్టుబడులు

సంస్థ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
ఇంధన శాఖ		
చింతా గ్రీన్ ఎనర్జీ	8,500	5,800
గనేకో త్రీ ఎనర్జీ	2,140	1,000
శ్రేష్ఠ రెన్యువబుల్స్	70	339
ఐటీ శాఖ (క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రతిపాదనలు)		
క్యూపీఐఏ ప్రైవేట్ లిమిటెడ్	47	9
క్యూబిట్ స్మార్ట్ సొల్యూషన్స్	15	30
క్యూక్లెయిర్ ఇయాన్ క్వాంటమ్ ల్యాబ్స్	14	5-12
సైబాసెక్స్	10	10-15
క్యూబిట్స్ (నోస్ట్రడామస్ టెక్నాలజీస్)	37	40
సెంటెల్లా ఏఐ డెరివేటివ్స్	6	40
42టెక్నాలజీ ఇన్వెస్టిమెంట్స్	9	5-8
ఎలక్ట్రానిక్స్ రంగం		
సిప్సా టెక్ ఇండియా	1,140	1,251
శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్	62	500
ఏసీఎస్ హెల్త్‌కేర్ ఆర్గీఎమ్	30	600
నానోల్ టెక్నాలజీస్	50.67	567
పర్యాటక రంగం		
వీసీఆర్ హాస్పిటాలిటీస్	225	1,230
మెగ్నస్ బీచ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్	348	1,700
యాగంటి ఎస్టేట్స్	61	250
నాంది హోటల్స్	150	222
పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు (ఏపీ మారిటైం బోర్డు ప్రతిపాదనలు)		
రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్	1,622	1,200
రామాయపట్నం కార్గో కంటైనర్ టెర్మినల్	1,615	1,300
సాగర్ డిఫెన్స్ ఇంజినీరింగ్	45	300
పరిశ్రమల శాఖ ప్రతిపాదనలు		
టీబీజీ స్టాక్	1,216	400
శ్రీ వెంకటేశ్వర బయోటెక్	122	184
ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్	182	415
జేఎంజే ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్	305	900
రవిటెంక్సింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్స్	141	600
గాయత్రి రెన్యువబుల్ ఫ్యూయల్స్	320	700
మల్లాది డ్రగ్స్	343	355
ఏపీఐఐసీ ప్రతిపాదనలు		
విరూపాక్ష ఆర్గానిక్స్	1,225	1,500
రముకొ గ్లోబల్ ఎకో పార్క్	193	426
మాస్ ఫ్యాబ్రిక్ పార్క్	200	35,000

■ ఇప్పటి వరకు నిర్వహించిన ఎస్ఐపీబీల్లో రూ. 8.29 లక్షల కోట్ల పెట్టుబడులు ఆమోదించామని, తద్వారా 7,62,148 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది.

అందరికీ ఉచిత ఆరోగ్య బీమా అమలుకు చర్యలు

• యూనివర్సల్ హెల్త్ పాలసీలో కమిటీ ప్రతిపాదనలకు ప్రభుత్వ ఆమోదం

ఈనాడు, అమరావతి: పేద, ధనిక తేడా లేకుండా అందరికీ ఉచిత ఆరోగ్య బీమా అందుబాటులోకి తెచ్చేలా రూపొందించిన 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' సమర్థ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ- ఏబీ పీఎంజేఏవై పథకం హైబ్రిడ్ మోడ్‌లో అమలుకు పిలిచిన టెండరులో ఆర్ఎఫ్‌పీ, డీసీఏలో కొన్ని సవరణలకు ఆమోదం తెలిపింది. ప్రీబిడ్ సమావేశాల ద్వారా చిన్నచిన్న సవరణలకు టెండరు కమిటీకి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం.. ఆయా ప్రతిపాదనలను ఆమోదించింది. ఈ మేరకు వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం ఉన్న పేదవర్గాలకు (బీపీఎల్) చెందిన కుటుంబాలకు రూ.2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ మోడ్‌లో.. అంతకంటే ఎక్కువ అవసరమైతే రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఏపీఎల్ కుటుంబాలు (ఈహెచ్ఎస్, వర్కింగ్ జర్నలిస్టు స్కీమ్ మినహా) రూ.2.50 లక్షల వరకు బీమా వర్తిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు బీమా కంపెనీలకు సెప్టెంబరు 9న ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. టెండరు నిబంధనల్లో మార్పులతో తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

✦ రాష్ట్రంలో ఈహెచ్ఎస్, వర్కింగ్ జర్నలిస్ట్ స్కీమ్ మినహా మిగిలిన అన్ని కుటుంబాలు యూనివర్సల్ హెల్త్ పాలసీ పరిధిలోకి వస్తాయి.

✦ పీఎంజేఏవై, ఎన్టీఆర్ వైద్యసేవ లబ్ధిదారుల కుటుంబాల్లోని సభ్యులు ఈ పథకం పొందడానికి అర్హులు.

✦ ఏడాది పొడవునా ఆసుపత్రుల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏడాదికి రెండుసార్లు జాబితాలో నమోదు ప్రక్రియ జరుగుతుంది.

✦ బీమా కంపెనీలు పన్నులు మినహాయించి ప్రీమియం ధర చెల్లించవచ్చు.

✦ క్లెయిమ్ రేషియో 120 శాతం దాటితే.. ప్రీమియం మించిన అదనపు ఖర్చులో 50 శాతం ట్రస్ట్, 50 శాతం బీమా కంపెనీ భరిస్తాయి.

✦ ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన 521 వ్యాధులకు సంబంధించిన సేవలకు మొదట బీమా కంపెనీ భరిస్తుంది. బిల్లులు పరిశీలించి ట్రస్ట్ సొమ్ము చెల్లిస్తుంది.

✦ రాష్ట్ర, జిల్లా, ఆసుపత్రుల స్థాయిలో ప్రస్తుతం సేవలందిస్తున్న వైద్య మిత్రలు, ట్రస్ట్‌లో పనిచేస్తున్న పొరుగు సేవల, ఒప్పంద సిబ్బందిని అవసరాల మేరకు బీమా కంపెనీ కొనసాగించాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో 67 శాతం లోటు వర్షపాతం

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో నవంబరు నెలలో 67 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కోస్తా జిల్లాల్లో తూర్పు గోదావరి, రాయలసీమలో నంద్యాలలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. అల్లూరి సీతారామరాజు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, గుంటూరు, కృష్ణా, పల్నాడు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో 90 శాతానికి పైగా లోటు నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా నవంబరులో 98.8 మిల్లీమీటర్లకు 32.8 మి.మీ.వర్షం మాత్రమే కురిసింది. అయితే గత వారం రోజుల్లో రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెలలో గురువారం వరకు రాష్ట్రంలో సగటున 3.2 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 25.7 వర్షం కురిసింది. తిరుపతి జిల్లాలో 28.3 మి.మీ.కు గాను 178.7 మి.మీ., నెల్లూరు 15.9 మి.మీ. గాను 142.7 మి.మీ. వర్షం కురిసింది.

✦ శుక్రవారం ప్రకాశం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు కురిసే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సాయంత్రం 6 గంటల వరకు అత్యధికంగా తిరుపతి జిల్లాలోని చిట్టమూరులో 88.7, చింతవరంలో 83.5, నెల్లూరు జిల్లా పాలూరులో 61 మి.మీ. వర్షపాతం నమోదైంది.

న్యాయమూర్తులు, న్యాయాధికారుల డీఏ పెంపు

న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



ఈనాడు, అమరావతి: హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, పదవీవిరమణ చేసిన న్యాయమూర్తులు, న్యాయాధికారులు, కుటుంబ పింఛనుదారులకు డీఏ పెరిగింది. కేంద్ర న్యాయశాఖ లేఖలకు అనుగుణంగా వారి డీఏను 55% నుంచి 58%కి పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులు 2025 జులై 1 నుంచి వర్తిస్తాయని వివరించారు.

ధాన్యం రైతులకు గోనె సంచుల కొరత రానీయొద్దు

• కలెక్టర్లతో సీఎస్ విజయానంద్

ఈనాడు, అమరావతి: ధాన్యం రైతులకు గోనె సంచుల కొరత లేకుండా చూడాలని సీఎస్ విజయానంద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. రైతుల నుంచి అందే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని చెప్పారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీవర్షాలు, నష్టంపై ఆరా తీశారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని విపత్తుల నిర్వహణ శాఖను ఆదేశించారు. ఎరువుల కొరత లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిపై నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేశామని, టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉంచామని వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఈ సందర్భంగా కలెక్టర్లకు చెప్పారు. సీఐఐ సమ్మిట్‌లో ఒప్పందాలు చేసిన కంపెనీలతో మాట్లాడి యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని పరిశ్రమలు, పెట్టుబడులశాఖ కార్యదర్శి యువరాజ్ కోరారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మలేరియా నియంత్రణపై దృష్టి సారించాలని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరకామణిలో చోరీని సమర్థించడం.. భక్తుల మనోభావాలను దెబ్బతీయడమే

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



ఈనాడు, దిల్లీ: శ్రీవారికి భక్తులు ఇచ్చిన కానుకలను దొంగిలించడాన్ని సమర్థించడం ద్వారా జగన్.. భక్తుల మనోభావాలను దెబ్బతీశారని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై దుష్ప్రచారం, తప్పుడు ఆరోపణలతో ఉనికి చాటుకోవడానికి జగన్ తాపత్రయ పడుతున్నారని దుయ్యబట్టారు. ఆయన గురువారం దిల్లీలోని ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'జగన్ అప్పుడప్పుడు బెంగళూరు నుంచి ప్రత్యేక విమానాల్లో రావడం, ఎంపిక చేసి, పిలిపించుకున్న విలేకరులతో మాట్లాడటం తప్ప ఆయన చేసిందేమీ లేదు. అరాచక శక్తులు పిన్నెల్లి సోదరులు, నకిలీ మద్యం మాఫియా జోగి రమేష్ సోదరులు, హుండీ దొంగలు, డ్రగ్స్, గంజాయి స్మగ్లర్లను వెనకేసుకొస్తూ జగన్ తన మనస్తత్వాన్ని చాటుకున్నార'ని విమర్శించారు. తన తప్పులను అంగీకరించి, వేంకటేశ్వరస్వామికి, ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలని కలిశెట్టి డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.44 లక్షల మోసం

• తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో లాభాలు ఆశ చూపి, తన నుంచి రెండు విడతలుగా రూ.44 లక్షలు వసూలు చేసి మోసం చేశారని ఏలూరుకు చెందిన సజ్జా సురేశ్ వాపోయారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా.. నిందితులపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి మంత్రి కొల్లు రవీంద్ర, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వేలో తన భూమిని తక్కువగా చూపారని, దీనికి కారణమైన సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలానికి చెందిన రంగమ్మ అనే మహిళ ఫిర్యాదు చేశారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఆంధ్రా కోస్తా తీరం పొడవు 1,053 కిలోమీటర్లు

దేశ తీరం పొడవు 7,516 కి.మీ.నుంచి 11,098 కి.మీ.కు సవరణ

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం పొడవు ఇప్పుడు 1,053.07 కిలోమీటర్లకు చేరిందని కేంద్ర భూవిజ్ఞానం, శాస్త్ర, సాంకేతిక వ్యవహారాలశాఖ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు. నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్ ఇదివరకున్న 973.7 కిలోమీటర్లను సవరించి ఇప్పుడు 1,053.07 కిలోమీటర్లుగా నిర్ధారించినట్లు చెప్పారు. ఆయన గురువారం రాజ్యసభలో వైకాపా సభ్యుడు గొల్ల బాబూరావు అడిగిన ప్రశ్నకు ఈమేరకు సమాధానం ఇచ్చారు. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్ఎస్‌సీఎస్) ప్రతిపాదించిన తాజా విధివిధానాలను అనుసరించి సర్వే ఆఫ్ ఇండియా సమన్వయంతో నేషనల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్ మదింపుచేసి భారత తీరప్రాంతాన్ని ఇదివరకున్న 7,516.6 కిలోమీటర్ల నుంచి 11,098.81 కిలోమీటర్లుగా ఖరారుచేసినట్లు చెప్పారు. ఈ సవరణను కోస్టల్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ అడ్వయిజరీ కమిటీ ఆమోదించినట్లు వెల్లడించారు. సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన తాజా నివేదిక ప్రకారం కొత్త తీరప్రాంతాన్ని కేంద్ర నౌకాయాన, జలరవాణాశాఖ 2025 ఏప్రిల్ 29న అధికారికంగా ప్రకటించినట్లు చెప్పారు. దాని ప్రకారం దేశంలోని వివిధ రాష్ట్రాల తీరప్రాంతాల్లో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఈ సవరించిన తీరప్రాంతం పోర్టులు, మౌలికవసతులు, టూరిజం జోన్ల నిర్మాణం, ప్రకృతివైపరీత్యాల ముప్పు అంచనాకు ఉపయోగపడతాయన్నారు.

ఏపీ నుంచి 12 ఏళ్లలో రూ.25 వేల కోట్ల టోల్ వసూలు

ఆంధ్రప్రదేశ్‌లోని జాతీయ రహదారుల నుంచి గత 12 ఏళ్లలో 25,972.43 కోట్ల టోల్ వసూలు అయినట్లు కేంద్ర రహదారి రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. గురువారం లోక్‌సభలో ఆయన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ 'గత అక్టోబర్ 31 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 85 టోల్‌గేట్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 1,135 టోల్‌గేట్లలో ఇవి 7.48%. 2014-15లో రాష్ట్రంలో రూ.1,053.47 కోట్ల టోల్ వసూలు కాగా, 2024-25 నాటికి ఆ మొత్తం రూ. 3,718.55 కోట్లకు (252% వృద్ధి) చేరింది' అని వెల్లడించారు.

* చెన్నై-తిరుపతి మధ్య ప్యాకేజీ-2 కింద నిర్మిస్తున్న యాక్సెస్ కంట్రోల్డ్ జాతీయ రహదారిలో అదనపు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెట్టడం కుదరదని మంత్రి గడ్కరీ తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందించారు. యాక్సెస్ కంట్రోల్డ్ హైవేలో ఎక్కువ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెడితే భద్రతాపరమైన ప్రమాదాలు తలెత్తి, రవాణా సామర్థ్యం దెబ్బతింటుందని చెప్పారు.

కొవిడ్ తర్వాత పర్యాటకులు మూడింతలు

కొవిడ్ తర్వాత ఏపీకి వచ్చే దేశ, విదేశీ పర్యాటకుల సంఖ్య మూడింతలు పెరిగింది. గురువారం రాజ్యసభలో తెదేపా ఎంపీ సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పిన లెక్కలు ఈ విషయాన్ని వెల్లడించాయి. కొవిడ్ సంవత్సరం 2020లో రాష్ట్రానికి వచ్చిన దేశీయ పర్యాటకుల సంఖ్య 7.08 కోట్లు కాగా, 2024 నాటికి ఆ సంఖ్య 29.02 కోట్లకు చేరింది. ఇదే సమయంలో విదేశీ పర్యాటకుల సంఖ్య 67,591 నుంచి 2.62 లక్షలకు పెరిగింది. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు 90.17 కోట్ల మంది దేశీయ పర్యాటకులు, 5.83 లక్షల మంది విదేశీ పర్యాటకులు చుట్టివెళ్లారు.

పోలవరానికి ఇప్పటివరకు రూ.20,658 కోట్ల కేంద్ర సాయం

పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.20,658 కోట్ల సాయం అందించినట్లు జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ, ఏపీ పరిధిలో మొత్తం 7 నదుల అనుసంధాన ప్రాజెక్టు లింకులున్నాయని, వాటిలో ఐదింటికి డీపీఆర్‌లు, రెండింటికి ప్రీ ఫీజిబిలిటీ నివేదికల తయారీ పూర్తయిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు సాకారమైతే 29.16 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించే వీలవుతుందన్నారు. అలాగే 1,846 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి అవకాశం ఉంటుందని మంత్రి చెప్పారు.

అరటి రవాణాపై రైల్వే రవాణాఛార్జీలను తగ్గించాలి

లోక్‌సభలో తెదేపా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ డిమాండ్



ఆంధ్రప్రదేశ్ అరటి రైతులు నాణ్యమైన పంట పండిస్తున్నా రైల్వేశాఖ విధిస్తున్న అదనపు ఛార్జీల కారణంగా జాతీయ మార్కెట్లలో పోటీ పడలేని పరిస్థితి వచ్చిందని అనంతపురం తెదేపా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేంద్రం దీనిపై దృష్టిసారించి ఏపీ రైతులకు భారంగా మారిన రైల్వే రవాణా ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయన గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. "రాయలసీమలోని ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో యేటా 40వేలకు పైగా హెక్టార్లలో అరటి సాగవుతోంది. ఈ సీజన్‌లో ధరలు పతనమై కోత కోసం పెట్టిన ఖర్చులు కూడా తిరిగి రాని స్థితిలో రైతులు ఉన్నారు. దీన్ని గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంటను తక్షణం దూరప్రాంత మార్కెట్‌లకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దానివల్ల కొంత ఉపశమనం లభించింది. అయితే ప్రతి సంవత్సరం పునరావృతమవుతున్న సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం భారతీయ రైల్వే విధించే అధిక రీఫర్ కంటెయినర్ ఛార్జీలే. దీనివల్ల శీతలీకరణ రవాణా రైతులకు అందని ద్రాక్షగా మారింది. పైగా ఖాళీగా తిరిగి వచ్చే కంటెయినర్లకు పూర్తి ఎమ్‌టీ హాలేజ్ ఛార్జీలు విధించడంవల్ల రైతులపై రెండింతల భారం పడుతోంది. దీనివల్ల దిల్లీ, ముంబయి లాంటి ప్రధాన నగరాలకు ఏపీ రైతులు తమ సరకును రవాణా చేసుకోలేని స్థితిలో ఉన్నారు. కేంద్రం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలి. అలాగే అనంతపురంతోపాటు, రాయలసీమ జిల్లాల నుంచి దిల్లీ, ముంబయి నగరాలకు అరటి రవాణాకోసం ప్రత్యేక కార్గో రైళ్లు నడపాలి. దీనివల్ల మార్కెట్ విస్తరించి రైతులకు న్యాయమైన ధర లభించేందుకు వీలవుతుంది" అని అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

'కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల పరిధిని కేంద్రం నోటిఫై చేసింది'

ఈనాడు, దిల్లీ: కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల పరిధిని కేంద్ర జలశక్తి శాఖ నాలుగేళ్ల క్రితమే నోటిఫై చేసిందని ఆ శాఖ సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌధరి తెలిపారు. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ మల్లురవి "ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం అమల్లోకి వచ్చి పదేళ్లు పూర్తయ్యాక కూడా కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల పరిధిని నోటిఫై చేయడంలో విఫలం కావడానికి ప్రధాన కారణాలేంటి? ఈ జాప్యం కారణంగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య పెరుగుతున్న జల వివాదాలపై కేంద్రానికి అవగాహన ఉందా?" అంటూ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. "కేంద్ర ప్రభుత్వం 2014 మే 28న కృష్ణా నదీ యాజమాన్య మండలి(కేఆర్ఎంబీ), గోదావరి నదీ యాజమాన్య మండలి (జీఆర్ఎంబీ)ని ఏర్పాటు చేసింది. ఆ రెండు నదులపై ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ, నియంత్రణ, పరిపాలన వ్యవహారాలను రెండు బోర్డులు పర్యవేక్షించాల్సి ఉంది. వాటి పనితీరును విశ్లేషించేందుకు.. కేంద్రం అపెక్స్ కౌన్సిల్‌ను కూడా ఏర్పాటుచేసింది. పలుదఫాల చర్చల తర్వాత కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల పరిధిని 2021 జులై 15న విభజన చట్టంలోని సెక్షన్ 87(1)కింద కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. వాటి పరిధిలోకి వచ్చే ప్రాజెక్టులు, విభాగాలను స్పష్టంగా పేర్కొంది. ఆ ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు 2021 అక్టోబరు 14 నుంచి ప్రాజెక్టులను బోర్డులకు అప్పగించాల్సి ఉంది" అని కేంద్ర మంత్రి వివరించారు.

పీపీఏలు పూర్తయితేనే 'రామగుండం' రెండోదశ నిర్మాణం

తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగుండంలో తలపెట్టిన ఎన్టీపీసీ రెండోదశ ప్లాంటు నుంచి విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడానికి వివిధ డిస్కంలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు కేంద్ర విద్యుత్తుశాఖ సహాయమంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. గురువారం లోక్‌సభలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. "2,400 మెగావాట్ల ప్లాంటుకు అవసరమైన బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయడానికి కేంద్రం అనుమతులిచ్చింది. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉన్నందున... విద్యుత్తు కొనుగోలుకు ఏపీ డిస్కంలు ఆందోళన వ్యక్తంచేశాయి. ఈ అంశాన్ని సింగరేణి దృష్టికి ఎన్టీపీసీ తీసుకెళ్లింది. వివిధ డిస్కంలతో పీపీఏలు కుదుర్చుకోవడానికి ఎన్టీపీసీ నిరంతరం సంప్రదింపులు చేస్తోంది. ఒప్పందాలు కుదిరాక ప్లాంటు నిర్మాణ బాధ్యతను కాంట్రాక్టు సంస్థకు అప్పగిస్తాం. తర్వాత 64 నెలల్లో ప్లాంటును నిర్మించాల్సి ఉంటుంది' అంటూ కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

భారత నౌకాదళ సేవలకు వందనం: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: దేశ సరిహద్దుల రక్షణతో పాటు విపత్తుల వేళ సహాయ చర్యల్లో పాల్గొంటూ భారత నౌకాదళం కీలకపాత్ర పోషిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. భారత నౌకాదళ దినోత్సవం సందర్భంగా నావికాదళ సిబ్బందికి, మాజీ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఎక్స్ వేదికగా గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఇదే అంశంపై మంత్రి లోకేశ్ సైతం ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలిపారు.

ఘంటసాలకు చంద్రబాబు నివాళి

'ఘంటసాల వెంకటేశ్వరరావు నేపథ్య గాయకుడే కాదు.. భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లిన దేశభక్తుడు' అని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఘంటసాల జయంతి సందర్భంగా గురువారం ఆయనకు నివాళి అర్పించారు.

పవన్‌కల్యాణ్ నివాళులు

ప్రముఖ నేపథ్య గాయకులు ఘంటసాల జయంతి సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం 'ఎక్స్' వేదికగా నివాళులు అర్పించారు. 'తెలుగు సంగీత సాహిత్య గొప్పదనాన్ని తన గాత్రంతో విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు ఘంటసాల. స్వాతంత్ర్య సంగ్రామంలో, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలల పాటు కారాగారంలో గడిపారు'' అని గుర్తు చేసుకున్నారు.

ఏపీఐఐసీ ఇన్‌ఛార్జ్ వీసీఎండీగా శుభం బన్సల్

ఈనాడు, అమరావతి: ఏపీఐఐసీ ఇన్‌ఛార్జ్ వీసీఎండీగా శుభం బన్సల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఐఐసీ వీసీఎండీ అభిషిక్త్ కిషోర్ ఈ నెల 5 నుంచి 12 వరకు విదేశీ పర్యటనకు వెళ్తుండటంతో బన్సల్‌కు ప్రభుత్వం ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించింది.

దివ్యాంగుల సంక్షేమానికి చంద్రబాబు కృషి

తెదేపా కేంద్ర కార్యాలయంలో సంబరాలు

ఈనాడు, అమరావతి: దివ్యాంగుల సంక్షేమానికి దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల కార్పొరేషన్ ఛైర్మన్ జి.నారాయణస్వామి పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇంద్రధనస్సు పేరుతో ఏడు వరాలను ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు.

సీఎం కార్యక్రమాల సమన్వయకర్తలకు జీతభత్యాల ఖరారు

ఈనాడు, అమరావతి: సీఎం కార్యక్రమాల సమన్వయకర్తలుగా నియమితులైన పెందుర్తి వెంకటేశ్, మంతెన సత్యనారాయణరాజులకు జీతభత్యాల్ని ప్రభుత్వం ఖరారు చేసింది. వారిద్దరికీ ప్రభుత్వం సహాయ మంత్రి హోదా కల్పించింది. వారికి నెలకు రూ.1.50 లక్షలు చొప్పున వేతనం, వ్యక్తిగత సిబ్బంది అలవెన్స్ కింద రూ.45 వేలు, వాహన అలవెన్స్‌గా రూ.60 వేలు, ఇంటిఅద్దె భత్యంగా రూ.50 వేలు చెల్లించనుంది.

కొత్తతరం నాయకులకు రోశయ్య ఆదర్శం

• తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



హనుమంతరావుకు రోశయ్య పురస్కారం అందజేస్తున్న పొన్నం ప్రభాకర్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్. చిత్రంలో శివ సుబ్బారావు, బిగాల గణేశ్ గుప్తా

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: కొత్తతరం రాజకీయ నాయకులు మాజీ ముఖ్యమంత్రి రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో భాష, సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో మాజీ గవర్నర్, ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావుకు రోశయ్య స్మారక పురస్కారంతో సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిండైన తెలుగుదనానికి ప్రతిరూపం రోశయ్య అని, దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 16సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన జీవితం, ప్రసంగాలు నూతన శాసనసభ్యులకు ఒక పాఠంలాంటివని కొనియాడారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఏపీ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. రోశయ్య సేవలను గుర్తుచేసుకున్నారు. అనంతరం సీనియర్ నాయకుడు వి.హనుమంతరావును రోశయ్య స్మారక పురస్కారంతో సత్కరించారు. సభలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాత, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు కోలేటి దామోదర్‌గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొణిజేటి శివసుబ్బారావు తదితరులున్నారు.

గాంధీభవన్‌లో రోశయ్య వర్ధంతి...

ఉమ్మడి ఏపీ మాజీ సీఎం రోశయ్య వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పీసీసీ ఉపాధ్యక్షులు టి.కుమార్‌రావు, అధికార ప్రతినిధి శ్రీరంగం సత్యం, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రైఫిల్ అసోసియేషన్ సభ్యుడిగా సలలిత్ తొట్టెంపూడి ఎన్నిక

ఈనాడు, అమరావతి: నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) గవర్నింగ్ బాడీ సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు సలలిత్ తొట్టెంపూడి ఎన్నికయ్యారు. మొహాలిలో గురువారం నిర్వహించిన జాతీయ కమిటీ ఎన్నికల్లో ఆయన ఎన్నికైనట్లు నిర్వాహకులు ప్రకటించారు. రాష్ట్ర స్థాయిలో షూటింగ్ క్రీడాభివృద్ధి కోసం తొట్టెంపూడి చేస్తున్న కృషికి ఆయన ఎన్నిక నిదర్శనమని పలువురు క్రీడాకారులు అభిప్రాయపడ్డారు. "జాతీయ స్థాయి గవర్నింగ్ బాడీలో సభ్యుడిగా ఎన్నిక కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. షూటింగ్ క్రీడ దేశ వ్యాప్తంగా అభివృద్ధి చెందేలా పని చేస్తా. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తా' అని ఈ సందర్భంగా సలలిత్ చెప్పారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఏఐ) అధ్యక్షుడిగా కలికేశ్ నారాయణ సింగ్‌దేవ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అమిత్ సంఘీ, కార్యదర్శి జనరల్‌గా పవన్‌కుమార్ సింగ్, గౌరవ కోశాధికారిగా మేఘశ్యామ్ శ్రీపాద్ భాంగ్లే ఎన్నికయ్యారని ఆయన వివరించారు.

డీడీవో వ్యవస్థతో పంచాయతీరాజ్ శాఖలో మెరుగైన పాలన

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారుల (డీడీవో) కార్యాలయాలు ప్రారంభించడం ద్వారా పంచాయతీరాజ్ శాఖలో మెరుగైన పాలన సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ కేఎస్ వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి వైవీడీ ప్రసాద్, ఐకాస నేతలు డి.వెంకట్రావు, నాతి బుజ్జి తదితరులు తెలిపారు. డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యాలయాలు ఒకే గొడుగు కిందకు తేవడంతో వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విప్లవాత్మక మార్పులతో పరిపాలన మెరుగుపరుస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఐకాస తరఫున ధన్యవాదాలు అని చెప్పారు.

మంత్రి మనోహర్‌తో కేరళ పౌరసరఫరాల సంస్థ ప్రతినిధుల భేటీ



జయకృష్ణను సత్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్


ఈనాడు, అమరావతి: పౌరసరఫరాల వ్యవస్థలో సంస్కరణలు, వినియోగదారులకు మెరుగైన సేవలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై పరిశీలనకు కేరళ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ జయకృష్ణ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం రాష్ట్రానికి వచ్చింది. గురువారం విజయవాడలోని కమిషనరేట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో భేటీ అయింది. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, డైరెక్టర్ ఆర్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం-బనకచర్ల' లింక్ ప్రాజెక్టుకు సూత్రప్రాయ అంగీకారమేదీ తెలపలేదు

తెలంగాణ ఈఎన్సీకి సీడబ్ల్యూసీ లేఖ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదివరకు ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టు(ఏపీ ప్రభుత్వం ఈ లింగ్ ప్రాజెక్టు డీపీఆర్ తయారీని రద్దు చేసుకుంది)కు తాము సూత్రప్రాయ అంగీకారమేదీ తెలపలేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసింది. ఈ ఏడాది అక్టోబరు 6న ఈ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి ఏపీ సర్కారు టెండరు పిలిచిన నేపథ్యంలో..ప్రాజెక్టు సర్వే, డీపీఆర్‌తోపాటు ఇతర పనులు చేపట్టకుండా నిలువరించాలంటూ తెలంగాణ ఈఎన్సీ అదే నెల 10న సీడబ్ల్యూసీకి లేఖ రాశారు. స్పందించిన సీడబ్ల్యూసీ ఈమేరకు గురువారం ప్రత్యుత్తరం రాసింది.

సిట్ వేసింది సుప్రీంకోర్టు ఆదేశాలతో: వర్ల రామయ్య



ఈనాడు, అమరావతి: 'శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాలతో సిట్ వేసిన విషయాన్ని జగన్ మర్చిపోయారు. స్వామివారికి పరకామణి దొంగ రూ.14.5 కోట్ల విలువైన ఆస్తులు రాసిస్తే.. చంద్రబాబు ఎప్పుడైనా స్వామివారికి అలా రాసిచ్చారా? అని జగన్ ప్రశ్నించడం అతని అజ్ఞానానికి నిదర్శనం. అతని మాటలు చూస్తుంటే, ఇదంతా జగన్‌కు తెలిసే జరిగినట్టు అర్థమవుతోంది' అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. తనపై చేసిన వ్యాఖ్యలకు జగన్ క్షమాపణ చెప్పాలని వర్ల డిమాండ్ చేశారు.